RNI No. APTEL/2003/12253

# భావవీణ

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

# BHAVA VEENA

Journal of Telugu Literary, Culture & Language Study

Vol : 16 Issue No. 11(1) Monthly November 2019 ISSN No. : 2456-4702 Rs. : 15/-



ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission
UGC Approved Journal
No. 42500

యోగి వేమన

మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**Journal of Telugu Literary, Culture & Language Study**

(తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : Kolla Sri Krishnarao
E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9490847482.
Rohini Towers,
2/11 Brodipet,
GUNTUR-2.

**Vol. 16 - Issue. 11(1) - November 2019 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253 - Rs. : 15/-**



## EDITORIAL BOARD

*Chief Editor*
**PITTA SANTHI**
***M.A.(Tel), M.Sc(Psy).,M.Ed.,M.Phil(Edu),(Ph.D).,***
**C/o. Dr. Busi Venkataswamy**
Holy Homes Apartment, Postal colony ,
4 Th Line,- 522 002, Guntur Dist., A.P. Cell no : 7386529274, 7989781963.

## ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University,
   Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.
4. **Dr. Busi Venkataswamy,** M.A. (Tel)., M.A (San)., M.A (Ling)., PhD.
   HOD & Research Guide, Dept. of Telugu
   PAS College, Pedanandipadu.
5. **Thottempudi Sree Ganesh,** M.A., M.Phil (Computational Linguistics) (Ph.D)
   Research Scientist, Centre for Applied Linguistics and Transalation Studies, Universityof Heidelberg, Germany.
6. **Dr. Ponnama Reddy Kumari Neeraja** M.A., Ph.D.
   HOD, Dept. of Telugu,
   Govt. Degree College, Puttur, Chittor Dist.

## ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Madras University,
   CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman,
   Telangana University, Dichpally,
   Nizamabad, Telangana.
5. Prof. **N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Dept. of Telugu & O.L.,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Associate Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District.
   Telangana.

7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept.of Modern Indian Languages,
Madhurai Kamaraj University, Madhurai,
Tamilnadu.

8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Yogi Vemana University, Kadapa.

9. **Prof. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
Dept. of Telugu,
Regional Institute of Education (NCRT)
Manasa Gangothri, Mysore, Karnataka.

10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
Associate Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittor Dist.

11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
Asst.Professor, Dept. of Telugu,
Adikavi Nannaya University,
RAJAMUNDRY, East Godavari, A.P.

12. **Mr.D.ESWARA RAO,** M.A.,
Associate Professor, Dept.of English,
P.A.S.College, PEDANANDIPADU-522 235,
Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. Guntupalli Gowri,** M.A., PhD.
Dept. of Telugu,
Govt. College for Women, Guntur - 522 002.

18. **Dr. Kakani Sudhakar,** M.A., M.Phil., PhD.
Dept. of Telugu,
S.S.N. College, Narasaraopet - 522 601.

19. **Dr. K. Pushpamma,** M.A., PhD.
HOD, Dept. of Telugu,
SVRM College,
Nagaram - 522 035.

20. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

21. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

22. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
Project Senior Fellow, Dept. of Classical
Literature, CIIL, Mysore.

23. **Dr. G. Sailamma,** M.A., M.Phil., PhD.
Editorial Assistat,
Centre for Publications Dravidian University,
Kuppam, Chittor Dist.

24. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
Guest Faculty, Dept. of Telugu,
Central University of Andhra Pradesh,
Ananthapuram District. A.P.

25. **Dr. M. Prasad,** M.A., M.A. (San)., PhD. Diploma in Maliyalam.
School Assistant (Telugu)
Govt. High School,
Rapuru, SPSR Nellore.

26. **Dr. V. Triveni**
Head & Assistant Professor,
Dept. of Telugu Studies,
Telangana University, Dichpally, Nizamabad.

27. **Dr. Mark Poloneyes,** M.A., M.Phil., PhD.
Principal & HOD,
P.G. Centre, Gadwal,
Palamuru University, Mahabobnagar, Telangana.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Principal & Research Guide, Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**DTP & PRINTING**

**TENALI PRAKASH**, G.L.S. GRAPHICS, LEMALLE, Guntur. 94 94 660 509.

గమనిక : రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - **ఎడిటర్.**

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet,
GUNTUR - 522 002. Andhra Pradesh. Cell : 7386529274, 7989781963.
E-mail : parisodhanatelugu@gmail.com.Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# వేమన

"విశ్వదాభిరామ వినురవేమ" అనే మాట వినని తెలుగువాడు ఉండడు. వానకు తడవని వారు, ఒక్క వేమన పద్యం కూడా రాని తెలుగువారు ఉండరని లోకోక్తి. అంత ప్రఖ్యాతి గాంచిన వేమన 17వ శతాబ్దంలో జీవించాడు. వేమన కొండవీటి రెడ్డిరాజు వంశానికి చెందినవాడని, గండికోట దుర్గాధిపతులలో సంబంధం కలిగినవారని అంటారు. ఇంకొక పరిశోధన ప్రకారం వేమన కడప మండలంలోని ఒక చిన్నపల్లెలో మధ్య తరగతి కాపు కులస్థులకు జన్మించారని అంటారు.

వేమన పద్యాలలో అతని జీవితానికి సంబంధించిన క్రింది పద్యాలను ముఖ్యంగా ఉదహరిస్తారు.

"నందన సంవత్సరమున పొందుగ కార్తీకమందు బున్నమినాడీ
వింధ్యాద్రి సేతువులకును, నందున నొక వీరుడేరుపడెరా వేమా!"

"ఊరు కొండవీడు వునికి పశ్చిమ వీధి; మూగచింతపల్లె
మొదటి యిల్లు ఎడ్డిరెడ్డి కులము యేమని చెప్పదు; విశ్వదాభిరామ వినురవేమ!

కాదనడెవ్వరితోడను; వాదాడగబోడు వెర్రివాని విధమునన్
భేదాభేద మెరుంగను; వేదాంత రహస్యములను వేమన నడుపున్ ॥

వేమన పద్యాలు వందల సంవత్సరాల వరకు గ్రంథస్తం కాకుండా కేవలం సామాన్యుల నోటనే నిలిచి ఉన్నాయి. 1791లో ఫాదర్ లెగాక్ తొలిసారిగా వేమన పద్యాలు సేకరించాడని పరిశోధకులు భావిస్తారు. 1816లో ఒక ఫ్రెంచి మిషనరీ, తరువాత ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ ఎన్నో వేమన పద్యాలను సేకరించారు. అతను వందల పద్యాలను సేకరించి, వాటిని లాటిన్, ఆంగ్ల భాషలలోకి అనువదించారు. తెలుగువారిలో వేమన కీర్తిని అజరామరం చేయడానికి కృషి చేసినవాడు కట్టమంచి రామలింగారెడ్డి. రాష్ట్రంలో పలుచోట్ల వేమన జయంతి ఉత్సవాలు, సంఘాలకై కృషి చేశారు.

పైన పేర్కొన్న సాహితీవేత్తల కృతి తరువాత వేమన రచనలకు పండితుల నుండి అనన్యమైన గౌరవం లభించసాగింది. కామరాజు వేంకట లక్ష్మణరావు, సురవరం ప్రతాపరెడ్డి, మల్లంపల్లి సోమశేఖర శర్మ, వేటూరి ప్రభాకరశాస్త్రి వంటి వారు వేమనను సంస్కర్తగా ప్రస్తుతించారు. ఆరుద్ర 'మన వేమన' అనే గ్రంథాన్ని రచించారు. ఆ తరువాత ఎందరో యువ కవులు రచయితలు వేమనను గురించి, వేమన రచనల గురించి పరిశోధనలు చేశారు. డా॥ ఎన్. గోపి గారు, బంగోరే వంటి ప్రముఖులు వేమనపై పరిశోధనలు జరిపినవారిలో ముఖ్యులు.

వేమన సాహిత్యం వెలుగులోకి వచ్చిన తరువాత వేమన సాహిత్యాన్ని చదివిన సాహితీ ప్రముఖులు, కవులు క్రింది విధంగా అభిప్రాయాన్ని వెల్లడించారు.

"కవిత్రయం అంటే తిక్కన, వేమన, గురజాడ" - శ్రీశ్రీ

"వేమన కవిత్వం గాయపు మందు గాయానికి కాక, కత్తికే పూసినట్లుండును॥ - రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ

పామరులకు కూడా అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి, మెప్పించిన కవి వేమన. ఆటవెలదుతో అద్భుతమైన కవిత్వము, అనంతమైన విలువ గల సలహాలు, సూచనలు, విలువలు, తెలుగు సంగతులు ఇమిడ్చిన మహానుభావుడు. ఆట వెలదిని ఈటెగా విసిరిన దిట్ట, ఛాందస భావాలక తొలి అడ్డుకట్ట యోగి వేమన.

- సంపాదకవర్గం

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | శాసనాలు - అధ్యయనం (మొదటి భాగం) | - ఆచార్య జి. అరుణ కుమారి | 6 |
| 2. | క్రీడాభిరామంలో మంచన శర్మ - శ్రీనాథుని రేఖాచిత్రం | - డా॥. వి. పళని | 12 |
| 3. | గుర్రం జాషువా 'నేతాజీ' | - డా. కె.ఎన్. సుందరేశ్వరరావు | 17 |
| 4. | రావూరి కథలు పరిశీలన | - డా. ఇ. వాసు | 23 |
| 5. | అక్కినేని కుటుంబరావు నవలా సాహిత్యం - వస్తువైవిధ్యం | - డా॥. బి. ఉపేంద్ర | 28 |
| 6. | అలపర్తి రామకృష్ణ నవలలు - సాంస్కృతికాంశాలు | - సి. విజయలక్ష్మి | 30 |
| 7. | తెలుగులో 'దళిత స్త్రీ' వాద సాహిత్యం | - డా॥. పి. ఎ. సత్యనారాయణ | 33 |
| 8. | శరత్ నవలల - చలన చిత్రాలు - రస దృక్పథం | - భవానీ శంకర్ | 35 |
| 9. | వేకువరాగం - హేమలత మౌనరాగం | - వెంకటేశ్వరరావు కట్టూరి | 37 |
| 10. | దేవులపల్లి విశ్వనాథం ఖండకావ్యాలు - సామాజిక స్పృహ | - సూరె శ్రీనివాసులు | 40 |
| 11. | కందుకూరి వీరేశలింగం సాహిత్యం - సాంఘీక దృక్పథం | - వి. వెంకటేశన్ | 43 |
| 12. | పత్రికా (గోల్కొండ) ప్రావీణ్యుడు - ప్రతాపరెడ్డి | - జె. విజేందర్ | 46 |
| 13. | బండి నారాయణస్వామి జీవితం, సాహిత్యం | - ఎ. సుబ్రమణ్యం | 48 |
| 14. | "బంజారా పండుగలు - మానవ సంబంధాలు" | - బానోత్ స్వామి | 53 |
| 15. | 'చిత్తూరు కథ' సంకలనం - రైతుల సమస్యల చిత్రణ | - డా॥ పి. జయచంద్రుడు | 56 |
| 16. | దేవరాజు మహారాజు "కడుపు కోత" కథా సంపుటి విశ్లేషణ | - ధీరావత్ లక్ష్మణ్ | 60 |
| 17. | ఆత్రేయ నాటకాల్లో శిల్ప విన్యాసం | - వై. దివ్య | 62 |
| 18. | దళిత దృక్కోణంలో "స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్" కావ్యం | - డా॥ ఎన్. ఈశ్వరరెడ్డి | 66 |
| 19. | మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో వెలువడిన చారిత్రక గ్రంథాలు | - కె. జనార్దన్ | 72 |
| 20. | జాషువా - 'శిల్పి' | - డాక్టర్ ఎం.మునిరత్నం | 76 |
| 21. | 'భావన' - వస్తువిశ్లేషణ | - నూకల విజయలక్ష్మి | 80 |
| 22. | మారిషస్ దేశంలో శిక్షణోపాధ్యాయుల లిఖిత దోషాలు.... | - ప్రవాసీ చిన్నయ్య | 83 |
| 23. | డా॥ టి.జి.ఆర్. ప్రసాద్ గారి కథలు - మానవీయ విలువలు | - యస్. రాధిక & డా॥. పి. శ్రీనివాసులు | 91 |
| 24. | అభ్యుదయ కవి - దాశరథి | - గుర్జకుంట స్వరాజ్ | 94 |
| 25. | అవమానాలను ఎదిరించి నిలిచిన సత్యవాడ సోదరీమణుల 'అమ్మమ్మ ఆశయం' | - యద్దనపూడి దీప్తి | 97 |
| 26. | కాకతీయుల కాలపు ఆర్థిక వ్యవస్థ | - డా॥. గంగు కిషన్ ప్రసాద్ | 102 |
| 27. | పాలేరు నాటకం - సామాజిక చైతన్యం | - డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు | 108 |
| 28. | తెలంగాణా కథ - వలస కుటుంబ కష్టాలు | - జి. అశోక్ | 112 |
| 29. | బసవేశ్వరుని వచనాలు - సామాజిక చైతన్యం | - డా॥. మఠపతి మాంతయ్య | 114 |
| 30. | Importance of Human Element in Machine Translation | - Dr. Bolugadde Anil Kumar | 117 |

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# శాసనాలు - అధ్యయనం (మొదటి భాగం)

- ఆచార్య జి. అరుణ కుమారి, తెలుగు శాఖాధ్యక్షులు, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

వ్రాత తెలియక ముందు ఆదిమ జాతివారు గుర్తులకు సంకేతాలుగా నిలిచే ముడుల రాతలో నేర్పరులు. పాత కాలంలో చైనా దేశీయులు, పారశీకులు, మెక్సికోవాసులు, దక్షిణ అమెరికాలోని పెరూ దేశీయులు ముడుల రాతలో నేర్పరులు. ఆ దేశపు గొర్రెల కాపర్లుకు ఈ ముడుల భాష తెలుసు. ఈ ముడుల భాషను గ్రంథి భాష అని, ముడుల అక్షరాలను గ్రంథి వర్ణమాల అని, క్వీపా అని వ్యవహరించారు.

గ్రంథి లిపిని ముడుల రాత, ముడుల అక్షరాలు, ముడుల వర్ణమాల, గ్రంథి వర్ణమాల, క్వీపా అని వ్యవహరిస్తున్నారు. ముడుల రాతను ఈ విధంగా కొనసాగించారు. కర్రకు రంగు రంగుల దారాలు చుట్టి ముడి వేస్తారు. ఈ ముళ్ళు దగ్గర దగ్గరగా ఉంటే అతి ముఖ్యమైన విషయం అని అర్థం. ముళ్ళకు రంగులు వేయకపోతే సంఖ్యలని అర్థం.

ఒంటి ముడి - పదులు, జంట ముడులు - వందలు, మూడు ముడులు - వేలుగా పరిగణించారు.

దారాలు సన్నవా, లావువా, ముడి వదులుగా ఉందా, బిర్రుగా ఉందా, ఎలా వేసారు, ఏ వరుసలో ఉన్నాయి అని గమనించి ఆ సంకేతాలను గుర్తుపట్టాలి.

అమెరికా ఆదిమవాసులు ముడులకు బదులుగా రంగు పూసలు, గవ్వలు వాడేవారు. వీటిని దండలుగా గుచ్చేవారు. రంగుల సంకేతాలు ఆనాడు ఈ విధంగా ఉండేవి. ఈ రంగు రంగు పూసల దండలను కటకాలు అని అంటారు. వీటికే వామ్‌పమ్ అని పేరు.

నలుపు - మరణం, అశుభం, దురదృష్టం, భయం.
తెలుపు - శాంతి, పెళ్ళి
పసుపు - బంగారం
ఎరుపు - యుద్ధం, ఆపద
ఆకుపచ్చ - ధాన్యం

ఈ సంకేతాలను ఈ నాటికీ మనం పాటిస్తున్నాం. క్రమేపి సుద్ధతోగాని బొగ్గుతోకాని ఎర్ర మట్టితో కానీ గోడల మీద గీయడం మొదలుపెట్టారు. 2000 ఏళ్ళనాటి గాథా సప్తశతిలో భర్త అప్పుడొస్తాడు ఇప్పుడొస్తాడని ఒక స్త్రీ గోడలనిండా గీతలు గీసిందనే వర్ణన ఉంది. సెర్బియా దేశపు ప్రజలు ఇంటి ద్వార బంధాలకు గాట్లు పెట్టి లెక్కలు గణించేవారు. కర్రకు గాట్లు పెట్టి రెండుగా చీల్చి ఒకటి వర్తకుడి దగ్గర మరొకటి ధాన్యం అప్పుగా తీసుకున్న వ్యక్తి దగ్గర ఉంచేవారు. అప్పు తీర్చే సమయంలో కర్రముక్కల్ని జోడించి గాట్లును లెక్కించి అప్పు తీర్చేవారు.

ప్రజలు రాత నేర్చుకోవడానికి ముందు వస్తువులతోనే జవాజులు రాసుకునేవారు. కొన్ని జాతులవారు కయ్యానికి కాలు దువ్వవలసి వస్తే బల్లెమో బాణమో పంపేవారు. వస్తువుల స్థానంలో బొమ్మలు చోటు చేసుకున్నాయి. చెట్టు పట్టల పైన, దుప్పి తోలుపైన, దంతాలపైన, ఎముకల పైన బొమ్మలు వేసి పంపేవారు. ఉదాహరణకు విల్లుకు బదులుగా విల్లు బొమ్మ వేసి పంపేవారు. ఆ పైన గ్రామాల పొలిమేరల్లోగాని చెరువు గట్ల మీదగాని, కోట గవనుల ముందుగాని, రాతి బండల మీదగాని బొమ్మలు చెక్కి వీరుని మరణాన్ని అతని గొప్పతనాన్ని అతనికి సంబంధించిన సమాచారాన్ని అందించేవారు. ఈ బొమ్మల సంకేతాలున్న రాతి బండలను వీరగల్లులు అని అనేవారు. ప్రపంచమంతటా ఈ చిత్రాక్షరాలే ప్రపంచ రాతగా నిలిచాయి.



సూర్యుడు, కొండ, చంద్రుడు, నీరు..ఇవి చిత్ర లిపి సంకేతాలు.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253  UGC Approved Journal No. 42500

ధ్వని వాచక సంకేతాలుగా రూపొందిన విధానాన్ని గమనించవచ్చు.


మాయ్ - నీరు


నబస్ - పాము

ఈ విధంగా చిత్రలిపి బొమ్మల రాత క్రమంగా గూఢ సంకేతాలుగా నిలిచి ఆ పైన వంకర గీటులుగా మారి ఆపై ప్రజల చేతి వాటంతో నడిచి క్రమేపి ఒక స్థిరమైన ఆకారంతో అక్షరాల రూపంలో నిలిచిందన్న మాట. ఋగ్వేదంలో లిపికి సంబంధించిన ప్రశంస ఉంది.

"ఉతత్వః పశ్యన్ న దదర్శ వాచమ్
ఉతత్వః శృణ్వన్ న శృణోత్యేనామ్" 10.71.4

కొందరు వేద వాక్కును చూసి చూడరు, కొందరు వేదవాక్కును విని వినరు. వేదకాలం నాటికి లిపి ఉందనే అంశాన్ని ఈ సూక్తం వివరిస్తుంది. ఎన్నో వంకర టింకర గీతల నుండి రాతిబండల మీద, రాగి రేకుల మీద, తాటాకుల మీద, కడితాల మీద రాపాడి రాపాడి నేటి లిపి రూపాన్ని సంతరించుకుంది. భాష అనేది ధ్వని రూపాలతో వ్యక్తమవుతుంది. ఈ ధ్వనులు ఇవి, వీటికి ఇవి గుర్తులు అనే నిర్ణయమే వర్ణ సమామ్నాయం. అక్షరం అంటే క్షరం కానిది. నాశనం లేనిది. మాటలు, గాలిలో కలిసిపోతాయి. కాని సంకేతాలు నశించవు. అవే అక్షరాలు.

లిప్ అనే ధాతువు నుండి లిపి అనే పదం ఏర్పడింది. లిపి అంటే ఉపదేహమని అర్థం. ధ్వనికి ఉపదేహమే లిపి. లిపికి కప్పుట, మూయుట అని అర్థం. స్వరాన్ని అంటే అచ్చును కప్పేది రక్షించేది అనే అర్థంలో ప్రయోగిస్తున్నారు. కప్పుట మూలంగా విలక్షణమైన ఆకృతిని కలిగిస్తుంది. లేఖన సాధనాలను బట్టి లేఖన పద్ధతులను బట్టి అక్షరాన్ని వర్ణం, లిపి, లేఖి, లేఖం, లేఖనం అనే పేర్లతో వ్యవహరిస్తున్నారు. రంగులతో రాయడం వలన వర్ణం అని, రంగులు పూయడం వలన లిపి, లేఖి అని, చెక్కడం వలన లేఖం అని పిలుస్తున్నారు.

లోకంలో భిన్న వస్తువులకు మానవ వివిధ స్పందనలకు ధ్వనిమయ రూపాలను కల్పించటానికి ఆదిమ కాలం నుండి జరిగిన జరుగుతున్న కృషి ఫలితంగా అనేక భాషలు ఉద్భవించాయి. ధ్వనిమయ రూపాలకు దృశ్య రూపాన్ని రూపొందించటానికి వివిధ లిపులు ఆవిర్భవించాయి. పాణినికి రెండు వందల సంవత్సరాల ముందువాడైన బుద్ధుడు (6Th B.C.) విద్యాభ్యాసం సమయంలో గురువు విశ్వామిత్రుడిని 64 లిపులలో నాకు ఏ లిపిని నేర్పిస్తావని ప్రశ్నించినట్లు లలిత విస్తరమనే గ్రంథం తెలియజేస్తుంది. బ్రాహ్మి, ఖరోష్ఠి, పుష్కరసారి, అంగ, వంగ, మగధ, ద్రావిడ, మంగల్య, చీన, హూన, అంగులేయ, దేవ, నాగ, యక్ష, కిన్నెర, అసుర వంటి లిపులను అరవై నాల్గింటిని పేర్కొన్నారు. జైనమత గ్రంథం 18 లిపులను పేర్కొంది.

మన దేశంలో ఎక్కువ ప్రచారంలో ఉన్న లిపులు బ్రాహ్మి ఖరోష్ఠి లిపులు. జైన బౌద్ధ గ్రంథాలలో బ్రాహ్మి లిపియే ప్రాచీనమని తేలుతుంది.

- ♦ ఈజిప్టు చిత్ర లిపి నుండే ప్రపంచంలోని భాషలన్నీ పుట్టాయని పాశ్చాత్య విద్వాంసుల అభిప్రాయం.
- ♦ బ్రాహ్మి, సింధు నాగరికతా లిపులకు చిత్రలిపి భూమిక అని భారతీయ పండితులు విశ్వసిస్తున్నారు.
- ♦ సింధు నాగరికతా లిపే బ్రాహ్మి లిపికి మూలమని మరొక వాదం వినిపిస్తుంది.
- ♦ ఆదిమజాతి వార్త వినిమయం జరపడమే కాదు గ్రంథాలను కూడా లిఖించేవారని చరిత్ర చెబుతుంది.
- ♦ తెలుగు లిపి దక్షిణ బ్రాహ్మి లిపి నుండి పుట్టి గుండ్రంగా మారి తన స్వతంత్రను నిలుపుకుంది. భారతదేశం అనేక భాషలకు నిలయం. కనుక అనేక లిపులకు చోటిచ్చింది. భారతదేశంలోని లిపులన్నీ బ్రాహ్మి లిపి నుండే పరిణమించాయి.

క్రీస్తుపూర్వం 4/3 శతాబ్దం వాడైన కౌటిల్యుడు రాసిన అర్థశాస్త్రంలో 'అకారాదయో వర్ణాః త్రిషష్టిః' అని అన్నాడు.

| | |
|---|---|
| హ్రస్వ దీర్ఘ ప్లుత భేదాల చేత అచ్చులు | 22 |
| ఐదు కవర్గాదులు | 25 |
| య ర ల వ ష శ స హ | 8 |
| అయోగ వాహలు - అనుస్వార(ం), | |
| విసర్గ(ః), జిహ్వామూలీయం | 4 |
| ఉపధ్మానీయాలు, | |
| య మా లు | 4 |
| | 63 |

వర్గంలోని ప్రథమాక్షరానికి పంచమాక్షరం చేరి పలిక్+నీ = పలిక్క్నీ వంటి అక్షరాలును వీటినే 'యమం' అని పేరు. (ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థాక్షరాలకి పంచామాక్షరం పరమైనప్పుడు)



బ్రాహ్మీ లిపిలోని 'అ'కారానికి సంకేతంగా ఈ అక్షరం సత్ చిత్ ఆనంద/అనంత. బ్రహ్మ త్రిగుణాలు.

బ్రాహ్మీ లిపిలో నిలువు గీత అనంతానికి సంకేతం మిగిలిన రెండు గీతలు సత్, చిత్‌లకు సంకేతాలు.

### ఇ అనే అక్షరానికి బ్రాహ్మీ లిపిలో ∴

త్రిగుణాలు -సత్వ రజో తమో గుణాలకు సంకేతంగా ఏర్పడిన అక్షరం. ఇది వేదిక్ మాయగా పరిగణింబడింది. ఈ త్రిగుణాలకు సంకేతాలుగా నిలిచిన ఈ మూడు చుక్కలకు సత్ చిత్ అనంతాలకు సంకేతాలుగా నిలిచిన మూడు గీతలను కలిపినట్లయితే △ గా ఏర్పడి బ్రాహ్మీ లిపిలో E గా రూపొందిందని, దీనినే గుణ సంధిగాను పి.వి.పరబ్రహ్మశాస్త్రి పేర్కొన్నారు. బ్రహ్మ గుణాలుగా గుర్తింపబడ్డాయి కాబట్టి ఈ లిపిని బ్రాహ్మీలిపి పేరు కలిగిందని పి.వి.పరబ్రహ్మశాస్త్రి పేర్కొన్నారు.

సింధూ లిపి లక్షణాలను తొలిరోజుల్లో బ్రాహ్మీలిపి పుణికి పుచ్చుకుంది. సింధులిపి అవలంబించిన హలరీతిని బ్రాహ్మీ లిపి తొలి రోజుల్లో సౌలభ్యార్థం ఎడమ నుండి కుడికి రాసే విధానాన్ని ఏర్పరచుకుంది. కుడి నుండి ఎడమకు ఎడమ నుండి కుడికి నిటారుగా రాసే పద్ధతులున్నాయి. సూర్య గతిని అనుసరించి రాత పద్ధతి ఏర్ప డిందనే వాదన కూడా ఉంది.

చరిత్ర నిర్మాణానికి శాసనాలు అతి ముఖ్యమైన ఆధారాలు. శాసనం అనే పదానికి అనుశాసనం, ఆజ్ఞ అనే అర్థాలున్నాయి. కౌటిల్యుడు (క్రీస్తుపూర్వం 4-3 శతాబ్దం) అర్థశాస్త్రంలో (అథ దశమో2ధ్యాయః అష్టా వింశం ప్రకరణమ్ - శాసనాధికారః)

'శాసనే శాసనమిత్యా చక్షతే శాసన ప్రధానాహి రాజానః; తన్మూలత్వాత్ సంధి విగ్రహయోః' అని అన్నాడు. విషయం లిఖితం రూపంలో ఉంటేనే శాసనం. పత్రం మీద విషయం పెట్టినప్పుడు దానిని శాసనం అంటారు. రాజులకు శాసనం ప్రధానమైనది ఎందుకంటే సంధి, విగ్రహం రెండూ శాసనం మీదనే ఆధారపడి ఉంటాయి కాబట్టి. వాగ్దానం శాసనంగా పరిగణించబడదు.

కౌటిల్యుడి అర్థ శాస్త్రం పదవ అధ్యాయంలో రాజ శాసనాలు రాయించే విధానాన్ని గురించి వివరించాడు. లేఖకునికి ఉండవలసిన లక్షణాలను, శాసనాన్ని లిఖించే విధానాన్ని వివరించాడు.

### లేఖకుడు - లక్షణాలు :

1. లేఖకునికి సమయానుకూలంగా అన్ని విషయాల పట్ల అవగాహన ఉండాలి.
2. అంశాన్ని వేగంగా అందంగా రాయాలి.
3. ఇతరుల లేఖలను చదివే నైపుణ్యం ఉండాలి.
4. వ్యక్తిగత విషయాలు జోడించకుండా రాజు చెప్పదలచిన ఉద్దేశాన్ని పేర్కొనాలి.
5. ప్రభువుకు సంబంధించిన దేశం, ఐశ్వర్యం, నామ ధేయం తెలిపేటప్పుడు ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త వహించాలి.
6. లేఖకుడు అమాత్య సంపద కలవాడై అన్ని కట్టు బాట్లను తెలుసుకొని ఉండాలి.
7. కార్య విషయంలో రాసేటప్పుడు ఎవరికి రాస్తున్నాడో వాని జాతిని, కులాన్ని, పదవినీ, విద్యను, అతడు చేసే పనిని, ఐశ్వర్యాన్ని, శీలాన్ని, దేశాన్ని, కాలాన్ని, వైవాహిక సంబంధాన్ని దృష్టిలో ఉంచుకొని లేఖ తయారు చేయాలి.

## లేఖకు ఉండవలసిన ప్రధాన లక్షణాలు :

1. **అర్థ క్రమం** : చెప్పవలసిన విషయాన్ని క్రమపద్ధతిలో కూర్చి ప్రధానమైన విషయాన్ని ముందు చేర్చటం.
2. **సంబంధం** : విషయానికి విరోధం లేకుండా చివరి వరకు తరవాతి విషయాలు చేర్చడం.
3. **పరిపూర్ణత** : అర్థాలు పదాలు అక్షరాలు ఎక్కువ తక్కువ లేకుండా ప్రతిపాదించదలిచిన ఈ విషయాన్ని స్పష్టంగా హేతువులు, ఉదాహరణలు, దృష్టాంతాలను చూపి చెప్పగలగడం.
4. **మాధుర్యం** : అందమైన అర్థాన్ని అనాయాసంగా బోధించగల శబ్దాల ప్రయోగం మాధుర్యం.
5. **ఔదార్యం** : అగ్రామ్యాలైన శబ్దాలను ప్రయోగించడం ఔదార్యం.
6. **స్పష్టత్వం** : ప్రసిద్ధమైన శబ్దాల ప్రయోగం స్పష్టత్వం.

## శాసన విధానాలు:

శ్లో॥ ప్రజ్ఞాపనాజ్ఞా పరిదాన లేఖాస్తథా పరీహార నిసృష్టి లేఖా,
ప్రావృత్తికశ్చ ప్రతిలేఖ ఏవ సరత్రగ శ్చేతి హి శాసనాని.

1. **ప్రజ్ఞాపన లేఖ** : 'రాజు గారి ముందు ఫలానావాడు నువ్వు సాధించిన గొప్ప పనిని గూర్చి చెప్పాడు'. అన్నట్టుగా ప్రజ్ఞాపన లేఖ ఉంటుంది. విక్రమేంద్ర భట్టారక వర్మ ఇంద్రపాల నగరం శాసనం. రాజుల వంశ చరిత్ర, యుద్ధం, పరిపాలనా కాలం సింహ వర్మ గెలిచాడు.
2. **ఆజ్ఞా లేఖ** : నిగ్రహానుగ్రహాలను గూర్చి ప్రధానంగా రాజ భృత్యుల నిగ్రహానుగ్రహాలను గూర్చి ప్రభువు ఆజ్ఞ ఉన్న లేఖ ఆజ్ఞా లేఖ.
   గోవింద వర్మ పేణ్కపఱ గ్రామాన్ని నిధులతో సహా ఇచ్చాడు. రాజభటులకు, అధికారులకు ప్రవేశం లేదు. గోవింద వర్మ భార్య మహాదేవి పేరున ఇచ్చాడు.
3. **పరిధాన లేఖ** : కష్ట సమయాలలో కాని అనుగ్రహం చూపించేటప్పుడు గాని ఉత్తమ మధ్యమాధముల విషయంలో తగు విధమైన అర్హతలను బట్టి చేసిన పూజ చూపుతూ రాసిన లేఖ పరిధాన లేఖ.
   ఎఱకసాని పిల్లలమర్రి శాసనం - విద్యార్థుల భోజన వసతి, చలివేంద్రంలో నీరు పోసే వారికి, సత్రానికి, వంట వారికి ఇచ్చిన భూమి.
4. **పరిహార లేఖ** : కొన్ని జాతుల విషయంలో గాని ఆయా పురాల విషయంలో గాని, గ్రామాల విషయంలో గాని, దేశాల విషయంలో గాని రాజాజ్ఞ ప్రకారం అనుగ్రహం చూపుతూ రాసిన లేఖ పరిహార లేఖ.
   లుంబినిలో బుద్ధుడు పుట్టినందుకు ఆ పురవాసులందరికీ పన్ను మినహాయింపు క్రీస్తు పూర్వం 3వ శతాబ్దంలో అశోకుని రుమ్మిన్‌డెయ్ శాసనం.
5. **వాచిక లేఖ/ నైసృష్టిక లేఖ** : పనులు చేయించే విషయంలో కాని, కొన్ని ఆజ్ఞలు ఇవ్వడానికిగాని మరొకరికి అధికారం ఇస్తూ రాజు జారీ చేసిన లేఖ వాచిక లేఖ.
6. **ప్రవృత్తి లేఖ** : ఒక శాసనానికి సంబంధించి ప్రవృత్తి లేఖ రెండు విధాలుగా ఉంటుంది. దైవం వలన కలిగిన అకాల వర్షాలు, సస్య సమృద్ధి, వర్షాభావాదులు వీటికి సంబంధించినది మొదటిది. మానవులు ప్రవృత్తి వలన జరిగిన యదార్థ విషయాలకు సంబంధించినది రెండవది.
   తల్లిదండ్రులకు పుణ్యం కలగాలని మూసేటి కాలువ కింద 4 మరుతుర్ల వృత్తిని నిలుపు సందర్భంలో వేయించిన నాగులపాడు శాసనం. రాజులకు పుణ్యం కలగాలని అంగరక్షకుడు వేసిన తాడువాయి శాసనం.
7. **ప్రతి లేఖ** : ఇతరుల నుండి వచ్చిన లేఖను ఉన్నదున్నట్లుగా ముందుగా చదువుకొని అర్థం చేసుకుని తరువాత పైకి చదివి వినిపించి రాజు ఏ విధంగా చెబితే ఆ విధంగా సమాధానం రాసేది ప్రతి లేఖ.
8. **సర్వత్రగ లేఖ** : రాజు ఏ లేఖలో పథికుల రక్షకు వాళ్లకు సహాయపడానికి ఆదేశిస్తూ దుర్గపాల రాష్ట్ర అంత పాలకులకులకు అధికారులకు రాస్తాడో ఆ లేఖ సర్వత్రగ లేఖ అశోకుని శిలా శాసనాలు:

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


దేవానాం పియే.. మానవులకు, పశువులకు అశోకుడు వైద్యానికి ఔషధ మొక్కలను పెంచాడు. బాటసారులకు నీడని ఇవ్వడానికి చెట్లు నాటించాడు.

## లేఖ దోషాలు :

1. **అకాంతి** : నల్లని పత్రాలు ఉపయోగించడం. అందంగా లేక ఎగుడుదిగుడుగా కనబడీ కనబడ కుండా అక్షరాలు
   ఉండటం అకాంతి. 'ఆయా ప్రదేశముల కనవసరమని తోచినప్పుడును, సంక్షిప్తము చేయు ప్రయత్నము నందునను, లేఖకుని పొరపాట్లు వల్లను ధర్మ సూత్రములలో కొన్ని అసమగ్రముగ లిఖింపబడినవి'. అశోకుని ఎఱ్ఱగుడి 14వ శిలాశాసనము ప్రాకృత మూలము నుండి తెలుగులోకి అనువదించబడిన సారాంశము. (6వ పాదం అశోకుని ఎఱ్ఱగుడి 14వ శిలాశాసనము)
2. **వ్యాఘాతం** : మొట్టమొదట చెప్పినదానికి తరువాత చెప్పినది విరుద్ధంగా ఉండటం.
3. **పునరుక్తం** : చెప్పిన దానిని మళ్లీ చెప్పడం. అశోకుని 14వ శిలాశాసనం. కొన్ని విషయాలు శాసనాలలో మళ్ళీ మళ్ళీ ప్రకటించాడు. ప్రజల ఆచరణార్థం తరచుగా చెప్పబడ్డాయి.
   ఉదా॥ తల్లిదండ్రులను గౌరవించాలని పలుమార్లు శాసనాల్లో పేర్కొన్నాడు. (2వ లఘు శిలాశాసనం, 3వ శిలా శాసనం, 4వ శిలా శాసనం)
4. **అపశబ్దం** : లింగ వచనాలు కాలం ప్రయోగించ వలసిన విధంగా కాక మరొక విధంగా ప్రయోగిం చడం.
5. **సంప్లవం** : విరామ స్థానం కానిచోట విరామ స్థానం ఇవ్వడం, అర్ధక్రమం మొదలైన గుణాలకు విరుద్ధంగా ఉండడం.

అశోకుని 14వ శిలాశాసనంలో ఆయా ప్రదేశాలలో అనవసరమని తోచినప్పుడు సంక్షిప్తం చేయ ప్రయత్నించిన లేఖకుని పొరపాట్ల వల్ల ధర్మ సూత్రంలో కొన్ని అస మగ్రంగా లిఖింపబడ్డాయి.

3 శతాబ్దం నాటి అశోకుని ఎఱ్ఱగుడి శాసనాలు రాజోద్యోగులైన రజ్జులనుద్దేశించినవి. సువర్ణగిరి నగరమందున్న మహామాత్యుల కందజేసిన రాజాజ్ఞలే ఈ శాసనాలు. సువర్ణగిరి కర్నూలు జిల్లా పత్తికొండ తాలుకా ఎర్రగుడి గ్రామం. ఈ గ్రామానికి పశ్చిమంలో గుట్ట ఉంది. అది ఏనుగ కొండ నల్ల ఏనుగ కొండ పేర్లు ఉన్నాయి. సువర్ణగిరిని సొర్నగిరి జొన్నగిరి అని అన్నారు. శాసనకర్త మగధ సామ్రాజ్యధినేత జంబూద్వీప చక్రవర్తి అయిన 'ప్రియదర్శి' అనురాజు శాసనాలలో ఎక్కడా అతని తల్లిదండ్రులను గురించి కాని అన్నదమ్ముల గురించి కాని భార్యను గురించి కాని ఇతర బంధువులను గురించి కాని ప్రస్తావింపబడలేదు. కాని మెగస్తనీసు రాసిన ఇండికా వలన పురాణాలు, కౌటిల్యుని అర్థశాస్త్రం, జైన బౌద్ధమత గ్రంథాల వలన మనకు అశోకుని పూర్వ చరిత్ర తెలుస్తుంది. మైసూరు రాష్ట్రంలోని మాస్కి శాసనం వలన ఈ ప్రియదర్శి మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుడని తెలుస్తుంది.

పాణిని క్రీ.పూ. 6-5 శతాబ్దాల కాలంలోను, బుద్ధుడు క్రీ.పూ 563-483 శతాబ్దంలోను, చాణుక్యుడు క్రీ.పూ 371-283 శతాబ్దంలోను, అశోకుడు క్రీ.పూ 268-232 శతాబ్దంలోను ఉన్నారని చరిత్ర చెబుతుంది. ఇవి ప్రమాణ కాలాలు కాకపోవచ్చు. కాని ప్రమాణాలను సూచించడానికి పనికి వచ్చే ఆధారాల ద్వారా సూచించవచ్చు. ఎఱ్ఱగుడి మొదటి లఘు శాసనం - ప్రాకృత మూలం

దేవానాం పియే హే వహే (1)
వాపితె వ్యూథేన 200 50 6 (12)

256 దినముల పర్యటనానంతరము నేనీ సందేశ మును ప్రకటించితిని. దైవత్వ ప్రాప్తి ధనికులకు మాత్రమే కాదు. దరిద్రుడైనను చిత్తశుద్ధితో ధర్మ మాచరించిన స్వర్గప్రాప్తి పొందవచ్చు.

**రెండవ లఘు శిలాశాసనంలో..**

రజ్జుకులకు మీ రాజ్ఞ ఇవ్వవలెను.

ప్రతివారు తమ తల్లిదండ్రులకు అణగియుండ వలెను.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

ప్రతివారు పెద్దలను గౌరవించవలెను.
ప్రతివారును జీవులపై దయజూపవలెను.
ప్రతివారును సత్యమునే వచింపవలెను.
ప్రతివారును ధర్మమునే చాటవలెను.

**దేవానాం ప్రియ**

↓

**రాజోద్యోగులు (రజ్జులు)**

↓

**గజారోహకులు, బ్రాహ్మణులు, రథారూఢులు, గురువులు**

↓

**శిష్యులు** | **బంధువులు, స్త్రీ పురుషులు**

పైన పేర్కొన్న వారి మూలంగానే ధర్మదీక్ష కొన సాగిందని అశోకుడు భావించాడు.

దేవానాం ప్రియ బిరుదాంకితులైన రాజులెల్లరు విహార యాత్రలకే వెళ్ళేవారని, మృగయా వినోదులని, దేవానం ప్రియుడు ప్రియదర్శి తన అభిషేచనానంతరం 10 సంవత్సరాలకు సంభోగిని దర్శించాడని ధర్మయాత్ర చేసాడని ఎనిమిదవ శిలాశాసనం చెబుతుంది. అభిషేచన మైన 12 సంవత్సరములకు భేరీఘోషలు ధర్మ ఘోష లయ్యాయని అశోకుని మొదటి శిలాశాసనంలోను, దేవానాం ప్రియుని మహావనంలో వంట ఇంటిలో ప్రతి దినం వేలాది జంతువులు వధింపబడేవి. ధర్మ లిపి రాసే నాటికి రోజుకు మూడు జీవులు అనగా ఒక జంతువు, రెండు పక్షులు మాత్రమే మాంసాహారం కోసం చంపబడేవి అని శాసనంలో ప్రకటించాడు.

## ఆధార గ్రంథాలు :

1. సుబ్బారావు, రాయప్రోలు. అశోకుని ఎర్రగుడి శిలాశాసనములు. హైదరాబాదు; ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పురావస్తు శాఖ ప్రచురణ, 1975.
2. కౌటిలీయమ్, అర్థశాస్త్రమ్. హైదరాబాద్; శ్రీ జయ లక్ష్మీ పబ్లికేషన్స్, 1999.
3. రామచంద్ర, తిరుమల. మన లిపి పుట్టు పూర్వోత్తరాలు. హైదరాబాద్; విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ (తృతీయ ముద్రణ), 1993.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# క్రీడాభిరామంలో మంచన శర్మ - శ్రీనాథుని రేఖాచిత్రం

- **డా॥. వి. పళని,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు & అనువాద అధ్యయన శాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

క్రీడాభిరామ కర్త వల్లభరాయుడే. క్రీడాభిరామ రచనలో వల్లభరాయుడు శ్రీనాథుని నుండి ఎటువంటి సహాయ సహకారాలు పొందాడో, లేదో కూడా ఇద మిత్థంగా చెప్పలేం. ఇది శ్రీనాథుని పై వ్యంగ్య, అధిక్షే పాత్మకంగా వచ్చిన వీధి నాటకంగా కనిపిస్తుంది. ఈ విషయాన్ని సోపపత్తికంగా వివరించే ప్రయత్నం చేస్తాను. కీర్తిమంతుడైన వ్యక్తిపై సంధించిన వ్యంగ్యాస్త్రమే ఎప్పుడైనా గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. ఇదే వల్లభరాయుడు క్రీడాభి రామం రాయడానికి గల ప్రధాన కారణంగా కనిపిస్తోంది. అందులోను విజయనగర ప్రభువుల పాలనలో అధికారిక పదవిలో ఉన్న ఈయన కాకతీయుల రాజధాని ఓరు గల్లును కథాక్షేత్రంగా ఎంచుకోవడం కూడా వ్యూహంలో భాగంగా కనిపిస్తుంది. వేశ్యావిట విశృంఖలతకు వేదిక విజయనగరం కావడం కన్నా ఓరుగల్లు కావడమే వల్లభ రాయనికి నచ్చిన అంశం.

క్రీడాభిరామం 'వీథి' అనే రూపక భేదానికి సన్నిహితంగా ఉన్న రచన. రావిపాటి త్రిపురాంతకుడు రాసిన ప్రేమాభి రామమనే సంస్కృత కావ్యానికి ఇది అనువాదం. ఇందు లోని కథ చాలా చిన్నది. ఇందులో ప్రధాన పాత్రలైన కాసలనాటి గోవింద మంచన శర్మ, టిట్టిభ సెట్టి వేకువ జామున ఓరుగల్లు నగరంలో ప్రవేశించి రాత్రివరకు నగరంలో సంచరించడం ఇందులో ప్రధాన ఇతివృత్తం. కాకతీయుల కాలం నాటి వృత్తులు, కులాలు, క్రీడలు, ఆహారపుటలవాట్లు, ఆచార్య వ్యవహారాలతోబాటు, కవితాత్మక దృష్టితో కూడిన స్త్రీ సౌందర్యం క్రీడాభి రామంలో నిండుగా, మెండుగా దర్శనమిస్తాయి.

### కర్తృత్వ వివాదం :

క్రీడాభిరామ కర్తృత్వ విషయంలో పలువురు పలు అభిప్రాయాలను వ్యక్తం చేశారు. శ్రీ మానవల్లి రామకృష్ణ కవిగారు శ్రీనాథుడు, వల్లభరాయల విషయంలో ఇరు వైపుల సమర్థనీయమైన అనేక అంశాలను వివరించారు. రావిపాటి త్రిపురాంతకుని మూల గ్రంథంగాని, నాంది, ప్రస్తావనలు ఉన్న తెలుగు ప్రతిగాని లభించనందువల్ల క్రీడాభిరామ కర్తృత్వాన్ని నిర్ధారించడం కష్టతరంగా ఉందని పేర్కొన్నారు. శ్రీనాథుడే క్రీడాభిరామ కర్త అని చెప్పడానికి బలాన్ని చేకూర్చే కారణాలు వివరించారు. భీమఖండం తృతీయాశ్వాసంలో ఉన్న పద్యంలోని మూడు పాదాలు యథాతథంగా క్రీడాభిరామంలో కూడా ఉన్నాయన్నది వీరి వాదన.

"గార్గ్య సిద్ధాంత మత ముషః కాల కలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
వ్యాస మతము మనః ప్రసాదాతిశయము"

అలాగే శ్రీనాథుడు శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువును దర్శించి ఆయనకు అంకితంగా వల్లభాభ్యుదయ మనే కావ్యాన్ని రచించాడని అందులో శ్రీకాకుళ ఆంధ్ర దేవుని తిరునాళ్లను వర్ణిస్తూ విధవాదుర్వర్తనాలను విశదంగా వర్ణించాడని, అదే విషయం క్రీడాభిరామంలో కూడా ఉందని చెబుతూ, "గరుడ స్థంభ ప్రతిష్టా కలన..." వంటి కొన్ని పద్యాలను ఆధారాలను చూపారు. సందర్భోచితంగా ఎక్కడైనా విష్ణు స్తుతి చేసి ఉండొచ్చు గానీ ఈశ్వరార్చన కళాశీలుడైన శ్రీనాథుడు వల్లభాభ్యుదయ కావ్యం రాసా డన్నది అనుమానమే.

వీరేశలింగం పంతులుగారు తమ ఆంధ్రకవుల చరిత్రలో క్రీడాభిరామాన్ని వల్లభరాయుని కృతిగానే పరిగణించారు.

శ్రీ చిలుకూరి వీరభద్రరావుగారు ఆంధ్రుల చరిత్ర మూడవ భాగంలో క్రీడాభిరామాన్ని శ్రీనాథుడే వల్లభ రాయని పేరుతో రాసి ఉండొచ్చని ఊహించారు.

పింగళి లక్ష్మీకాంతంగారు కూడా కీర్తి మంతుడైన శ్రీనాథుడు అపకీర్తి భయంతో తాను రాసిన క్రీడాభిరామ

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

కర్తృత్వాన్ని వల్లభరాయనికి కట్టబెట్టి ఉంటాడని అనుమానించారు.

శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారు క్రీడాభిరామ కర్త శ్రీనాథుడే అని ఒక సిద్ధాంతాన్ని ప్రకటించారు. సులక్షణ సారము, అప్పకవీయము, లక్షణ దీపిక, సర్వలక్షణ సార సంగ్రహము వంటి అనేక గ్రంథాల్లో శ్రీనాథుని వీథి నాటకంలోని పద్యాలుగా ఉదహరింపబడిన అనేక పద్యాలు క్రీడాభిరామంలో కూడా ఉన్నాయి. అంతే కాకుండా ఈ గ్రంథంలో వల్లభరాయుని వాగ్వైభవం, దాతృత్వాది విషయాల వర్ణన మితిమీరి ఉంది. గ్రంథ కర్త వల్లభరాయుడు అయి ఉంటే తన మీద తాను కంద పద్యాష్టకాన్ని రచించుకొనడు. ఉపసంహారంలో కూడా, "ముదమున ముల్కినాటి పుర మోహన శైలి..." (క్రీడాభిరామం 294) అనే పద్యంలో కాలభైరవుడు 'కవీంద్ర కాంక్షిత త్రిదశ మహీరుహమగు వల్లభరాయనికి సమగ్ర వైభవాభ్యుదయములు కృప సేయును' అనే ఆశీర్వచన ఉంది. ఇది తానే తుమ్ముకొని తానే శతాయుస్సని ఆశీర్వదించుకొన్నట్లుగా ఉంది. ఇటువంటి అనేక ఆధారాలను చూపుతూ క్రీడాభిరామ కర్త శ్రీనాథుడే అని నిర్ధారించే ప్రయత్నం చేశారు.

వేటూరి ప్రభాకర శాస్త్రిగారి వాదనను ఖండిస్తూ శ్రీ వేమూరి విశ్వనాథ శర్మగారు వల్లభరాయుడు క్రీడాభిరామ కర్త అని నిర్ధారించి చెప్పారు.

క్రీడాభిరామం ప్రస్తావన వంటి అవతారికను బట్టి, భరతవాక్యాన్ని బట్టి, ఆశ్వాసాంత గద్యను బట్టి దీని కర్త వల్లభరాయుడని స్పష్టమౌతుంది.

మూడు గ్రామ గ్రాసములతోడ... అనే పద్యంలోని

"ప్రత్యక్ష మొనరించి భైరవ స్వామిచే సిద్ధ సారస్వత శ్రీ వరించె" అనే పాదాలను బట్టి వల్లభరాయుడు మోపూరు భైరవుని మీద చాలా స్తుతులు, పద్యాలు రాసినట్లు తెలుస్తోంది. శ్రీనాథుడు ఎక్కడా మోపూరు భైరవ స్వామిని స్తుతించినట్టు కన్పించదు.

గ్రంథాంత గద్యలో "ఇది శ్రీమన్మహామంత్రి శేఖర వినుకొండ తిప్పయామాత్యనందన చంద్రమాంబ గర్భ పుణ్యోదయ సుకవిజన విధేయ వల్లభరాయ ప్రణీతంబైన క్రీడాభిరామంబను వీథినాటకంబున సర్వంబు నేకాశ్వాసము" అన్నది గ్రంథస్థ నిదర్శనంగా కనిపిస్తుంది.

అలాగే, కృతి అవతారికలో వల్లభరాయని వాగ్వైభవం, దాతృత్వ వర్ణనలు మితిమీరి ఉన్నది నిజమే. అయితే, క్రీడాభిరామం వీథినాటకంగా రచింపబడింది. కృతికర్త ప్రశంస నాటక ప్రస్తావనలో సూత్రధారుడు చేసింది. కాబట్టి అనౌచిత్యం లేదని వేమూరి విశ్వనాథ శర్మగారు వ్యక్తం చేసిన అభిప్రాయం సమంజసమైంది. సూత్రధారుల ముఖంగా కృతి కర్తలు తమను తాము పొగుడుకోవడం సహజమేనని అరుణగిరి నాథుడు రచించిన యోగానంద ప్రహసనం వంటి అనేక ఆధారాలను కూడా ఆయన చూపారు.

బండారు తమ్మయ్యగారు, చిలుకూరి పాపయ్యశాస్త్రి గార్లు క్రీడాభిరామంలోని పద్యాలు శ్రీనాథుడు రాసినవి, వల్లభరాయుడు రాసినవి వేరు చేసి చూపించే ప్రయత్నం చేశారు.

శ్రీ బండారు తమ్మయ్యగారు క్రీడాభిరామం కావ్య రచనా సంకల్పము వల్లభరాయునిదేనని, అయితే శ్రీనాథుడు రచనలో పూర్తిగా తోడ్పడి ఉండవచ్చని అభిప్రాయబడ్డారు.

శ్రీ చిలుకూరి పాపయ్యశాస్త్రి గారు కూడా కొండవీటి వినుకొండ 40 మైళ్ల దూరంలో ఉన్న పట్టణం కాబట్టి శ్రీనాథుని ప్రభావం వల్లభరాయని పై తప్పకుండా ప్రసరించి ఉంటుందని అలాగే కృత్యాదిలోని, అంతంలోని పద్యాలను శ్రీనాథుడే సమకూర్చి ఉంటాడని ఊహించారు.

శ్రీ టేకుమళ్ళ అచ్యుతరావుగారు క్రీడాభిరామం హాస్యరసంతో కూడిన క్షుద్ర కావ్యమని శ్రీనాథుని భాషా ప్రయోగాలు ఈ గ్రంథంలో కనిపించినప్పటికీ, ఆయనలోని బహుముఖ ప్రజ్ఞగాని, శయ్యా విశేషములు గాని ఈ గ్రంథంలో కనిపించడం లేదని, కాబట్టి శ్రీనాథుని ప్రభావానికి లోనైన వల్లభరాయడే క్రీడాభిరామ కర్త అని వివరించారు. వల్లభరాయుడు క్రీడాభిరామాన్ని ఆంధ్రీక

రించడంలో తన మిత్రుడైన శ్రీనాథుని సాయం పొంది ఉంటాడని ఊహించారు.

మొత్తం మీద క్రీడాభిరామ కావ్యాన్ని శ్రీనాథుని సహాయంతో వల్లభరాయుడే రచించాడని, అందుచేతనే క్రీడాభిరామంలోని శైలి అక్కడక్కడ శ్రీనాథుని కవితా శైలిని పోలి ఉందని అనుకున్నా, శ్రీనాథునిపైగల మక్కువతోనే వల్లభరాయడు శ్రీనాథుణ్ణి అనుసరించాడని చెప్పడం సహేతుకం, ఆనాటి కవులకు శ్రీనాథుని జీవితం, విద్వత్తు, కవితా పటిమ, రాజుగారి కొలువులో అధికారిక పదవి, పలుకుబడి ఇవన్నీ ఆయనను ఒక ఫాషన్ ఐకాన్‌గా నిలిపాయి. అందుకే వల్లభరాయడు తన రూపకానికి నాయకుడైన మంచనశర్మను శ్రీనాథునికి హాస్య రేఖాచిత్రం (Caricature)గా మలచాడని పిస్తుంది. పరిశోధకులు ఈ అభిప్రాయాన్ని ముందు ముందు మరింత పరిశోధించవలసి ఉంది.

## మంచన శర్మ - శ్రీనాథుని హాస్య రేఖా చిత్రం (Caricature) :

మంచన శర్మ ఆహార్యం (కట్టుబాట్లు), దేశాటనా ప్రియత్వం శ్రీనాథునికి సరిపోలుతున్నాయి.

సీ. "గన్నెరుఁ బూచాయ కరమొప్ప నీర్కావి
మడుఁగుదోవతి పింజె విడిచి కట్టి
గొజ్జంగి పూనీరు గుంకి మేదించిన
గంగమట్టి లలాటమునఁ దీర్చి
వలచేత బంగారు వలపోసనము తోఁడ
బ్రన్నని పట్టుతోరము ధరించి
జజిగొన్న వెలిపట్టుజన్ని దంబులలుంగ
యంటులు వాయంగ నఱుత వైచి

గీ. తళుకు చెంగావికోకయు వలుఁద శిఖయుఁ
జిగురుబొమ్మంచు పెదవులు చిన్నినగవు
నందమొందగ వచ్చె గోవిందశర్మ
మాధవునిపట్టి యొసపరి మన్మథుండు

ఇందులో వర్ణించిన దోవతి పింజెకట్టు, గొజ్జంగి పూనీట గుంకి మేదించిన గంగ మట్టి, బంగారు వలసోసనము, పట్టు తోరము, పట్టు జన్నిదము వంటివి ఆనాడు రాజాశ్రయంలో అధికారిక పదవిలో ఉన్న శ్రీనాథుని ఆహార్యానికి గీచిన గీతలా ఉందేమోననిపిస్తుంది. శ్రీనాథుడు శైవుడు, మంచన శర్మ వైష్ణవుడు. అందువల్ల బొట్టులో, జుట్టులో మాత్రం వైవిధ్యం పాటించాడు. గొజ్జంగి పూనీట గుంకి మేదించిన గంగ మట్టి బదులుగా గొజ్జంగి పూనీట గుంకి మేదించిన విబూదిని, వలుఁద శిఖ బదులుగా పూర్ణ పింగళం ఊహించుకోవాలి.

ఆయనకు వైశ్య వరులతో ఉన్న స్నేహాన్ని పురస్కరించుకొని టిట్టిభ శెట్టి పాత్రను సృష్టించాడనిపిస్తుంది. శ్రీనాథుడు తన చాటుపద్యాల్లో కనబడిన ప్రతి సౌందర్యాన్ని వర్ణించినట్లుగా మంచన శర్మ ఓరుగల్లులో తన దృష్టి పథంలోకి వచ్చిన ప్రతి స్త్రీని శృంగారాత్మకంగా వర్ణించడం, విలాస పురుషత్వం ప్రదర్శించడం, భోజన ప్రియత్వం అన్ని శ్రీనాథునికి సరిపోయే లక్షణాలే. పైగా శ్రీకాకుళ ఆంధ్ర మహావిష్ణువు జాతరలో వైష్ణవ విధవా దుర్వర్తనాలను పనిగట్టుకుని వర్ణించడం, రచనలో శ్రీనాథుని అనుకరించడం, ఇవన్నీ క్రీడాభిరామం శ్రీనాథుని పై వల్లభరాయడు సంధించిన వ్యంగ్యాస్త్రంగానే భావించడానికి ఊతమిస్తున్నాయి. ఇది శ్రీనాథుని పై సంధించిన వ్యంగ్యాస్త్రమని మనకు తెలియ చెప్పడం కోసమే వల్లభరాయడు కొన్ని సూచనలు చేయడం కనిపిస్తున్నది.

## భోజన ప్రియుడు - కవిసార్వభౌముడు :

శ్రీనాథుని మృష్టాన్న ప్రియత్వం విదితమే. అవకాశమున్న ప్రతిచోటా ఆయన వివిధ రుచుల్ని వర్ణించి తనివి తీర్చుకొన్నాడు. కాశీఖండంలో మూలంలో లేకున్నా అన్న పూర్ణ శిష్య పరివార సమేతుడైన వ్యాసునికి వడ్డించిన 'పాయసాపూపసూప పదార్థ నివహంబు" (కాశీఖండం, స.ఆ.179) గుణనిధి కథలో తల్లి తనపై చూపే ప్రేమను తలపోస్తూ

"అరుణ గభస్తిబింబ ముదయాద్రి పయింబొడతేర గిన్నెలోఁ
బెరుగును వంటకంబు వడపిందియలుం గుడువంగఁ బెట్టు..." (కాశీఖండం 4-114) పదార్థాలు.

అలాగే శివునికి నివేదించడానికి సిద్ధం చేసిన నైవేద్యాల వర్ణన

సీ. "మరిచ ధూళీపాళి పరిచితంబులు మాణి
బంధాశ్మ లవణ పాణింథమములు
బహుల సిద్ధార్థ జంబాల సారంబులు
పటురామఠామోద భావితములు
తింత్రిణిక రసోపదేశ దూర్థరములు
జంబీర నీరాభి చుంబితములు
హైయంగవీన ధారాభిషిక్తంబులు
లలితా కుస్తుంబరూల్లంఘితములు

గీ. శాక పాక రసావళీ సౌష్టవములు
భక్ష్య భోజ్య లేహ్యంబులు పానకములు
మున్నుగాఁగల యోగిరంబులు సమృద్ధి
వెలయఁ గొనివచ్చె నొండొండ వివిధములను"
(కాశీఖండం 4-119)

మిరియాల పొడి చల్లినవి, సైంధవలవణం వేసి తయారు చేసినవి, ఆవపెట్టి వండినవి, ఇంగువతో ఘుమఘుమలాడుతున్నవి, చింతపండు పులుసుతో చేసినవి, నిమ్మరసంతో చేసినవి, హైయంగవీనము అంటే నిన్నటి పాలు చేమిరి వేసి సిద్ధం చేసిన పెరుగును నేడు చిలికి వెన్న తీసి కాచిన నెయ్యి అంటే, సద్యోఘృతం అన్న మాట. అటువంటి తాజా నేతిలో మునిగితేలుతున్నవి, లేత కొత్తిమీరతో పరిమళిస్తున్నవి, శాకంగాను, పాకంగాను, రసంగాను మారినపుడూ సౌష్ఠవం కోల్పోనివి, నమిలి తిన వలసిన భక్ష్యాలూ, అంతగా నమలనక్కరలేని భోజ్యాలు, నాలుకతో చప్పరించి ఆస్వాదించే లేహ్యాలు, తాగుతూ ఆనందించే పానకాలు ఆ నైవేద్యాల్లో ఉన్నా యట. శ్రీనాథుని భోజన ప్రియత్వాన్ని నిర్దేశించడానికి ఈ ఒక్క పద్యం చాలు.

క్రీడాభిరామం కాలం నాటి భోజనాన్ని మంచన శర్మ కూడా చాలా ప్రీతిగా ప్రస్తావిస్తాడు. శీతాకాలంలో పొద్దున్నే ధనవంతులు కొత్తబియ్యంతో వండిన అన్నాన్ని ఇగురావ కూరతో, మరిగిన నేయి, పెరుగుతో తినేవారట.

"శీతకాలంబు కడి మాడ సేయ గుడుచు
భాగ్యవంతుడు జేపాటి పల్లె పట్ల
గ్రొత్త యోరెంబు నిగురావకూర తోడ
బిచ్చలంబైన నేతితో బెరుగు తోడ" తింటారని చెప్పి తనవి తీర్చుకున్నాడు. (క్రీడాభిరామం, 55)

ఓరుగల్లు నగరంలో "పూట వంకటంబు వెట్టు బాడబుల వాడ" ఉండేది. అక్కడ గంధము, సాంబ్రాణి సుగంధం వ్యాపించి ఉండేది. ఓరుగల్లులో కేవలం ఆహారానికే కాకుండా ఆహార, విహారాలకు కూడా అనువుగా ఉండే భోజనశాలలు ఉండేవి. మధ్యాహ్నం లక్ష్మణ వజ్ఞల యింట ఒక రూకకు

"కప్పుర భోగి వంటకము, కమ్మని గోధుమపిండి వంటయున్
గుప్పెడు పంచదారయును, గ్రొత్తగా కాచిన యాలనే పెస
ర్పప్పును గొమ్మునల్లనటి, పండ్లును నాలుగునైదు నంజులున్
లప్పల తోడ గ్రొంబెరుంగు" దొరికేవి.
(క్రీడాభిరామం, 166)

కప్పుర భోగి అనేది సన్నబియ్యంలోని ఒక రకం. కమ్మని గోధుమ పిండి వంటయున్ అనడంలోను, ఆలనేయి అందులోను కొత్తగా కాచింది, దానికి జోడుగా పెసరపప్పు ఇలా చెప్పడంలోనే వ్యంజనాలపై శ్రీనాథుడ నికి ఉన్న రస ప్రీతి వంటి ప్రీతి కన్పిస్తున్నది.

(మధ్యాహ్న భోజనంలో పంచదార వడ్డించడం ఆన వాయితీగా ఉండేదేమో, ఈ రోజుల్లో కూడా పెరుగులో పంచదార కలుపుకొని తినడం ఉంది. కొత్తగా కాచిన ఆవునెయ్యి, క్రొంబెరుంగు అంటే పొద్దున్న చేమిరి వేసిన కమ్మని పెరుగు. ఉష్ణమండల వాసులమైన మనకు పెరుగు, పెసరపప్పు, అరటిపండు భోజనంలో ఉండే విధంగా జాగ్రత్త తీసుకున్నారనిపిస్తుంది. అయితే, ఈ కథాకాలం శీతాకాలం. దీన్ని బట్టి ఆరుగాలాలూ పప్పు, పెరుగు, పండ్లతో భోజనం ఆరగించడం కనిపిస్తున్నది.)

ఇంతేగాక, మంచ శర్మ శ్రీనాథుని రేఖాచిత్రమని చెప్పడానికి వల్లభరాయడు కొన్ని సూచనలు చేసినట్టు కన్పిస్తున్నదని ముందే చెప్పుకున్నాం. భీమేశ్వర పురాణం మూడవ ఆశ్వాసంలో (3-41) శ్రీనాథుడు చెప్పిన పద్యంలోని మూడు పాదాలను క్రీడాభిరామంలో యథాతథంగా ప్రయోగించడం,

"గార్గ్య సిద్ధాంతమత ముషఃకాల కలన
శకున మూనుట యది బృహస్పతి మతంబు
వ్యాస మతము మనః ప్రసాదాతిశయము
విప్రజన వాక్యమరయంగ విష్ణు మతము"
(క్రీడాభిరామం, 66)

(శ్రీనాథుని "సర్వసిద్ధాంత మభిజిత్తు సమ్మతమగు" అనే పాదానికి బదులుగా "వ్యాస మతము మనః ప్రసాదాతిశయము" అనే పాదం కన్పిస్తోంది) శ్రీనాథుడు రచించిన పల్నాటి వీర చరిత్రను గురించి అన్యాపదేశంగా ప్రస్తావించడం, మంచన శర్మ కూడా శ్రీనాథుని లాగానే దేశాటనకు వెళ్ళడం, అందులోను తీర్థయాత్రల సందర్భం లోనూ స్త్రీ సౌందర్యాన్ని వర్ణించడం వంటి అనేక సూచనలు ఇందుకోసమే చేసినట్టు అనిపిస్తుంది.

మొత్తం మీద, వల్లభరాయడు శ్రీనాథుని ప్రభావానికి లోనై, ఆయనపై గల ప్రేమతో మంచన శర్మ పేరుతో రేఖా చిత్రాన్ని గీసి ఆనందించి ఉంటాడు. విధవా దుర్వర్త నాలను వర్ణించిన సందర్భంలో తప్ప మరెక్కడా వల్లభ రాయడు హద్దు మీరినట్టు కన్పించదు. శ్రీనాథుని శాలి వాహన సప్తశతి లభించి ఉంటే క్రీడాభిరామంలోని మరి కొన్ని వర్ణనలకు పోలికలు దొరికి ఉండేవేమో.

**ఆధార గ్రంథాలు :**

1. ఆంధ్ర సాహిత్య చరిత్ర - పింగళి లక్ష్మీకాంతం
2. తెలుగు సాహిత్య సమీక్ష - డా. జి. నాగయ్య
3. శ్రీ ప్రభాకర సంపూర్ణ గ్రంథావళి, క్రీడాభిరామం, పరిష్కృతం శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి - (సం.) డా. వేటూరి ఆనందమూర్తి.
4. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
5. రెడ్డి రాజ్యాల చరిత్ర - మల్లంపల్లి సోమశేఖర శర్మ

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# గుర్రం జాషువా 'నేతాజీ'

– డా. కె.ఎన్. సుందరేశ్వరరావు, తెలుగు శాఖాధ్యక్షులు, ప్రభుత్వ పురుషుల కళాశాల (స్వయం ప్రతిపత్తి), కడప.

ఆధునిక తెలుగు సాహిత్యంలో తొలితరం కవుల్లో అన్నివిధాలా విలక్షణంగా కనిపించే మహనీయమూర్తి గుర్రం జాషువా. వస్తునవ్యత, వైవిధ్యం, వ్యథాభరితమైన హృదయం నుండి పొరలిన భావావేశం, లోకం దృష్టిలో క్షుద్రవస్తువుగా గుర్తించబడిన దానిలో కూడ ఉదాత్తతను చూడగల సహృదయం - జాషువా కవిత్వంలోని విశిష్ట గుణాలు.

జాషువా 1895 సెప్టెంబర్ 28న గుంటూరు జిల్లా వినుకొండలో వీరయ్య, లింగమాంబ దంపతులకు జన్మించారు. అప్పటికింకా ఆంధ్రదేశంలో గాంధీగారి హరిజన నినాదం గానీ, హరిజనోద్యమం గానీ ప్రచారం కాలేదు. ఉన్నతవిద్య పూర్తయ్యే లోపే జాషువాలో కవితాసక్తి మొగ్గ తొడిగింది. యువకుడయ్యేసరికి జాషువాలో ఆంగ్లేయుల పట్ల వ్యతిరేకత మొదలయ్యింది. తమను వారు బానిసలుగా చూడడం, నాటి మిషనరీలు దళితులను తమ మతంలో చేర్చుకుని విద్యాబుద్ధులు చెప్పించినా, తమతో సమానంగా గుర్తించకపోవడం లాంటి విషయాలు అందుకు కారణం. ఇటు హిందూ, అటు క్రైస్తవ మత భావాలతో జాషువా విసిగినట్లు తన 'స్వీయ చరిత్ర' ద్వారా తెలుస్తుంది.

ఇరవయ్యో శతాబ్దపు ప్రారంభసాహిత్యం పాతకొత్తల మేలు కలయిక లాంటిది. ఆంగ్ల సాహిత్యాభిమానులు ఆధునికరచనల వైపు దృష్టి సారిస్తే, సంప్రదాయాభిమానులు అవధానాలు, పద్యరచన లాంటి ప్రక్రియల్లో నిమగ్నమైనారు. ఆనాటి తిరుపతివేంకటకవుల, కొప్పరపు కవుల ప్రభావం యువజాషువాపై బలంగా ప్రసరించింది. స్వతహాగా సాహిత్యంలో సంప్రదాయాభిమాని కావడంవల్ల పద్యవిద్య జాషువాను ఆకర్షించింది. దీపాల పిచ్చయ్య శాస్త్రితో స్నేహం, జూపూడి హనుమచ్ఛాస్త్రి అనే సంస్కృత పండితుని శిష్యరికం కారణంగా ఉభయభాషల్లో పాండిత్యం సంపాదించాడు. హిందూమత కావ్యాలు, శాస్త్రాలు, పురాణాలు అధ్యయనం చేస్తున్నాడన్న కోపంతో మిషనరీస్కూలు ఉపాధ్యాయ ఉద్యోగం నుండి తొలగించారు. ఆ తర్వాత చాలా చోట్ల చాలా ఉద్యోగాలు చేయాల్సివచ్చింది.

క్రమంగా జాషువా రచనలు చేయడం మొదలుపెట్టాక తన దృష్టి నాటకరచన వైపు మళ్ళింది. ఆ తర్వాత పద్య కావ్యాలైన పిరదౌసి, స్వప్నకథ, కాందిశీకుడు, ముంతాజ మహలు, గబ్బిలము, నేతాజీ, బాపూజీ, 'నా కథ' (స్వీయ చరిత్ర) రాశారు. ఇంకా రాష్ట్రపూజ, కొత్తలోకము, ముసాఫిరులు, క్రీస్తుచరిత్ర, నాగార్జునసాగరం, ఖండ కావ్యాలు రాశారు.

### 'నేతాజీ' కావ్యేతివృత్తం :

'నేతాజీ' పద్యకావ్యం. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీగారి అహింసా సిద్ధాంతాన్ని నిరసించి, హింసాపద్ధతినే సమరించి, ఆంగ్లేయులపైకి 'ఆజాద్ హింద్ ఫౌజ్'ను తయారు చేసిన సుభాష్ చంద్రబోస్ జీవితమే ఈ కావ్యంలో కథావస్తువు. జాషువా దృష్టిలో సుభాష్‌బోసు మహాత్యాగి, శాశ్వతుడు. దేశం కోసం బోసు చేసిన సాహసాలు అమూల్యమైనవని, మరే స్వాతంత్ర్యసమర యోధుడు చేయని పని బోసు చేశారని జాషువా అభిప్రాయం. దేశం అతనికెంతో ఋణపడి ఉందని, తెల్ల దొరలు మనపై అగ్నివర్షం కురిపిస్తే, బోసు గొడుగై నిలిచి మనలనాదరించాడన్నాడు. మనం ఈ రోజు అనుభవిస్తున్న స్వేచ్ఛకు మూలం బోసు సాహసాలేనన్నాడు.

'నేతాజీ' కావ్య పీఠికలో జాషువా "బోసు అజ్ఞాత పలాయనముతో ఆసేతుహిమాచల మాశ్చర్యచకితమైనది. ఒక భారతదేశమే కాదు - ఖండాంతరములు కన్ను దెరచినవి. బోసు మహాత్యాగి. అతనిత్యాగముతో దేశమతనికి ఋణ పడ్డది. గగన మగ్నివర్షములు కురియుకాలాన, మనకతడాతపత్రమై నిలిచి ఆదరించినాడు. ఆ మహనీయునకు కావ్యనమస్కారము చేయక నా చేతులూరు

కొనకపోయినవి'' అంటాడు. ఈ కావ్యాన్ని జాషువా తన తండ్రికి అంకితమివ్వడం విశేషం. ఈ కావ్య ప్రథమ ముద్రణ 1947 లో జరిగింది. ఇందులో 'అంజలి', 'కన్న తండ్రి', 'తొలినిట్టూర్పు', 'మలినిట్టూర్పు' అనే నాలుగు కవితాఖండికలున్నాయి.

**అ) అంజలి :**

ఈ ఖండికలో నాలుగు పద్యాలు నేతాజీ సుభాష్ చంద్రబోస్ గారికి అంజలి ఘటిస్తూ రాయబడ్డాయి.

''పాలిత ప్రజల ప్రాణాలు పన్నిదముగా
నధిపతుల్ జూదంబులాడువేళ
ప్రళయ సంగ్రామదేవత మింటికెగబ్రాకి
చిచ్చర పిడుగులు జిమ్మువేళ
పేరైన బ్రిటిషునౌకా రాణివాసంబు
ముక్కలై మున్నీట మునుగువేళ
అఖిల జాతీయ నాయకకోటి గుజరాతు
సెట్టితో చెరసాల జేరువేళ

''గుండెలరచేతిలో బట్టుకొని, జపాను - పొట్టితోడేటి ధాటికి చొక్కుచున్న
దేశజనయిత్రి కభయసందేశమంపి - ఆదరించిన నేతాజికంజలింతు''

అని మొట్టమొదటి పద్యంతో కావ్య ప్రారంభం చేశాడు. బోసు కాబూలు యాత్ర సందర్భంలోపడిన కష్టనష్టాలను ప్రస్తావిస్తూ -

''అడుగడుగునకు వెంటనంటి వాసనబట్టు
కఱకు సి.ఐ.డీ ల కన్ను మాపి
సహజ గంభీర వర్చస్సు గుప్తముసేయు
చక్కని మొలక మీసములు బెంచి
అనుమానమునకింతయు దావుసూపని
ప్రకృతి సిద్ధంబైన పలుకు మార్చి
నాడెంపులొడుగు చల్లాడంబు దాలిచి
కాబూలువాని పాగా ధరించి ''

''ఖర్చుకై చేతనొక చిల్లిగవ్వలేక - కరువులై వచ్చు నాపదలెదురుకొనుచు
భరత జనయిత్రి శిరమున భారముంచి - బోసు గావించినాడు కాబూలు యాత్ర''

అంటూ బోసుకు నివాళి అర్పించాడు.

**ఆ) తొలి నిట్టూర్పులు :**

ఈ ఖండికలో జాషువా భరతమాత దాస్యాన్ని గూర్చి, బోసు ఏ సందర్భంలో, ఏ ఉద్దేశంతో భరతమాత దాస్య శృంఖాలను త్రెంచడానికి సిద్ధపడ్డాడో, తన వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ జీవితాన్ని త్యజించి దేశసేవలో నిమగ్నుడైనాడో వివరిస్తూ -

''జాతీయ సభాపతియై - నేతాజి సుబాసుబోసు నిఖిలభరత వి
ఖ్యాతింగడించి, గాంధీ - చేతంబునకెక్కె, సాహసిక సింహంబై''

''పెండిలినిమాని, భరత - ఖండమునకు సేవసల్పి, కారాగృహముల్
గండములు గడచి, జాతికి - గుండెయగుచు మెలగె పగర గుండెలలోనన్''

''మాతృపరాధీన స్థితి - శాతాయుధ మగుచు మానసము వగలింపన్
నీతులకు వేళగాదని - తాతనెదుర్కొనుచు క్రొత్త దారిన్ ద్రొక్కెన్''

కత్తి పట్టకుండా స్వేచ్ఛరాదని, గాంధీతో విభేదిస్తూ బోసు నిర్ణయం తీసుకున్నప్పుడు -

''కత్తుల్ బట్టక స్వేచ్ఛరాదెపుడు, చర్ఖాపద్ధతులే పూర్తిగా
చిత్తై పోవునటంచు గాంధిమునితో సిద్ధాంతమున్ జేసి, భూ
భృత్తుల్ దెల్లని చక్రవర్తులు, భయాప్తిన్ గ్రుంగి, కంగారుగా
నెత్తించిన్ యవరెస్టు నెత్తములపై హిందూరణ స్తంభమున్'' అన్నాడు.

బోసు పల్లె పల్లెకూ పర్యటించి భరతజాతికి వీర రసాన్ని నూరిపోశాడని చెబుతూ -

''పలుకుపల్కున నిప్పులొలికి, రక్తము పొంగు పౌరుషంబులుపన్యసించి
అడుగుజాడలలోన నడచి, చెప్పిన చోట నిలిచి పోరాడు సైనికుల గూర్చి
దరిదాపులేని దుర్భర దాస్యమున కుందు తల్లికన్నీరు ప్రత్యక్ష పఱచి
విస్మృతమైన గంభీర భారత బాహు పాండిత్యపటిమ జ్ఞాపకము చేసి ''
''స్వీయసంస్థ దిశల జెలగి ప్రోజ్వలముగా - పల్లె పల్లియలకు పర్యటించి
శ్రీ సుబాసు వంగసింగంబు జాతికి - వీరరసము నోలి నూరిపోసె'' నట.

భారతదేశంలోని ప్రతిపల్లెలో యుద్ధశబ్దాలు మారు మోగిన ఆ కాలంలో బోసు అంతరంగంలో అగ్ని పర్వతాలు బద్దలౌతుండగా, తనలోని ఆవేశం పొంగి రక్త గంగలను అరికట్టి, ఎన్నో కాళరాత్రులు గడిపినాడు. భారత మాత తన దు:ఖాన్ని బోసుతో ఇలా చెప్పుకుందంటూ జాషువా -

''వర్ణించినాడు నా బాహుపాండిత్యంబు గరిమతో యోజనగంధి కొడుకు
చాటించె నా యహింసామహామంత్రంబు సన్యాసియై శాక్య చక్రవర్తి
సృష్టించినాడు నా ప్రేమ సామ్రాజ్యంబు నవఖండముల యేసునాథమౌళి
స్థాపించె నా శాంతి సమర దిగ్విజయంబు రాటాలదొర బోసినోటి తబిసి
''నిన్ను గన్న దాన, నీతండ్రి తాతల/గన్నదాన, గాంధి గన్నదాన!
బ్రతికి చెడినదాన , భావాలు గల దాన/ధనికురాల, దు:ఖదగ్ధురాల!! అన్నదట. ''గాంధీజీ తన ప్రేమ సిద్ధాంతంతో 'సత్యము, అహింస, శాంతి' అనే అస్త్రాలతో స్వాతంత్ర్యం వస్తుందంటున్నాడు. నాకు నలుగురు పుత్రులు నాలుగు దారుల్లో వెళుతూ, అనైక్యతతో బల హీనులైనారా''ని వాపోయింది.

ఈ దుర్భర స్థితిని చూసి పుణ్యాత్ములైన వేమన, పోతులూరి వీరబ్రహ్మం, వివేకానందుడు లాంటి వారు సమాధుల్లో దు:ఖ పడతారని చెబుతూ -

''విసిగివేసారడే వేమన్న ఘన యోగి, భరత విజ్ఞాన దౌర్బల్యమునకు
వాపోవడే మొన్న శ్రీపోతులూరయ్య, భావిభారత మత ప్రళయమునకు
అంగలార్పడె వివేకానందసన్యాసి, తల్లిదేశపు దరిద్రత్వమునకు
భుక్తి మానడె, దేశభక్త మార్తాండుడు నిమ్నజాతుల దాస్యనిర్భరతకు''
''అన్యదేశాభ్యుదయ గాథలాలకించి/భారతక్షీణదశ కన్నులార గాంచి
యెందరెందరు పుణ్యమునీంద్రులకట/బాధపడిరొక్కొ జీవసమాధులందు'' అన్నాడు. ఇంకా భారతమాత ఇలా వాపోయిందట

''కొందరు నాదేశంలో గాంధీని దేవుడిగా పూజిస్తూ, తాను ప్రతిపాదించిన హరిజనోద్ధరణను మాత్రం దూషిస్తున్నారు. మరికొందరు జుట్టు, బొట్టుదాల్చి సీమదొరల వేషాలు జూని 'ఏ ఎండకా గొడుగు' పడుతూ అవకాశవాదులుగా బ్రతుకుతున్నారు. ఇలాంటి వారు నీవు ప్రారంభించబోయే యుద్ధంలో నీకు తోడుగా నిలవగలరా? ఇన్ని కులమత విద్వేషాలు, స్వార్థము, అసూయ పెరిగిన ఈ కాలాన 'సత్యము' 'ధర్మము' తమాషా మాటలైనాయి''.

జాషువా తన సమకాలీన కవులను, వారిలోని లోపాలను తూర్పారబట్టినారు. ఇలా ఒకరిలో ఒకరుండక, ఎవరికివారై వేరైపోతే భరతజాతి బాగుపడుతుందా? అని హెచ్చరించాడు.

''ఒక్కడేచ్చి యేడ్చి పాఠకులేడ్వలేదంచు
కోపించి, తెలివితక్కువకు వగచు
ఒకడాత్మ జాత్యున్నతికి ముప్పురాకుండ
మాటిమాటికి రామకోటి వ్రాయు
ఒకడు ముత్యాల మాలికలల్లుకొనివచ్చి
అమ్ముడు వోక, లోనుమ్మలించు

ఒకడు దిక్కరిరాజమూరేగు సమయాన
పెడకన్ను కులికించి వెక్కిరించు
"ప్రణయకవియొకండు, పాషాణకవి యొక్కడు -
ఏడ్చు కవియొకండు, నేకమగుచు
నొండొరులను జూచి యోదార్చుకొనుచున్న - బాగు
పడునె భావి భరతజాతి"

'జాతి భేదం' అనే పిశాచి కళ్ళముందే ఉన్నప్పుడు బ్రహ్మదేవుని నేర్పరితనమైనా ఎందుకూ పనికిరాదు. నేను ఏ దాస్యాన్నైనా సహిస్తానుకాని, నా బిడ్డల్లో ఒక వర్గం వారు బానిసలుగా బ్రతకటం సహించలేను. ఈ దేశంలో తోటిమనిషి తిండిలేక అల్లాడుతుంటే వానికింత తిండి పెట్టక, పెద్దపెద్ద భవంతుల్లో విలాసాలు అనుభవించే నరరూపరాక్షసుల కోసం నీ ప్రాణాలు అర్పించగలనా! బ్రతుకంతా తమ లాభనష్టాల కోసం బేరా లాడడమేగాని, తమతోపాటు జన్మించిన పేదలకు బ్రతుకే లేకుండా చేసిన ఉపాధ్యాయులున్నారిక్కడ. కళాశాలలు కూడ ఈ దు:ఖంతోనే బ్రతుకుతున్నాయి. స్త్రీలను వంటయింటి కుందేళ్ళుగానే చూస్తున్నారు. పుణ్యకథా ప్రసంగాలతో, స్వర్గసుఖాల కోసం అల్లాడిపోతున్నారు. ఈ పెద్దలనాటి ధర్మాలు విని విని తల బొప్పి కట్టింది. స్త్రీలను హింసించడం ఎక్కువైంది. భర్తలెంత క్రూరులైనా నోరెత్తకుండా వారి నోరు మూయిస్తున్నారు. వారిలోని సహజమైన జ్ఞానాన్ని చంపేస్తున్నారు. వారిని ఉద్ధరించే నాయకుడే లేడు. గాంధీ మహాత్ముడు శాంతి విజయధ్వజంతో జైలులో ఉన్నాడు. తెల్లదొరలు గాంధీనోరు మూయించామని సంబర పడుతున్నా, నిన్ను చూసి భయంతో బిత్తరపోతున్నారు. నీకిదే సమయం. వీరమార్తాండుడివై బయలుదేరు పుత్రా"!

"సకలోర్వీతలి దద్దరిల్ల, విజయస్తంభంబునాటించి, ఢి
ల్లికి, నీ తల్లిపతాకతో సుఖములుల్లేఖింప యత్నించు పు
త్రక! నీ మేని కవోష్ణ నాళములలో రంజిల్లు నా రూపు పా
యక నీవెంట నటించు లెమ్మచల ధైర్యస్థైర్య!
యోధాగ్రణీ"!

అంటూ నేతాజీ బోసును కోరి, భరతమాత అంతర్ధాన మయ్యిందట. అపుడు బోసు కర్తవ్యోన్ముఖుడై తదుపరి కార్యక్రమాన్ని ఆలోచించాడట.

**ఇ) మలి నిట్టూర్పు :**

ఈ ఖండికలో సుభాష్ బోసు కలకత్తా నుండి బయలుదేరి అజ్ఞాతంలోకి వెళ్ళడం, కాబూలు వెళ్ళదలచి, పెషావర్ చేరి ముస్లిము వేషం వేసి మసీదుల్లో తలదాచుకొని, మూగవానిలాగా నటిస్తూ 'జియాయుద్దీన్' పేరుతో, 'రహమత్' అనే మిత్రునితో కలిసి కాబూలు చేరాడని వర్ణించాడు. తమను గూర్చి ప్రశ్నించే బాటసారులకు జవాబులిచ్చి, అపరాధ పరిశోధక అధికారులను బెదురుచూపులతో ప్రక్కకు ఒదిగి తప్పించుకొని, లారీల్లో ప్రయాణిస్తూ, ఒక్కొక్కసారి రోజంతా ఉపవాసాలుండి కాబూల్ దాటి, ఎన్నో గండాలనెదుర్కొని తన సోదర భారతీయుల ప్రజల దాస్యాన్ని, తొలగించడం కోసం బోసు చేసిన త్యాగాన్ని ఎన్నటికీ మరువలేమని అన్నాడు.

"కూర్మి తమ్ముల నలువది కోట్ల ప్రజకు - దాస్య
దళనంబు గావించు త్యాగమూర్తి
పడిన కడగండ్లు కాబూలు పంటవలతి - వ్రాసు
కున్నది గర్భగహ్వరమునందు"

గాడిదలు, ఒంటెలు, గుర్రాలు తిరుగాడే దుర్గంధంతో నిండి, చీకటితో నిత్యం పెనుగులాడే ఆ కాబూలు సత్రాలలోనే బోసు జీవించాడట. ఈ భరతభూమిలో బోసుతో సరితూగే నాయకుడే లేడని జాషువా స్తుతించాడు.

మాస్కో వెళ్ళదలచి, రష్యన్ కాన్సల్ జనరల్ కటాక్షం కోసం అభ్యర్థించి, తిరిగి తిరిగి, వేసారి, చివరికి జర్మన్ దేశస్థులనాశ్రయించాడు. అష్టకష్టాలు పడ్డాడు. అక్కడి సి.ఐ.డి భటుడొకడు బోసుపై కన్నువేసి, బోసు దగ్గర ఉన్నడబ్బంతా దోచుకున్నాడు. ఏదో ఒక నెపంతో, నేరాలు మోపి ఇబ్బంది పెట్టాడు. ఆ దేశంలో బోసును కాపాడే ఉద్దేశంతో ఉత్తమచందనుడనే వాడు రక్షణగా నిలిచి, వెంటనే ఉండి, సాయపడ్డాడు. 'హరిద్వార్'లో సుభాష్ బోసు సన్యాసివేషంలో పోలీసులకు దొరికాడని పత్రికల్లో

వచ్చిన వార్తలను చూసి, బోసు తనలోతాను నవ్వు కున్నాడు. రష్యాప్రయాణం విఫలం కాగా, ఇటలీ కార్యాలయాధికారి సహకారంతో 'రోమ్'కు వెళ్ళి, రష్యా ప్రయాణం చేయవచ్చని ఆలోచించాడు. తనకు కాబూలులో సాయపడిన ఉత్తమచందుని, అతని భార్యను పిలిచి "ఇక ఇక్కడ ఉండడం క్షేమంకాదు. మాస్కో వెళ్ళడమే ఉత్తమం. అందుకు నాకు సాయం చేయుము. మీ దంపతులు నాకు చేసిన సాయానికి జీవితాంతం మీకు బుణపడి ఉంటాను. మీ కాలుష్యం లేని మనసులకు నా జోహార్లు" అంటూ వీడ్కోలు తీసు కుంటూ ఇలా సందేశమిచ్చాడు -

"తల్లిదండ్రులెపుడు బిడ్డలకు నేర్పగరాదు
కులగోత్రముల వారి గొప్పతనము
చదివింపగారాదు చదువులయ్యలు
పాఠశాలలలోన వర్ణాల గొడవ
రచియింపగారాదు రచయితల్
శాశ్వత దాస్యంబు నిలుపు కథానకములు
సలుపరాదెట్టి ప్రచారంబు లీదినంబములు
నందున్న కృత్రిమపు సంస్థ"

"లన్నదమ్ముల తనమున కడ్డువచ్చు - శబ్దజాండంబు సర్వంబు చావవలయు!
స్వర్గమఱచేతియందూడి పడగవలయు - మోక్ష రాజ్యంబు బొందితో పొందవలయు" నన్నాడు.

అందుకు మిత్రుడైన ఉత్తమచందు రష్యావివరాలు తెలిపిన ఒకని బోసుకు సాయంగా పంపుతానంటూ పల్కి, భారతస్వాతంత్ర్యం త్వరలో బోసు ద్వారా సాకారం కాబోతోందని ఆశిస్తూ ఇలా అన్నాడట -

'వర్ధిల్లుగాక నీ ఫార్వర్డుబ్లాకు సంస్థారాజమా చంద్రతారకముగ
ముద్రణంబగుగాక ముందు నీ శుభమూర్తి, భరతపుత్రుల మన:ఫలకసీమ
లేచుగాకలఘు ఢిల్లీ గుండెకాయపై, నీవెత్తు మూడు వన్నెల పతాక
నీళ్ళాడుగావుత నీ పలాయనగాథ, నవకవీశాన ఘంటములయందు"
"మింటమెఱయుచున్న మృత్యుదేవత నోట/ నుమియు నగ్ని గోళకములనుండి
జన్మదేశమునకు సంపూర్ణ భద్రత/బిక్ష పెట్టుమన్న విశ్వవీర".

రష్యాకు వెళ్ళడానికి చాలా ఖర్చు ఔతుందని యెంచి బోసు, మనసు మార్చుకుని ఇటలీకి వెళ్ళ నిశ్చయించాడు. జర్మన్ల విమానమెక్కి, బెర్లిన్‌లో దిగాడు. అక్కడ పొగరు బోతు నియంత హిట్లరు బోసుకు ఎదురొచ్చి స్వాగత మిచ్చాడు. సెల్యూట్ చేశాడు. అలా జర్మనీయుల చేత స్వాగతసత్కారాలు పొంది, వారికి ఆది భారతశౌర్యాన్ని వివరంగా చెప్పి, వారిని ఒప్పించి, కఠినమైన హిట్లరు శిలా హృదయాన్ని ద్రవింపజేసి, మన భారతీయ దేశభక్తుల పాట్లు తెలియజెప్పి, మద్దతిమ్మని ప్రార్థించాడు. అందుకు హిట్లరు మారుమాట ఆడకుండా, జర్మనీలో బందీలుగా ఉన్న మన వీరసైనికులను విడుదల చేశాడు. అపుడు మన సైనికులు -

"ఆ నేతాజి పదంబుల - నానందాశ్రువుల స్నాన మాడించి, తలం
బూని నుతించిరి హిందూ - సైనికులు, ససంభ్రమ ప్రసన్నాశయులై".

ఆ సైనికులకు కొత్త పద్ధతులతో యుద్ధవిద్యలు నేర్పి, ఆ బెంగాల్‌సింహం బోసు జపాన్ ప్రయాణమయ్యాడు. జపనీయులు కూడ బోసుకు అద్భుతమైన స్వాగతం పలికారు. దివ్యవర్చస్సుతో ప్రకాశిస్తున్న బోసు దివ్య మూర్తిని చూసి ఏమనుకున్నారో గాని తలవంచి అతనికి నతులు సలిపినారు జపనీయులు. పూర్వం ఒక బుద్ధ దేవుడు ఈ భూమిపై పుట్టి అహింసను నేర్పితే, మళ్ళీ పుట్టిన ఈ బుద్ధదేవుడు 'హింస'ను ప్రకటిస్తూ తన జాతికి సాయం చేయమని జపాన్‌రాజును ప్రార్థించగా, అందుకు వినయంగా అతడు సమ్మతించాడు. ఆ తర్వాత తన సైన్యంతో సింగపూర్ చేరి, వారందరికీ సేనానాయకుడై, రణశిక్షాదక్ష సైన్యంగా తయారు చేసి, 'ఆజాద్ హింద్

ఫౌజు' కీర్తులు ఆకాశాన్నంటగా లక్షమందిని యోధులుగా మార్చాడు. ఈ వార్తలన్నీ విన్న తెల్ల దొరలకది పదివేల గాడిదతన్నులుగా కనిపించాయని జాషువా కావ్యాంతంలో ఇలా స్తుతించాడు. -

'అదిగోవచ్చె సుబాసుబోసనెడు భీతాహంబు గర్భంబులో
పదివేల్గాడిదతన్నులై మెలగ సప్తద్వీపసామ్రాజ్య సం
పద సాధించిన రాచవారలకు సింహస్వప్నముల్ సేసె, చా
లది, మా జాతి చరిత్రయందొక సువర్ణాధ్యాయమై నిల్చెడిన్.

బోసు వస్తున్నాడని పదివేలకన్నులతో ఎదురు చూస్తున్న హిందూ దేశభూమి నేడు స్వేచ్ఛ నందుకొన్నది.

"కలుగునే మాకూర్చు కల్హారమాలకు, వంగవీరుని గళాలింగనమ్ము
ప్రాప్తించునే వీర భరతనందనులకు నేతాజీ మధుర సాన్నిధ్యసుఖము
చెందునే స్వచ్ఛంద సింహపీఠమునకు, బోసుని పాదాల భూరంజము
అమరునే కావ్యకన్యాసహస్రములకు, అజదు పటాలనాయకుని చెలిమి"

"పుణ్యనదుల చల్వ, భూమిదేవత చల్వ/మంచుకొండ చలువ మాకు గలుగ
శ్రీసుబాసు బోసు సింగంబు క్రమ్మర/వచ్చి దర్శనంబు నిచ్చుగాక!"

**జాషువా కావ్యదృష్టి :**

పురోగమన దృష్టి కలిగిన కవి జీవితం, సాహిత్యం ఎల్లప్పుడూ సామాజికాభివృద్ధిపథం వైపే నడుస్తాయన డానికి జాషువా గొప్ప ఉదాహరణ. జాషువా తన సమ కాలీన భావకవులలాగా ఊహాలోకాల్లో జీవిస్తూ, సమాజాన్ని విస్మరించలేదు. నాటి సామాజికమైన అసమానతల పట్ల స్పష్టమైన నిరసనధోరణిని ప్రదర్శించాడు. నూతన వ్యవస్థ కోసం, సమానత్వం కోసం ఆశపడ్డాడు. నవ సమాజ నిర్మా ణానికి దోహదపడే రాజకీయ సిద్ధాంతం పట్ల దృష్టి చూపకపోయినా, కొంత వరకు గాంధేయవాదిగా ప్రభా వితుడైనాడు. ప్రత్యక్షంగా జాతీయోద్యమంలో పాల్గొనక పోయినా, స్వాతంత్ర్యపోరాటాన్ని పూర్తిగా సమర్థించాడు. అతివాద రాజకీయాలవైపు ఆకర్షితుడు కాకపోయినా, కవిగా మాత్రం కొంత వీరావేశానికి లోనై, అతివాద దృక్పథం ఉన్న నేతాజీ బోసు విధానాలపై ఉత్సాహం చూపాడు. ఇది తనలోని దేశభక్తికి తార్కాణం. తర్వాతి కాలంలో గాంధీతోపాటు అంబేడ్కర్‌ను కొనియాడాడు.స్వాతంత్ర్యం సిద్ధించిన తర్వాత తన జాతిజనుల శ్రేయస్సుకై గళ మెత్తాడు. నాటి కావ్య వస్తు రూపాల్లో సమూలమైన మార్పును తెచ్చాడు. తండ్రి నుంచి గొల్లసుద్దులను, అమ్మ నుంచి అరుంధతీయాన్ని అంది పుచ్చుకున్నాడు. తెలుగు పద్యాన్ని జవనాశ్వం లాగా కదం తొక్కించాడు. ఖండ కావ్యప్రక్రియకు ఆద్యుడు కాకపోయినా, అది ప్రచారం కావడానికి ప్రధాన కారకుడైనాడు.

జాషువా కవిత్వం విశేషంగా ప్రజాదరణ పొందడానికి ఆయన కవితాశిల్పం ప్రధానకారణం. తెలుగునుడి కారంపై అద్వితీయమైన అధికారం, ప్రాచీన పద్యనడకను యథాతథంగా పుణికి పుచ్చుకున్న వైనం, కొత్త కవి సమయాలు, జాతీయాలు సృష్టించుకోగలిగే నైపుణ్యం జాషువా సొంతం.

జాషువా కవితా 'వస్తువు' అభ్యుదయ మార్గంలో పయ నిస్తే, 'రూపం' యథాతథంగా సంప్రదాయమార్గాన్ని ఎంచుకుంది. అభ్యుదయ కవిత్వోద్యమం తెలుగునాట రాకముందే, జాషువా కవిత్వంలో ఆ దృష్టి స్పష్టంగా కనిపిస్తుంది. మొదటిసమస్య ప్రక్రియా రూపంలో వస్తే రెండో సమస్య 'గాంధేయవాదం' వల్ల బలపడి, జాషువాకు అభ్యుదయ కవిగా గుర్తింపు లేకుండా చేశాయని విమర్శకుల అభిప్రాయం. సామాజికంగా మాత్రం జాషువా, పురోగామిదిశలో నడిచి, మృదుమధురశైలిలో రచన చేసి పండితపామరులను రంజింపజేసిన ప్రజాకవి. దినదినం ప్రజల్ని వేధించే సమస్యలే ఆయన కావ్యవస్తువు.

**ఆధార గ్రంథాలు :**

1. 'నేతాజీ' (ఖండకావ్యము) - గుర్రం జాషువా
2. 'నాకథ' (స్వీయచరిత్ర) - గుర్రం జాషువా
3. జాషువా సాహిత్యం: దృక్పథం - పరిణామం - డా॥ ఎండ్లూరి సుధాకర్

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# రావూరి కథలు పరిశీలన

**- డా॥. ఇ. వాసు,** తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.ఎన్. డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

నిజజీవిత సమరానికి ఎదురొడ్డి నిలబడి సామాన్యంగా జీవిస్తూనే అసమాన సాహితీకృషి చేసినారు. స్వయంకృషితో సాధికారతను సంతరించుకుని సామాన్యుడి స్థాయి నుండి సమోన్నత స్థాయికి ఎదిగిన అక్షర తపస్వి. చదువుకున్నది కేవలం 7వ తరగతి వరకే అయినా అడుగడుగునా ఎదు రయ్యే కష్టాలను అధిగమించి తన 17వ ఏట నుంచి రచనలు చేయడం ప్రారంభించారు. వీరి కృషికి ఫలితంగా అనేక అవార్డులు అందుకోవడంతో పాటు, వీరి రచనలు అనేక భాషలలోకి అనువదింపబడ్డాయి. ఒక నిరక్ష రాస్యుడిగా విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేటు పొందిన తొలి తెలుగు వ్యక్తి కూడా ఇతనే. జాతీయ స్థాయిలో విశిష్ట సాహితీ పురస్కారమైన జ్ఞానపీఠ్ పొందిన మూర్తిత్రయంలో ఒకరు కావడం గొప్ప విశేషం.

వాన చినుకులలోను, గడ్డిపరకలోని, మబ్బు తునక లోను, పిచ్చి మొక్కలోను, గడ్డిపువ్వులోను, ఆకు, కొమ్మ, రెమ్మ, కొండ, బండ, మండేగుండె, యాచకునిలోని, పక్షిలోను, పతితలోను, సృష్టిని, సృష్టికర్తని, మానవతను, కారుణ్యాన్ని దర్శించి పాఠకులకు దర్శింపచేసిన దార్శ నికులు భరద్వాజ. తిండికోసం, పిడికెడు మెతుకులకోసం చేయని ఉద్యోగంలేదు. స్పష్టమైన అవగాహన, ఖచ్చిత మైన అంచనా, లక్ష్యశుద్ధి అంకుంఠితమైన దీక్ష, పట్టుదల, నిరంతర పఠనా, రచనా వ్యాసంగం, ఓర్పు, నేర్పు, ఆయన ఆయుధాలు. వాటి సాయంతో జీవన సమరంలో అఖండ మైన విజయాలు సాధించాయి.

### భరద్వాజ కథలు - విశ్లేషణ :

"చూడగల దృష్టి, రాయగల నేర్పు వుండాలేగాని, ఈ జగత్తునిండాకథలే, అసలు ఈ జగత్తే పెద్ద కథ" అని భరద్వాజ నమ్మకం.

భరద్వాజదొక విలక్షణమైన మనస్తత్వం తనకు ఎదు రైన ప్రతి చిన్న సన్నివేశాన్ని, ప్రతి చిన్న సంఘటనను నమోదు చేసి దానిలో తుపాతులను ఆకళింపుచేసు కుంటారు. అందులోంచి తనకుపయుక్తమైన అంశాలను తన రచనలలో పొందుపరుస్తారు. తాను చూసినవి, విన్నవి, తన అనుభవాలు, అనుభూతులను అక్షర బద్ధం చేస్తారు.

ఎవరికీ పనికి రానిదానిలోంచి కొందరికైనా పనికొచ్చేది వెలికితీయడం, అంతా తెలుసుననుకొన్న దానిలోంచి ఎంతో తెలియనిదాన్ని తెలియజేయడం ఆయనకిష్టం. ఒక సామాన్య సన్నివేశం భరద్వాజ స్పర్శతో రసగుళికలుగా మారినదనటంలో సందేహంలేదు. ప్రజల భాషలో పాఠ కులతో సూటిగా మాట్లాడ్డం ఆయన కథలు, రచనల్లోని ప్రత్యేకత సుమారు 25పైగా కథాసంపుటాలను ఆయన రచించారు. వాటిలో మచ్చుకు కొన్ని పరిశీలిస్తే ఆయన గొప్పతనం మనకు అవగతమవుతుంది.

### వైవాహిక సంబంధాలకు నిలువటద్దం లోకంకోసం కథ:

ఓ వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలోని లోపాల్ని లేదా తప్పుల్ని సరిదిద్దుకోకపోతే జరిగే అనర్థాలను తెలిపేదే ఈ లోకంకోసం కథ. ఇందులో నరసమ్మ ప్రధానపాత్ర. ఆమె కాపురానికి వచ్చిన తొలిరోజునుంచీ ఆమె ప్రవర్తనను గమ నిస్తున్నాడు. ఆమెచేసే తప్పులను సున్నితంగా వారించినా, గదిలో పెట్టి తాళంవేసి, తిండినీళ్ళు లేకుండా మాడ్చినా ఆమె తన పద్ధతి మార్చుకోలేదు. అది ఆమె బలహీనత అని గ్రహించి చూసీచూడనట్టు పోతున్నాడు.

రోజూలాగే గోడదూకి వచ్చాడు అపరిచితవ్యక్తి. గడ్డి వాము చాటున చేరి నరసమ్మకోసం ఎదురుచూస్తు న్నాడు. వీరి వ్యవహారం రెండునెలలగా సాగుతోంది. ఇది ఆమె భర్త గమనించినా, తెలియనట్టే ఊరుకున్నాడు. ఇన్నాళ్ళూ నరసమ్మ భర్తకు ఈ విషయం తెలియదని

భావించాడు అపరిచితవ్యక్తి. తీరా ఆమె భర్తకు విషయం తెలుసునని తెలిశాక, నేరుగా ఇంటికే రావడం ప్రారంభించాడు.

వారంరోజులు బాగానే సాగింది. రోజూలాగే ఇంటికి వచ్చాడు. ఆమె భర్త ఒక బడిత తీసుకొని గుమ్మంలో భీకరంగా నిలబడి ఉన్నాడు. లోపలినుండి నరసమ్మ ఏడుపు వినిపిస్తోంది. ఇంటిలోకి వెళ్తుండగా 'ఈ రోజునుండి ఈ ఇంటి గడపతొక్కావంటే డొక్కచీల్చి ఎండేస్తాను. నాలుగుకాలాల పాటు బతకదలచుకొంటే వెంటనే తిరిగి వెళ్ళిపో' అని గద్దించాడు.

ఇన్నాళ్లుగా భార్య చేసే తప్పుల్ని, బలహీనతల్ని సహించడానికి కారణం భర్తకు ఆమెపైఉన్న ప్రేమ. ఆ ప్రేమను అర్థం చేసుకోకుండా, దాన్ని అలుసుగా తీసుకొని అజ్ఞానంతో విచ్చలవిడిగా ఉన్నాడు. లోపలినుండి నరసమ్మ ఏడుపు వినిపిస్తోంది. ఇంటిలోకి వెళ్తుండగా 'ఈ రోజునుండి ఈ ఇంటి గడపతొక్కావంటే డొక్కచీల్చి ఎండేస్తాను. నాలుగుకాలాల పాటు బతకదలచుకొంటే వెంటనే తిరిగి వెళ్ళిపో' అని గద్దించాడు.

ఇన్నాళ్లుగా భార్య చేసే తప్పుల్ని, బలహీనతల్ని సహించడానికి కారణం భర్తకు ఆమెపైఉన్న ప్రేమ. ఆ ప్రేమను అర్థం చేసుకోకుండా, దాన్ని అలుసుగా తీసుకొని అజ్ఞానంతో విచ్చలవిడిగా ప్రవర్తించి, తన సంసారాన్ని తానే నాశనం చేసుకుంటున్న భార్యకు తగిన బుద్ధి చెప్పాడు ఆ భర్త. ఇలా గతితప్పి ప్రవర్తించే భార్యలకు ఓ మేల్కొలుపు ఈ కథ.

### మానవ సంబంధాలకు ప్రతీక -నీతిస్తంభం కథ:

ఒక రచయితగా చలం రాసే రచనలవల్లే సమాజంలోని స్త్రీలు కొత్త కొత్త పోకడలకు పోయి నాశనమైపోతున్నారని సుబ్బారావు భావన. చలానికి లేచిపోయేవాళ్ళ రచనలు తప్ప మరేమీ రాయడని అతని ఉద్దేశ్యం కూడా. అందుకే ఎప్పుడూ చలం రచనలను విమర్శిస్తూ పత్రికల్లో ఏవో రచనలు చేస్తుంటారు. అందుకే చలాన్ని అభిమానించే నాగభూషణం అంటే కూడా అతని సరిపడదు. స్త్రీలను చూస్తే భక్తిభావం రావాలనుకొనే వ్యక్తి సుబ్బారావు. ఈయన మరికొందరితో కలిసి పత్రికల్లో నీతి కథలు, నీతి విషయాలు రాస్తుంటారు. ఇటువంటి వ్యక్తి భార్య పార్వతమ్మ ఉత్తరం రాసిపెట్టి, ఎవరితోనో వెళ్ళిపోతుంది. ఇది స్థూలంగా కథ.

ఈ కథలో రచయిత మానవసంబంధాల ప్రాధాన్యతను తెలియజేశాడు. ప్రతివ్యక్తీ వారివారి వ్యక్తిగత జీవితం కోసం కొంత సమయం కేటాయించాలి. సమాజసేవతో పాటు వ్యక్తిగత జీవితం కూడా ప్రధానమైనదే. అప్పుడే సంబంధాలు నిలబడతాయని, పెళ్ళైన తొలిరోజుల్లో ప్రేమగా అన్పించినది తర్వాత నీచంగానూ, తుచ్ఛంగానూ అన్పించకూడదంటారు రచయిత. దీనికి ఉదాహరణ పార్వతి పాత్ర. ఆమె పూజలు, నోములు, వ్రతాలు అంటూ గడుపుతున్నప్పటికీ, భర్తనుంచి ప్రేమాభిమానాలు ఆశించింది. అవి దొరక్కపోయేసరికి మరొకరితో వెళ్ళిపోయింది. ఇది తప్పైనా, వ్యక్తి తన కుటుంబ సభ్యులను నిర్లక్ష్యం చేస్తే కలిగే అనర్థాలను తెలిపాడు. ఇది ఆవ్యక్తి గుణపాఠంగా, హెచ్చరికగా భావించాలి.

### కుటుంబ సంబంధాలు తెలిపే కథ-అనుమానం:

వెంకాయమ్మను నాగరాజుకిచ్చి పెళ్ళిచేశాడు ఆమె తండ్రి. కొంతకాలం కూతురు అల్లుడు ఇక్కడే మకాం వేశారు. గంపెడు సంసారానికి కావలసినవన్నీ సమకూర్చలేక కష్టపడుతుండేవాడు. నాగరాజు పనీపాట లేకుండా అత్తగారింట్లోనే ఉంటూ సోమరిగా తయారయ్యాడు. తర్వాత వెంకాయమ్మ అత్తగారింటికి వెళ్ళింది. యాభై రోజులతర్వాత తమ్ముడిపెళ్ళికని వచ్చి పుట్టింట్లోనే ఉండిపోయింది. నాలుగునెలలైనా తిరిగిరాలేదు. నాగరాజు ఉత్తరాలు రాసినా జవాబు రాలేదు. కారణం తెలియక అనేక ఆలోచనలతో తిండితిప్పలు మానేసి చిక్కి శల్యమైనాడు. ఒకరోజు అనుకోకుండా పిండివంటలన్నీ తీసుకొని వెంకాయమ్మ వచ్చింది. లావుగా బండగా ఉండే భర్తతో వేగలేక వెళ్ళిపోయానని, ఇప్పుడు తనమీద

దిగులుతో సన్నబడినందునే తిరిగి వచ్చానని సమాధాన మిచ్చింది.

ఈ కథ ద్వారా పనిపాటలేకుండా తిరుగుతున్న భర్తను మార్చాలనే ఉద్దేశ్యంతో ఈ మార్గాన్ని ఎంచుకుంది. ఆమె ఎంచుకున్నమార్గం సరైనది కాకపోయినా, తనభర్తతో నేరుగా చెప్పడానికి భయపడి ఈ పనిచేసి ఉండవచ్చు. ఇలా సోమరిగా తిరిగే భర్తను ఏభార్యా లెక్కచేయదన్న సామాజిక సూత్రాన్ని తెలిపాడు రచయిత.

**తల్లీ, బిడ్డల అనురాగాన్ని తెలిపే కథ-కన్నకడుపు:**

కన్నకూతురు కాపురం సరిదిద్దడంకోసం ఓ తల్లిపడే వేదన ఈ కథ. శేషగిరమ్మకు ఒక్కతే కూతురు. ఆమెపేరు వరమ్మ. డబ్బులేకపోయినా తన కూతురును బాగా చూసు కొంటాడన్న నమ్మకంతో శివరామయ్యకు ఇచ్చి పెళ్ళి చేసింది. పెళ్ళైన కొన్నాళ్లకే వరానికి సుఖవ్యాధులు సోకాయి. శేషగిరమ్మకు కూతురు పరిస్థితి తెలిసి ఉన్నపళంగా పరి గెత్తుకొని వచ్చింది. శేషగిరమ్మ వచ్చేటప్పటికి ఒంటినిండా రసికారుతున్న కురుపులు, మచ్చలతో లేవలేని స్థితిలో ఉన్న కూతుర్నిచూసి చలించిపోయింది. అల్లుడు చేసే తప్పుల్ని తెలుసుకున్నది. చివరకు అల్లుడిని ఎలా బాగు చేయాలో తెలియక తన జీవితాన్ని త్యాగం చేసింది. ఈ కథ ద్వారా తల్లితో సమానమైన అత్తగారితో శారీరక సంబం ధానికి కూడా వెనుకాడని, వావివరసలులేని శివరామయ్య వంటి నీచులను సమాజందృష్టికి తీసుకొచ్చాడు. కూతురి కాపురం బాగుచేయడం కోసం ఎటూపాలుపోని స్థితిలో ఆమె చేసినతప్పు సమాజం ఆమోదించదగినది కాదు. పెళ్ళికి ముందే శివరామయ్య ప్రవర్తన గురించి వాకబు చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేదికాదు. కాబట్టి ఇలాంటి చీడపురుగులకోసం నైతిక విలువలను దిగ జార్చుకోవడం తప్పని ఈ కథద్వారా తెలియజేస్తున్నాడు రచయిత.

**మూఢనమ్మకాలు, నకిలీ బాబాల అరాచకాలు తెలిపే కథ - సంతానం :**

పిల్లలకోసం తపించే ఓ స్త్రీ వేదనను ఆసరాగా తీసుకొని స్వామీజీల రూపం వేసుకొని, దొంగ స్వాములు చేసే అరాచకాలను తెలియజేయడం రచయిత ఉద్దేశ్యం. లక్ష్మికి పెళ్ళై రెండు సంవత్సరాలైంది. ఇంకా పిల్లలు లేరు. ఈ విషయమై భర్తను అడిగి అడిగి విసిగిపోయింది. కని పించిన గుళ్ళుగోపురాలకు వెళ్లేది. తాయెత్తులన్నీ కట్టించు కుంది. పక్కింటిపిల్లలనుతెచ్చుకొని ఆడించుకొనేది. ఆ గ్రామానికి మహాయోగి ఒకడు వచ్చాడు. 150 సంవత్స రాలు హిమాలయాల్లో తపస్సుచేసి, ఇప్పుడు భూలోక సంచారానికై వచ్చాడట. ఏ సమస్యనైనా చిటికెలో తీర్చేస్తా డని అందరూ చెప్పుకుంటున్నారు. అందరితో పాటు లక్ష్మికూడా ఆయన దగ్గరకు వెళ్ళింది. పూర్వజన్మలో శిశు ఘాతకురాలని, అందుకే సంతానం కలగలేదని, ఏడు రాత్రిళ్ళు ఏకాంతోపదేశం చేయాలని చెప్పాడు. అది నమ్మిన లక్ష్మి ఏడు రోజులపాటు వెళ్ళివచ్చింది. చివరి రోజు స్వామిని, అతని శిష్యగణాన్ని పిలిచి భోజనాలు పెట్టి 100 రూపాయలు కూడా సమర్పించింది. తర్వాత స్వామి మరొక ఊరుకు మకాం మార్చాడు. తర్వాత స్వామివారిదగ్గరకు వెళ్ళివచ్చిన వారందరికీ పిల్లలు పుట్టారు. కానీ పిల్లలందరూ అచ్చుగుద్దినట్లు స్వామివారి పోలికే. ఈ కథద్వారా దొంగస్వాములు ప్రజల నమ్మకా లను ఆసరాచేసుకొని వారిని ఏవిధంగా మభ్యపెడు తున్నదీ కళ్లకు కట్టినట్టు చూపించాడు రచయిత. ఇటు వంటివి అరికట్టాలంటే ప్రజలు మూఢనమ్మకాలు వదలి వాస్తవికతతో ఆలోచించాలని సూచిస్తున్నాడు.

**పల్లె వాతావరణంకు నిలువటద్దం-పల్లెపట్టు కథ:**

పల్లెల్లో ఉండే చిన్నచిన్న తగాదాలు, రాజకీయాలకు, పగలు, ప్రతీకారాలకు సామాన్య జనులు ఏ విధంగా బలౌతారో తెలిపే కథ. ఇందులో పల్లెవాతావరణం చక్కగా చిత్రించారు రచయిత. బసవయ్య, అంజయ్య ఇద్దరు భూస్వాములు. పొలం పనులతో మొదలైన వీరి గొడవలు చిలికి చిలికి గాలివానగామారి కుట్రలు కుతంత్రాల దాగా చేరుతుంది. చివరకు ఇరువైపులా జీతగాళ్ళైన నాగన్న, పోలిగాడు రక్తం చిందేలా ఒకరినొకరు కొట్టుకున్నారు.

దీనికి కారణమైన భూస్వాములు మాత్రం హాయిగా భోగాలను అనుభవిస్తున్నారు. సమాజంలో పెద్దమనుషులుగా చెలామణీ అవుతూ, ప్రజలమధ్య సామరస్యాన్ని కుదర్చాల్సిన వాళ్ళే వారి స్వప్రయోజనాలకు సామాన్యులను బలిచేయడం, దీన్ని అర్థం చేసుకోలేని అమాయక ప్రజలు ఇలాంటి వారికోసం తమ ప్రాణాలను పణంగా పెట్టడాన్ని నిరసిస్తూ, ఇలాంటి వారిపట్ల ప్రజలు జాగృతితో మెలగాలన్న సందేశాన్ని తెలియజేయడానికే ఈ కథను రాశారు.

**ఆత్మస్థైర్యానికి నిదర్శనం అభ్యుదయం కథ :**

రంగయ్య చిన్న వ్యాపారి. వ్యాపారంలో నష్టం వచ్చి, ఉన్నదంతా పోగొట్టుకున్నాడు. ఆరుగురు సంతానం. మళ్ళీ కొత్తగా వ్యాపారం ప్రారంభించాడు. ఈసారి ఊర్లో పెద్దమనుషులందరినీ కలిశాడు. పల్లెటూళ్ళలో డబ్బు మారకం కంటే వస్తుమారకం ఎక్కువ కాబట్టి అతని దగ్గర డబ్బులేకపోయినా ధాన్యం ఎప్పుడూ నిల్వ ఉండేది. అతని భార్యకూడా ఇంటింటికీ తిరిగి బట్టలు అమ్మేది. ఊర్లోని పెద్దపెద్ద ఖాతాలన్నీ రంగయ్యగారే వద్దే ఉండేవి. వారి కావలసిన వస్తువులన్నీ వాళ్ల ఇంటికే సరఫరా అయ్యేవి. ఇలా రంగయ్య వ్యాపారాన్ని పెద్దది చేశాడు. తర్వాత రాజకీయ నాయకులతో పరిచయాలు ఏర్పడ్డాయి. 1947 ఆగష్టువరకు అన్నిపార్టీలకు పనిచేసి పెట్టేవాడు రంగయ్య. తర్వాత కాంగ్రెసు పార్టీ జెండా ఇంటిపై ఎగిరింది. కానీ కొడుకు కమ్యూనిష్టుపార్టీలో చేరాడు. కానీ ఎన్నికల్లో కమ్యూనిష్టుపార్టీ మట్టికొట్టుకుపోయింది. దీంతో కొడుకు ఆపార్టీనుండి బయటికి వచ్చేశాడు.

ఈ కథలో ప్రధానమైన అంశం రంగయ్య ఆత్మస్థైర్యం. వ్యాపారంలో నష్టం వచ్చిందని కుంగిపోకుండా పట్టుదలతో తిరిగి పయత్నం చేశాడు. తన సంపాదన స్థిరంగా ఉండటంకోసం పెద్దపెద్దవారి ఖాతాలను సంపాదించాడు. ఎవరితోనూ గొడవలు రాకుండా అందరితోనూ స్నేహపూర్వకంగా మెలగడం, వ్యాపారిగా అతని లౌక్యం ప్రదర్శించాడు. ఒక స్థాయి ఏర్పడ్డాక సమాజంలో తన అభిప్రాయాన్ని తెలుపుతూ కాంగ్రెసు పార్టీ జెండా ఎగురవేశాడు. పట్టుదలతో సాధిస్తే విజయం వరిస్తుందని, దానికి సహనం అవసరమని రచయిత సందేశం.

**కన్న తల్లి ప్రేమను తెలియజేసే కడుపుతీపి కథ:**

బిడ్డలు చేసే తప్పుల్ని తల్లి క్షమించడమేకాక, నిందను తనమీద వేసుకొనే ఓతల్లి కథ. శకుంతల పసిపాపగా ఉన్నప్పుడే తల్లి అనాథాశ్రమంలో విడిచి వెళ్ళిపోయింది. ఆనందస్వామి ఆబిడ్డను పెంచుతూ, తర్వాత అలాంటి బిడ్డలను ఎందరినో చేరదీసి, వారికి తండ్రిగా మారాడు. శకుంతలకు ఆమెతల్లినుండి అప్పుడప్పుడూ కానుకలు, ఉత్తరాలు వస్తుండేవి. ఒకరోజు ప్రసాదనే వ్యక్తి వచ్చి శకుంతల తన చెల్లెలనీ, తనతో పంపమనీ కోరాడు. పెంచిన మమకారం బాధిస్తున్నా శకుంతల భవిష్యత్తు కోసం ఆమెను అతనితో పంపించాడు. ప్రసాదు ఆమెను తీసుకొని తన అక్క ఇంటికి చేరాడు. స్వతహాగా ఎదుటివారి మాటలను నమ్మని మనస్తత్వం కలిగిన సుభద్ర తమ్ముడి మాటలను నమ్మకపోగా, అనుమానం పెంచుకొంది. శకుంతలను ఆమె మాటలు బాధపెట్టాయి. ఇవి తెలిసిన తమ్ముడు ప్రసాదు తన తల్లి చెప్పిన గతాన్ని ఆమెకు చెప్తాడు. సుభద్ర తను చేసిన తప్పును తల్లితనపై వేసుకుందని గ్రహిస్తుంది. పశ్చాత్తాపపడి భోరున ఏడుస్తుంది.

పెళ్ళికి ముందే కూతురుకు జరిగిన అన్యాయానికి సాక్ష్యంగా పుట్టిన బిడ్డను ఏం చేయాలో తెలియక, అనాథను చేసినా, ఆమెకోసం ప్రతిక్షణం తపన పడటం కన్పిస్తుంది. అందుకే కానుకలు పంపి, ఉత్తరాలు రాసింది. ఈనిజం కూతురి భవిష్యత్తుకు ఆటంకం కాకూడదని, తప్పు తనపైవేసుకొంది ఆతల్లి. చివరకు తన మరణానంతరమైనా ఆబిడ్డను చేరదీస్తారని, ఆఖరి కోరికగా ఆ బిడ్డను ఇంటికి తీసుకువచ్చి కుటుంబానికి దగ్గర చేయాలని కొడుకును కోరింది. ఇందులో బిడ్డ భవిష్యత్తు కోసం తల్లిపడే తపన కన్పిస్తుంది. ఎవరినీ అంత

సులభంగా నమ్మకలేకపోవడమనే సుభద్ర ప్రవర్తనకు కారణం ఆమెకు తగిలిన గాయం. ఇందులో తల్లివేదనను చక్కగా చిత్రించారు రచయిత. సామాజిక స్థితిగతులకు అనుగుణంగా సమాజంలోని పరిస్థితులను ఉన్నది ఉన్నట్లుగా వాస్తవాలను కళ్ళకు కట్టినట్లుగా తన కథల్లో చిత్రీకరించిన ఘనత రావూరి భరద్వాజది. సమాజంలోని వ్యక్తులు తమ బాధ్యతలను, నైతిక విలువలను వదిలి ఇష్టానుసారం ప్రవర్తిస్తే సమాజంలో జరిగే అనర్థాలను తన కథల్లో చక్కగా వర్ణించారు. సమాజంలోని వివిధ అంశాలను కథల్లో ప్రస్తావిస్తూ అందులోని మంచి, చెడులను పాఠకులకే అర్థమయ్యేటట్లు సున్నితంగా తెలియజెప్పిన గొప్ప కవి రావూరి భరద్వాజ గారు.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అక్కినేని కుటుంబరావు నవలా సాహిత్యం – వస్తు వైవిధ్యం

– డా॥. బి. ఉపేంద్ర, గెస్ట్ లెక్చరర్, తెలుగు విభాగం, ట్రిపుల్ ఐ.టి., ఇడుపులపాయ, కడప జిల్లా.

ఆధునిక తెలుగు సాహిత్యంలో కథ, నవల, వచన కవిత అన్నవి ప్రధాన భూమిక పోషిస్తున్నాయి. నేడు సమకాలీనాంశాలను వస్తువుగా తీసికొని రచయితలు ఈ ప్రక్రియల్లో రచనలు చేస్తున్నారు. సరళ శైలిలో ఉండటం వల్ల వీటికి పాఠకాదరణ తక్కిన ప్రక్రియల కంటే ఎక్కువగా ఉంది. వీటిలో నవల అన్ని వర్గాల ప్రజల జీవన స్థితి గతులను చక్కగా చిత్రిస్తున్నది. నిజ జీవితాన్ని నిత్యజీవితాన్ని నవల సమగ్రంగా పేర్కొంటున్నది. అందు వల్లనే నవలను రచనా కాలానికి చెందిన అన్ని సామాజి కాంశాలకు దర్పణం పడుతుందని విమర్శకులంటున్నారు. తెలుగులో నవల పాశ్చాత్య ప్రభావంతో రూపు దాల్చినా కాలక్రమంలో అది తెలుగు ప్రక్రియే అన్నంతగా గుర్తింపు పొందింది. దీనికి నవలా రచయితలే కారకులని చెప్పవచ్చు. అలాంటి నవలాకారుల్లో అగ్రగణ్యులు అక్కినేని కుటుంబరావు.

## నవలా రచయితగా :

అక్కినేని కుటుంబరావు 1980 ప్రాంతంలో సాహితీ రంగంలో అడుగుపెట్టారు. కథలు, కవితలు, నవలలు, విమర్శలు రాశారు. కొన్ని సినిమాలకు దర్శకత్వం వహించారు. ఇన్ని రంగాల్లో బహుముఖ ప్రజ్ఞ చూపినా వీరికి నవలా రంగమే మంచిపేరు తెచ్చిపెట్టింది. ఈ క్రమంలో చూసినపుడు వీరి కలంనుంచి వేణుగానం, మోహన రాగం, కార్మిక గీతం, చేదుపాట, భద్రం కొడుకో, అమ్మ, సొరాజ్జెం, అధోజగత్ సహోదరి అనే నవలలు వెలువడ్డాయి. ఈ నవలల్లో సామాజిక స్పృహ, అభ్యుదయ దృక్పథం, సంస్కరణ దృష్టి, సమగ్ర పరిశీలన, శాస్త్రీయ అవగాహన, శ్రామిక వర్గ పక్షపాతం వంటి అంశాలు అడుగడుగునా కనిపిస్తాయి. ఈ నవలల్లోని వస్తువును ఈ వ్యాసంలో స్పృశించడం జరిగింది.

## నవలలు – వస్తు వైవిధ్యం :

ఈనాడు తల్లి దండ్రులు తన ఆశయాలను ఆశలను పిల్లలపై రుద్ది వాటిని నెరవేర్చు కొనుటకు వారిపై ఎంతో ఒత్తిడి పెడుతున్నారు. తన కొడుకు, కూతురు డాక్టరు లేదా ఇంజనీరు కావాలని కలగంటున్నారు. దానికోసం వారిపై చదువుల పేరుతో ఎంతో భారం మోపుతున్నారు. తమ పిల్లలకు అంత శక్తి సామర్థ్యాలు, తెలివి తేటలు ఉన్నాయో లేదో కూడా పరిగణనలోకి తీసికోరు. పిల్లలకు ఏ రంగంలో అభిరుచి ఉందో అన్నది అస్సలు పట్టించు కోరు. ఎంసెట్‌లో ర్యాంకు తెచ్చుకోవాలని మాత్రం పోరు పెడతారు. లాంగ్ టర్మ్ పేరుతో జైలుకు నకలనదగిన హాస్టల్‌లో పెడుతున్నారు. వారు ర్యాంకు సాధించలేక పోయినపుడు ఎంతగానో ఆవేదన చెందుతున్నారు. ఇరుగు పొరుగు వారిని పోల్చుకొని తమ పిల్లలను తీవ్రంగా మందలిస్తున్నారు. ఈ ఒత్తిడి భరించలేక కొందరు పిల్లలు ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. దీనికంతటికీ తల్లిదండ్రుల దురాలోచనే కారణమని కుటుంబరావు 'చేదుపాట'లో స్పష్టంగా పేర్కొన్నారు. ఎంసెట్ ఒక్కటే జీవిత లక్ష్యమన్నట్లుగా తల్లిదండ్రులు భావించటం అదీ బాగా చదువుకున్నవారు అనుకోవటం తగదని చక్కని హితవు పలికాడు కుటుంబరావు. ఈ నవల ఆరోజుల్లో (1980 ప్రాంతంలో) సంచలనం సృష్టించింది.

నేడు ఏ పట్టణం నగరం చూసినా బాల కార్మికులు కోకొల్లలుగా కనిపిస్తారు. వర్కు షాపుల్లో, హోటళ్లలో, బ్రాంది షాపుల్లో, భిక్షాటన చేస్తూ ఉంటారు. రాత్రులందు రైల్వేస్టేషన్ బస్ స్టేషన్‌లలో తలదాచు కుంటుంటారు. వారి జీవితం చాలా దుర్భరంగా ఉంటుంది. వారికి చదువుకొనే అవకాశముండదు. మంచి తిండి ఉండదు. బట్టలుండవు. తన అన్న వారెవరూ ఉండరు. వీరిలో ఆడపిల్లలుకూడా ఉండటం మరీ దౌర్భాగ్యం. మగ పిల్లలను తమ కంటే పెద్ద పిల్లలు వివిధరకాలుగా దోపిడీ

చేస్తుంటారు. అపుడపుడు భౌతిక దాడులు కూడా చేస్తుంటారు. ఇక ఆడపిల్లల సంగతి చెప్పాల్సిన పనిలేదు. వారు అన్ని రకాల దోపిడీలకు గురవుతుంటారు. మన భారత దేశంలో దాదాపు కోటిమంది పైన బాలకార్మికులు, అనాథలు ఉన్నట్లు ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. వీరు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను అక్కినేని కుటుంబరావు 'భద్రం కొడుకో' నవలలో కళ్లకు కట్టినట్లు చిత్రించారు. ఈ నవల సినిమాగా కూడా వచ్చింది. దీనికి ఉత్తమ బాలల చిత్రం అవార్డు వచ్చింది.

అమ్మాయిలు తమ జీవిత భాగస్వామిని ఎంపిక చేసుకొనే హక్కు కలిగి ఉండాలని గట్టిగా విశ్వసిస్తారు అక్కినేని కుటుంబరావు. అభ్యుదయ దృక్పథంతో చూస్తే స్త్రీకి ఆమాత్రం హక్కు ఉండరాదనటం క్షమించరాని నేరంగా చెప్పవచ్చు. కమ్యూనిస్ట్ భావజాలం కలిగిన కుటుంబరావు స్త్రీవాద భావజాలంతో 'వేణుగానం' అనే నవల రాశారు.

భారతదేశానికి కార్మికులు, కర్షకులు రెండు కళ్లవంటి వారు. ప్రకృతి కర్షకులను బాధిస్తుంటే యాజమాన్యాలు కార్మికులను దోపిడీ చేస్తుంటాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా అపుడపుడు కార్మికులు సమ్మెకు పూనుకుంటుంటారు. అలాంటి సమ్మెలను యాజమాన్యాలు కుటిలత్వంతో అణచి వేస్తుంటాయి. కార్మిక నాయకులపై దాడులు చేయిస్తుంటాయి. కొన్ని సందర్భాల్లో నాయకులను లోబరచుకొని ఆందోళనపై నీళ్లు చల్లుతుంటాయి. కర్మాగారంలో పని చేస్తు ప్రమాదవశాత్తు మరణించే కార్మికుల కుటుంబ రోగులను యాజమాన్యాలు అసలు పట్టించుకోకుండా ఉంటాయి. వారికి ఇవ్వవలసిన సొమ్మును సరిగా ఇవ్వటం లేదు. ఇది జగమెరిగిన సత్యం. ఈ పెట్టుబడిదారీ సమాజంలో కార్మికులు ఐక్యంగా ఉంటే తప్ప విజయం పొందలేరని రచయిత 'కార్మిక గీతం' అనే నవలలో హెచ్చరించారు.

అగ్రవర్ణాల చేత అణచివేయబడ్డ దళితుల దర్భర జీవితాన్ని 'సొరాజ్జెం' నవలలో చిత్రించాడు. అగ్రవర్ణాల వారు దళితయువకులను చాలా చులకనగా చూస్తారని, స్త్రీలను లైంగికంగా దోపిడీ చేస్తారని తేల్చి చెప్పాడు రచయిత. దళితుల పేదరికమే వారు అన్ని విధాల లొంగి ఉండుటకు హేతువగుచున్నదని తెలిపాడు.

ఇలా అన్ని సామాజికాంశాలను స్పృశిస్తూ, చక్కని సామాజిక స్పృహతో అక్కినేని కుటుంబరావు నవలలు రాశాడు. వారి నవలలు పాఠకులను ఆలోచింపజేస్తాయి. సమాజాన్ని సంస్కరించాలనే భావచైతన్యాన్ని రగిలిస్తాయి.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు నవలా వికాసం - మొదలి నాగభూషణశర్మ
2. తెలుగు నవల - అంపశయ్య నవీన్
3. కుటుంబరావు నవలలు
4. తెలుగు సాహిత్య సమీక్ష - రెండోసంపుటం - ఆచార్య జి.నాగయ్య

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# అలపర్తి రామకృష్ణ నవలలు - సాంస్కృతికాంశాలు

**- సి. విజయలక్ష్మి,** పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి.

సంస్కృతి అంటే జీవనరీతి లేదా జీవన విధానం. ఆ జీవన స్థాయిని సాంకేతిక, వైజ్ఞానిక, సామాజిక రంగాల అభివృద్ధిలో పెంచుకుంటూ పోవడం నాగరికత. నాగరికత సంస్కృతిలో ఒక భాగం మాత్రమే. సంస్కృతికి ఎల్లలు లేవు. అన్ని జాతుల వారూ అన్ని దేశాలవారూ సుసంపన్నం చేసుకున్న సంస్కృతి విశ్వమానవ సంస్కృతిగా మారే అవకాశాలున్నాయి. అదే విధంగా చరిత్రలో భాగమే సంస్కృతి. ఈ సంస్కృతిలో ఒక అంతర్భాగమే భాష. అవి సమాజ నిర్మాణంలో, మానవాభ్యుదయంలో పరస్పరం కలిసిపోయి పనిచేస్తుంటాయి.అందువల్ల చరిత్ర లేని జాతికి సంస్కృతి ఉండే అవకాశమే లేదు. ఎందుకంటే సంస్కృతే చరిత్రకు పునాదులు వేస్తుంది. ఈ రెండింటిని అభివ్యక్తం చేసి, వాటిని భావితరాల అభ్యుదయానికి వారసత్వంగా అందించేది భాష. భాష లేకపోతే సంస్కృతి విభాగాలైన సాహిత్యం, కళలు, వైజ్ఞానికాభివృద్ధి వంటి అంశాలు ఇతరులకు తెలియవు. తరతరాల సామాజిక సంఘటనలు, ఆర్థిక సాంఘిక పరిస్థితులూ లిపి బద్ధం కాకపోతే దేశానికి చరిత్రే లభించదు. అందుచేత భాష, సంస్కృతి, చరిత్ర ఒకదానికొకటి పూరకాలని చెప్పవచ్చు.

భాష ద్వారా లిఖిత రూప సాహిత్యం రూపుదాలుస్తుంది. అందులో సమకాలీన సంస్కృతి ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సమాజంపైన చక్కని అవగాహన కలిగిన రచయితలు తమ రచనల్లో సంస్కృతికి అధిక ప్రాధాన్యాన్నిస్తారు. దాని ద్వారా భావితరాలవారు గతకాలపు సంస్కృతిని అవగాహన చేసుకుంటారు. ఈ సంస్కృతీ చిత్రణ అన్నది ప్రతి రచయితనూ ప్రభావితం చేస్తుంది. సంస్కృతికి అంత మహత్తరమైన శక్తి ఉంది. ప్రపంచంలో వెలువడిన ఏ సాహిత్యాన్ని పరిశీలించినా అందులో సంస్కృతి తన ఉనికిని చాటుకుంటూనే ఉంటుంది. ఇది చారిత్రక యథార్థ సత్యం. ఈ నేపథ్యంలోనే ఆధునిక వచన ప్రక్రియ అయిన నవల్లో కూడా సాంస్కృతికాంశాలు చిత్రించబడ్డాయి. ఈ దృక్కోణంలో చూసినపుడు అలపర్తి రామకృష్ణ కూడా వివిధ సాంస్కృతికాంశాలను తన నవలల్లో పేర్కొన్నాడు. వీరి నవలల్లో సామాజిక, సాంస్కృతిక అంశాలు అడుగడుగునా కనిపిస్తాయి. వీరు ఈ రెండు అంశాలకు అంత ప్రాధాన్యం ఇచ్చారు. వీరి నవలల్లోని సాంస్కృతికాంశాలు ఇక్కడ పేర్కొనడం జరిగింది.

## దేవాలయాలు :

భారతీయుల ఆధ్యాత్మిక సంపదకు మూల కందాలు దేవాలయాలు. రాచరిక పాలనలో దేవాలయాలు వర్ధిల్లాయి. పండిత పామర జనావళికి ఆధ్యాత్మికతతోబాటు మానసిక ప్రశాంతతను అందించినవి, అందిస్తున్నవి దేవాలయాలు. ఈ దేవాలయాల ప్రాధాన్యాన్ని మన భారతీయులు ఏనాడో గుర్తించారు. వారి అడుగు జాడల్లోనే నేడు మనం నడుస్తున్నాం. ఈ విషయాన్ని 'అనురక్తి' నవలలో అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు.

"ఊరి మధ్య పెద్ద శివాలయం ఉంది. జీర్ణావస్థలో ఉంది. ఆ దేవాలయం కింద పదెకరాల పొలం ఉంది. ఆ దేవుడి మాన్యం పొలాలు భూషయ్య అజమాయిషీలో ఉన్నాయి. దేవుడి మాన్యం అంటే! దాతలు వెనుకటి రోజుల్లో దేవాలయాల నిర్వహణకు పొలాలు దానం చేసేవాళ్ళు. ఆ పొలాల మీదవచ్చే అయివేజు దేవాలయానికి చెందిన చెరువు మరమ్మత్తులకు ఉపయోగించాలి. ప్రతి సంవత్సరం పూడిక తీయించాలి" అని వకుళతో మధుబాబు చెబుతాడు. మన పూర్వులు ముందెన్నడో కట్టించిన గుడుల్లో కొన్ని అక్కడక్కడ జీర్ణావస్థలో ఉన్నాయి. వాటిని ఉద్ధరించవలసిన బాధ్యత మనపై ఉంది. అదేవిధంగా ప్రతి దేవాలయానికి భూములు కేటాయించబడ్డాయి. ఆ భూములను దేవసేవలో కొనసాగే వివిధ కులవృత్తులవారు, పూజారులు అనుభవించవచ్చు. అంతే కానీ వాటికి వారు యజమానులు కారు. అదేవిధంగా

ప్రతి దేవాలయానికి ఒక చెరువు ఉంటుంది. ఆ మాన్యం భూముల్లో వచ్చే ఆదాయం ఖర్చు పెట్టుట ద్వారా చెరువు పూడిక తీయించాలి. ఈ నిబంధనలన్నీ మన పెద్దలు ఏనాడో రూపొందించారు. అలా చేసే దేవ సేవకులకు పోషణ లభిస్తుందని దాని ద్వారా వారు చక్కగా సేవ చేస్తారని పెద్దలు ఎంతో ముందుచూపుతో వ్యవహరించారు. ఇది మన సంస్కృతిలో ప్రధాన భూమిక పోషిస్తున్నది. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా మన పూర్వులు అన్ని దేవాలయాలకు మాన్యాలు ఏర్పాటు చేశారు. ఇది వారి దూరదృష్టికి నిదర్శనం.

**తిరుణాళ్ళ :**

గ్రామ దేవతల గుళ్ళవద్ద, శివాలయాల వద్ద తిరుణాళ్లు జరుగుతుంటాయి. ఆ సమయంలో అక్కడికి వేలాది మంది భక్తులు వచ్చి దైవాన్ని దర్శించుకొని పునీతుల మయ్యామని భావిస్తుంటారు. అలా భావించటం మన భారతీయుల విశ్వాస సంస్కృతికి నిదర్శనంగా పేర్కొనవచ్చు. తిరుణాల ప్రధాన్యాన్ని గురించి ప్రకాశినితో సుగుణ ఇలా అంటుంది 'పాల కొండలు' నవలలో.

"పాలకొండ తిరుణాల ప్రత్యేకత ఏమిటో తెలుసా నీకు? అడిగింది ప్రకాశిని.

తల అడ్డంగా ఊపింది తెలియదన్నట్లు. కొత్తగా పెళ్ళి అయిన వాళ్ళు ప్రేమలో పడ్డవాళ్ళు ఎక్కువగా ఈ తిరుణాలకు వస్తూ ఉంటారు. నూతన దంపతులు తమ సంసారంలో అనేక ఒడిదుడుకులు లేకుండా పయనించాలని, ప్రేమికులు తమ ప్రేమ సాఫల్యం కావాలని పాలమ్మను ప్రార్థిస్తుంటారు. ప్రేమికులను పెద్దలు విడదియ్యాలని ప్రయత్నిస్తే వారి భరతం, అమ్మ పడుతుంది" అంటుంది. పాలమ్మ తల్లిని ఎవరెవరు ఏయే ప్రయోజనం ఆశించి మొక్కుతారో రచయిత అలపర్తి రామకృష్ణ చక్కగా పేర్కొన్నాడు. కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న వారిని పెద్దలు విడదీయాలని చూస్తే పాలమ్మ తల్లి శిక్షిస్తుందని ప్రజలు గాఢంగా నమ్ముతున్నారు. దీనిని మన సంస్కృతిలో ప్రధాన భాగంగా చెప్పవచ్చు. 'ప్రయోజన మనుద్దిస్య' అన్నట్లు ప్రయోజనం లేనిదే మందమతీ కూడా ఏపనీ చేయడు. మరి అలాంటిది మన పూర్వులు ఎంతో ప్రయోజనాన్ని ఆశించి తిరునాళ్ళు ఏర్పాటు చేశాడని చెప్పవచ్చు.

**శిల్పకళలు :**

భారతీయుల సంస్కృతికి నిలువెత్తు నిదర్శనాలుగా ఉంటున్నవి శిల్ప కళలు. భారతీయ శిల్పులు రాతిపై చెక్కిన శిల్పాలు ప్రపంచ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తున్నాయి. మహాబలిపురంలోని శిల్పాలు భారతీయుల శిల్ప నైపుణ్యానికి ప్రతీకలుగా నిలుస్తున్నాయి. అలాంటి శిల్పాలు ప్రపంచంలో మరెక్కడా లేవని చెప్పుటలో అతిశయోక్తిలేదు. రచయిత అలపర్తి రామకృష్ణ 'గుండెగుప్పెడంత' నవలలో ఎల్లోరా గుహల ఔన్నత్యాన్ని చక్కగా పేర్కొన్నాడు. రుత్విక్ నయనికతో ఇలా అంటాడు.

"ఎల్లోరా గుహల్లోని శిల్ప వైభవం చూసి ఆశ్చర్య పోయారు. కరెంటు, సాంకేతిక పరిజ్ఞానంలేని కాలంలో వెయ్యి సంవత్సరాలకు పూర్వం పెద్దపెద్ద విగ్రహాలు చెక్కారంటే మామూలు విషయం కాదు.

ఎల్లోరా గుహలు మొత్తం 34. కొన్ని బౌద్ధ, కొన్ని బ్రాహ్మణ, మరికొన్ని జైన గుహలు... పెద్ద గుహల్లో చైత్య మందిరాలు, విహారాలు మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. చైత్యాలు ప్రార్థనా మందిరాలుగా విహారాలను నివాసస్థలాలుగా బౌద్ధ భిక్షువులు ఉపయోగించుకునేవారు. ఎల్లోరా గుహల్లో అత్యంత అద్భుతమైనది కైలాసనాథ మందిరం. వంద అడుగుల ఎత్తు ఉంది. గుహల్లో కొన్నిటిలో రెండు మూడు అంతస్థులు మందిరాలున్నాయి" అంటూ గుహలును రచయిత మన కళ్ళముందు సాక్షాత్కరింప జేశాడు. గుహలనగానే మనకు ముందుగా ఎల్లోరా గుహలే గుర్తుకొస్తాయి. వాటిని చూసి తరించాల్సిందేగాని వినినా, చదివినా అంత భావన రాదు. శిల్పులు ఎంతగానో కష్ఠించి పదుల సంవత్సరాల కాలం శ్రమించి వాటిని చెక్కారని తెలుస్తున్నది. మన శిల్పులు తమ కళా ప్రతిభను చాటుకొనుటకు చెక్కారేగాని స్వార్థం కోసం చెక్కలేదు. ఈ విషయాన్ని రచయిత మనకు తెలియ జేశాడు. భారతీయ కళల్లో చెక్కు చెదరనిది శిల్పకళేననుటలో అతిశయోక్తి లేదని చెప్పవచ్చు.

**ఏరువాక పున్నమి :**

తెలుగువారి సంస్కృతికి ప్రతిబింబం 'ఏరువాక'. రైతులు ఏరువాక పున్నమిలో పొలాల దున్నకాన్ని ప్రారంభిస్తారు. వ్యవసాయ పరికరాలను బాగ పూజించి, పశువులను అలంకరించి, భూమి పూజ చేసి వ్యవసాయాన్ని ప్రారంభిస్తారు. ఈ విషయాన్ని 'గుండెగుప్పెడంత' నవలలో రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా చిత్రించాడు.

"కాలేజి పిల్లలందరిని సమావేశపరచి రుత్విక్ చేత ఉపన్యాసమిప్పించింది నయనిక.

వ్యవసాయం అంటే చిన్నచూపు తగదు. ఆర్థిక మాంద్యంతో ప్రపంచంలోని అగ్రరాజ్యాలు కునారిల్లినా మన దేశం తట్టుకుందంటే కారణం వ్యవసాయ ప్రధాన దేశం కావడం వల్లే! చదువులయ్యేక వ్యవసాయం చేసినా, చెయ్యకపోయినా విద్యార్థి వ్యవసాయ పద్ధతులు నేర్చుకోవాలి. ఖరీఫ్, రబీ, ఏరువాక లాంటి పదాలకు అర్థం తెలిసి ఉండాలి. ఏరువాక అంటే ఏమిటో తెలుసా? విద్యార్థులను అడిగాడు.ఎవరూ చెప్పలేకపోయారు.

ఏరు అంటే నాగలి కర్రు. మృగశిర కార్తె మొదటి రోజున ఎద్దుల్ని అలంకరించి మెడమీద భూమిని దున్నే నాగలి కర్రును ఉంచి మూడు చాళ్ళను దున్నిస్తారు. ఆముచ్చటే ఏరువాక. బతుకు తెరువుకు పాడిపంటలు అవసరం. మీరు గేదెల పాలు తీయడం కూడా నేర్చుకోవాలి! అప్పుడే జీవితంలో నెగ్గుకొస్తారు. దేనికీ భయపడకుండా ముందడుగు వెయ్యాలి! అంటూ ఉపన్యాసం ముగించాడు". ఉన్నత విద్యావంతులైనా కూడా వ్యవసాయాన్ని తృణీకరించరాదని రచయిత నేటి యువతకు చక్కని సందేశమిచ్చాడు. మన దేశం వ్యవసాయ దేశమని, దానిని నిర్లక్ష్యం చేసినా, తృణీకరించినా దేశం పురోగమనంలో నడుస్తుందని నర్మగర్భంగా హెచ్చరించాడు. వ్యవసాయాన్ని దైవసమానంగా భావించడం మన సంస్కృతికి నిదర్శనమని రచయిత తెలిపాడు.

**ఎడ్లపందాలు :**

మన తెలుగువారి సంస్కృతిని ప్రతిబింబించే మరో అంశం 'ఎడ్లపందాలు'. సంక్రాంతికి కోడి పందాలు, ఉగాదికి ఎడ్ల పందాలు కోస్తాంధ్ర ప్రజలు అత్యంత వైభవంగా జరుపుకుంటారు. కోట్లాది రూపాయలు డబ్బు ఈ సందర్భంగా చేతులు మారుతుంది. ఈ ఎడ్లపందాలు గురించి రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా తెలిపాడు.

"మొన్న కారం చేడు వెళ్ళానబ్బాయి. ఆ వూళ్ళో ఎడ్ల పందాలు పెట్టారు ... పుటకగల ఎద్దుల్ని చూస్తుంటే కడుపు నిండిపోయింది. తిరుణాళ్ళకు వచ్చినట్లు జనం పల్లెల నుంచి వచ్చారు. నాకైతే ఏదో ఆశ. రైతుకు మంచి రోజులొస్తాయి. పశువుల్ని పెంచడం భారం అనుకునే రోజులుపోతాయి. ప్రతి ఇంటి దగ్గర పశువుల సావిడి ఉంటుంది. ప్రతి ఇంట్లో పాడి ఉంటుంది. అన్నాడాయన.

సర్పంచ్ ఎక్కడ ఎడ్ల పందాలు జరిగినా తను పెంచే మేలుజాతి ఎడ్లను తీసుకెళతాడు. పందాలలో గెలిస్తే వాటిని చక్కగా అలంకరించి చుట్టుపక్కల గ్రామాలలో ఊరేగింపుగా తీసుకెళతాడు. గులాల్‌కొట్టి అలంకరించిన ఎడ్లను అందరూ చూస్తుంటే ఆయన పొంగిపోతాడు" అంటాడు రుత్విక్. పశువులకు పల్లె ప్రజలకు ఎంతో అవినాభావ సంబంధం ఉంటుంది. ఇదే కాల క్రమంలో సంస్కృతిగా పరిణమించింది.

ప్రముఖ నవలా రచయిత అలపర్తి రామకృష్ణ ఇలా వివిధ సాంస్కృతికాంశాలను తన నవలలో పేర్కొన్నాడు. ఇవి భావి తరాల వారికి చరిత్రగా దోహదపడతాయని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. తెలుగు భాషా సాహిత్య సంస్కృతుల చరిత్ర - డా॥ బూదరాజు రాధాకృష్ణ (సంపాదకులు)
2. ఆంధ్రుల సాంఘిక చరిత్ర - సురవరం ప్రతాపరెడ్డి
3. తెలుగు సాహిత్య సమీక్ష - ఆచార్య జి. నాగయ్య
4. సంస్కృతి - ఎ ఎస్ మూర్తి
5. అలపర్తి రామకృష్ణ నవలలు.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# తెలుగులో 'దళిత స్త్రీ' వాద సాహిత్యం

- డా॥. పి. ఎ. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, ప్రభుత్వ కళాశాల (అటానమస్), రాజమహేంద్రవరం.

పాశ్చాత్య దేశాల నుంచి దిగుమతి అయిన పారిశ్రామిక విప్లవం, భావ విప్లవాలు పుణ్యమా అని, అందరూ ఎదగటానికి విద్య అందరికీ అందుబాటులోకి వచ్చింది. విద్య ఇంగ్లీష్‌లోనే కాదు, ఆధునిక వ్యావహారిక భాషలో కూడా అట్టడుగు వర్గాలదాకా చేరుకుంది. ఫలితంగా ఆకలి దగ్గర నుంచి ఆత్మగౌరవం దాకా అణగారిన ప్రజలు ఎదగడానికి అనువైన వాతావరణం ఏర్పడింది.

స్వేచ్ఛ స్వాతంత్ర్యం, సౌభ్రాతృత్వం, సమానత్వాల దిశగా, అసమానతల మీద సునామీలా ప్రసార మాధ్యమాలు పిడికిలెత్తుతున్న నేపథ్యంలో దళితులు, స్త్రీల ప్రాపంచిక దృక్పథాల్లో మార్పు వచ్చింది. ఉదారవాదుల మేలుకొలుపుల్లో దళిత స్త్రీ కూడా నిద్రలేచింది.

ప్రగతి సమష్టి నుంచి వ్యష్టి వైపు ప్రయాణించడం మొదలయ్యింది. కొంతమంది కడుపు నిండటాన్ని స్వర్ణ యుగంగా చరిత్ర భ్రమించే కాలం చెల్లింది.

విద్య తన గడపదాకా రావటంతో దళిత స్త్రీ తన గురించి తాను గొంతెత్తడం ప్రారంభించింది. నిన్నటిదాకా సంస్కర్తలు, ఉదారవాదులు తన పక్షం వహించి తన సమస్యలు పరిష్కరించే కృషి చేశారు. అంటే సాహిత్య పరిభాషలో చెబితే ఇవాళ 'దళిత స్త్రీవాదం' నిబద్ధత, నిమగ్నతలను దాటి నిబిడిత వైపు ప్రయాణిస్తుందన్న మాట.

దళిత స్త్రీవాద సాహిత్యంతో పాటు దళిత స్త్రీవాద విమర్శ కూడా సమాంతరంగా సాగడం అవశ్యం. అలాంటి సాహిత్య విమర్శ సమస్యల్ని, దానిపై పోరాటాలను వెలుగులోకి తెస్తుంది.

సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి అన్నట్టు ఎంత సహానుభూతి చెందినా, ఒకడి బాధ మరొకడిది అవ్వదు ; ప్రపంచపు బాధ తన బాధగా చేసుకున్నప్పటికీ; ఎవడి గోడు వాడు ఎలుగెత్తితేనే దాని ఉనికి దాని తీవ్రత అభివ్యక్తం అవుతాయి. కాబట్టి దళిత స్త్రీ గురించి వచ్చిన ప్రాతినిథ్య సాహిత్యం కంటే దళిత స్త్రీ వాదం, దళిత స్త్రీ సమస్యల్ని శక్తిమంతంగా, సూక్ష్మస్థాయిలో వడిసి పట్టగలుగుతుంది.

'దళిత స్త్రీ' పరిధిలో 'ఆదివాసీ స్త్రీ' కూడా భాగమే అయినప్పటికీ సమస్య నేపథ్యం, సమస్య భిన్నత్వం దృష్ట్యా ఆదివాసీ స్త్రీని ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సి ఉంది. కాబట్టి 'దళిత స్త్రీవాదం'ను 'యస్.సి. స్త్రీ'కే వర్తింపజేయడం ఉచితం. తద్వారా సమస్య మూలాలను, సమస్య తాలూకు సూక్ష్మ వైవిధ్యాలను వెలికితీయడానికి, పరామర్శించడానికి, పరిష్కరించడానికి అనువైన వాతావరణానికి వీలు కలుగుతుంది. అంటే సమస్యను స్థూల దృష్టితో కాకుండా సూక్ష్మ దృష్టితో చూడాలన్నమాట.

అంతేకాదు అత్యున్నత న్యాయస్థానం 'దళిత' పదాన్ని నిషేధించిన నేపథ్యంలో సాహిత్య సందర్భంలో రూఢి అయిన 'దళిత' పద వినియోగం చర్యనీయాంశం. ఈ దశాబ్దంలో తెలుగులో వచ్చిన దళిత స్త్రీవాద సాహిత్య పాయల్ని పరికించడం ప్రస్తుత లక్ష్యం. ఇక్కడ వస్తు వైవిధ్యాన్నే కాకుండా సాహిత్య ప్రక్రియా వైవిధ్యాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. అంటే దళిత స్త్రీ సమస్యను సామాజిక దృక్కోణంలోను అలంకార శాస్త్ర దృక్కోణంలోంచి శోధించాల్సి ఉంటుందన్న మాట.

అంతేకాదు దళిత స్త్రీ సాహిత్యీకరించిన సమస్యల్ని సామాజిక శాస్త్రాల సాయంతో పరిశీలించడమే కాకుండా, ఆమె అనుభూతుల్ని, అనుభవాలను కూడా తన సాహిత్యంలోంచి పరికించాల్సి ఉంటుంది. అంటే ఆమె జీవితాన్ని మొత్తం స్పృశించాల్సి ఉంటుంది. ఆమె బాధల్నే కాదు ఆమె భావుకతను కూడా తమదైన అలంకార శాస్త్ర పరిభాషలో తూకం వేయాల్సి ఉంటుందన్న మాట.

విద్య అందుబాటులోకి వచ్చే కొద్దీ సమస్యల వలయంలో చిక్కుకున్న జీవితం తాలూకు సాహిత్యంలో వస్తు వైవిధ్యం విస్తృతమవటంతో పాటు జీవన తాత్త్వి

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


కతలోంచి ఉట్టిపడే కళాతత్త్వం కూడా వినూత్నంగా పరిచితమవుతుంది.

కాబట్టి అట్టడుగు ఉపశ్రేణి వర్గాల వాళ్ళ రాతల్లో ఆవిష్కృతమయ్యే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజ కీయ సంక్లిష్టతను వస్తు, కళాతత్త్వ దృక్కోణాల్లో లోతుగా పరిశోధించాల్సి ఉంటుంది.

ఆధునిక సాహిత్యం ప్రతిఫలించిన తెలుగు నేల మీది దళిత స్త్రీ వాస్తవికతను నాలుగు ప్రధాన మాండలికాల నేపథ్యంలో భాషా దృక్కోణంలో కూడా సాంస్క ృతిక పరిమళాలను వివేచించాల్సి ఉంటుంది.

విద్యావంతురాలైన 'ఆమె' తన మూలాలు తవ్వుకుని నిర్మించిన సామాజిక శాస్త్ర సిద్ధాంతాలను, కళాతత్త్వ రహస్యాలను బహిర్గతం చేయాల్సి ఉంటుంది. వాటిని నిగుతేల్చాల్సి ఉంటుంది.

ఆమె జీవితాన్ని కళా సృజనగా మలచిన నిర్మాణ వ్యూహాలను, దానికి ఉపకరించిన సామగ్రిని వివర ణాత్మకంగా చర్చించాల్సి ఉంటుంది.

కళగా ఆవిష్క ృతమయిన ఆమె కన్నీళ్ళను, కార్చిచ్చును ఉపశమింప చేయగల చట్టాలకు దోహదపడగల ముడి సరుకును సమకూర్చాల్సి ఉంటుంది. మొత్తం మీద త్రిగుణాత్మకమైన ఈ దశాబ్దపు ఆమె రాతలు ఆమె 'రాత' మారడానికి అనువైన చర్చావేదికను ఈ ప్రాజెక్టు పరంగా ద్విగుణీకృతంగా తయారు చెయ్యడం ఆవశ్యం. లోగడ కళారత్న ఆచార్య శిఖామణి లాంటివాళ్ళు తమ అనుభవాల్ని కవిత్వీకరించిన ఇద్దరు ముగ్గురు దళిత స్త్రీవాద కవయిత్రులను ప్రాసంగికంగా గుర్తించారు. ప్రస్తుతం దానికి కొనసాగింపుగా 'ఆమె' రచనల్ని ప్రధా నంగా, సమగ్రంగా దర్శించాల్సి ఉంటుంది.

ఆమె జీవిత లోతుల్ని స్పృశించిన నిబిడ సాహిత్యాన్నే కాదు, నిబద్ధత, నిమగ్నత సాహిత్యాన్ని విశ్లేషించాల్సి ఉంటుంది. సాహిత్యం అన్నపుడు దాని ప్రక్రియలన్నీ వస్తాయి. అంటే నవల, నాటిక, కథ, కవిత లాంటి 'ఆమె' వస్తువుగా కలిగిన అన్ని ప్రక్రియల్ని పరిశోధించాల్సి ఉంటుంది.

శ్రమ దోపిడి, లైంగిక దోపిడి, పరాధీనత, అజ్ఞానం, అనారోగ్యం, అవిద్య ఆమెను పట్టిపీడిస్తున్నాయి. వీటి నుండి విముక్తి పొందేందుకు 'ఆమె' పెనుగులాడు తుంది. ఆకలి దగ్గరే ఉన్న ఆమె ఆత్మగౌరవం దాకా ఎదగాలి. విముక్తి ఆమె స్వప్నం. దాన్నే 'ఆమె' సృజించిన సాహిత్యంలో ప్రతిఫలిస్తుంది. దానికనుగుణంగానే సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, నైసర్గికంగా, మేధాపరంగా, ఆరోగ్యవంతమైన పరిసరాలు తయారవ్వాలి. అలా కాకపోతే 70 ఏళ్ళ స్వాతంత్ర్య ఫలాలు బుగ్గిపాలయినట్టే. అంతర్జాతీయ వేదికల మీద మానవాభివృద్ధి సూచీలో మన స్థానం చూసుకుని మనదేశం తలవంచుకోవాలి. అలా జరగకూడదంటే 'ఆమె'కు అన్నీ సమకూరాలి. అందరిలాగే 'ఆమె' ఎదగాలి. 'ఆమె' తలెత్తుకుంటేనే దేశం తలెత్తుకోగలదు. లేకపోతే దేశాన్ని అజ్ఞానం, అవిద్య, వివక్ష, అనారోగ్యం ముసురు కుంటుందని ప్రపంచదేశాలు వెక్కిరిస్తాయి.

**ఉపసంహారం :**

అట్టడుగున ఉన్న, అభివృద్ధికి ఆమడదూరంలో ఉండిపోయిన 'ఆమె' హుందాతనం కోసం సమగ్రతాభి వృద్ధి కోసం జాతి నడుంబిగించాలి. ఆ మహాయజ్ఞానికి ఈ ప్రాజెక్టు రూపకల్పన చిన్న సమిధ కాగలుగుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగులో కవిత్వోద్యమాలు - తెలుగు అకాడమీ
2. తెలుగులో సాహిత్య చరిత్ర - ఆచార్య వెలమల సిమ్మన్న
3. ఆధునిక సాహిత్య విమర్శ సూత్రం - ఆచార్య కొలకలూరి ఐనాక్

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# శరత్ నవలల ఆధారిత చలన చిత్రాలు - రస దృక్పథం - తులనాత్మక పరిశీలన

- భవానీ శంకర్, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

భారతీయ చలన చిత్రాలలో రస దృక్పథానికి చెందిన చర్చ అనేక భేదాభిప్రాయాలతో కూడుకొని ఉన్నా, కళకి, రసానికి నెలకొన్న అవినాభావ సంబంధం మాత్రం స్పష్టం. కాబట్టి చలనచిత్రాలకు గల భారతీయ అలంకారిక శాస్త్ర భూమికను, నేపథ్యాన్ని పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉంది.

బిభూతి భూషన్ బంధోపాధ్యాయ రచించిన పథేర్ పాంచాలీ, అపరాజిత అనే బెంగాలీ నవలల ఆధారంగా చిత్రించిన పథేర్ పాంచాలీ, అపరాజిత, అపు సంసార్ (అపుత్రయంగా పేర్గాంచిన సత్యజిత్‌రే దర్శకత్వం వహించిన బెంగాలీ చలన చిత్రాలు) అను సినిమాలలో విస్పష్టమైన రస నిష్ఠ దృష్టి గోచరిస్తుంది. సత్యజిత్ రే అపుత్రయం (Apu Triology) రస దృక్కోణంలో ప్రాచీన సంస్కృత నాటక ప్రక్రియను దాదాపుగా అనువర్తించారు. ఇక 1964, 66 సంవత్సరాలలో తమిళ, తెలుగు భాషలలో వెలువడిన నవరాత్రి అను చిత్రం (1974లో నయాదిన్ నయీరాత్‌గా వెలువడింది) సినిమాలపై రస ప్రాధాన్యతను పూర్తిగా ప్రత్యక్షతరం చేశాయి. 'నవరాత్రులు నవరసాలను ప్రతిబింబిస్తూ, ప్రతిరాత్రి జరిగిన సంఘటన నుండి ఒక్కో రస స్థాయీభావాన్ని కథాగమనంలో సహృదయునిలో అంకురింపజేయడం చలన చిత్రాల్లో చేసిన మొట్టమొదటి రసాత్మకమైన ప్రయోగం ఈ తరహా రసాత్మక ప్రయోగం శరత్‌చంద్ర ఛటోపాధ్యాయ రచించిన నవలల ఆధారంగా చిత్రించిన సినిమాలలోనూ కనిపిస్తున్న దృష్ట్యా, వాటి రసౌచిత్య గుణదోషాలను పరిశీలించాల్సిన ఆవశ్యకత ఉంది.

నిష్కృతి నవల ఆధారంగా చిత్రించిన తోడికోడళ్ళు అనే తెలుగు చలనచిత్రం, అప్నే పంబే అనే హిందీ చలనచిత్రాల మధ్య రసదృక్పథంతో తులనాత్మక పరిశీలనగావించి చూద్దాం. తోడికోడళ్ళు చిత్రం తొలి అంకం నుండి కథాగమనంలో హాస్యరసానికి తగు ప్రాధాన్యత నిస్తున్నట్లు కనబడుతుంది. ఈ చిత్రం తొలి సన్నివేశంలో పిల్లలు చిందులు వేయడం, పెద్దమ్మను ఆటపట్టించడం వంటి సంఘటనలు మూలానికి భిన్నంగా ఉన్నా, చిత్రానికి ప్రత్యేక రస ప్రయోజనాన్ని ఆశించినట్లు కనిపిస్తుంది. ఈ రకమైన అదనపు సన్నివేశం రసౌచిత్య భంగం కలిగించకుండా 'ప్రకరణ వక్రతకు' తగు సారూప్యతను కనబరుస్తుంది. కావ్యంలో ఒక ప్రత్యేక ప్రకరణను చొప్పించడం ద్వారా నెలకొను వక్రతకువలే తోడికోడళ్ళు చిత్రంలో చొప్పించిన అదనపు సన్నివేశాలు వక్రోక్తిని స్ఫురింపజేస్తున్నాయి.

అప్నేపరాయెలో నేరుగా కథాంశానికి ప్రాధాన్యతనిస్తూ పాత్రలు అభినయాన్ని కనబర్చడం ద్వారా ప్రత్యేక రసదృష్టి వ్యక్తమవ్వదు. కానీ పాత్ర తీరు, సంభాషణల్లో అంతర్లీనంగా హాస్యస్ఫోరకమైన చతురత కనబడడం ద్వారా సంభాషణాశిల్పచాతుర్యం ప్రదర్శితమవుతుంది.

రెండు సినిమాల్లోనూ తొలి అంకంలోనే ప్రేక్షక హృదయాలలో దర్శకుడు చొప్పించదలచిన రసాంకుర బీజం కావలసిన మోతాదులో నాటుకుంది. ఇవి దర్శకుల నాటకీయ శిల్ప చాతుర్యానికి, సంభాషణ శిల్ప సృష్టిలో ఔచిత్య స్పృహకి నిలువుటద్దంగా నిలుస్తున్నాయి.

అలాగే శరత్ దేవదాసు నవల ఆధారంగా చిత్రించిన తెలుగు, హిందీ చలనచిత్రాలు సైతం రసపోషణ అను అంశంలో తులనాత్మక పరిశీలనకు నోచుకోదగినవిగా గమనించవచ్చు.

బిమల్‌రాయ్ దర్శకత్వం వహించిన హిందీ దేవదాసు సినిమా (1955)లో మొదటినుండి పాత్రల నడకలోనూ, వారి అభినయాలలోనూ ప్రేక్షకులను నిర్మల మనస్కు

లుగా, చిత్తశాంతితో నడిచేలా రసాభినయం జరిగిందని చెప్పవచ్చు.

ప్రేక్షకులలో ఏ అలజడికీ, రసోత్థానపతనాలకి తావివ్వ కుండా కథాంశ ప్రధాన రసమైన కరుణాన్ని శాంతిరసంతో ముడివేసి నడిపించాడు దర్శకుడు. ఇవి నవలా ప్రక్రియకు, పాఠకుడి ఊహకు ప్రాణం పోసినట్లుగా ఉంది. అయితే నవలాప్రక్రియకు భిన్నంగా సినిమా చిత్రీకరణ సాగాలని భావించే ప్రేక్షకులకు అంత రసోత్పత్తి జరగదని భావించవచ్చు. నవలలో పాఠకుడు చేసే దీర్ఘమైన విశ్లేషణ, కంటి మీద నడిచే తెరపై కలిగించడం సాధ్యం కాదు. కారణం దృశ్యీకరణలో ప్రేక్షకులు నాయికా నాయకులతో తాదాత్మ్యం చెంది రసానందం పొందడానికి ఎక్కువ ప్రాధాన్యతనిస్తాడు.

వేదాంతం రాఘవయ్య దర్శకత్వం వహించిన తెలుగు దేవదాసు సినిమా (1953)లో కథలో తర్వాత సాగే పరిణామాలలో ఉత్థానపతనాలతో కూడిన రస సంవిధానానికి అనువుగా సన్నివేశ కల్పన, పాత్రాభినయాలను కల్పించాడు. హిందీ (బిమల్‌రాయ్ దేవదాసు)లో కథా, పాత్రా అభినయాల్లోని నిర్మల, నిశ్చల మనస్సులతో ఏ భావ ప్రకంపనలకూ చోటు లేని తాత్త్విక జీవన చింతనాపరమైన ఆలోచనతో కూడిన పూర్వాపర రస సమన్వయం సాధించే ప్రయత్నం జరిగిందని చెప్పవచ్చు. తెలుగు (అక్కినేని నటించిన) దేవదాసులో నాయకుడికి సాంఘిక సంస్కరణలతో కూడిన ఆదర్శ భావాలు, చురుకుదనం, దుడుకు శైలి, "పల్లెకు పోదాం పారుని చూద్దాం ఛలో ఛలో" అనే పాటలో ప్రేక్షకులలో ఆనందోత్సాహాలను కలిగిస్తాయి.

అత్యంత ఉచ్ఛస్థాయిలో కథ ప్రధాన రసం పండాలంటే అది క్రమేణా ప్రేక్షకునిలో చొప్పిస్తూ పోవాలి. ప్రేక్షకుడి హృదయం అచంచలమైపోయి స్థిరచిత్తదశకు చేరాలి. అక్కినేని నటించిన తెలుగు దేవదాసులో ప్రేక్షకులు నాయకుని లక్షణాలని తమలో ఊహించుకుని, పరకాయ ప్రవేశం చేసి క్రమేణా కరుణ రసానుభూతివైపుకి ప్రయాణించేలా రసావిష్కరణ జరిగింది.

బిమల్‌రాయ్ మరియు వేదాంతం రాఘవయ్య దర్శకత్వంలో హిందీ, తెలుగు దేవదాసు చిత్రాలు రెంటిలోనూ నాయికా నాయకుల బాల్య సన్నివేశాలు ఎంతో ప్రేమ, వాత్సల్యం, కల్మషం లేని ముగ్ధమైన ప్రేమతో చిత్రించబడ్డాయి. అయితే విజయనిర్మల దర్శకత్వంలోని దేవదాసు (1974) సినిమా ఈ రెండు చిత్రాలను పూర్తిగా అనుసరించిందేగానీ ఏ విధమైన మార్పుకు అవకాశం ఇవ్వలేదు. ఇవి కొంత కృతకంగానూ, ఏ విభిన్నతా లేని పూర్వ వస్తు ప్రదర్శనా భావం కలుగుతుందని చెప్పవచ్చు. ఈ చిత్రంలోని పాత్రలకు సన్నివేశాలకు మధ్య రస సమన్వయం చేకూర్చే ప్రయత్నం చేసినా పూర్వం పరిచితమైన సినిమాల ప్రభావం కారణంగా ప్రేక్షకుల మన్ననలు పొందడం కొంత కష్టసాధ్యమని చెప్పవచ్చు. సంజయ్ లీలా బన్సాలీ దర్శకత్వం వహించిన దేవదాసు (2002) చిత్రంలో ప్రతి రస స్థాయీ భావాన్ని అత్యంత ఉచ్ఛ స్థాయిలో చొప్పించే ప్రయత్నం జరిగిందని చెప్పవచ్చు. కొన్నిసార్లు పార్వతి తల్లి (కిరణ్ ఖేర్) వంటి పాత్రల చేత అనౌచిత్య రసాలకు ప్రాధాన్యత కల్పించే ప్రయత్నం చేసినా సాహితీవేత్తలకు అంత రుచించే విధంగా లేదని చెప్పవచ్చు.

ఈ విధంగా భారతీయ చలనచిత్రాలలోని సన్నివేశ కల్పనలలోనూ, పాత్రోచిత రసాభినయాలలోనూ భారతీయ అలంకారిక శాస్త్ర దృక్పథం పెనవేసుకుందని పై తులనాత్మక పరిశీలనావ్యాసం ద్వారా గ్రహించవచ్చు.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# వేకువరాగం - హేమలత మౌనరాగం

- వెంకటేశ్వరరావు కట్టూరి, పరిశోధక విద్యార్థి, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, బొమ్మూరు, రాజమండ్రి.

తెలుగు సాహితీ పూదోటలో అక్షర పరిమళాలు వెద జల్లుతూ, సాహిత్య లోకాన్ని తన కవిత్వంతో ఓలలాడిస్తూ 'జ్వాల'లా విస్తరించి వికసించి తెలుగు వెలుగులు పంచింది. సాహిత్యమే శ్వాసగా కవిత్వమే జీవితంగా, పుస్త కాలే ప్రపంచంగా జీవించింది. పరిశోధకురాలిగా, అధ్యాపకురాలిగా, కవయిత్రిగా, రచయిత్రిగా, ఉప న్యాసకురాలిగా, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ఉద్యమ నాయకురాలిగా, బహుముఖ ప్రజ్ఞా పాటవాలు కలిగిన వ్యక్తిత్వం ఆమె సొంతం. బహు భాషా కోవిదు రాలు, పరిశోధకులకు దిశానిర్దేశం, మార్గనిర్దేశం చేయడంలో ఆమెకు ఆమే సాటి. అంతర్జాల సాహిత్యంలో తొలి తెలుగు పరిశోధకురాలు 'వెన్నెల' కలం పేరుతో ఎన్నో ఉత్తమ కవితలు మనకందించారు.

స్వచ్ఛమైన వెన్నెల వంటి మనసు ఆమె సొంతం. 'టెక్ సేవి' అను ముద్దుగా పిలిచినా, హేమక్కా అని పలక రించినా, ఎవరు పిలిచినా సంతోషంగా పలకరించడం, శత్రువును కూడా ప్రేమగా పలకరించడం బహుశా ఆమెకే సొంతం. కళాకారుల్ని, కవులను సగౌరవంగా సత్కరిం చడం, వారి నుండి మరింత ఉత్తమ సాహిత్యాన్ని వెలికితీసి తెలుగు సాహితీ పాఠకలోకానికి 'విహంగ ' పత్రిక ద్వారా పరిచయం చేయడం ఆమెకే చెల్లును. పరిశోధకురాలుగా తొలి దళిత కవి కుసుమ ధర్మన్న జీవిత చరిత్రను మనకు పరిచయం చేసిన ఘనత ఆమెకే సొంతం. స్త్రీవాదిగా, దళిత స్త్రీల పక్షపాతిగా, అనేక పోరాటాలు చేశారు.ఆమె మరెవరో కాదు తెలుగు సాహిత్యంలో గొప్ప కవి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ జీవిత భాగస్వామి,డా॥ హేమలత పుట్ల.

పుట్ల హేమలత తన పదమూడో యేటనుండి కవిత్వం రాయడం, రచనా వ్యాసంగం చేయడం ప్రారంభించారు. ఆమె తొలికథ 'తిరిగిరాని పయనం' తరువాత కాలంలో అనేక సామాజిక అంశాలపై కవిత్వం రాస్తూ, ప్రజల్ని చైతన్య వంతుల్ని చేశారు. ఆమె కలం నుండి 1985-2019 మధ్య ఆవిడ ఎంతో ఇష్టంగా కొన్ని కవితలు రాసుకొని భద్రపరుచుకున్నారు. ఈ కవితలు పుస్తక రూపంలోకి తీసుకురావడానికి, కవర్ పేజీ కూడా స్వయంగా తయారు చేసుకున్నారు. ఆ కవితా సంకలనానికి 'వేకువరాగం' గా పేరుపెట్టుకున్నారు. దీనిలో క్షణాలు జారిపోతున్నాయి. జీవితపు విలువలు ఆవిష్కరించారు. పుట్ల. 2013లో ఆసుపత్రిలో బెడ్ పై ఉన్నప్పుడు మరణశయ్యపై ఉన్నట్లు భావించి రాసిన కవిత.

"నేనిక్కడ మృత్యు తల్పంపై
శివారెడ్డి ఆసుపత్రి గీతమై
చావు బ్రతుకుల తరాజుపై తూనిక రాయినై
మెదడుకు పదును పెడుతుంటాను...."

అంటూ జీవన్మరణ పోరాటంలో ఓడిపోకూడదు. గట్టి సంకల్పంతో మరణాన్ని సైతం జయించాలి. అంటూ మానవ జీవిత విలువలను తెలియజెప్పారు. చావు బ్రతుకులు తరాజుపై తూనిక రాయినై ఆలోచనల ఆకురాయితో పదును పెడతాను అంటూ బ్రతకడం కోసం ఎలాగైనా ప్రయత్నం చేయాలి. మనోనిబ్బరం కలిగి ఉంటే మరణాన్ని సైతం జయించవచ్చు అంటూ తరాజులో తూకం వేసేటప్పుడు పైకి కిందికి ఎలా కద లాతుందో ప్రాణం కూడా అలాగే ఉంది. అని చక్కని పదాల కూర్పు కూర్చారు.

ఈ చూపు చివరిది. ఈ మాట చివరిది. ఈ శ్వాస చివ రిది, ఇక సుప్రభాతాలు లేవు, అస్తమయాలే తప్ప, పైవాడు సిద్ధం చేసిన క్షణం, పూల రథమై దిగి వస్తోంది. అయ్యో నేనిప్పుడే జీవిత పాఠశాల్లో అడుగు పెడు తున్నాను. నా కెవరైనా ఓనమాలు నేర్పించండి. అంటూ మరణపుటంచుల వరకూ వెళ్ళిన వారి మనసులో కలిగే భావాలు మనముందు కవిత్వీకరించారు. '2019 జనవరిలో ప్రరవే పది సంవత్సరాల వేడుకలో ఒక వ్యాసం రాస్తున్న

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


ప్పుడు ఈ కవితను గూర్చి వివరిస్తూ కన్నీటి పర్యంత మయ్యారు వారు'.'పిండాల బావి కవితలో ఆడపిల్ల అంటేనే బ్రతకనివ్వరు. అమ్మా నా కోసం నువ్వు ఎంత తపన పడుతున్నావో కదా. నేను తల్లినై ఒక బిడ్డకు జన్మ నివ్వాలని వుందమ్మా అంటూ మాతృత్వం విలువను గూర్చి చక్కగా వివరించారు. భర్త దూరమైతే భార్యకు సమాజంలో గుర్తింపులేదని, మగావాడి అహంకారానికి ఆడది బలైపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమా జంలో కొడుకు కి ఉన్న విలువ కూతురుకు లేదనీ పురుషాధిక్య ప్రపంచంలో స్త్రీజాతి మ్రగ్గిపోవలసిందే దీనికి ముగింపు లేదా అని ప్రశ్నించారు. ఆడపిల్ల అని తెలిస్తే గర్భంలోనే చిదిమేస్తున్నారు. ఆడపిల్ల పుట్టడానికి కారణం కూడా మగవాడే అన్న విషయాన్ని మరిచి మృగాళ్లలా మారి భ్రూణ హత్యలు చేస్తున్నారు. కడుపులో పెరుగుతున్నది ఆడబిడ్డ అని తెలియగానే, ఎక్కడ గర్భం విచ్చినం చేస్తారో అని ఆ తల్లి పడే వేదనను తెలియజేశారు. ఒరిస్సా నయా ఘాడ్ పట్టణంలో ఒక పాడుబడ్డ బావిలో నలభైకి పైగై ఆడ పిండాలను కనుగొన్నారు అని పేపర్లో వార్తను చూసి డా॥పుట్ల స్పందించి రాసిన కవిత పిండాల బావి.

'గతి తప్పిన ప్రయాణం' కవితలో

ఆ రోజు నుంచీ / హృదయం దేశరాజధానియై రగులు తూనే ఉంది / కామ పిశాచాల చేతిలో చిధ్రమైన అంగాలు / ఘోర దృశ్యమై మనసు తెరపై కదిలినప్పుడల్లా / ఒక దిగులు మేఘం కమ్ముకుంటూనే ఉంది....

దేశ రాజధాని ఢిల్లీ నడివీధుల్లో బస్‌లో ప్రయాణం చేస్తున్న నిర్భయను అత్యాచారం చేసి చంపిన ఘటన యావత్ దేశాన్ని కుదిపేసింది. ఇటువంటి అమానుష చర్యలను వ్యతిరేకించి ఆడబిడ్డకు అండగా నిలబడ్డాలని రచయిత్రి కోరుకుంటుంది. ఇక వాకపల్లిలో గిరిజన స్త్రీలపై పోలీసులు అత్యంత దారుణమైన హేయమైన నీచమైన చర్య ఆదివాసీ మహిళలపై అత్యాచారానికి ఒడి గట్టడం. పోలీసుల ధమనకాండపై రచయిత్రి గళమెత్తారు.

"వాకపల్లి లో ఖాకీలు కాటేసిన ప్రకృతి / ఇంకా చిగురించనే లేదు."

ఇక్కడ కవయిత్రి స్త్రీలను ప్రకృతితో పోల్చారు. పోలీసులు నక్సల్స్ ఏరివేతలో భాగంగా కుంబింగ్ వెళ్లిన ఖాకీలు ఆదివాసి మహిళపై జరిగిన అత్యాచారం చేసిన దుర్మార్గ ఘటనపై ఆవేదనతో రచయిత గతి తప్పిన ప్రయాణంలో వెలిబుచ్చారు. జ్వాల అనే మరో కవితలో నేనిప్పుడు కొత్త మహిళను అంటూ ముందుకు వచ్చారు.

నిన్నటిదాకా / అణిచి వేయబడ్డాను / ఇవాళ నేను / అంతర్జాతీయమయ్యాను / నేనొక కొత్త దీపాన్ని / నేనొక కొత్త రూపాన్ని అంటూ పితృస్వామ్యంలో అణచివేయబడ్డ అబలల జీవితాన్ని వివరించారు. తరాలు మారినా యుగాలు మారినా స్త్రీ జీవితం మారలేదు. నేటి ఆధునిక మహిళ పితృస్వామ్య భావజాలం నుండి బయటకు వచ్చి నూతన జీవితాన్ని ప్రారంభించిందని వివరించారు. అంతార్జాతీయ స్థాయిలో స్త్రీ శక్తికి ఉన్న విలువ ఏమిటో తెలియజేశారు. ఆకాశంలో సగం అవనికే తల్లులమని నేటితరం స్త్రీలు నిరూపించారు. చట్టసభల్లో తమ వాణి గట్టిగా వినిపిస్తూన్నారు. నేటి ఆధునిక మహిళలు. ఆరని జ్వాలను నేను అంటూ సమాజానికి స్త్రీ శక్తి ఎంత అవసరమో తెలియజేశారు. 'వర్ణయుద్ధం' కవితలో చుండూరు ఘటనకు స్పందించి రాశారు. 1991ఆగష్టు 6న గుంటూరు జిల్లా చుండూరు గ్రామంలో అగ్రవర్ణాల వారు. దళితవాడపై దాడిచేసి వేట కొడవళ్ళతో, గొడ్డళ్ళతో, బరిసెలతో దళితులను వెంటాడి, వేటాడి చంపారు. ఆ మారణ కాండలో ఎనిమిది మంది దళితులు ప్రాణాలు కోల్పోగా, ఐదు మంది తీవ్రంగా గాయపడ్డారు. మృత దేహాలను ముక్కలు ముక్కలుగా నరికి గోనెసంచుల్లో మూటగట్టి, రాళ్ళుకట్టి తుంగభద్రలో పడేశారు. ఇద్దరు అన్నదమ్ములను మల్లెతోటలోనే చంపి భూమిలో తొక్కే శారు. ఒకరిని సజీవంగానే సంచిలో కుక్కి కాలువలో పడేశారు. ఎంతోమంది అమాయకులు కులాల కొట్లాటలో బలహీన ప్రజలు ప్రాణాలను కోల్పోయారు.

ఒక నిశ్శబ్ద ఘోషలోంచి / ఒక పొలిమేర దాటుతుంది / ఒక నల్లపూసలు చెల్లా చెదురవుతాయి / మరో ఇల్లాలి నుదుటి మీద / సూర్యుడు తిలకమై అస్తమిస్తుంటాడు.

కులాల గొడవల్లో అమాయక దళిత స్త్రీల మాంగ ల్యాలు తెగిపోతున్నాయని, ఈ కులాల కుమ్ములాటలు మారణహోమాలు లేకుండా అన్నదమ్ముల్లా కలిసి మెలసి ఉండాలని హేమలత వర్ణయుద్ధం కవితలో వివరించారు. 'అమ్మకోసం' ఓరోజు కవితలో కన్నతల్లికి బిడ్డలపై తల్లి ప్రేమ ఎలా ఉంటుందో పరిచయం చేశారు. ఉన్నత చదువులు చదువుకొని, విదేశాల్లో స్థిరపడిన వాళ్ళు వారి తల్లితో ఇంటర్నెట్ ద్వారా పలకరించడం, అంతలోనే కనబడి కొంతలోనే మాయమైపోతున్న మానవ సంబంధాలు, కనుమరుగైపోతున్న విలువలు గురించి ఈ కవితలో వివరించారు.

"ఏడాదిగా కనిపించని కొడుకుని / ప్రేమగా తల నిమురుదామనుకుంటే / అంతర్జాల రాతిగోడలా /కొన్ని క్షణాల అనంతరం/ఇంటర్నెట్ కొడుకు అంతర్ధానమవుతాడు"

అంతార్జాల మాయా ప్రపంచంలో కనుమరుగవుతున్న మానవ సంబంధాల గురించి హేమలత హృద్యంగా తెలియజేశారు.

ఈ కవితా సంకలనాన్ని "నక్షత్రమాల" అంటారు. ఎందుకంటే ఈ కవితా సంపుటిలో ఇరవై ఏడు కవితలున్నాయి. ఈ ప్రక్రియను నక్షత్రమాల అంటారని అందువలనే 'వేకువరాగం' అనే ఈ సంకలనానికి ఈ నక్షత్రమాల పేరు పెట్టామని ఈ కవితా సంపుటి నిలువుగా ఉండే ఉర్దూ, హిందీ 'షాయిరీల పుస్తకం'ల వలె ఉంటుందని, ఇటువంటి పుస్తకాలు రచయిత్రికి ఎంతో ఇష్టమని తన వేకువరాగం కవితాసంపుటి ఇలాగే అచ్చు వేయించుకుంటానని తనకిష్టమైన రీతిలో ముద్రించమని తన మనోభావాన్ని తన ముందుంచిందని ఆమె జీవిత భాగస్వామి ఆచార్య ఎండ్లూరి సుధాకర్ తెలిపారు.

హేమలత స్త్రీవాది, దళితస్త్రీల పక్షాన పోరాడారు. అనేక సభల్లో ఉపన్యాసాలు చేశారు. వేకువరాగం కవితా సంపుటిలో దళితుల గురించి మరియు వారి జీవితాలు గురించి స్త్రీల గురించి పితృస్వామ్య వ్యవస్థలో స్త్రీ ఎలా బతుకెళ్లదీస్తుందో తెలియజేశారు. అమాయక ఆదివాసీ స్త్రీలపై జరుగుతున్న అకృత్యాలు అమానుష చర్యల పట్ల ఆవేదన చెందారు. తన కవిత్వం ద్వారా కొంతైనా మార్పు కలుగుతుందని ఆశించారు. కుల మత ప్రాంతీయ భేదాలు లేని నూతన సమాజం కోసం కలలుగన్నారు.

హేమలత కోట్లు సంపాదించలేదు కానీ లక్షలాది మంది స్నేహితులను సంపాదించుంది. ఆమె ఎక్కడ ఉంటే అక్కడ సంతోషమే. గలగలా నవ్వుతూ నలుగురినీ నవ్వించేది. అటువంటి మహోన్నత మాతృమూర్తి భౌతికంగా మనందరినీ విడిచి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయినా, ఏ లోకంలో ఉన్నా 'వేకువరాగం'లా మనందరనీ 'విహంగం'లా విహరిస్తూ పలకరిస్తూనే ఉంటుంది.....

## ఉపయుక్త గ్రంథాలు :

1. వెల్చేరు నారాయణరావు - తెలుగులో కవితా విప్లవాల స్వరూపం
2. సి. నారాయణరెడ్డి - ఆధునికాంధ్ర కవిత్వము - సంప్రదాయాలు, ప్రయోగాలు
3. పుట్ల హేమలత - వేకువరాగం (కవితా సంపుటి )

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దేవులపల్లి విశ్వనాథం ఖండకావ్యాలు - సామాజిక స్పృహ

- సూరె శ్రీనివాసులు, పరిశోధక విద్యార్థి, తెలుగు & ప్రాచ్య భాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

ఆధునిక సాహిత్యంలో నూతన పంథాలో సాగిన పద్యం ఖండకావ్యరూపంలో వికసించింది. దీనికి ప్రప్రథమంగా రూప కల్పనచేసిన కవి గుఱ్ఱం జాషువా. ప్రకృతిలోని ప్రతి వస్తువును, జీవిని వస్తువుగా తీసికొని జాషువా ఖండ కావ్యాలు రాశాడు.ఖండకావ్యంలో ఒక పద్యం నుంచి 10 పద్యాల వరకూ ఉంటాయి. ఇవి ఏకవృత్తపద్యాలు. 'వాక్యమ్ రసాత్మకమ్' అన్న నానుడికి ప్రతిబింబాలు ఖండ కావ్యాలు. జాషువా మార్గంలోనే ఎందరో కవులు ఖండకావ్యాలు రాశారు. అలాంటి వారిలో ప్రముఖులు దేవులపల్లి విశ్వనాథంగారు.

దేవుల పల్లి విశ్వనాథంగారు తాను రాసిన ఖండ కావ్యాలను హరివిల్లు అనే మూడు సంపుటాలుగా వెలువ రించారు.'తరంగిణి'లో ఎన్నికల భారతం, సందేశం, వీర భారతం, పతాక గీతం, కాలుష్యం, బాల కార్మికుడు, ప్రజాస్వామ్యము, ప్రపంచము, జీవన వేదం, డ్రైవర్ కండక్టరు, రజకుడు, పోస్ట్‌మాన్, అప్ప, దూరదర్శన్, కవి, సైనికుడు, యువతరం, పుడమి తల్లి, అడవితల్లి, విద్య, బ్రౌన్‌దొర, ఆంధ్రకేసరి, శ్రీరాముడు, సీత, నందమూరి తారక రామారావు, జన్మభూమి, ప్రకృతి ప్రళయం, గాడేపల్లి వీర రాఘవశాస్త్రి, మాతృమూర్తి థెరిస్సా, సంస్కృతి అనే అంశాలున్నాయి. 'విశ్వసందేశము'లో ప్రబోధము, దీపావళి, వృక్ష విలాసము, పల్లెపడుచు, పవనసందేశము, మానవ జన్మ వృద్ధ సేవ, హితబోధ, మహిళ, భారతదేశం, దీనవాణి, తెలుగు వెలుగు, సంపూర్ణ సంక్రాంతి, వసంత విపంచి, పుష్పప్రబోధము, దేశభక్తి, హితోపదేశము, వరద పరవళ్ళు, మాతృభూమి, స్వర్ణ భారతి, శంఖారావం, ధరల పరుగు, మానవత, అమానుషం, పారతంత్రమా, ప్రజా తంత్రమా? రామప్పగుడి, వేయి స్తంభాల మండపము, కీర్తి పతాక అనే అంశాలున్నాయి. 'హరివిల్లు'లో ప్రేమ, అమ్మ, విధివంచిత, వికృతి, ఆకాంక్ష, సరస వినోదిని, అస్పృశ్యత, శిశు విక్రయము, రక్త తర్పణము, కపట సన్యాసి, మతము, అక్షర సంక్రాంతి, భారతనీతి, కళా సౌరభము, తీవ్రవాదము, శాంతి, పరిణయము, ప్రకృతి, గౌతమబుద్ధుడు, శ్రీ ఆదిశంకరాచార్యులు, వివేకా నందుడు, అన్నమయ్య, త్యాగయ్య, తిక్కన, పోతన, శ్రీనాధుడు, వేమన, గాంధి, అల్లూరి సీతారామరాజు, అమరజీవి, వ్యవసాయం వంటి అంశాలున్నాయి.

**ఉగ్రవాదం :**

నేడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న సమస్య తీవ్రవాదం. ఇది అమాయక ప్రజలను బలితీసుకుంటున్నది. ఉగ్ర వాదులు మారణ హోమం సృష్టిస్తున్నారు. వారి లక్ష్యం, ఆశయం ఏమిటో వారికే తెలియదు. ప్రపంచాన్ని మొత్తాన్ని 'ఇస్లామిక్' మతంలోకి మార్చాలనుకుంటున్నట్లు అపుడపుడు ప్రకటిస్తుంటారు. అయితే మతోన్మాదం ద్వారా, హింస ద్వారా ఎలా ఇస్లామిక్ గా మారుస్తారో వారికే తెలియాలి. ఈ విషయాన్ని గురించి కవి దేవుల పల్లి విశ్వనాథం ఇలా అంటారు.

సీ॥ ఆఫ్ఘనిస్తానున నల్ల కల్లోలముల్
గుమికూడి శాంతియు కొల్లవోయె
ఛాందల భావముల్ సామరస్యంబును
చెఱచును, కలిమియు చెదరిపోవు
ఆయుధోత్పత్తియు నధికమైన యెడల
దండ యాత్రలు హెచ్చి దద్దరిల్లు
నధికార దాహంబు, నఱ్ఱులు చాపగ
యుద్ధంబు సిద్ధమౌ నుర్వియందు

తే॥ తీవ్రవాదంబు నష్టంబు తెచ్చిపెట్టు
ప్రేమ లోపించు, కరుణయు వీగిపోవు
మానవత్వంబు నశియించు, మమత తొలగు
విశ్వ శాంతికి, ప్రేమయే వెలుగు గూర్చు

- అంటాడు కవి. ఉగ్రవాదులు 2001 సెప్టెంబరు 11వ తేదీన అమెరికా వాణిజ్య కేంద్రమైన వరల్డ్ ట్రేడ్

సెంటర్‌పై దాడిచేసి అపార ఆస్తి నష్టం, ప్రాణ నష్టం కలుగ జేశారు. 2008లో హైదరాబాద్‌లో బాంబులు పేల్చి పదుల సంఖ్యలో అమాయకుల ప్రాణాలను బలి తీసుకున్నారు 2007 లో బొంబాయిలోని హోటల్ తాజ్‌పై దాడిచేసి దాదాపు 150 మందిని పొట్టన పెట్టుకున్నారు. ఇలా ప్రపంచ వ్యాప్తంగా హింసాత్మక సంఘటనలకు పాల్పడి మారణ హోమం సృష్టించారు. ఇంకా సృష్టిస్తూనే ఉన్నారు. కవి ఈ అంశాలన్నిటిని పరిగణనలోకి తీసికొని ఉగ్రవాదాన్ని గర్హించాడు.

### అత్యాచారాలు :

నేడు స్త్రీలు అత్యాచారాలకు గురవుతూనే ఉన్నారు. మూడు నెలల పసి కందు మొదలు పండు ముదుసలుల వరకు బలవంతపు, దౌర్జన్యపు అత్యాచారాలకు గురవుతూనే ఉన్నారు. అత్యాచార సంఘటన జరగని ప్రాంతం గాని రోజుగాని లేదంటే ఆశ్చర్యపడాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం నిర్భయ లాంటి చట్టాలను తెస్తున్నా జరగరాని సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి. అందుకు కవి దేవుల పల్లి విశ్వనాథం ఆవేదన చెందుతూ ఇలా అంటున్నాడు.

సీ॥ చిన్నారి పాపల శీలంబు దోచెడి
కామాంధులెందరో కలరు నేడు
వీధిలో వలువలు విడిపించి యింతుల
చెఱచెడి చెనటలు చేరిరిచట
పరకాంతల వలచి బాధించు చుండెడి
కలియుగ కీచకుల్ గలరు పుడమి
విద్యార్థినుల జూచి, వెకిలి చేష్టలు జేయ
పాపాత్ములున్నారు వసుధయందు

తే॥ మగువపట్ల గౌరవముంచి మసలు కొనుడు
ఆమె కన్నీరు కార్చగా హాని కలుగు
ధర్మబద్ధమై మనుగడ తనరవలయు
సకల పురుషార్థ సాధన జరుగవలయు

- అంటాడు కవి. ఇంటిలో దూరి దౌర్జన్యంగా స్త్రీలను ఎత్తుకుపోయి అత్యాచారం చేస్తున్నారు. అంతేగాకుండా మహిళలు పనిచేసే చోట, బస్సుల్లో, రైళ్ళలో, వీధుల్లో లైంగిక వేధింపులకు గురవుతున్నారు. కొందరైతే సామూహిక అత్యాచారం చేసి ఆపై క్రూరంగా చంపుతున్నారు. పవిత్రదేశంలో జరుగుతున్న ఇలాంటి క్రూర నేరాలకు పాల్పడుతున్న వారికి ఎక్కడికక్కడ అత్యంత కఠిన శిక్షలు విధిస్తే తప్ప అదుపులోకి రావని చెప్పవచ్చు.

### బాలకార్మికులు :

భారతదేశాన్ని పట్టి పీడిస్తున్న మరో సమస్య బాలకార్మిక వ్యవస్థ. పాలు తాగాల్సిన ప్రాయంలో ఎందరో పిల్లలు పాలకవర్గ సేకరణలో ఉంటున్నారు. మెకానిక్ షాపుల్లో, హోటళ్ళలో, అంగళ్ళలో వెట్టి చాకిరీ చేస్తూ మగ్గిపోతున్నారు. ఇంకొందరు భిక్షాటన చేస్తున్నారు. మరి కొందరు భవన కార్మికులుగా ఉంటున్నారు. వీరి సంఖ్య దేశ వ్యాప్తంగా దాదాపు పదిలక్షలకు పైగా ఉందని సర్వేలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని గూర్చి కవి దేవులపల్లి విశ్వనాథం ఇలా అంటాడు.

సీ॥ పండంటి చిన్నారి బ్రతుకును బుగ్గి పా
లొనరించు బాలుర కనుట యెట్లు?
దీనాతి దీనమై దిక్కు తెలియకున్న
పసివారి బాధల బాపుటెట్లు?
కొండలు కరిగింప గుండెలవిసిపోవ
బొక్కెడన్నము లేక పొగులుచుంద్రు
సెగలు పొగలు చిమ్మ రగిలెడి కొలిమిలో
కఱ్ఱులు కాల్చుచు కనలు చుంద్రు

తే॥ బాల కార్మికులను గన జాలికలుగు
విద్య నేర్పెడి వేళలో వెతలెమిగిలె
చదువు నేర్వక బ్రతుకులు చక్కబడునె?
కరుణతో బ్రోచుడీ బాల కార్మికులను

- అంటూ సభ్య సమాజాన్ని వేడుకుంటాడు. ఇలా పేదరికం, తల్లిదండ్రుల నిరాదరణ, తల్లిదండ్రులు లేకపోవడం అనే ఈ మూడు అంశాలే బాల కార్మికులు తయారు కావడానికి ప్రధాన హేతువులుగా పేర్కొనవచ్చు. ఏది ఏమైనా మానవత్వాన్ని మంటగలిపే ఈ సమస్య

పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపైన్నే ఉంది. దేవుల పల్లి విశ్వనాథంగారు ఎన్నో అంశాలను చక్కని సామాజిక స్పృహతో చిత్రించారు. సరళశైలితో కూడిన వీరి పద్యాలు అందరినీ ఆకట్టుకుంటాయని చెప్పవచ్చు. ఇలా చిత్రించి ఒక కవిగా తన సామాజిక బాధ్యతను చక్కగా నెరవేర్చా డని చెప్పవచ్చు.

**ఉపకరించిన గ్రంథాలు :**

1. తరంగిణి - దేవులపల్లి విశ్వనాథం
2. హరివిల్లు - దేవుల పల్లి విశ్వనాథం
3. విశ్వసందేశము - దేవుల పల్లి విశ్వనాథం
4. ఖండ కావ్యాలు - గుఱ్ఱం జాషువా
5. ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, ప్రయోగాలు - డా॥ సి. నారాయణ రెడ్డి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# కందుకూరి వీరేశలింగం సాహిత్యం - సాంఘిక దృక్పథం

- వి. వెంకటేశన్, పరిశోధక విద్యార్థి, తెలుగు అధ్యయనశాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

తెలుగు సాహిత్యంలో ఆధునిక ప్రక్రియలకు మూల పురుషుడు కందుకూరివీరేశలింగం పంతులు. వీరేశలింగం పంతులు 1848వ సంవత్సరం ఏప్రిల్ 16 వ తేదీన రాజ మహేంద్ర వరం (రాజమండ్రి) లో సుబ్బరాయుడు, పున్నమ్మ దంపతులకు జన్మించాడు. సంఘసంస్కరణ సాధనంగా సాహిత్యమును పోషించిన నవయుగ వైతాళికుడు రావుబహద్దూర్ వీరేశలింగం పంతులు.

బాల్యవివాహ నిర్మూలనం, స్త్రీ పునర్వివాహం, స్త్రీ విద్యావ్యాప్తి మొదలైన వాటికోసం తనజీవిత సర్వ స్వమును అర్పించి, ఆంధ్ర రాజారామోహన్‌రాయ్‌గా ప్రసిద్ధి చెందాడు. అనేక సాహిత్య ప్రక్రియలను గైకొనిన మహాపండితుడు కందుకూరి. పద్యం, గద్యం నవల నాటకం, ప్రహసనం, విమర్శనం, అనువాదం, పత్రికా రచన, జీవిత చరిత్ర, స్వీయ చరిత్ర వంటి అనేక సాహిత్య ప్రక్రియలను గావించిన ఆధునికాంధ్ర సాహితీ యుగకర్త కందుకూరి వీరేశలింగం పంతులు. సమాజంలో కూరుకు పోయిన కుల వ్యవస్థను నిర్మూలించి సర్వమాన సమా నత్వమును చాటిన మహనీయుడు కందుకూరి. సంఘం లోని లోపాలను వెలుగెత్తి చూపిన గొప్ప సంఘసంస్కర్త కందుకూరి.

> "తన దేహము తన గేహము,తన కాలము తన ధర్మము
> తన విద్య జగజ్జనులకు వినియోగించిన ఘనుడీ వీరేశలింగం కవి జనులారా!"
>
> - చిలకమర్తి లక్ష్మీ నరసింహం.

ఆంధ్ర దేశమునకు సాంఘీకముగా, సాహిత్యముగా వినూతన జాగృతిని కలిగించిన ప్రథముడు కందుకూరి తెలుగు దేశంలో అతని మూలంగానే సంఘసంస్కర ణోద్యమం ప్రారంభమైనదనడంలో అతిశయోక్తి లేదు. ఆధునికాంధ్ర సాహిత్యమునకు కొత్తపుంతలు పుట్టించిన మూల పురుషుడు కందుకూరి వీరేశలింగం పంతులు.

## సాహిత్య ధృక్పథం:

కందుకూరి వీరేశలింగం పంతులు సాహిత్యరంగమున పెక్కు సంస్కారములు ఒనర్చి నూతన రీతులకు మార్గ దర్శకులైనారు. వీరికి బాల్యం నుండే తెలుగు నందు చక్కని పాండిత్యము అలవడినది. తెలుగు భాషనే గాక సంస్కృత భాషలో కూడా వీరికి మంచి పరిచయమున్నది. వీరు ఆంగ్ల భాషలో ఉత్తీర్ణులు అగుటచే ఆంగ్ల భాషలోని ప్రక్రియలన్నియు పరిశీలించి వాటిని ఆంధ్ర సాహిత్య మున ప్రవేశపెట్టుటకు వీలైనది. పంతులుగారికి తొలుత ప్రబంధ పద్ధతులపై ఎక్కువ ఆసక్తి చూపేవారు. బాల్య దశలో ఆనాటి కవుల వలనే మార్కండేయ శతకము, గోపాల శతకమును వ్రాసారు. కాల క్రమేణా పూర్వ కవుల ప్రభావంతో శృంగార రసంతో కూడిన శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషదము,రసిక జనరంజనము అను రెండు మిశ్రమ ప్రబంధమును రచించారు. అభాగ్యోపాఖ్యానము అను హాస్య ప్రబంధమునందు పంతులుగారి హేళన పూర్వకమైన సంఘసంస్కార దృష్టి గోచరిస్తున్నది. "అభాగ్యో పాఖ్యానము" తెలుగులో వెలువడిన మొదటి వికట కావ్యము.

క్రీ.శ. 1887లో అతడు రచించిన సరస్వతీనారద సంవా దము నందు కందుకూరి వారి కావ్యరీతులు వ్యక్తమగు చున్నది. కందుకూరి వారు ప్రౌఢకావ్యమును వ్రాయుటలో దక్షులు అయినను ప్రజాసామాన్యము నందు ప్రచారము సాహించుటకు ప్రౌఢమైన కవిత్వముకంటే సరళమైన గద్యమే శక్తివంతమైనదని భావించి గద్యమునే చేపట్టారు. తొలుత వారు చిన్నయసూరి నీతిచంద్రికనే మార్గదర్శకంగా ఎంచుకొని ప్రౌఢమైన శైలిలో 'సంధి-విగ్రహము'లను పరిశీలించి రచించిననూ క్రమక్రమముగా కాల పరిస్థితు లను అనుసరించి సరళ స్వతంత్రమైన శైలిని ఆదరించి విషయ ప్రచారములను విజ్ఞాన ప్రచారములు కలిగిన అనేక గ్రంథములను రచించారు. ఇటువంటి పెక్కు

రచనలను రాయడం వలన కందుకూరి గారికి 'గద్య తిక్కన' బిరుదు సార్ధకమైనది.

అర్ధరహితమైన వ్యర్ధబంధనములో కూరుకు పోయిన తెలుగు గ్రాంథిక భాషను సరళీకరించిన ఘనత కందుకూరిగారిదే. పూర్తిగా వ్యవహారిక భాషను ఆనాడు ఆమోదించక పోయిననూ అందరికీ అర్ధమగు వచనమును వ్రాయవలసిన అవసరమును గురించి నిగూఢంగా ఆలోచించి తమ రచనలద్వారా ఆచరణలో పెట్టి చూపించిన ఘనుడు కందుకూరి. తమ జీవితంలో వర్తమాన ఆంధ్రభాషా ప్రవర్తక సంఘమును స్థాపించి దానికి తానే అధ్యక్షులై వ్యవహారిక భాషావాదనను సంపూర్ణంగా బలపరిచిన వారు కందుకూరి వీరేశలింగం పంతులు.

తిరుపతి వేంకట కవులు పద్యం రాయటంలో సిద్ధహస్తులైతే కందుకూరి వారు గద్య కావ్యమును అలంకరించుటలో సిద్ధహస్తులు. గద్యరచనలు వీరు పూనుకున్న వాజ్మయ మార్గములో నవల, స్వీయచరిత్ర, విమర్శ, శాస్త్రము మొదలైనవి చాలా ప్రాచుర్యము పొందాయి. ఆంగ్లమున గోల్డ్‌స్మిత్ రచించిన ''వికార్ ఆఫ్ వేక్ ఫీల్డ్'' అను నవలను అనుసరించి పంతులుగారు రాజశేఖర చరిత్ర అను పేరిట ఒక సాంఘీక నవలను క్రీ.శ.1878లో రచించారు. రాజశేఖర చరిత్ర తెలుగులో వెలువడిన తొలి సాంఘీక నవల అని కొందరి అభిప్రాయము. తెలుగులో మొదటి వచనప్రబంధము, మొదటి నాటకము, ప్రకృతి శాస్త్రము, ప్రహసనము, మొదటి చరిత్రము, స్త్రీల కొరకు వచన పుస్తకము నేనే రచించితినని స్వయంగా కొనియాడిన వ్యక్తి కందుకూరి వీరేశలింగం పంతులు.

పంతులుగారు ''గలివర్స్‌ట్రావెల్సు'' అను ఆంగ్ల గ్రంథమును ఆధారం చేసుకొని సత్యరాజపూర్వదేశ యాత్ర అను వ్యంగ్య హాస్యముతో కూడిన సాంఘీక విమర్శ గ్రంథమును రచించారు. పంతులుగారు చేపట్టని ప్రక్రియగాని, సుసంపన్నము చేయని సాహిత్య శాఖగాని లేదు. విక్టోరియా మహారాణి చరిత్రము, జీసస్ చరిత్రము అనునవి వీరు రచించిన జీవిత చరిత్రములు. పంతులు గారు ఈ స్వీయ చరిత్రలను 1910లో వెలు వరించినారు. ఇవి అతని అపూర్వ మేధాశక్తికి నిదర్శ నములు.

## సాంఘీక దృక్పథం :

కందుకూరి వీరేశలింగం పంతులుగారు సాహిత్య రంగమునే గాక సాంఘీక రంగంలో కూడా మార్గదర్శకులు. క్రీ.శ.1874లో వారు స్థాపించిన వివేక వర్ధిని అనే మాస పత్రిక ద్వారా సంఘంలోని లోపాలను తీవ్రంగా విమర్శించి ప్రజా చైతన్యమునకు పూనుకున్నారు. వివేకవర్ధిని పత్రికయే గాక చింతామణి, సతీహిత భోదిని, సత్య సంవర్ధని,సత్యవాది మొదలగు పత్రికలను కూడా ప్రజా చైతన్యం కొరకు పంతులుగారు నిర్వహించారు. పంతులు గారు నెలకొల్పిన పత్రికలు సంఘసంస్కరణాభిలాషకు ఎంతో తోడ్పడింది.

పంతులు గారు వితంతు వివాహము, బాల్య వివాహమును గురించి నిగూడంగా ఉపన్యాసించారు. సంఘంలోని దురాచారాలను ఖండించడంలోనూ, దోషమని తోచిన వాటిని నిర్భయంగా వ్యక్తం చేయటంలోనూ పంతులు గారు చూపిన ధైర్యసాహసాలు చెప్పుకోదగ్గవి. సంఘంలో పలుకబడి కల్గిన దుశ్చర్యలను బట్టబయలు చేయుచూ ఎన్నో ప్రహసనాలు వ్రాసారు. క్రీ.శ.1880లో పంతులు గారు పలువురి పెద్దల సమక్షమున తన స్వగృహంలో రెండు వితంతు వివాహములను జరిపి వారిచే మన్ననలను పొందిన మహనీయుడు కందుకూరి. సంఘమునందు గల స్త్రీల ఎదుగుదల కొరకు స్త్రీ విద్యా వ్యాప్తిని మెరుగుపరుచుటకు విశేష కృషిని గావించారు. స్త్రీ విద్యా విధానంను వ్యాప్తిలో తెచ్చుటకు దవళేశ్వరం వద్ద ఒక బాలిక పాఠశాలను స్థాపించారు. క్రీ.శ.1906 తన కుల చిహ్నమైన జంధ్యమును విసర్జించి సర్వమాన సమానత్వమును చాటిన మహనీయుడు. హితకారిణి సమాజంను స్థాపించి ప్రజా ప్రయోగము కొరకు తన ఆస్థిని దానమిచ్చిన ఘనత కందుకూరి గారిది. కందుకూరి సంఘసంస్కరణ సేవా ధృకృథమును మెచ్చి ప్రభుత్వం అతనికి క్రీ.శ. 1893లో రావుబహద్దూర్ బిరుదును సత్కరించింది.

## సాంఘీక విప్లవాత్మక మార్పులు :

బాల్యవివాహాలకు వ్యతిరేకంగా కుల నిర్మూలన కొరకు అకుంఠిత దీక్షతో విప్లవం సాగించిన ఘనుడు కందుకూరి. కుల వ్యవస్థలో పాతుకుపోయిన ఆ రోజులలో దానిని వ్యతిరేకించి వివేక వర్ధిని పత్రికలలో వ్యాసం రాసారు. తాను సాధించిన విప్లవవాత్మక మార్పులలో వితంతు, పునర్వివాహం ఓ ఎత్తు. అప్పటి సమాజంలో బాల్యంలోనే ఆడపిల్లలకు వివాహాలు చేసేవారు. కాపురాలకు పోక ముందే భర్త చనిపోయి అనేక కష్టనష్టాలు అనుభవించే వారు. వాటిని పూర్తిగా రూపుదిద్ది పునర్వివాహం జరపాలని ప్రచారం చేసిన ఘనత కూడా కందుకూరి గారిదే.

1881 సం॥ డిసెంబరు 11 వ తేదీన గౌరమ్మ (తూవూరు) గోగులపాటి శ్రీరాములు ఇరువురికి పునర్వివాహం చేశారు. ఈ పునర్వివాహం నందు తన సతీమని రాజలక్ష్మీ ఎంతో తోడ్పడింది. కందుకూరి గారికి తన చిన్ననాటినుండి అలవడిన స్వభావిక లక్షణమే తన కార్యదీక్షకు సాహసము. దేవేంద్రనాథ్ ఠాగూర్, కేశవ చంద్రసేన్, ఈశ్వర చంద్ర విద్యాసాగర్ మొదలైన వారి రచనలు ఇతని అధ్యాత్మిక చింతనలో విప్లవాత్మకమైన మార్పును తెచ్చింది.

1887వ సం॥లో సంఘసంస్కరణ సమాజంను స్థాపించి సమాజంలోని దురాచారాలపై విప్లవాత్మక మార్పును తెచ్చారు. మూఢనమ్మకాలపై తాను కొనసాగించిన పోరాటము చిరస్మరణీయమైనది. ఒక వ్యక్తిగా, సంఘసంస్కర్తగా, రచయితగా వీరేశలింగం మార్గ దర్శకులైనారు. తెలుగు జాతికి అధ్యుడు, ఆధునకాంధ్ర సమాజ పితామహుడు కందుకూరి వీరేశలింగం పంతులు.

## ముగింపు :

విరేశలింగం పంతులు గారు సాహిత్య సాంఘీక రంగంలో ప్రజాభిమానంను సంచరింప చేయుటలో తమ పాత్ర అద్వతీయమైనది.

తాను నమ్మిన ఆశయమును నిరూపించుటలో కందుకూరి ప్రతిభాశాలి. పంతులు గారు సాహిత్య, సాంఘీక, సామాజిక చైతన్యమును ప్రతిబింబించుటకు అధ్యులు. కందుకూరి విరేశలింగం పంతులు గారు వైతాళికులకే వైతాళికుడు అనడంలో అతిశయోక్తి లేదు.

## ఆధార గ్రంథాలు:

1. తమిళనాడు పాఠ్య పుస్తకం (9వ తరగతి) పుట - 80.
2. తెలుగు సాహిత్య దీపిక: డా॥ మద్దిలేటి పుట - 91.
3. తెలుగు సాహిత్య సమీక్ష (2వ సంపుటము) - జి.నాగయ్య : పుట - 600 - 605.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పత్రికా (గోల్కొండ) ప్రావీణ్యుడు - ప్రతాపరెడ్డి

**- జె. విజేందర్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

19వ శతాబ్దంలో అప్పటి గద్వాల సంస్థానం, ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లాలోని ఇటికాలపాడు గ్రామంలో, రంగమ్మ-నారాయణరెడ్డి దంపతులకు జన్మించిన సురవరం. పినతండ్రి రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఉన్నత విద్యను అభ్యసించి, తెలుగు, సంస్కృతం, ఉర్దూ, ఇంగ్లీషు భాషలను నేర్చుచుకున్నారు. మద్రాసులో విద్యాభ్యాసం చేస్తున్న రోజులలో జాతీయ కాంగ్రెస్ ఉద్యమం, మహాత్మా గాంధీ బోధనలు ఆయనను విశేషంగా ఆకర్షించాయి. ఖద్దరుధారణ, నిత్యపఠనం, నిరాడంబర జీవనం, స్వాతంత్ర్య స్వేచ్ఛ, సత్యనిష్ఠ బాగా అలవడినాయి. బహుగ్రంథ పఠనం వల్ల విషయ అవగాహన పెరిగింది. విమర్శనాత్మక దృష్టి కలిగి, రచనా వ్యాసంగానికి శ్రీకారం చుట్టారు. వివిధ వార, మాస పత్రికల్లో వైవిధ్యభరితమైన వివిధ చారిత్రాత్మక, విమర్శనాత్మక, సంస్కరణవాద వ్యాసాలు ప్రకటించారు. ఆ రోజులలో వారు వ్రాసిన హరిజనోద్ధరణ, మద్యపాననిషేదం లాంటి కొన్ని వ్యాసాల సంకలనమే సంఘోద్ధరణము. కొత్వాల్ వెంకటరామిరెడ్డి చేయూతతో నిర్మించబడిన రెడ్డి జనవసతి గృహానికి కార్యదర్శిగా సురవరంగారు బాధ్యతలు స్వీకరించి, విద్యార్థులకొక ప్రవర్తనా నియమావళిని ప్రవేశపెట్టారు. దీని మూలాన హాస్టల్‌లో క్రమశిక్షణపెరిగి, విద్యార్థులు ఆకర్షితులై చాలామంది చేరడం ప్రారంభించారు. ఫలితంగా సంస్థ స్వయంపోషకం కూడా అయింది. కుల, మత, వర్గ, భేదాలులేని ప్రతాపరెడ్డిగారు కేవలం రెడ్డి జనసంఘానికే కాకుండా, యాదవ సంఘానికి సైతం కార్యదర్శిగా పనిచేసి వారి అభ్యున్నతికి కృషిచేసారు.

## గోల్కొండ పత్రిక ఆవిర్భావం - సాహిత్య సేవ :

తెలంగాణ ప్రజల ఆకాంక్షలను, ఆశయాలను ప్రతిధ్వనిస్తూ 1930లో జోగిపేటలో జరిగిన ప్రథమాంధ్ర మహాసభకు సురవరంవారే అధ్యక్షత వహించారు. నిజాం రాష్ట్రంలో తెలుగు పత్రిక ప్రచురించడమే గొప్ప "ఆంధ్ర పత్రిక" లేదా మరో తెలుగు పత్రికలాగా జాతీయభావాలు హైద్రాబాద్ నుంచి ప్రచారం అంత సులభమైన విషయం కాదు. సంక్లిష్టమైన స్థానిక రాజకీయ, సాంఘిక ఆర్థిక పరిస్థితులలో "అక్షయ నామ సంవత్సరం చైత్ర బహుళ తదియనాడు అనగా 1925 మే 10వ తేదీన తనకు తోచిన రీతిన "గోల్కొండ పత్రిక" ప్రారంభ సంచికను అకుంఠిత దీక్షా - దక్షతలతో, ధైర్య సాహసాలతో నిజాం రాజ్యంలోని బ్రిటీష్ రెసిడెన్సీ సమీపంలోని ట్రూప్ బజార్ నుంచి ప్రచురించారు. తొలి రోజులలో పత్రికకు ప్రతాపరెడ్డిగారు సంపాదకుడు మాత్రమే కాదు, ఉపసంపాదకుడు, ప్రూఫ్ రీడర్, మేనేజర్, గుమస్తా, చివరికి చెప్రాసి - అన్నీ ఆయనే అయి రాత్రింబవళ్ళు శ్రమించారు. సువరంవారు మొదటగా గోల్కొండ పత్రికను, వారంలో ద్విదిన పత్రికగా (సోమ, గురు) ప్రవేశపెట్టారు. 1947 సంవత్సర ప్రారంభం నుంచి "గోల్కొండ పత్రిక" దినపత్రికగా మార్చి, ఏడాది తిరిగే నాటికి పత్రిక వాటాదారులు సంపాదకుడిగా ఉన్న సురవరం ప్రతాపరెడ్డిని తొలగించి నూకల నరోత్తమ రెడ్డిని ఆయన స్థానంలో సంపాదకుడిగా నియామకం చేసారు. తానే 'గోల్కొండ పత్రిక', 'గోల్కొండ పత్రికనే' తాను అని తలచి, జీవితాంతం ఆ పత్రికా నిర్వహణకు అంకితం చేసిన సురవరం ప్రతాపరెడ్డిగారు చేసేదిలేక 1951 లో "ప్రజావాణి" అనే మరో ద్విదినపత్రికను ప్రారంభించారు. కానీ నిర్వహణకు నిధులు కరువై రెండేండ్లకే దానికి నూరేండ్లు నిండాయి.

సురవరం వారు సంపాదకునిగా తప్పుకున్నా దశాబ్దాలు గోల్కొండ పత్రిక దిన పత్రికగా వెలువడినా, అది కొనసాగినంతకాలం ఆయన పెట్టిన ఒరవడిలోనే సాగింది. "గోల్కొండ పత్రిక" పేరు చెప్పగానే ఆనాడైనా, ఏనాడైనా అందరికి దాని సంపాదకునిగా సురవరం ప్రతాపరెడ్డిగారి పేరే మదిలో మెదులుతుంది. ఆ పత్రికపై

అంతబలమైన ముద్రవేసిన సురవరం వారు పత్రికను పాఠకుల పరం చేయడానికి పాఠకులను ఆలోచనా పరులుగా మార్చుటకు ఆలోచనాశీలులందరినీ అభ్యుదయ మార్గంలో నడిపించడానికీ పత్రికను అపూర్వరీతిలో తీర్చిదిద్దారు. సురవరం ప్రతాపరెడ్డి గారు తెలంగాణ కవుల కవిత్వపు కమ్మదనాన్ని తెలుగు తెలిసిన వారందరికీ రుచి చూపించాలని "గోల్కొండ కవులు సంచిక" 1935లో వెలువరించి అందులో 183 మంది పూర్వ కవులు, 354 మంది ఆధునిక తెలంగాణ కవుల రచనలు ప్రచురించి వెలుగులోకి తెచ్చిన అసాధారణ సంపాదకుడు ప్రతాప రెడ్డిగారు.

గోల్కొండ పత్రిక తెలంగాణ ప్రజల్లో సాంస్కృతిక, సామాజిక రాజకీయ చైతన్యం కల్గించింది. ఈ పత్రికలో అనేక మంది సాహిత్య సృజన చేశారు. తెలుగువారికి గౌరవం, ఆత్మగౌరవం విద్య ద్వారా లభ్యమవుతాయనే విషయాన్ని గుర్తించారు. ఎన్నో సామాజిక, జానపద, పల్లె పదాలు వెలుగులోకి తెచ్చారు. అనేక అంశాలను సృజిస్తూ రచనలు చేశారు.

ఎవరికివారు ఎక్కడికక్కడ తమ హద్దులలో తమ పద్దులలో ఆగిపోవాలా? అలా జరగకూడదని జగత్తుకు జరంత సోయిని కల్పించే ప్రయత్నం చేసిన తెలంగాణ సాహితీ కృషీవలుడు సువరం. వాస్తవానికి తెలంగాణ ప్రాంతంలో ఏదైనా సాహిత్య కృషి ప్రారంభమైనదంటే ఖచ్చితంగా అది గోల్కొండ పత్రికే. తన జీవిత చరమాంకంలో రచించిన ఆంధ్రుల సాంఘికచరిత్ర దేశ స్వాతంత్ర్యనంతరం భారతీయ భాషల్లో రచించిన అత్యుత్తమ గ్రంథంగా కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి పొందిన మొట్టమొదటి తెలుగు గ్రంథం. ఎన్ని డిగ్రీలున్నా కోత్వాలు వెంకట్రామిరెడ్డి లాంటి వారి అండ దండలున్నా, పెద్ద జీతాలిచ్చే ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఏ మాత్రం ప్రయత్నించక, తన జీవిత కాలమంతా చాలీచాలని జీతంతో "గోల్కొండ పత్రిక" ద్వారా జనాభ్యుదయం కాంక్షించిన త్యాగశీలుడు సుర వరం ప్రతాపరెడ్డిగారు.

**ముగింపు :**

నిజాం నవాబు నిరంకుశ పాలనను ఎదిరించి, ప్రాణ త్యాగానికైనా సిద్ధమై తెలంగాణ ప్రజానీకం యొక్క భాషాభిమానాన్ని పెంచి, ప్రజాస్వామ్య కాంక్షను కల్గించి, సంఘ సంస్కరణాభిలాషను రేకెత్తించారు. సురవరం ప్రతాపరెడ్డిగారు లేకపోతే, ఆయన సంపాదకత్వంలో "గోల్కొండ పత్రిక" వెలువడకపోతే తెలంగాణ ప్రజలలో జాగృతి కలగడానికి మరెందరి జీవిత కాలాలు కావలసివచ్చే వేమోనని నా అభిప్రాయం. సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకిస్తూ ప్రజలను ప్రజాస్వామ్య విధానానికి అనువుగా మలచడంలో "గోల్కొండ పత్రిక" సంపాదకుడిగా ఆయన చేసిన కృషి అపూర్వమైంది, అనితరసాధ్యమైనది. ఈ విధంగా నిద్రాణమై ఉన్న తెలంగాణను తన కలంచే, గళంచే మేల్కొల్పిన చైతన్య స్ఫూర్తి సురవరం ప్రతాప రెడ్డిగారు.

అసాధారణమైన పరిశోధనాశక్తిగల సురవరం ప్రతాప రెడ్డి గారు రచయితగా, గ్రంథాలయోద్యమ నాయకుడిగా, సంఘసేవా పారాయణుడిగా, రాజకీయవేత్తగా, ప్రథమ శ్రేణికి చెందినవారైనా, ప్రధానంగా పత్రికా సంపాదకుడిగా ఆయన తెచ్చిన ఒరవడి అపూర్వమైంది, ఆదర్శప్రాయమైంది. ఏది ఏమైనా తన బహుముఖ సేవతో తెలుగువారి చీకటి జీవితాలలో చైతన్యాన్ని నింపిన సాహితీ కిరణం, పత్రికా ప్రావీణ్యుడు సురవరం ప్రతారెడ్డిగారు.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# బండి నారాయణస్వామి జీవితం, సాహిత్యం

- ఎ. సుబ్రమణ్యం, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

రాయలసీమ స్థితిగతులను అవగాహన చేసుకొని సమాజంలో జరుగుతున్న పనితీరును పదిమందికి తెలియజేయాలనే కుతూహలం కలిగిన మేధావి, మంచి రచయిత బండి నారాయణ స్వామి. ఈయన రచనల్లో సామాజిక, రాజకీయ, ఆర్థిక, మత తదితర విషయాలకు సంబంధించిన ఎన్నో అంశాలు చోటుచేసుకొని ఉంటాయి. పల్లె వాతావరణాన్ని కళ్ళకు కట్టినట్లు తన రచనల్లో చూపిస్తాడు. ప్రముఖుల జీవిత చరిత్రలను ఔపాసన పట్టిన బండి నారాయణ స్వామి సాహిత్యంలో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకొన్నాడు. కథలు, నవలలు, కవిత్వాలు, వ్యాసాలు రాయడంలో దిట్ట. ఏ రచనలో అయినా సమాజాన్ని ప్రతిబింబింపజేయడం తన ప్రత్యేకత. తన రచనల్లో ప్రపంచీకరణ పోకడలు, ప్రాంతీయ అస్తిత్వ ఉద్యమాలు, ఆధ్యాత్మిక, ధార్మిక చింతనలు మొదలైన అంశాలను గురించి స్వామి ఎంతో విలువైన సాహిత్యాన్ని తెలుగు ప్రజలకు అందజేశారు. తాను ఎందుకు రాస్తు న్నాడో? ఏం రాస్తున్నాడో? ఎలా రాస్తున్నాడో? ఎందుకోసం రాస్తున్నాడో అని ఆయన సాహిత్యం చదివితే ఆయన వ్యక్తిత్వం ఎలాంటిదో మనకు అర్థమవుతుంది. ఆయన వ్యక్తిత్వం తెలియాలంటే ఉపబలకంగానైనా బండి నారాయణస్వామి జీవితాన్ని గురించి నాలుగు మాటలైన చెప్పుకోవాలి. అలా చెప్పుకుంటేనే వారి జీవితానికి, వారి సాహిత్య వ్యక్తిత్వానికి ఉన్నటువంటి సత్సంబంధాలు మనకు అర్థమవుతాయి.

## జననం - విద్యాభ్యాసం - ఉద్యోగం :

రాయలసీమ ప్రాంతంలోని అనంతపురం జిల్లాకు చెందిన బండి నారాయణస్వామి 3.6.1952వ సంవత్సరం హొన్నూరప్ప, పోలేరమ్మ దంపతులకు అనంతపురం పాత ఊరులో జన్మించాడు. ఈయనకు ఒక తమ్ముడు, ఇద్దరు చెల్లెలు. భార్య పరంజ్యోతి. కుమార్తె అరుణాచలం సౌరిస్, కొడుకు విహారి. బండి నారాయణ స్వామి ఒకటో తరగతి నుంచి అయిదో తరగతి వరకు అనంతపురం ఎలిమెంటరీ స్కూలో చదివారు. ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకు అనంతపురంలోనే షిరిడి సాయి బాబా నేషనల్ హైస్కూల్లో ఉత్తీర్ణులయ్యారు. బి.ఎ. (హెచ్‌పిటి) అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో పట్టభద్రులయ్యారు. అనంతపురం ఎస్వీయు పిజి సెంటర్లో 1974-1976 సంవత్సరంలో ఎం.ఎ.తెలుగు పూర్తి చేశారు. 1980వ సంవత్సరం నెల్లూరులో బి.ఎడ్.ట్రైనింగ్ పూర్తి చేసుకుని ఉద్యోగం వేట ప్రారంభించారు. మొదట మెడిటేషన్ ఇన్స్‌ట్రక్టరుగా పనిచేశారు. తరువాత ప్రభుత్వ ఉపాధ్యాయుడుగా తన జీవితాన్ని ప్రారంభించి "అ, ఆలు నేర్పే అయ్యవారిగా గుడిపల్లి, పులికట్ల గ్రామాలలో పదమూడేండ్లు సింగిల్ టిచర్ ఉద్యోగం. అయిదేండ్లు అనంత అక్షర విజయానికి డిప్యుటేషన్ మీద పల్లెలు తిరుగుతూ, ఉన్నత పాఠశాల పలకం చెరువులో ఒక సంవత్సరం, తగరకుంటలో ఎడెనిమిదేళ్ళుగా సోషల్ టీచరుగా పనిచేశారు" (పాలపిట్ట, జూన్ 2010).

## రచనలు - అవార్డులు :

బండి నారాయణస్వామి గారి కథా సంపుటాలు: 1.పరుగు (1987) 2.వీరగల్లు 3.రంకె. నవలలు: 1.గద్దలాడతాండాయి 2.మీరాజ్యం మీరేలండి 3.రెండుకలల దేశమ్ 4.నిసర్గమ్ (అముద్రితం). నారాయణ స్వామి జె.కె.రచనలు, రమణ మహర్షి, బీడీ బాబా అద్వైత రచనలు, ఫిక్షన్ కన్న ఫిలాసఫీ రచనలు చదవడం చాలా ఇష్టం. కృష్ణశాస్త్రిగారి రేడియో పాటలు, సినిమా పాటలు చదివేవారు, వినేవారు.

బండి నారాయణస్వామి గారికి కథా కోకిల, కొలకలూరి, ఎన్టీఆర్ పురస్కారాలను అప్పాజోస్యుల విష్ణుభొట్ల ఫౌండేషన్‌వారు ప్రదానం చేశారు. గుడిపాటి వెంకటా

చలం, రవీంద్రనాథ్ ఠాగూర్, టాల్‌స్టాయ్, మయకోవస్కీ, దొస్తోవస్కీ వంటి ప్రముఖ రచయితలంటే ఇష్టం. వీళ్ళ రచనల ప్రేరణే బండి నారాయణస్వామిని ఆదర్శవంత మైన రచయితగా చేశాయి. బండి నారాయణ స్వామి సింగమనేని నారాయణ, కొలకలూరి ఇనాక్, చిలుకూరి దేవపుత్ర మొదలయిన రచయితల వలన కథా మెళ కువలు నేర్చుకున్నాని తానే చెప్పుకొని ఉన్నాడు. బండి నారాయణ స్వామికి మహాకవులను చూసే అదృష్టం కలిగింది. ఒకసారి అంటే 1975వ సంవత్సరంలో కవితల పోటి జరిగినప్పుడు శ్రీరంగం శ్రీనివాసరావు జడ్జీగా ఉన్నారు. నాకు రెండో బహుమతి వచ్చిందని ఒక ఇంటర్వ్యూలో చెప్పారు. విద్యార్థి దశ నుంచే కవితలు రాయడం మొదలు పెట్టిన నారాయణస్వామి ఆదర్శ వంతమైనటువంటి రచనలు చేశారు.

## సాహిత్యం - వ్యక్తిత్వం :

బండి నారాయణ స్వామి సాహిత్యాన్ని తెలుసుకునే ముందు వారి వ్యక్తిత్వాన్ని గురించి ఎంతైన తెలుసుకోవాలి. బాల్యం నుంచే కథలన్నా, కవితలన్నా ఎంతో ఇష్టం. అందుకు ప్రేరణ తండ్రి ఉపాధ్యాయుడు కావడం. విద్యార్థి దశ నుంచే లైబ్రరీకి వెళ్ళడం, పుస్తకాలు తిరగ వేయడం, కథల పుస్తకాలను దొంగతనంగానైనా దొంగి లించుకొని చదివే వారంటే ఆయన ఎలాంటివారో ఆయన వ్యక్తిత్వం పసిగట్టవచ్చు. పుస్తకాలను నడుస్తూ చదవడం కూడా తన జీవితంలో జరిగింది. ఎందరో ప్రముఖుల జీవితాలను చదివి ప్రేరణ చెందాడు. ఆదర్శవంత మైనటువంటి రచనలను కోకొల్లలుగా చదవడమే కాకుండా ఇంకా ఏదో ఏదేదో చదవలానే దృఢ సంక ల్పంతో పట్టువీడని విక్రమార్కునిలా తాను రచనలు చేయాలని సంకల్పించుకొన్నాడు. "జీవితం యొక్క వరం కొంతమందికి మాత్రమే దక్కుతుంది.అటువంటి వరాన్ని దక్కించుకున్న రచయితుల్లో నేను కూడా ఒకడ్ని" (పాలపిట్ట,జూన్2010) అంటారు బండినారాయణస్వామి.

తన రచనల్లో మార్క్సిజం గురించి అక్కడక్కడ పలకరిస్తాడు. సమాజాన్ని మేల్కొల్పడానికి ముందుగా తన చుట్టూ ఉన్న వాతావరణాన్ని రెండు కళ్ళతో తనివితీరా చూస్తాడు. ఆ తరువాతే రంగంలోకి దిగుతాడు. ఆయన వ్యక్తిత్వం, జీవితం నుంచి వెలువడిన ఎన్నో సంఘటనలు సాహిత్యానికి ఇతివృత్తాలుగా తీసుకున్నారు. రచయిత కథలో పునరుక్తి లేకుండా రాయడానికి ప్రయత్నించేవాడు. ఒక కథలో పొందు పరిచిన విషయాన్ని మరో కథలో రాకుండా జాగ్రత్త పడేవారు. ఈయన కథల్లో కరువులకు సంబంధించినవి, జీవితాలకు సంబంధించినవి, గ్రామాల్లో జరిగే విధి విధానాల మీద మంచి పట్టు ఉండేది. వీరి కథల్లో రైతుల కష్టాలు, ఆత్మహత్యలకు గల కారణాలు తెలియజేస్తారు. వాటికి పరిష్కార మార్గాలు కూడా ఉంటాయి. బండి నారాయణస్వామి గారిని కథను ఒకేసారి రాస్తారా? ఎంత కాలంలో రాస్తారు? ప్లానింగ్ ఎలా ఉంటుంది? అని అడిగినప్పుడు తాను ఈ విధంగా స్పందించాడు-"కథ రాయాలన్న ఆలోచన వచ్చాక దాని నిర్మాణానికి సంబంధించిన వ్యూహం పాత్రలు మనసులో కదులుతూనే ఉంటాయి. రోజూ హైస్కూలుకు వెళ్ళుతూ కిటికి దగ్గర కూర్చొని ఆలోచించుకుంటూ మనసులో కథకు సంబంధించిన నిర్మాణం జరిగిపోతూ ఉంటుంది. కథను తిరగరాసే క్రమంలో కొన్ని ఇమేజరీలు వస్తాయి. బొమ్మల వాక్యాలు వస్తాయి. నేను 'చమ్కీదండ' కథ మాత్రమే ఒక్క సిట్టింగ్‌లో రాశా. రాత్రి పదిగంటలకు కూర్చుంటే పొద్దున ఏడు గంటలకు పూర్తయింది. మామూలుగా అయితే ఒక కథ గురించి నెల దినాలు ఆలోచిస్తా. మరో రెండు వారాల్లో రాస్తా. మరో మూడు నాలుగు వారాల్లో తిరగరాస్తా"(పాలపిట్ట, జూన్ 2010) అన్నారు.

నారాయణ స్వామి కథల్లో రాయలసీమను పట్టి పీడిస్తున్న రెండు ప్రధాన సమస్యలను ఇతివృత్తాలుగా తీసుకున్నారు. 1.కరువు 2.ఫ్యాక్షన్. ఇవే తన కథలకు ఇతివృత్తం.

## కరువు కథలు :

స్వామి కథల్లో కరువును విశ్లేషించిన కథలు 'వానరాలే', 'నడక', 'బతుకు ఊబి', 'ఊరుతల్లి', 'నీళ్ళు', 'సావుకూడు' మొదలయిన ఎన్నో కథల్లో రైతుల కష్టాలు, కడగండ్లు

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

చోటుచేసుకొని ఉన్నాయి. నారాయణ స్వామి కథలు పరిపూర్ణంగా చదివినట్లయితే ఏ కారుకి ఏ విత్తనం వెయ్యాలి, ఎలాంటి పంట పండించాలి, ఎలాంటి మందులు చల్లాలి, రైతుకు జరిగే అన్యాయం ఏమిటి, మధ్యవర్తుల దోపిడీ ఏమిటి, ఒకే కుటుంబంలో ఉన్న తల్లి, తండ్రి, బిడ్డ, గొడ్డు కష్టపడి కూడా కష్టానికి తగిన ఫలితం లేకుండా వడ్డీలకు రుణాలు తీసుకొని వడ్డీ రుణాల్ని తీర్చలేక పంట చేతికి రాక, అతి వృష్టి, అనావృష్టి వలన వ్యవసాయదారులు ఏ విధంగా కొట్టు మిట్టాడు తున్నారో నారాయణ స్వామి కథలు చదివితే తెలుస్తుంది. ఇందులో అన్ని కథలను విశ్లేషించుకోవడం కుదరదు. అందువలన వీలైనంత తక్కువగా రెండు మూడు కథల్లోని ఇతివృత్తాల సందేశాలను తెలియజేసుకుంటూ బండి నారాయణ స్వామి గారి కథలు సమాజానికి, రైతాంగానికి ఎంత వరకు ఉపయోగపడుతాయో వివ రించుకొవచ్చు. వాన రాకుండాపోతే, వాన దేవుడు కరుణించకుండాపోతే, రైతు ఎన్నెన్ని ఇబ్బందులకు లోనవుతాడో 'వానరాలే' కథని విశ్లేషించుకుంటే గాని తెలియదు. ఆ కథలోని సారాంశంతోపాటు సంసారం ఎలాంటిదో తెలుసుకుందాం.

## వానరాలే :

వానలకోసం ఎదురుచూసే రైతుల కడగండ్లను చిత్రిం చిన కథ ఇది. ఆ సంవత్సరం వానలు బాగా కురుస్తాయని కరణం ధైర్యం చెబితే పెన్నప్పకు ఆశ పుట్టింది. ఊరిలో చాలా మంది రైతులు వెనకడుగు వేస్తుంటే, పెన్నప్ప ముందడుగు వేశాడు. ఆర్థికంగా తలకు మించిన భారమే అయినా, చెనిగిత్తనాలు క్వింటాల్ వెయ్యి రూపాయలు పెట్టి కొన్నాడు. మూడు మూట్ల విత్తనాలు కొన్నాడు. ఇది చూసి పెన్నప్ప భార్య "ఈసారి వానలు వస్తాయో, రావో అని పెద్ద పెద్ద రైతులే ఇత్తనం ఏసేదానికి జంకుతాంటే, నువ్వు మూడు మూటలు ఇత్తనం కాయిని ఎందుకు మోసుకొస్తివి సామీ? నిరుడు సంవత్సరం మాదిరి వానలు కురసక పాయ అనుకో! ఇప్పుడు ఇత్తనం మీద అప్పుచేసిన ఆ మూడు వేలు భూమిలోకి పారేసుకున్నట్లే కదా! ఆ మూడు వేలు అప్పును ఎట్లా కడతాము? దానికి అయ్యే వడ్డీని ఎట్ల కడతాము? మన కడుపులకు ఏం తింటాము? వచ్చే సంవత్సరం మన పాపపెండ్లి ఎట్ల చేస్తాము? వద్దు సామీ వద్దు, ఆ సేద్యమూ వద్దు, ఆ అప్పులూ వద్దు. కూలీ నాలీ చేసుకుని బతుకుదాము. ఉంటే తింటాము, లేకపోతే ఇన్ని నీళ్ళు తాగి పస్తులు పడుకుందాము"(వీరగల్లు కథా సంకలనం,పుట.22). కానీ పెన్నప్ప భార్యమాటలను పట్టించుకోలేదు. కానీ రానురాను అతనికి ధైర్యం చాలక ఐదు ఎకరాలు మాత్రమే విత్తనం నాటాలనుకున్నాడు. మిగతా ఐదు ఎకరాల్ని బీడుగానే పెట్టేయాలని అనుకున్నాడు. మూడు వేలకు మునిగే బదులు ఒకటిన్నర వేయికి మునిగేది మేలుకదా! అని అనుకున్నాడు. సగం విత్తనాల్ని దగ్గర పెట్టుకొని మిగతా సగం విత్తనాల్ని అదే రేటుకు ఈడిగ రంగప్పకు ఇచ్చేశాడు.

కృత్తికలో సేద్యం చేశారు. పునర్వసులో వాన వస్తే విత్తనం వేయాలని కాసుకోనున్నారు. పునర్వసుపోయి పుష్యమి వచ్చినా వాన రాలేదు. కప్పలకు పెండ్లిండ్లు చేశారు. భారతంలో విరాటపర్వం చదివించారు. ఇంటి కొకరు గుంపుగా చేరి ఊర్లో సందుగొందులన్నీ తిరగతా బజన్లు చేసినా వానలు రాలేదు. ఇలా ఉండగా ఒకరోజు వాతావరణం మంచిగా మారిపోయింది. మెరుపులు మెరిశాయి. ఉరుములు ఉరిమాయి. దీంతో పెన్నప్పకు ఆశ పుట్టింది. పది ఎకరాలకూ విత్తనాలు చల్లుంటే బాగుండేదని అనిపించింది. కానీ పెన్నప్ప అంచనా తారుమారయ్యింది. క్షణంలో గాలి వచ్చేసి మబ్బులన్నీ మాయమైపోయాయి. పెన్నప్ప దిగులు పడిపోయాడు. రైతులెవ్వరికీ ఆశ్లేషలో విత్తనాలు వేసేందుకు ధైర్యం చాలకపోయింది. ఇరవై ఎకరాలు ఉన్నోల్లు పది ఎకరాలకే పంటపెట్టారు. పది ఎకరాలు ఉన్నోల్లు ఐదు ఎకరాలకే విత్తనాలు చల్లారు. కొందరైతే సేద్యం జోలికే వెళ్ళలేదు. పెన్నప్ప ఐదు ఎకరాలకు విత్తనం ఏసి మిగతా ఐదు ఎకరాలు బీడు పెట్టాడు. విత్తనం వేసిన వారం దినాలకు మొలకలొచ్చాయి. మఖలో వాన వచ్చింది. వాన వచ్చిన మూడు దినాలకు కలుపు తీసి సేద్యం చేశారు. పుబ్బ

వచ్చింది. చెట్లు పూతకొచ్చాయి. ఇంకా కొన్నాళ్లు గడిచి, సెట్టు బాగా పుంజయి ఏపుగా ఎదిగాయి.

కళకళలాడే ఆ ఐదు ఎకరాల చేను పక్కన బీడుపడిన ఇంకో అయిదెకరాల చేను ముండ మోపి మాదిరి కన్పించింది పెన్నప్పకు. కానీ ఉత్తరలో వాన రాలేదు. ఒక పక్క ఊడలకు పిందెలు కాస్తుంటే, ఇంకో పక్క భూమిలో తేమలేక చెట్లు వాడబడ్డాయి. చేనుపక్క చూసిన పెన్నప్పకు తన కడుపులో ఎవరో చేయిపెట్టి దేవినట్లయింది. చిత్తకార్తె పోతుందనగా మూడు దినాలు జడి పట్టుకుంది. పైరు కొంచెం కళకళలాడింది. పెన్నప్పకు మళ్లీ కొంచెం ఆశ వచ్చింది. ఆ ఆశ కూడా ఎక్కువ కాలం నిలవలేదు. స్వాతి, విశాఖ కార్తెల్లో కూడా వానరాలేదు. చలికాలం మొదలైపోయింది. విత్తనాలు సరిగా మొలకెత్త లేదు. చివరకు కుప్పపెట్టి కాయిని విడిపిస్తే, ఎకరాకు మూడు మూటలు కూడా పంట దిగలేదు. పెన్నప్ప విచారానికి అంతులేదు.

టౌనుకు పోయి వచ్చిన వాళ్ల దగ్గర చినిక్కాయరేటు విచారించేవాడు. మార్కెట్టు రేటు తగ్గుతా, ఎక్కుతా వచ్చింది. చివరకు ఆలస్యం చేస్తే ఉన్న రేటు కూడా దక్కదేమోనని అనుకున్నాడు. చినిక్కాయ మూటలు లారీకి ఎక్కించాడు. క్వింటాలుకు రెండున్నర మూటలు తూగాల్సిన కాయ మూడు మూటలు తూగింది. దానిలోనూ తరుగని, నాసిరకం కాయ అని రకరకాల పేర్లతో మంచి ధర కట్టారు. వచ్చిన డబ్బును అప్పుకింద జమకట్టేశాడు. షావుకారి చివరకు పెన్నప్పే అంతాపోను షావుకారుకు యాభై రూపాయలు బాకీ పడ్డాడు. పెన్నప్ప ఏడ్వలేదు. "అయిదు ఎకరాల్లో నేనూ, నా పెండ్లామూ, నా కూతురూ, నా ఎద్దులు చేసిన రెక్కల కష్టం విలువ రెండు వేలు. నా పెండ్లాం మాట వినకుండా ఇంకొక అయిదు ఎకరాల్లో కూడా సేద్యం చేసింటే ఇంకొక రెండు వేల రూపాయలు మా రెక్కల కష్టంలో దండగై పోయేది మేలేకదా! నాకు మంచే జరిగె కదా!'' అనుకున్నాడు. చేసేది లేక పెన్నప్ప షావుకారునే ముప్పై రూపాయలు అప్పు అడిగి, అతడిచ్చిన ఇరవై రూపాయలతో ఊరిముఖం పట్టాడు. దినాలు గడిచే కొద్ది పెన్నప్ప వ్యవసాయ కూలీగా మారాడు. వానల కోసం ఎదురుచూసే రైతుల కడగండ్లను చిత్రించిన కథ ఇది. కార్తెలు గడిచి పోతున్నా వానరాకపోవడం, చిన్న చిన్న మబ్బుతునకలను చూసి వాన వస్తుందని రైతులు ఆశ పడడం, చివరకు వాన వచ్చి సేద్యం చేసినా అప్పే మిగలడం రైతుల జీవితంలోని విషాదాన్ని సూచిస్తుంది.

**నీళ్లు :**

అనంతపురం జిల్లా రాయదుర్గంలో మంచినీటి కోసం ఒక కుటుంబంపడే ఆరాటాన్ని ఈ కథ వ్యంగ్యం, నిస్సహాయత కలగలసిన కంఠస్వరంతో వర్ణించాడు. ఈ కథలో అనంతపురం నివాసి హిరేలాల్ మండలంలో టైపిస్టుగా ఉద్యోగం చేస్తుంటాడు. రోజూ అనంతపురం నుంచి ఈ మండలానికి బస్సులో వెళ్ళి వస్తుంటాడు. ఉదయాన్నే తనతోపాటు తనకు అవసరమైన క్యారేజి కూడా పట్టుకుని వెళ్ళాలి. అతని భార్య నీళ్ళ కోసం ఎంతో ఆరాటపడుతుంది. అనంతపురంలో నీళ్ళకోసం అందరూ ఇతని భార్య లాగే ఆరాటపడుతుంటారు. ఆ జనంలో నుండి ఉద్యోగి భార్య నీళ్ళు తేవడం చాలా కష్టం అవుతుంది. నీళ్ళ కోసం తన భార్యపడే అవస్థలను చూసి ఉద్యోగి కూడా సహాయం చేస్తుంటాడు. ఒక రోజు ఉద్యోగి ఇంటికి తన స్నేహితుడు వస్తాడు. ఉద్యోగి ఆ స్నేహితుడ్ని స్నానం చేయమని అనలేకపోతాడు. ఎందుకంటే నీళ్ళ కొరత. స్నేహితుణ్ణి ముఖం మీద కాసిని నీళ్ళు చల్లుకోమని అంటాడు. ఈ పరిస్థితి వచ్చినందుకు ఉద్యోగి భార్య ఎంతో బాధపడుతుంది. ఒక రోజు ఉద్యోగి కొడుకు పళ్ళెంలో నీళ్ళు వలకబోస్తుంటే అతని భార్య కొడుకు కోపంతో కొడుతుంది. ప్రజల ఈ సమస్యను ఆసరాగా తీసుకుని రాజకీయ నాయకులు సమస్యను మరింత జటిలం చేయడానికి ప్రయత్నిస్తుంటారు. నీళ్ళ రాజకీయాలు అలా ఉంటే నాగరికత అంటే ఏమిటి అని ఈ కథ ప్రశ్నిస్తుంది. నీళ్ళు ఎన్ని ఎక్కువ ఉపయోగిస్తే ఆ సమాజానికి అంత ఎక్కువ నాగరికత ఉంటుందని ఒక సూత్రం ఉంది కదా! మరి తాగేదానికి ఒక కడవ

నీళ్ళు నోచుకోలేని వారికి ఏం నాగరికత ఉంటుంది? అని ఈ కథ వ్యంగ్యంగా ప్రశ్నించింది.

**ముగింపు :**

బండి నారాయణ స్వామి జీవితాన్ని వారి కథల్లోని ఇతివృత్తాన్ని వేరు చేసి చూడలేం. నారాయణస్వామి రాయలసీమ బిడ్డ కాబట్టే ఆ ప్రాంతపు కష్టాల్ని వస్తువులుగా తీసుకొని కథలుగా తీర్చిదిద్దాడు. ఇవి కథలు మాత్రమే కాదు. రైతుల కష్టాలు, పేదల కన్నీళ్లు రంగరించి తన కలంలో సిరాల నింపుకున్నాడు. సేద్యం చేయడానికి రైతు పడే అవస్థలను వాన కురవక రైతు పడే బాధను నీళ్ళులేక ప్రజలు ఎదుర్కొనే సమస్యలను భూతద్దంలో పెట్టి చూపించారు. నీళ్ళను ఏ విధంగా పొదుపుగా వాడు కోవాలి, నీళ్ళ కోసం జనం ఎలాంటి ఇబ్బందులు పడు తున్నారన్న విషయాలు వీరి కథల్లో చూడవచ్చు. ఇది కేవలం కథలు మాత్రమే కాదు కష్ట జీవుల కష్టాలు. వాళ్ళ కన్నీళ్లు. వారి వ్యధలు. ఇవన్నీ కలిసిన 'కలగూరగంపె' మన నారాయణ స్వామి కథలు. ఇవి కేవలం కల్పితాలు కావు. కష్టాలు. ఇవి ఏసీ రూంలో కూర్చొని కల్పితంగా రాసినవి కావు. తాను అనుభవించి ప్రజల కష్టాలను చూసి నారాయణస్వామి స్పందించారు. అవార్డుల కోసం రాసి నవి కావు. అద్భుతాలు వీరి కథల్లో కనిపించవు. రైతు మడక దున్నడం, మట్టిలో విత్తనాలు చల్లడం, వాన కోసం ఎదురు చూడడం, పంట చేతికి రావటం, పంటను నమ్ముకున్న రైతు చివరకు ఎలాంటి ఇబ్బందులకు లోనవుతున్నా గానీ తన ఆశను మాత్రం వదులుకోకుండా పైరు పెట్టాలని మరల మరల ఎలా మదనపడుతుంటాడో బండి నారాయణ స్వామి కథలను చదివితే తెలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. ఇరివెంటి కృష్ణమూర్తి - తెలుగు కథా రచయితలు, ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీ, కళాభవన్, సైఫాబాద్, హైదరాబాద్, 1982.
2. పోరంకి దక్షిణామూర్తి - కథానిక స్వరూప స్వభావాలు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాద్, 1988.
3. బండినారాయణస్వామి - వీరగలు (కథాసంకలనం), భగవాన్ ప్రచురణలు, అనంతపురం, ఏప్రిల్ 2004.
4. వల్లంపాటి వెంకటసుబ్బయ్య - రాయలసీమలో ఆధునిక సాహిత్యం, సామాజిక సాంస్కృతిక విశ్లేషణ, 2006.
5. పాలపిట్ట మాసపత్రికలో ప్రచురింపబడిన బండినారాయణ స్వామికి సంబంధించిన వ్యాసాలు, జూన్ 2010.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# "బంజారా పండుగలు - మానవ సంబంధాలు"

- **భానోత్ స్వామి,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయము, వరంగల్, తెలంగాణ.

భారతదేశంలో నివసిస్తున్న అనేక ఆదిమ జాతులలో బంజార ఒక విశిష్టమైన తెగ. ప్రధానంగా మన దేశంలోని బంజారాలను 'గోర్' లేదా 'గవార్' అని అంటారు. "గోర్ లేదా గోర్యా" అనే పదాలు "గవార్" అనే హిందీ పదం నుండి వచ్చినట్లుగా చరిత్రకారుల, బాషా శాస్త్రవేత్తల అభిప్రాయం. హిందిలో గవార్ అనగా గ్రామ గ్రామాలు తిరిగే వారని అర్థం. గో సంరక్షణ చేసేవారు కావున బంజారాలను గోర్ బంజారాలు అని పిలుస్తున్నట్లు భావనలున్నాయి. భారతదేశంలో వివిధ ప్రాంతాలను బట్టి ఆయా సంస్కృతి సాంప్రదాయాలనుబట్టి బాషలో మార్పులు ఉండవచ్చుకాని, ఉత్తర దక్షిణ రాష్ట్రాల ప్రజల గిరిజన సంస్కృతి చాలా దగ్గరగా పోలి ఉంటాయని చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం అనేక అంచనాలు వీరి పై ఉన్నాయి."బంజారా లేదా సుగాలీలు" మోల మోట అనే సోదరుల సంతతికి చెందిన వారని, మరి కొంతమంది చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం స్వాతంత్ర్యం రాకముందు వీరు సంచార తెగలుగా జీవిస్తూ ఉండేవారు. బంజారాలు వనాలలో సంచరించడం వలన వీరిని బంజారాలని పిలువడం వెనుక ఒక చారిత్రక కథనం ఉన్నట్లు చరిత్రకారుల అంచనాలున్నాయి.

1192లో రెండవ తరైన్ యుద్ధంలో పృధ్వీరాజ్ చౌహాన్ ఓటమికావడం, బంజారసైనికులు అడవిపాలు కావడం జరిగింది. ఈ విధంగా అడవిపాలుకావడం, అడవిలో ఎర్రమట్టి శరీరానికి రాసుకోవడం, గుహలలో, చెట్ల పొదలలో జీవనం సాగించడం జరుగుతూ వస్తున్న క్రమంలో ప్రత్యేక భాష, ప్రత్యేక వేషధారణ ధరిస్తూ అడవిలో జంతువుల మధ్య జీవనాన్ని కొనసాగిస్తున్న క్రమంలో వీరు మాట్లాడే భాషకు లిపిని వ్రాయలేక పోయారు. 12వ శతాబ్ధం ప్రారంభం నాటికే తెలుగు సాహిత్యంలో అనేక శాసనాలు, తాళ్ళపత్ర గ్రంథాల ఆధారాలు ఉన్నట్లు ప్రస్తుతం మనం చూస్తూన్నాము. కాని తెలుగు సాహిత్య చరిత్రలో బంజారాల జీవితాలను వారి సంస్కృతి సాంప్రదాయలలో పెద్దగా సాహిత్య ప్రక్రియ ఆనాడు జరుగులేదు. 19వ శతాబ్ధం ప్రారంభం నాటికి తెలుగు సాహిత్యంలో గిరిజన సాహిత్యం గురించి, గిరిజన జీవన విధానం గురించి సాహిత్య ప్రక్రియలు ప్రారంభమైనట్లుగా ఎన్నో రచనలు వచ్చాయి. అయితే బంజారాల ముఖ్య వృత్తి ఆనాడు సంచార జీవనం గడపడం, కాలానుక్రమంగా వ్యవసాయ వృత్తిని ఎన్నుకోవడం జరుగుతూ వస్తున్న క్రమంలో వీరు పశు సంపదను అభివృద్ధి పరచుకున్నారు. ప్రస్తుతం ఇప్పటికి కొన్ని గిరిజన తెగలలో, గిరిజన తండాలలో పశుసంపదను కాపాడుకొంటూ వీరు జీవనాన్ని కొనసాగిస్తున్నారు.

వీరు ప్రాచీన కాలంలో వ్యవసాయం ప్రదాన వృత్తిగా ఉన్న నేపథ్యంలో వీరి సంస్కృతి సాంప్రదాయాలలో అనేక మార్పులు వచ్చాయి. వీరి సంస్కృతిలో భాగంగా వీరి వృత్తులను బట్టి ప్రకృతితో గొప్ప సంబంధాలను ఏర్పరచుకున్నారు. సాధారణంగా హిందూ సనాతన సంప్రదాయంలో ఏ కులానికి, ఏ మతానికి లేని విభిన్న సంస్కృతిని, వేశధారణను, సాంప్రదాయాలను, ఆహారపు అలవాట్లను వీరు ప్రత్యేక సంతతిగా పరిణామం చెందారు. ఈ క్రమంలో వీరి సంస్కృతిలో భాగంగా పండుగలు ప్రారంభమైనావి. బంజారాలు ప్రకృతి ఒడి అయిన అడవిలో జీవనం కొనసాగిస్తారు, కాబట్టి వీరి పండుగలు కూడా ప్రకృతికి దగ్గరగా వీరి సంస్కృతి ప్రతిబింభిస్తుంది. వీరి వృత్తిలో భాగంగానే అనేక గేయాలు, జానపద పాటలు, సామెతలు, పొడుపుకథలు, వీరు నిరక్షరాస్యులైనా గొప్ప మౌఖిక సాహిత్యాని చెప్పగలరు.

వ్యవసాయం ప్రధాన వృత్తిలో భాగంగా ప్రతి సంవత్సరం జులై - ఆగస్టు మాసాలలో వీరి పండుగలు

నాందిపలుకుతాయి. ఇందులో భాగంగానే మొదట జరుపుకునే పండుగ "సిత్లా భవాని". ఏ పండుగ జరుపుకున్నా ఏ ఉత్సవం చేసినా కూడా సామూహికంగా అందరూ కలిసి జరుపుకోవడం గొప్ప విశేషం. వీరు జరుపుకునే పండుగ పూజా కార్యక్రమం ఒక విలక్షణమైన రీతిలో ఉంటుంది. వీరు పూజించే దేవతలు హిందూ దేవతలైనప్పటికీ, వారి పూజా విధానం ఒక ప్రత్యేక మైనదిగా ఉంటుంది. బంజారాలకు జీవనాధారం, పశు సంపద కాబట్టి వారు పశుసంపద కోసం "ఈ సీత్లా భవాని యాడీ" పండుగను జరుపుకుంటారు.

సామాన్యంగా హిందూసాంప్రదాయాలలో ఒక గిరిజన తెగలు తప్ప ఏ జాతులు కూడా జంతువులను, పశు వులను పూజించరు. ప్రతి సంవత్సరం శ్రావణమాసంలో జరిపే ఈ పండుగను "ధాటోడి" పండుగ అంటారు. ఈ పండుగను వర్షాలుపడి విత్తనాలు మొలకెత్తే సమయంలో జరుపుతారు. ఈ పండుగ శ్రావణమాసంలో మంగళవారం రోజున అందరూ తండా సమక్షంలో నిర్ణయించుకొని సామూహికంగా జరుపుకుంటారు. ఈ పండుగ యొక్క ప్రాముఖ్యత కేవలం వారి పశుసంపద బాగుండాలి, వ్యవసాయం సంవృద్ధిగా పండాలి అనే కాంక్షతో తండాలో ఉన్న అందరు మహిళలు నవ ధాన్యాలతో నైవేద్యం తయారుచేసి ఒక పాత్రలో తీసుకువచ్చి దానికి పైన ఒక వస్త్రంతో తయారు చేసిన "పులియా గొన్నో"తో అలంక రించి తీసుకువచ్చే క్రమంలో, బియ్యం బెల్లంతో వండిన పాయసం వంటకమును (సీత్లా భవాని ప్రతిష్టించిన) ప్రదేశానికి అందరూ ఊరేగింపుగా వెళ్ళి ఐదుగురు కన్యలు "పాంచ్ బేడో" ఐదు దొంతరలలో నీటిని తీసుకొని రాగా వీరు వండిన నైవేద్యాన్ని పూజా కార్యక్రమం అనంతరం అందరికి పంచుతారు. సీత్లాయాడిని ఏడుగురు శక్తి దేవతలుగా కొలుస్తారు. వారు భవానీ, మత్రాల్, హింగాళ, ధ్యాళంగర్, కంకాళి, దండి, సీత్లా భవానీలుగా వీరికి పేర్లు కలవు. సీత్లా యాడికి జంతుబలిని చేసి ఆ రక్తంను, నైవేధ్యంను కలిపి పశువులపై చల్లుతూ, బలి ఇచ్చిన జంతువు యొక్క పేగులు బయటకు తీసి దాని మీద నుండి పశువులను దాటిస్తారు. కావున దీనిని "దాటుడు పండుగా" అని పిలుస్తారు. ఈ విధంగా కేవలం పశు సంపదను పూజించే పండుగగా వీరి సంస్కృతిలో భాగం.

బంజారా సాహిత్యంలో మరియు సంస్కృతిలో రెండవ గొప్ప పండుగ "తీజ్". సీత్లా భవానీ పండుగ ముగిసిన రోజున సాయంత్రం (మంగళవారం) తండావారు అందరూ సామూహిక నిర్ణయంతో తండా నాయకుని అనుమతితో జరుపుకునే పండుగ తీజ్. ఈ పండుగను అశ్లేష కార్తి నుండి ఉత్తర కార్తి మధ్యన జరుపుకుంటారు. సీత్లా పండుగ వర్షాలు సంవృద్ధిగా పడాలని జరుపుకుంటే తీజ్ పండుగ వర్షాలు బాగాపడ్డాక చెరువులు కుంటలు నిండిన తర్వాత ఆరుద్ర పురుగు కనిపించే సమయంలో తీజ్ పండుగను జరుపుకుంటారు. మంగళవారం రోజున సాయంత్రం తండా నాయకుని ఇంటి ముందు ఒక మండపాన్ని ప్రతిష్టించి ఎంతో నిష్టతో గేయాలు, పాటలు పాడుతు గోధుమలను నీటిలో నానబెడతారు.

ఈ విధంగా నానబెట్టిన గోధులమను వెదురుతో తయారు చేసిన బుట్టలలో గోధుమలను చల్లుతారు. ఈ విధంగా చల్లిన గోధుమలను మండపం పైన ప్రత్యేక పూజ నిర్వహించి గేయాల రూపంలో ఈ పండుగ ప్రాము ఖ్యతను తెలియజేస్తూ మహిళలు మౌఖికంగా పాటలు పాడుతారు. ఈ పండుగ మహిళా సంతతికి చెందినప్పటికీ మానవ విలువలతో అందరూ కలిసి భిన్నాభిప్రాయాలు లేకుండా జరుపుకుంటారు.

ఈ పండుగ తొమ్మిదిరోజుల ప్రక్రియగా కొనసాగు తుంది. ప్రతిరోజు ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడు పూటలా పెండ్లికాని యువతులు ఎంతో నిష్టతో ఎంతో పవిత్రంగా ఉంటూ గేయాలు పాడుకుంటూ గోధుమలకు నీరు పోస్తారు. ఈ క్రమంలో వారు వారి కోరికలను మదిలో తలచుకుంటూ గొప్ప జీవితాన్ని, మంచి భర్తను వారికిమ్మని మదిలో పూజిస్తారు. ఈ విధంగా తొమ్మిది రోజులు సాయంత్రం మండపం దగ్గరికి సామూహికంగా రావడం, పాటలు పాడటం, పండుగ యొక్క విశిష్టతను తెలిపే గేయాలను పాడటం వీరి

సంస్కృతితో భాగం. తొమ్మిది రోజులు ప్రకృతిని తలుస్తూ వారివారి సంస్కృతి, సాంప్రదాయాలను, జీవన శైలిని, మానవ విలువలను పెంపొందించే విధంగా ఈ పండుగను జరుపుకుంటారు. చివరిరోజైన "తీజ్ బొరాయెర్ దాడో" తీజ్ నిమజ్జనం చేయడం జరుగుతుంది. ఈ ప్రక్రియ గురువారం ఉదయం నుండే ప్రారంభమవు తుంది. గురువారం సాయంత్రం నాటికి పూజా కార్య క్రమాలలో భాగంగా నైవేద్యం తయారు చేసి "మేరమ యాడికి" నైవేధ్యం సమర్పిస్తారు. తీజ్ నిమజ్జనానికి ముందు తండా వాసులందరూ వలయాకారంగా కూర్చుం టారు. స్త్రీలందరూ పండుగ గేయాన్ని పాడుతూ తీజ్ తెంపి వారి చేతులలోకి ఇస్తారు. ఈ విధంగా పూజా వృత్తాంతం తరువాత తీజ్‌ను అందరూ కలిసి చెరువులో నిమజ్జనం చేసిన తరువాత ఆ గంగా జలాన్ని తీసుకువచ్చి ఇంట్లో అక్క, బావల కాళ్ళు కడుగుతారు. ఈ విధంగా ప్రకృతికి మానవునికి గొప్ప అవినాభావ సంబంధాన్ని తెలియజేస్తుంది.

బంజారాలలో "హోళి" గొప్ప సంస్కృతిని కలిగిఉన్న పండుగ. వీరు ఈ పండుగను 15రోజుల ముందు నుండే ప్రారంభిస్తారు. దీనిని "గేర్ వగాయేరో" (చందాలు వసూలు చేయడంగా) పిలుస్తారు. అడవికి వెళ్లి మోదుగు పూలను తెచ్చి నీటిలో నానబెట్టి ఆ నీరు రంగుగా మారి నప్పుడు దానితో ఆడుకుంటారు. హోళిరోజు ఉదయం అందరూ కలిసి ఊరి మధ్యలో ఈ పండుగను జరుపు కుంటూ బంజారాల ఇష్ట దైవం రాముడు కాబట్టి, రామ భక్తుడైన హనుమంతుని వారసులమని, ఎవరైనా ఇంటికి వస్తే రాం! రాం !! అని అంటారు. రాం! అంటే రాముడు అని, రామ లక్ష్మణుల దారిలో నడవాలని గొప్ప మానవ సంబంధాన్ని, మానవ విలువలని లోకానికి చాటిచెప్పే గొప్ప సంస్కృతి మా పండుగ ద్వారా తెలుస్తుం దని వీరి ప్రతీక. హోళిరోజు ఉదయం అందరూ చిన్నా పెద్దా కలిసి పాతవస్తువులను కాలుస్తూ, దానిచుట్టూ మహిళలు ఆ పండుగ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తూ గేయాలను పాడుతూ నవధాన్యాలు, ఇత్తడి చెంబులో నీరును పోసి నైవేద్యాన్ని చిన్నపిల్లలకు ఇస్తారు. ఈ నైవేధ్యాన్ని తీసుకున్న పిల్లలు రోగాల బారినుండి విముక్తులవుతారని గొప్ప నమ్మకం. ఈ విధంగా ప్రకృతికి, మానవునికి సంబంధాలను తెలిపే పండుగలు బంజారా లలో అనేకం ఉన్నాయి.

ఏ కుల, మతాలలో లేని విభిన్నమైన, విలక్షణమైన సంస్కృతి, సాంప్రదాయాలు ఉన్న గొప్ప మానవీయతను, మానవ సంబంధాలను ప్రేరేపించే విధంగా ఉన్న పండుగలు వీరి జీవితాలకు ప్రతీక. ప్రకృతికి మానవునికి ఉన్న సంబంధాల వలన సమాజంలో స్వేచ్ఛానురాగాలు, కులమత ధోరణులు, అరాచక ఒరవడులు, సామాజిక రుగ్మతలు అన్ని సమసిపోయే విధంగా వీరి పండుగలు ఆనవాలుగా చెప్పవచ్చు. అనాగరికులైన గిరిజనుల భాషకు లిపిలేకుండా గొప్ప మౌఖిక సాహిత్యాన్ని చెప్పడం, గేయాలు పాడటంలో గొప్ప సాహిత్య ప్రక్రియలు ఆవిర్భ వించాయి. ఈ విధంగా వీరి సాహిత్యంలో కథలు, నవలలు, గేయ రచనలు, పాటలకు సంబంధించిన పరిశోధనలు జరుగుతున్నాయి.

## ఉపయుక్త గ్రంథ సూచి :

1. నల్గొండ జిల్లా బంజారా సాహిత్యం - జీవన చిత్రణ - ప్రో. సూర్య ధనుంజయ్, 2009, ఉస్మానియా విశ్వవిద్యాలయం హైదరాబాద్.
2. బంజారాల చరిత్ర, సంస్కృతి - ప్రో. వీరన్న, 2016, కాకతీయ విశ్వవిద్యాలయం.
3. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్.వి.యస్. సుందరం, 1983.
4. భారతదేశం, గిరిజన సముదాయం - మజుంధార్, 1986.
5. సుగాలి సంస్కృతి, బాషా సాహిత్యాలు - ప్రో. గోనా నాయక్, 2002, కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# 'చిత్తూరు కథ' సంకలనం - రైతుల సమస్యల చిత్రణ

- డా॥ పి. జయచంద్రుడు, తెలుగు అధ్యాపకులు, పి.వి.కె.యన్. ప్రభుత్వ కళాశాల (స్వయం ప్రతిపత్తి), చిత్తూరు.

ప్రపంచంలో వ్యవసాయ ఆధారిత దేశాలలో అత్యంత ప్రధానమైన దేశం భారతదేశం. సువిశాలమైన భారత దేశంలో అత్యంత సారవంతమైన భూములలో భారతదేశ రైతులు ఎన్నోరకాల ఆహారపంటలు, వాణిజ్య పంటలను పండిస్తున్నారు. భారతదేశానికి ధాన్యాగారమైన గంగా మైదానం ప్రపంచంలోనే ప్రసిద్ధిగాంచిన అత్యంత సార వంతమైన క్షేత్రం. సారవంతమైన భూములకు కావాల్సిన నీటివనరులు కూడా భారతదేశంలోవున్నాయి. కాని గత దశాబ్దకాలంగా పర్యావరణ వైపరీత్యాల కారణంగా, రైతు లకు సాంకేతిక పరిజ్ఞానలేమి కారణంగా రోజురోజుకు వ్యవసాయం కుంటుపడుతుంది. వ్యవసాయంపై ఆధార పడి జీవించే రైతులు తలకు మించి అప్పులు చేయడం కారణంగా పంట వల్ల లాభాలు రాకపోవడంతో నష్టాల ఊబిలో కూరుకుపోతున్నారు. బ్రతికే మార్గం కానరాక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. 'జైజవాన్ జైకిసాన్' అన్న నినాదంతో ప్రభుత్వాలు కొంతమేరకు సహాయ మందిస్తున్నా రైతులను ఆత్మహత్యలనుండి రక్షించలేక పోతున్నాయి. కొద్దిపాటి లాభాలను ఆర్జిస్తున్న రైతులు జీవితం మీద ఆశతో, లాభోద్దేశంతో పంటలు పండిస్తున్నా మధ్యవర్తులైన దళారుల దోపిడి వల్ల రైతులు మోస పోతున్నారు. నేడు వ్యవసాయానికి అయ్యే ఖర్చుకూడా విపరీతంగా పెరిగిపోతూంది. ఇలా రైతులు ఒకవైపు ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతిక పరిజ్ఞానలేమితో సతమత మౌతుంటే మరోవైపు అధిక వ్యయభారం, దళారుల దోపిడి కారణంగా రైతుల జీవితాలు చితికిపోతున్నాయి. అలా భారతదేశంలో వ్యవసాయ ఆధారితులైన రైతులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ 'చిత్తూరు కథ'ను తిరుపతికి చెందిన పేరూరు బాలసుబ్రమణ్యం సంక లనంగా వెలుగులోకి తెచ్చారు. ప్రస్తుతం 'చిత్తూరు కథ' సంకలనంలో చిత్తూరు జిల్లాలోని రైతుల సమస్యలను ఎదుర్కొంటున్న సమస్యలను విశ్లేషించడమే ఈ నా పత్రోద్దేశం.

'చిత్తూరు కథ' సంకలనంలో చిత్తూరు జిల్లా రైతుల సమస్యలను చిత్రించే కథలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రధానంగా డా॥ లంకిపల్లి కన్నయ్య నాయుడి 'జీవనం', గోపినికరుణాకర్ రచించిన 'దేవరెద్దు', పలమనేరు బాలాజి రచించిన 'తపన' వీరపల్లి వీణావాణి 'మూలాధారచక్రం', బడబాగ్ని శంకరరాజు 'ఆఖరితడి' వంటి కథలు రైతు సమస్యలను కళ్ళకు కట్టేట్లు చిత్రించాయి. డా॥ లంకిపల్లి కన్నయ్య నాయుడు రైతు కథకుడిగా సుప్రసిద్ధుడు. ఈ కథలో చిత్తూరు కథకులు చిత్తూరు ప్రాంతంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కడు దయనీయంగా చిత్రిం చారు. భారతదేశం, ఆంధ్రప్రదేశ్‌లా చిత్తూరు జిల్లా కూడా వ్యవసాయ ఆధారిత ప్రాంతమే. ఇక్కడి ప్రజల ప్రధాన జీవనం వ్యవసాయమే. చిత్తూరు జిల్లా తూర్పు నుండి పడమర వెళ్ళేకొలది వర్షాభావ ప్రాంతం ఎక్కువ. ఈ సంక లనంలో రైతుల సమస్యలను చిత్రించిన కథకులు దాదాపు అందరూ పడమటి ప్రాంతానికి చెందినవారు కావడం విశేషం. అలాగని తూర్పు ప్రాంత రైతులకు ఎలాంటి సమస్యలు లేవని కాదు. వారు కూడా వర్షాభావ పరిస్థితికి, అధిక వ్యయభారానికి, అప్పులబాధలకు గురౌతున్నవారే. ఇప్పుడు చిత్తూరు రైతులు ఎదుర్కొం టున్న సమస్యలను పరిశీలిద్దాం.

'జీవనం' కథలో డా॥ లంకిపల్లి కన్నయ్య నాయుడు రైతులు ఒకవైపు వ్యక్తిగతంగా అధికారుల నిర్లక్ష్యంవల్ల ఎలాంటి సమస్యలను ఎదుర్కొంటారో చిత్రిస్తూ, మరోవైపు ప్రకృతిపరంగా రైతుకు ఎలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందో చక్కగా వివరించారు. 'జీవనం' కథలో నలభైఏళ్ళ 'రైతు' జీవయ్యకు వ్యవసాయమంటే అమితమైన ప్రేమ. మార్పుకనుగుణంగా వ్యవసాయంలో ఎప్పటికప్పుడు కొత్త పద్ధతులకోసం క్రాంతిపతంలో పయనించే రైతు జీవయ్య.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

పెళ్ళీడువచ్చిన ఒక కుమార్తె, డిగ్రీ చదువుకొనే ఒక కుమారుడు, భర్తకు చేదోడువాదోడుగా ఉండే సహధర్మ చారిణి జీవయ్య కుటుంబం. జీవయ్యకు వ్యవసాయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదురైనా మట్టిని నమ్ము కునే బతకాలనే తపన కలవాడు. మట్టిని పంటగా మార్చ గల శక్తి సంపన్నుడు జీవయ్య. జీవయ్య ఇప్పుడు కొడుకు చదువులకోసం, కుమార్తె పెళ్ళికోసం పంటపై ఎన్నో ఆశలు పెట్టుకొన్నాడు. అటువంటి జీవయ్య ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య కరెంటు సమస్య. తగినంత కరెంటు లేకపోవడం, సరైన సమయానికి కరెంటు రాకపోవడంవల్ల ఒకవైపు మడిపైరు, చెరుకుతోట ఎండిపోతుంటే, మరో వైపు తమలపాకుతోట, మిరపతోట ఎండిపోతున్నాయి. ఎప్పుడో ఒకప్పుడు వచ్చిపోయే కరెంటు వల్ల ఇలా నీరు లేక పంటలు ఎండిపోతుంటే మరోవైపు మోటార్లు కాయిల్స్ కాలిపోతే దానిని పట్టణానికి తీసుకెళ్ళి కట్టించు కోడానికి మరికొన్ని రోజులుకావడం - ఇలా జీవయ్య సరైన సమయానికి కరెంటు లేకపోవడం, ఉన్నా మోటారు కాలిపోవడం వంటి సమస్యల వల్ల పంటలకు నీరు అందకపోవడం చేత పంటలు ఎండిపోతున్నాయి. వాటిపై ఎన్నో ఆశలు పెట్టుకున్న జీవయ్య జీవచ్ఛవంలా తయారవుతున్నాడు. రాత్రింబవళ్ళు నిద్రాహారాలు మాని కరెంటుకోసం ఎదురుచూడాల్సివస్తోంది. దీనికితోడు అప్పుడప్పుడు ఓవర్‌లోడ్ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు కాలి పోతే ఇక రైతుల బాధలు వర్ణనాతీతం. వీటన్నింటికి కారణం అధికారులేనని, కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించని మనుషులు, డబ్బుకు అమ్ముడుబోయిన మనుషులు, అధికారదర్పంతో డాబుసరిగా బ్రతకటం నేర్చుకున్న మనుషులు, ఈ మనుషుల చేతుల మీదుగా తిరిగే యంత్రాలు, డబ్బుకు దాసోహమని 'లోడ్'కు మించి కనెక్షన్లు ఇవ్వడంవల్ల మోటారుకాయిల్స్ కాలిపోతున్నా యని, ట్రాన్స్‌ఫార్మర్లు మండిపోతున్నాయని, దీనికి అధికారుల నిర్లక్ష్యమే కారణమని బాధపడేవాడు. వారానికి యాభై కట్టకు కోసే తమలపాకు తోట సకాలంలో కరెంటు రాక నీరులేకపోవడంతో తోట ఎండిపోవడంతో వ్యాపారి బేరం పోయిందని తన దురదృష్టాన్ని తిట్టుకుంటాడు. కర్పూరం లాంటి బెల్లం పదిబండ్లు కావాల్సిన చెరకు నీరు లేకపోవడంతో వాడిపోయిందని, బెల్లం ఆడితే, ఆడిన ఖర్చు కూడా రాదని, శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరైందని ఎంతగానో దిగులు చెందాడు. ఇలా అధి కారుల నిర్లక్ష్యం, స్వార్థం కారణంగా పంట ఒకవైపు నీరు లేక ఎండిపోయి జీవయ్య అవస్థ పడుతుంటే, మరోవైపు సకాలంలో శిస్తుకట్టాలని నిర్బంధించేవాళ్ళు.

అధికారుల వల్ల జీవయ్య నీరులేక పంటలను కోల్పో తుంటే మరోవైపు ప్రకృతి వైపరిత్యాలు అతన్ని వెంటాడు తున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కరువు కాటకాలు సంభవించడం జరుగుతున్నాయి. వీటికితోడు ఎలుకలు, చీడ పురుగులు, మిడతలు, నక్కలు, పక్షులు దయలేని శత్రువుల్లా అందివచ్చిన కాస్త పంటను దోచు కుంటున్నాయి. అందుకే వ్యవసాయదారులకు మిత్రుల కంటే శత్రువులే ఎక్కువని, ఒకవైపు దయలేని అధి కారులు, మరోవైపు ప్రకృతి వైపరీత్యాలవల్ల సామాన్య రైతాంగ జీవితం అడకత్తెరలో పోకచెక్కలా రైతు జీవితం తయారైందని రచయిత వాపోయాడు. జీవయ్య కంటే చదువులో వెనుకబడే మణీగారి కొడుకు ఎలాగో డిగ్రీ పూర్తి చేసుకొని పొలం అమ్మి పట్టణంలో లక్షలు సంపా దించి లక్షాధికారవుతుంటే, పొలాన్ని నమ్ముకున్న జీవయ్య అధికారుల నిర్లక్ష్యానికి, ప్రకృతి వైపరీత్యాలకు జీవనాన్ని గడపటానికి నానావస్థలు పడుతూ, నీరులేక ఎండిపోతున్న పంటలతో తమ శ్రమంతా వృథా అయిందని ఎండి పోతున్న పంటను చూడలేక మిక్కిలి బాధతో గుండె ఆగి పొలంలోనే కూలబడ్డాడు.

రైతుసమస్యలను చిత్రించే మరో కథ గోపిని కరుణాకర్ రచించిన 'దేవరెద్దు' కథ. ఈ కథ చిత్తూరు పడమటి ప్రాంతంలో సకాలంలో వర్షాలు లేకపోవడం వల్ల రైతులు ఎలా అప్పులపాలైపోతున్నారో, ఎటువంటి కడు దయ నీయమైన జీవితాన్ని గడుపుతున్నారో, అప్పులు తీర్చలేక ఎలా ప్రాణాలను కోల్పోతున్నారో, తగిన ఆర్థిక స్తోమత లేని కారణంగా బంధాలు ఎలా తెగిపోతున్నాయో చిత్రించు అద్భుతమైన కథ.

'దేవరెడ్డు' కథలో ఎంగ్రటవణ పీలేరు ప్రాంతానికి చెందిన ఒక యువరైతు. సకాలంలో వర్షాలులేక పోవడంతో చేసిన అప్పులు తీర్చలేక తండ్రి మరణిస్తే, బ్రతుకుతెరువుకోసం ఎంగ్రటవణ వ్యవసాయాన్నే నమ్ము కున్నాడు. ఎంగ్రటవణ చిన్నప్పటి నుండే వ్యవసాయ పనుల్లో ఆరితేరినవాడు. మేనమామ చేత సెబాష్ అని పించుకొన్నవాడు. తన కూతుర్ని ఎంగ్రటవణకు ఇవ్వ డానికి చిన్నప్పుడే మామచేత మాట పొందినవాడు. కాని వర్షాభావం వల్ల ఎంగ్రటవణకు వ్యవసాయం కలసి రాలేదు. తండ్రి లేని ఎంగ్రటవణ పశువుల్ని నమ్ముకుని బ్రతుకు జీవిస్తున్నాడు. ఎంగ్రటవణ తల్లి తన కుమారునికి అన్న కూతుర్నిస్తాడనే నమ్మకంతో కాలం గడుపుతూవుంది. ఒకరోజు ఎంగ్రటవణ మేనమామ కిష్టడు తన కుమార్తెకు తిరుమలకొండమీద పనిచేసే వ్యక్తితో పెళ్ళి కుదిరిందని, తాను మాట తప్పినందుకు క్షమించమని కోరగా, ఎంగ్రటవణ తల్లి తన అన్న కిష్టడితో పిల్లలిద్దరూ ఒకరినొకరు ఇష్టపడుతున్నారని, తన బిడ్డ కష్టపడి భార్యను పోషించు కోగలడని, ఇచ్చిన మాటను తప్పి తన బిడ్డకు అన్యాయం చేయవద్దని ప్రాధేయపడింది. కాని కిష్టడు వ్యవసాయాన్నే నమ్ముకున్న ఎంగ్రటవణకు కూతుర్నిస్తే, ఎర్రటి ఎండలో కష్టపడాలని, పస్తులతో అల్లాడాలని, దరిద్రంతో కాపురం చెయ్యాలని, అదే ఉద్యోగం ఉన్నవాడికి ఇస్తే నెలనెలా జీతంతో హాయిగా కాపురం చేసుకుంటుందని అన్నాడు. తన అన్న మాటలు విని ఎంగ్రటవణ తల్లి తన అన్నను నానావిధాలుగా శాపించింది. కాని కిష్టడు తన చెల్లితో "చెల్లె... నిన్ను ఎన్నుమింద గువ్వను సాకినట్టు సాకితిమే. ఏ పొద్దన్నా ఇట్టుండే పుల్లతీసి అట్టేసి ఎరుగుదువా? చిన్న వగిసిలో ఎన్ని అగసాట్లు పడితివి. ఎన్ని అగమానాలు పడితివి. ఈడ్ని సాకేదానికి ఎన్ని తిప్పలు పడితివి. తాళి బొట్టుతో సహా కుదువ పెట్టి పంట పండిస్తే ఏం మిగిలింది? అప్పులే కదా మిగిలింది. చేసిన అప్పులు తీర్చలేక, నీ మొగుడు పురుగులు మందు తాగి సచ్చె. సేద్దిం జూదం గదా! వద్దు చెల్లే చూసిచూసి నా బిడ్డగొంతు కొయ్యలేను. నువ్వు ఎన్నైనా తిట్టు నాకు బాధ లేదు. నా బిడ్డ సుఖమే నాకు ముఖ్యం" అని వెళ్ళిపోయాడు. ఈ కథలో రచయిత వర్షాభావ ప్రాంతాల్లో రైతు దయనీయ మైన జీవిత విధానాన్ని చిత్రిస్తూ, రైతులు ఎలా అప్పుల పాలౌతున్నారో, ఆత్మహత్యలకు ఎలా పాల్పడుతున్నారో, చివరకు లేమి కారణంగా అనుబంధాలు ఎలా తెగి పోతున్నాయో చక్కగా వివరించాడు.

డా॥లంకిపల్లి కన్నయ్య నాయుడు రచించిన 'జీవనం', గోపిని కరుణాకర్ రచించిన 'దేవరెడ్డు' కథలు రైతులు ఎదుర్కొంటున్న ప్రకృతి వైపరీత్యాలను, అధికారుల నిర్లక్షంవల్ల ఏర్పడే కరెంటు సమస్యలను చిత్రిస్తే, పలమనేరు బాలాజి రచించిన 'తపన', బడబాగ్ని శంకర రాజు రచించిన 'ఆఖరితడి' కథలు సన్నకారు రైతులపై పెద్దరైతులు ప్రదర్శిస్తున్న దౌర్జన్యాకాండను విశదీకరిస్తుంది. అంతేగాకుండా 'తపన' కథలో నీటికోసం బోర్లేసినా ఫలితం లేకపోవడంతో అప్పులబాధలతో రైతుల ఆత్మహత్యలు చేసుకున్న సంఘటనలను రచయిత చిత్రించాడు. 'తపన' కథలో చిన్నరైతైన గోవిందయ్యపై ఈర్ష్యతో మునివెంకటరెడ్డి గోవిందయ్య బోరు ఎండిపోవాలనే దురుద్దేశంతో పదమూడు బోర్లు వేసినా నీరు రాక పోవడంతో ఆత్మహత్య చేసుకుంటాడు. మునివెంకటరెడ్డి బోర్లు వేయడం కారణంగా గోవిందయ్య బోరు ఎండి పోవడంతో గోవిందయ్య మరో బోరు వేయడం ప్రారంభిస్తాడు. కాని ఆ వేస్తున్న బోరు బండిని మునివెంకటరెడ్డి తన పలుకుబడిని ఉపయోగించి మధ్యలోనే ఆపి వేయిస్తాడు. ఆ కారణంగా అప్పులు చేసి బోరు వేస్తున్న గోవిందయ్య అప్పులు తీర్చలేననే దిగులుతో బోరుబావి వద్దే గుండెపగిలి మరణిస్తాడు. ఇలా అప్పుల బాధతో క్రుంగి ఆత్మహత్యలకు పాల్పడ్డ రైతుల జీవితాన్ని రచయిత పలమనేరు బాలాజీ చక్కగా చిత్రించారు. అదే విధంగా బడబాగ్ని శంకరరాజు 'ఆఖరి తడి' కథలో చెరువుల నీటిపై ఆధారపడి జీవించే రైతుల్లో సన్నకారు రైతైన చంద్రన్న, పెద్ద రైతైన నరసింహారెడ్డిలకు వంతుల

విషయంలో వ్యక్తిగత కక్ష్యలకు, ఆధిపత్యపు పోరుల కారణంగా నిరంతరం రైతుల పరిస్థితి నిప్పుల కొలిమిలా వుంటుంది. ఆ శత్రుత్వకారణంగా చంద్రన్నను నరసింహా రెడ్డి హత్యగావిస్తాడు. ఇలా అప్పులబాధలతో, అంతర్గత కలహాలతో రైతులు ఎలా జీవితాన్ని గడుపుతున్నారో 'తపన', 'ఆఖరి తడి' కథలలో చిత్తూరు కథకులు చిత్రించారు.

రైతుల సమస్యలను చిత్రించు మరో కథ వీరపల్లి వీణావాణి రచించిన 'మూలాధార చక్రం'. ఈ కథ నేటి రైతులు ఎదుర్కొంటున్న అధికమైన వ్యవసాయ వ్యయ సమస్యను చిత్రించింది. పొలాన్నమ్మి తన కొడుకుకి ఉద్యోగం కొనివ్వాలని వచ్చిన వీరపల్లి వీర్రాఘవులను పాతికేళ్ళ ఉద్యోగ జీవితంలో 8 రెట్లు జీతం పెరిగితే తన యాభై సంవత్సరాల క్రితం తనకొచ్చిన రాబడిలో సగానికి పడిపోయిందని బాధపడతాడు. పొలం మీద పెట్టె ఖర్చు నాలుగు రెట్లు పెరిగిపోయాయని, ఎరువుల దగ్గరనుండి ప్రతి వస్తువు రేటు పెరిగిపోయాయని బాధపడ్డాడు.ధరల రేటు పెరిగిపోతే ప్రతి 6 నెలలకు ఒక సారి కరువు భత్యం అందించే ప్రభుత్వం, మాకు మాత్రం ఎలాంటి భత్యాలను అందివ్వదని వీరపల్లి వీర్రాఘవులు తండ్రి నాగన్న బాధపడలేదు. ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ఏమాత్రం రైతులను ఆదుకోవడం లేదని, నేడు వ్యవసాయానికి, లాటరీకి పెద్ద తేడా లేదని నిట్టూర్చుతాడు. ఈ మూలాధార చక్రం కథలో రైతులపై పడే వ్యవసాయపు ఖర్చులు ఎలా పెరిగిపోతున్నాయో, వాటిని భరించడానికి ప్రభుత్వాలు ఎలా దోహదం పడలేకపోతున్నాయో రచయిత వీరపల్లి వీణా వాణి చక్కగా వివరించాడు.

ఇలా చిత్తూరు రైతులు అధికారుల కారణంగా ప్రకృతి వైపరీత్యాలు, పెద్దరైతుల ఆధిపత్యపు పోరు, ప్రభుత్వపు నిరాదరణ మొదలైన కారణాలచేత ఎంతటి దయనీయ జీవితాన్ని గడుపుతున్నారో "చిత్తూరు కథ"సంకలనంలో చిత్తూరు కథకులు రైతుల సమస్యలను సమాజానికి తెలియపరచారు.

## పరిశీలనా గ్రంథాలు :

1. చిత్తూరు కథ (సంకలనం) - బాలసుబ్రమణ్యం, పేరూరు.
2. రైతు కథలు (సంకలనం) - నాగరాజు సాకం
3. కడప కథ (సంకలనం) - ఓబుల్ రెడ్డి తవ్వా
4. తెలుగు సాహిత్య చరిత్ర - ద్వానా శాస్త్రి

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దేవరాజు మహారాజు "కడుపు కోత" కథా సంపుటి విశ్లేషణ

**- ధీరావత్ లక్ష్మణ్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

ప్రఖ్యాత కవి, కథా రచయిత, నాటక కర్త, అనువాద కుడు, కాలమిస్ట్ అన్నిటినీ మించి పాపులర్ సైన్స్ రచయిత. కవిగా అర్ధ శతాబ్ది (1960-2010) పూర్తి చేసుకున్న నిత్యకృషీవలుడు.

దేవరాజు మహారాజు 21 ఫిబ్రవరి 1951న వరంగల్లు జిల్లా, కోడూరు గ్రామంలో జన్మించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి 1975లో యం.యస్‌సి, 1979లో పిహెచ్.డి. తీసుకొని, వృక్ష పరాన్నజీవులపై పరిశోధనలు చేస్తూ, చేయిస్తూ, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకు, పరిశోధక విద్యార్థులకు జువాలజి ప్రొఫెసర్‌గా ముప్పయేళ్ళు మార్గదర్శనం చేశారు. పరాన్న జీవశాస్త్రం లోంచి సామాజిక పరాన్నజీవుల పైకి దృష్టి సారించడం, ఒక తాత్విక భూమికను రూపొందించుకుని రెండిటి మధ్య ఒక వారధిలా నిలబడగలగడం ఈయన ప్రత్యేకత.

తెలంగాణ ప్రజల భాషలో కవిత, కథ చెప్పి, మెప్పించి, కవిగా, కథకుడుగా స్థిరపడ్డారు. భారతీయ భాషల కవిత్వాన్ని, కథల్ని తెలుగులోకి అనువదించి, తెలుగు కళ్ళకు ఇరుగుపొరుగు దృశ్యాల్ని చూపించారు. వెండితెర కవిత్వంగా కొనియాడబడుతున్న భారతీయ సమాంతర సినిమాను విశ్లేషించారు.

"కడుపకోత" కథా సంపుటిలోని కథలను విశ్లేషించడం ఈ వ్యాసరచన ఉద్దేశం.

"కడుపుకోత" కథ తెలంగాణ మాండలికంలో రాయబడినది. తెలుగు సాహిత్యంలో మాండలికాన్ని మొదట ప్రవేశపెట్టింది గురజాడ అప్పారావు. తొలిసారిగా మాండలికంలో కథలు రాసిన వారు మాధవపెద్ది గోఖలే. తెలంగాణ మాండలికంలో కథలు రాయడానికి పూనుకున్న తొలి రచయిత వట్టికోట ఆళ్వార్‌స్వామి. ఆకాలంలో గూడూరు సీతారాం, సురమౌళి, యశోదారెడ్డి మొదలైన వారు తెలంగాణ జీవితాన్ని ప్రతిబింబిస్తూ, ఆ భాషలో కథలు రాశారు. తర్వాత అల్లం రాజయ్య, కాలువ మల్లయ్య, బి.ఎస్.రాములు, రఘోత్తమ రెడ్డి, పడాల రాములు మొదలైన వారు ఈకోవలోకి వస్తారు.

'కడుపుకోత' కథ ఈవిధంగా మొదలవుతుంది. "కమలమ్మను దావాఖాన్ల శరీకు జేశింద్రు. దానికి కడుపు నొప్పి. ఇయ్యాల్లనా, నిన్ననా ఎన్నొద్దుల్నించి అగోరిస్తాంది. మంత్రాలు, తాయిత్తులు ఎన్ని గట్టినా తక్వగాలే. ఎందరి వైద్యులతాన మందు దిన్నా తక్వగాలె. ఆకాడికి అల్లుడు మంచోడు. నా బిడ్డ ఆగమ్మ పక్షోలే తల్లడిల్లుతుంటే కొంటవోయి ఉస్మానియాల ఏశిండు. పెద్ద డాక్టర్లు జూసి ఆపరేషను జెయ్యాలన్నారు." ఈరకంగా కథంతా ఒక ముసలవ్వ అనుభవంలోంచి ఆమె మాటల్లోనే సాగి పోతుంది. బిడ్డ ఆపరేషను గురించి మొదటిసారిగా హాస్పిటల్‌కు వచ్చిన ముసలవ్వ అక్కడి అన్యాయాల్ని అసహ్యించుకుంటుంది. ఆపరేషన్ థియేటర్‌లోంచి బయటపడ్డ ఆమె కూతురు కమలమ్మ మెళ్ళో పుస్తెలతాడు మాయమవడం ఇందులోని ఇతివృత్తం.

కడుపుకోత కథ మహానగరంలోని ఆసుపత్రి వాతావరణంలో చిత్రిస్తే, "కండ్లు దెరిశిన నెత్తురు" కథ తాలూకా స్థాయిలో ప్రైవేట్ ప్రాక్టీస్ చేసుకుంటున్న ఫేక్ డాక్టర్స్ దొంగవైద్యుల మోసాల్ని వెల్లడించింది. "మంత్రం, చీకటి పడుతుంది" కథలు గ్రామ స్థాయిలో వైద్య విధానపు స్వరూప స్వభావాల్ని తెలియజేస్తాయి. అమాయక ప్రజలు మందుల ఖర్చులు భరించలేక మంత్రాలకుపోతే, మంత్రగాడు అంతకంటే ఎక్కువ అడుగుతాడు. వైద్యం చేసే బడిపంతులు ఫీజుగా డబ్బులు అడగడు. ఎప్పటి నుండో కన్నేసి ఉంచిన సోములు భార్యను కోరుకుంటాడు. ఈవిధంగా సమాజ రుగ్మతల్ని సరైన పంథాలో డయగ్నోజ్ చేశారు రచయిత.

"కోళ్ళపందెం" కథలో దొరలు తమ రైతు కూలీలను కోళ్ళుగా భావించి, వారి మధ్య పోటీ పెట్టి ఆనందించడం

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


జరుగుతుంది. కోళ్ళతో ఆడుకునేది సంవత్సరానికి ఒకసారయితే, వీరితో సంవత్సరం పొడుగునా ఆడు కుంటారు. ఊరి సర్పంచ్, కరణం రాజకీయాల మధ్య గ్రామంలోని మామూలు పేదజనం ఎలా నశించి పోతున్నారనేది వర్ణించబడింది.

నిజాం నీడలో, గ్రామాల్లో సాగిన భూస్వాముల ఆగ డాలు మనకు చిల్లరదేవుళ్ళు వంటి నవలల్లో కనిపిస్తాయి. నిజాం పరిపాలన అంతమైపోయి, స్వాతంత్ర్యం లభించిన తర్వాత కూడా పల్లెలలో, పెత్తందారుల జులుం నశించి పోలేదు. వెనకటిలా దొరలమని విర్రవీగలేరు. అట్లని మామూలు ప్రజలతో కలిసిపోనూ లేరు. అట్లాంటి క్లిష్ట పరిస్థితిని "పాతగోడ" కథలో చూడవచ్చు.

దొర బంగళాకు, ఇతర గ్రామస్తులు ఇళ్ళకు మధ్య ఎత్తుగా నిలబడి ఉన్న గడిగోడ కూలిపోవడం "పాతగోడ" కథలోని ఇతివృత్తం. దొరతనం కూలిపోయిందన్న అర్థం స్ఫురించేలా రాయబడ్డ ఈ కథలో - గ్రామస్తులు రాత్రికి రాత్రే వర్షానికి తడిసి ఉన్న గడిగోడను గడిలోకి పడగొడ తారు. అంటే దొరతనాన్ని పడగొట్టారని అర్థం.

జానపద వ్యక్తీకరణ గొప్పగా ఉన్న మరో కథ "యెలుగు మింగిన శీకటి". ఇందులో ప్రమాదవశాత్తు గుడిసెలు కాలిపోతే, గ్రామంలోని పటేలు ఇండ్లు కాలిన వారి దగ్గర చందాలు వసూలు చేసి ఫైరింజన్ వారికి మామూళ్ళు ఇవ్వదలచుకుంటాడు. "మూగమోసం" ఒక ప్రత్యేకమైన కథ. ఈ కథంతా రైలుబోగిలో నడుస్తుంది. రైలుబోగి సమాజానికి సంక్షిప్త స్వరూపం. సమాజంలో మోసం చెయ్యనిది ఎవరు? అందరూ ఎవరినో ఒకరిని ఏదో ఒకరకంగా మోసం చేస్తున్నవారే. జరుగుతున్న మోసాల్ని చూసి, తమకు పట్టనట్లు ఊరుకున్న వారు కూడా ఒక రకంగా మోసగాళ్ళే. ఈవిధంగా రచయిత కళ్ళెదుట ఉన్న సమాజంలోని అవకతవకల్ని తనదైన పద్ధతిలో కళాత్మకంగా చెప్పారు.

**ఆధార గ్రంథాలు :**

1. దేవరాజు మహారాజు, ఆవరణం, జీవన ప్రచురణలు, హైదరాబాద్, 2011.
2. దేవరాజు మహారాజు, కడుపుకోత, చైతన్య ఆర్గనైజర్స్, హైదరాబాద్, 1977.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# ఆత్రేయ నాటకాల్లో శిల్ప విన్యాసం

- వై. దివ్య, పరిశోధక విద్యార్థి, తెలుగు & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

భారతీయ నాటక సాహిత్యానికి సుదీర్ఘమైన చరిత్ర ఉంది. వేదాల్లోనే నాటకీయ ఛాయలున్నట్లు పరిశోధకులు పేర్కొంటున్నారు. సంస్కృత సాహిత్యంలో నాటక సాహిత్యం ఒక ప్రత్యేకమైన శాఖగా విరాజిల్లినది. భాసుడు, మేఘుడు, కాళిదాసు, భవభూతి వంటి కవీశ్వరులు అత్యుత్తమ నాటకాలను రాశారు. 'నాటకాంతం హి సాహిత్యం' అనే నానుడి అందువల్లనే వచ్చిందని పండితులంటున్నారు. సంస్కృతంలో నాటకాలు వెలువడడమేగాకుండా ఆనాటక లక్షణాలను తెలిపే గ్రంధాలు కూడా ఎన్నో వెలువడ్డాయి. ప్రపంచంలోనే ఏ భాషలోనూ వెలువడనంతటి నాటక సాహిత్యం సంస్కృతంలో వెలువడింది.

సంస్కృతాన్ని అనుసరించిన తెలుగు కవులు సంస్కృత నాటకాలను శ్రవ్య కావ్యాలుగానే అనువదించారు. అయితే ఆధునిక యుగంలో ఆంగ్లేయుల ప్రభావంతో వినూత్న రీతిలో తెలుగు కవులు వందలాది నాటకాలు రాశారు. అలా ప్రారంభంలో తెలుగు కవులు పౌరాణిక వస్తువుతో నాటకాలు రాశారు. ఆ తర్వాత సాంఘిక, చారిత్రక, హేతువాద అంశాలను వస్తువుగా తీసుకుని నాటకాలు రాయడం ప్రారంభించారు. అలా రాయబడిన నాటకాల్లో ప్రముఖంగా చెప్పదగినవి ఆత్రేయ నాటకాలు.

ఆత్రేయ కలం నుంచి గౌతమబుద్ధ, అశోక సామ్రాట్, పరివర్తన, వాస్తవం, ఈనాడు, ఎన్ జి ఓ, విశ్వశాంతి, కప్పలు, భయం, మనసూ-వయసూ నాటకాలు వెలుపడ్డాయి. ఇందులో చారిత్రక, సాంఘిక నాటకాలూ ఉన్నాయి. ప్రతి నాటకంలోనూ విషయం సుదీర్ఘంగా వివరించబడింది. అదే విధంగా శిల్పంకూడా చక్కగా చిత్రించబడింది. ఈ శిల్పం మూలంగానే వీరినాటకాలు బహుళ ప్రజాదరణ పొందాయని చెప్పవచ్చు. భాష భావ వ్యక్తీకరణలో ఆత్రేయ గారు తగు జాగ్రత్తలు తీసికున్నారనవచ్చు.

ప్రాచీన భారతీయ లాక్షణికులు శిల్ప శబ్దాన్ని పారిభాషికార్థంలో ప్రయోగించిన దాఖలాలు లేవని డా॥ పోరంకి దక్షిణామూర్తి తెలిపారు. మహాకవి తిక్కన మాత్రం 'అమలోదాత్త మనీష నేను భయ కావ్య ప్రౌఢిఁ బాటించు శిల్పమునం బారగుడం, గళా విదుఁడ' అని నిర్వచనోత్తర రామాయణంలో పేర్కొన్నాడు. ఇక్కడ ఈ శబ్దానికి నైపుణ్యం అనే సామాన్యార్థమే కాని పారి భాషికార్థం లేదు. సంస్కృతం ఇంగ్లీషు నిఘంటువులో శిల్ప శబ్దానికి ఆప్టే మహాశయుడు 'ఒక కళ, లలితమైన లేదా యాంత్రికమైన కళ, నైపుణ్యం, ఉపాయం, ప్రతిభ, కౌశలం పని, కాయకష్టం, ఆచార కాండ, యజ్ఞంలో వాడే ఒక రకం గరిటె అనే అర్థాల్నిచ్చాడు. మనం ఒక శిల్పాన్ని చూస్తే అది శాశ్వతంగా గుర్తుంటుంది. అదేవిధంగా నాటకంలో కూడా శిల్ప కళ ఉట్టిపడాలి. ప్రేక్షకుడు పాత్రల సంభాషణలో నటన చూస్తున్నపుడు దృశ్యాన్ని అంటే శిల్పాన్ని చూసినంత భావన కలగాలి. దీనిని నాటక కర్తలు చక్కగా పోషించాల్సి ఉంటుంది. ఆత్రేయ తన నాటకాల్లో చక్కని శిల్పాన్ని పాటించాడని చెప్పవచ్చు.

ఆత్రేయ నాటకాల్లోని శిల్ప సౌందర్యాన్ని ఈ అంశాల ఆధారంగా నిర్ధారించవచ్చు.

1. వస్తు విన్యాస శిల్పం
2. పాత్ర చిత్రణ శిల్పం
3. సంఘటన ఘటనా శిల్పం
4. సంఘర్షణోత్పాదన శిల్పం
5. సన్నివేశ కల్పనాశిల్పం
6. కథన శిల్పం
7. వర్ణన శిల్పం
8. శీర్షికా శిల్పం

ఈ అంశాలను ఈ వ్యాసంలో విశదీకరించడంతో బాటు సోదాహరణంగా తెలపడం జరిగింది.

### 1. వస్తు విన్యాస శిల్పం :

రచయిత తానెన్నుకొన్న వస్తువులోనుంచి ఒక ప్రణాళికను రూపొందించుకొని, తదను సారంగా వివిధ అంశాలను పొందుపరచి నాటక శరీరానికొక సౌష్ఠవం, సౌందర్యం సంతరింపజేస్తాడు. దీనినే 'వస్తు విన్యాస శిల్పం' అంటారు. ఆత్రేయ నాటకాలలో చక్కని వస్తు విన్యాస శిల్పం చిత్రించబడింది. ఈ విషయం వీరి ప్రతి నాటకంలోనూ ద్యోతకమవుతున్నది. ఉదాహరణకు గౌతమబుద్ధ నాటకాన్ని పేర్కొనవచ్చు. ఈ నాటకంలో వస్తువు గౌతమ బుద్ధుని జననం మొదలు విరాగిగా మారి జ్ఞానం పొంది తన ఉపన్యాసాలతో ప్రజల్లో ఆధ్యాత్మిక చైతన్యం తెచ్చిన తీరును రీతిని చక్కగా చిత్రించాడు ఆత్రేయ. ఇందులో పదిరంగాలు ఉన్నాయి. ఒక్కొక్క రంగంలో ఒక్కో అంశాన్ని ఎన్నుకొని అద్భుతంగా కథను విన్యాసం చేస్తూ చిత్రించాడు. వీరి పది నాటకాలూ దీనికి హేతువులుగా ఉంటున్నాయి.

### 2. పాత్ర చిత్రణ శిల్పం :

నిత్య జీవితంలో ఒక్కొక్క వ్యక్తికున్న వైయక్తిక మూర్తిమత్వంలాగే, రచయిత చూపే పాత్ర చిత్రణ శిల్పంతో, సాహితీ గతమైన పాత్ర కూడా పాఠకుడి మనస్సులో నిలిచిపోతుంది. ఆత్రేయ నాటకాల్లో దాదాపు 150 పాత్రలుంటాయి. ఒక్కొక్క పాత్రది ఒక్కో వ్యక్తిత్వం. 'వాస్తవం' నాటకంలో రామయ్య పాత్రధారి ఇలా అంటాడు ఒక సందర్భంలో.

"ఏమిటో కలికాలం! అంతా తల క్రిందులైంది. అన్యాయం పెరిగిపోతూంది. తిన్న యింటికి వాసాలెంచే తత్వం అధికమవుతూంది. పెట్టి పోషించే వాడికే గుంట తవ్వడం మొదలెట్టారు. చూచారూ? వచ్చింది... ఆ శాస్త్రాల్లో చెప్పారే ఆ ప్రళయం - అంతా వినాశనం చేసే ప్రళయం. అది దాపురించింది... భగవద్గీతలో అన్నట్లు 'యదాయదాహి ధర్మస్య గ్లానిర్భవతి భారతా! అభ్యుత్థానమధర్మస్య తదాత్మానం సృజామ్యహం' అని భగవంతుడు ఎక్కడో ఎప్పుడో అవతరించాడు అధర్మాన్ని నిర్మూలించటానికి తప్పదు" అంటాడు. ఇలా ప్రతి ఒక్కో అంశాన్ని విపులంగా వీక్షకులకు వివరిస్తుంది. దీంతో ప్రజల్లో చైతన్యం వస్తుంది.

### 3. సంఘటన ఘటనా శిల్పం :

కథలో ఆకర్షక కేంద్రాలుగా భాసించేవి సంఘటనలు. వీటిని సహజంగా, సమర్థంగా, రోచకంగా కూర్చడం, ప్రభావ స్ఫోరకంగా నిర్వహించడం గొప్ప శిల్పం. ఈ శిల్పాన్ని, ఆత్రేయ చక్కగా చిత్రించాడు. కవి పాత్ర ధారి ఒక సంఘటనలో ఇలా అంటాడు 'పరివర్తన' నాటకంలో.

"పేద కుటుంబం నాది. ఉన్నది కాస్తా అమ్మి నాకు బి.ఏ వరకు చదువు చెప్పించారు. వంశాన్నుద్ధరిస్తారని ఎన్నో ఆశలు పెట్టుకున్నారు తల్లిదండ్రులు. చదువు పూర్తయింది. ఆస్తీ హరించిపోయింది. అప్పటికే నాకు కవిత్వంలో ప్రవేశం వుంది. ఉద్యోగ ప్రయత్నంలో కొన్ని సంవత్సరాలు గడిచినవి. దాసూ! కవిత్వం నువ్వెరగవు. కవివింత మనిషి. కవి గుమస్తా కాలేడు. కవి చేయతగ్గ ఉద్యోగాలు చాలా తక్కువ వున్నాయి ఈ సంఘంలో. అందుచేత ఏ ఉద్యోగాన్నీ అంటి పెట్టుకొని వుండలేక పోయాను. అది నా తప్పే కావచ్చు. కానీ ఈ ప్రపంచం నన్ను మోసం చేసింది. కవిగా పెద్ద భవిష్యత్తు కలదని కలలు రేపింది. కవిగా బ్రతగ్గలననే స్వప్నంలో నన్ను కూలదోసింది" అంటాడు. ఇలా ఒక పాత్ర సందర్భానికి తగినట్లు సంఘటనలు సృజించుకొని ఆయా సంఘటనల ద్వారా వివిధాంశాలను వీక్షకులకు తెలియ జేస్తున్నది.

### 4. సంఘర్షణోత్పాదన శిల్పం :

పాత్రల మనస్సుల్లోగాని, బయట గాని పాత్రకూ ప్రకృతి శక్తికి మధ్య కాని సంఘర్షణను సార్థకంగా ఉత్పాదన చేయడమన్నది ఒక శిల్పం. దీనికి తోడ్పడేవి సంఘటనలు కావచ్చు, పాత్రల ఆలోచనలు కావచ్చు. ఆత్రేయ నాటకాల్లో పాత్రలు ఎంతో సంఘర్షణకు లోనవుతాయి. 'గౌతమబుద్ధ' నాటకంలో ఇల్లు వదలి వెళ్ళే సందర్భంలో గౌతముడు ఇలా సంఘర్షణకు లోనవుతాడు.

"లేదు. యశోధరను కడపటిసారి చూసివస్తాను. పాపం మూర్తీభవించిన సౌందర్య రాశి. నా తోడిదే లోకమని తన సర్వస్వం నాకర్పించింది. యశోధరా! తండ్రి యెవరనే

ప్రశ్నకు తల్లి కన్నీటిలో బదులు తీసుకోబోయే పాపాయి - లోకోపకారార్థం మిమ్మల్ని విడిచిపోతూన్న నన్ను చిరు నవ్వుతో పంపండి'' అంటాడు. ఒక పక్క జ్ఞానాన్వేషణ, మరొక పక్క భవబంధాలు గౌతమున్ని సంఘర్షణకు లోను చేస్తాయి. ఇలాంటి సంఘర్షణాత్మక అంశాలు ఆత్రేయ నాటకాల్లో చాలా ఉన్నాయి.

## 5. సన్నివేశ కల్పనాశిల్పం :

కథలో జరిగే వాటికి అనుగుణమైన పరిసరాలను నేపథ్యాలను, వాతావరణ స్థితిగతులను అత్యంత సహ జంగా ప్రతీకాత్మకంగా చిత్రించడమన్నది 'సన్నివేశ కల్పనా శిల్పం'. కథాగతమైన పాత్రల బాహ్యాభ్యంతర స్థితులకూ సంఘటనలకూ సంఘర్షణకూ పోషకమైనదిది. ఆత్రేయ నాటకాల్లో చక్కని సన్నివేశాలు సృజించబడ్డాయి. 'వాస్తవం' నాటకంలో రామయ్య పాత్ర ధారి ఇలా సన్నివేశాన్ని కల్పించుకొని మాట్లాడతాడు.

''అవును సుబ్బన్నా! కాలం మారిపోయింది. నా చిన్న తనంలో ఈనెలలో ఈపాటికి యింత మిడి మేలపు ఎండలు ఎరగను. ప్రపంచంలో ఎప్పుడూ అన్యాయం, అక్రమం, అధర్మం అధికమై పోయిందో, అప్పుడే అన్నీ తల క్రిందులవుతాయి. మానవ ప్రకృతి ఎప్పుడు మారిందో, దానితో బాటు మిగతా నేచర్ అంతా కూడా మారిపోతుంది'' అంటాడు. ఒక కావ్యం పాఠకాదరణ పొందడానికి సన్నివేశాలు, సంఘటనలు, వారి పర్య వసానాలు ఉండాలి. వాటి ద్వారా వీక్షకులు, పాఠకులు మార్పు చెందుతారు. ఈ సత్యాన్ని ఆరుద్ర గుర్తించి తన నాటకాల్లో వివిధ సన్నివేశాలు కల్పించాడు.

## 6. కథన శిల్పం :

దృక్పథ నిర్దేశంలో, భాషా శైలిలో, వర్ణన విధానంలో సంవిధాన పద్ధతిలో భాసించే నైపుణ్యాన్ని కథన శిల్పంగా పరిగణిస్తారు. ఆత్రేయ నాటకాల్లో చక్కని కథన శిల్పం ఉంది. నాటకం చూస్తున్నా, చదువుతున్నా తరువాత ఏమి జరుగుతుందో అన్న ఆతురత కలుగుతుంది. ఉదా హరణకు 'ఈనాడు' నాటకంలోని ఈ సంభాషణ ఈ విషయాన్ని రుజువు చేస్తున్నదనవచ్చు. నసీం పాత్ర ధారి ఇలా అంటాడు.

''ఏమిటా నిరుత్సాహం! పేద ప్రజలు పిడికిలి బిగిస్తే వింధ్య పర్వతమైనా విరిగిపోతుంది. ఈమత కలహాలలో చస్తున్నది మనం. మనకు రాజకీయాల్లేవు. మనకు మతాల్లేవు. కులాలవసరం లేదు. మనమంతా ఒకటే కులం, కష్టజీవులం. మన రాజకీయాలు, తిండి గుడ్డ మన మతం సమ్మతం. అంటే చెల్లీ! ఈ అనలాన్ని రేపింది స్వార్థ పరులు, గూండాలు. వాళ్ళకు తుపాకులు, జీపులు, బాంబులు సరఫరా చేశారు. మూటా ముల్లెతో కదులు తూన్న తెల్లవాళ్ళు, సంస్థానాధీశులు చేతులు కలిపారు. కానీ అన్ని ప్రదేశాల్లోని అల్ప సంఖ్యాకులు, అన్ని మతాల వారు ఏకమైతే'' అంటాడు. ఒక కావ్యానికి లేదా నాటకానికి కథనం ప్రాణం వంటిది. ప్రాణం ఉంటేనే జీవి చైతన్యంతో ముందుకు కదులుతుంది. అదేవిధంగా నాటకంలో కూడా కథనశిల్పం ప్రధాన భూమిక వహిస్తుందని చెప్పవచ్చు.

## 7. వర్ణన శిల్పం :

వర్ణన కథా కథనంలో అంతర్భాగమే అయినప్పటికి దానికొక విశిష్ట శిల్పమున్నందువల్ల ప్రత్యేకంగా గుర్తించక తప్పదు. ఆత్రేయ తన నాటకాల్లో చక్కగా వర్ణనలు చేశాడు. 'అశోక సామ్రాట్' నాటకంలో తిష్య పాత్రధారి ఇలా అంటాడు. ''కానీ అనంతమైన జీవితం ప్రేమోపాస కుడైన మౌనివలె ఈయవ్వన వార్ధక్యాల వంక చిరునవ్వుతో చూస్తుంటుంది'' అంటాడు. జీవితాన్ని, మౌని ధ్యానాన్ని, యవ్వనాన్ని, వార్ధక్యాన్ని రచయిత చక్కగా అన్వయించి వర్ణించి చెప్పాడు. వర్ణనలు ప్రాచీన సాహిత్య లక్షణమైనా వర్ణనలు లేనిదే ఏ సాహిత్యమైనా రాణించదు. దాని పేరులో మార్పు ఉండవచ్చు గానీ లక్షణంలో మార్పుం డదు.

## 8. శీర్షికా శిల్పం :

సుందరమైన విగ్రహానికి నొసటి తిలకంలాగే చక్కటి నాటకానికి మరించ చక్కదనం చేకూర్చేది పేరు. ఈ పేరు సర్వసాధారణంగా ఆనాటకంలోని పాత్ర పేరైన

కావచ్చు.అందులోని సంఘటనలు లేదా సన్నివేశం అయినా కావచ్చు. ఆత్రేయ చక్కని శీర్షికా శిల్పాన్ని పాటించాడు. అశోక సామ్రాట్ నాటకంలో ఈ శీర్షిక ఇలా ప్రయోగించబడింది.

''కాదు, నాయనా! శాంతి అశోక సామ్రాట్టుకు, సామ్రాజ్యానికే శాంతి ప్రదాయిని అంటాడు. అదేవిధంగా 'భయం' నాటకంలో ఆశబ్దం ఇలా ప్రయోగించబడింది. 'అయిపోయింది. అంతా ఖాళీ అయిపోయింది. ఇంక భయమే' లేదు. నేనెందుకు చస్తాను'' అంటూ నాటకాన్ని ముగిస్తాడు. ఆత్రేయ ప్రాచీన నాటక ఫణితిని వదల కుండా ఆధు నిక దృక్కోణంతో నాటకాలు రాశాడు. ప్రతి నాటకంలోనూ చక్కని సామాజిక స్పృహ కనిపిస్తుంది. పాత్రల్లో జీవం కనిపిస్తుంది. కథా కథనంలో ఐక్యత కనిపిస్తుంది. సంభా షణల్లో చతురత కనిపిస్తుంది. భాష ప్రయోగంలో సరళత తాండవమాడుతుంటుంది. అయితే వీరి నాటకాలు వివిధ రంగాలతో విస్తృతంగా ఉంటాయి. ఒక విషయాన్ని సమగ్రంగా చెప్పడానికి ఏ రచయితకైనా ఇంతకంటే సౌలభ్యం మరేమి ఉంటుంది. ఈ విధంగా ఏ కోణంలో చూసినా ఆత్రేయ నాటకాల్లో చక్కని శిల్పం చిత్రించ బడిందని రూఢిగా చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. ఆత్రేయ సాహితి - మొదటి, రెండో సంపుటాలు.
2. ఆంధ్రనాటక వికాసం - పి ఎస్ ఆర్ అప్పారావు
3. నాటకా పంచ వింశతి - సం॥ కొర్రపాటి గంగాధరరావు
4. కథానిక స్వరూప స్వభావాలు - డా॥ పోరంకి దక్షిణా మూర్తి
5. సాహిత్య భావలహరి - ఆచార్య యస్వీ జోగారావు
6. సాహిత్య శిల్ప సమీక్ష - ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# దళిత దృక్కోణంలో "స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్" కావ్యం

- డా॥ ఎస్. ఈశ్వరరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, యోగి వేమన విశ్వవిద్యాలయం, కడప.

భారతదేశానికి స్వాతంత్ర్యం కోసం మహాత్మగాంధీ, స్వాతంత్ర్యానంతర సామాజిక న్యాయం కోసం డా॥ బి.ఆర్. అంబేద్కర్ కీలకపాత్ర పోషించారు. అట్టడుగు వర్గాల సమగ్ర అభివృద్ధితోనే భారతజాతి బలోపేతం అవుతుందని బలంగా విశ్వసించిన వ్యక్తి అంబేద్కర్. భారత స్వతంత్ర్య సంగ్రామ వీరులపై తెలుగులో అనేక కవితలు, కావ్యాలు వచ్చాయి. అంబేద్కర్‌పై రావాల్సినన్ని రచనలు రాలేదు. లభ్యమౌతున్న వాటిలో డాక్టరు యెండ్లూరి చిన్నయ్య, డాక్టరు బి. విజయ భారతి గార్లు అంబేద్కర్ చరిత్రను తెలుగు వచనంలో అందించారు. అదే క్రమంలో జల్లి రాజగోపాలరావు 'స్ఫూర్తిప్రదాత అంబేద్కర్' అనే శీర్షికతో ఒక దీర్ఘకవిత రాశారు. ఈ కవితలో కనిపించే అంబేద్కర్ చరిత్రను పరామర్శించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం. ఇది అసంపూర్ణ జీవిత చరిత్ర.

అంబేద్కర్ జననం (1891) నుంచి 1930లో నాసిక్ 'కాలారాం' దేవాలయ ప్రవేశోద్యమం వరకు అంబేద్కర్ చరిత్రను కవిత్వీకరించాడు రాజగోపాల్. పన్నెండు ఖండికలు ఈ దీర్ఘకవితలో ఉన్నాయి. అంబేద్కర్ జీవితంలోని ముఖ్య ఘట్టాలను ఇందులో స్పృశించాడు రాజగోపాల్. జననం, విద్యాభ్యాసం, విదేశీప్రయాణం, తండ్రి రాంజీ మరణం, బరోడా సంస్థానంలో అవమానాలు, సైమన్ కమిషన్, మహద్‌చెరువు పోరాటం, మనుస్మృతి దహనం, దేవాలయ ప్రవేశ పోరాటం వంటి కీలక ఘట్టాలు ఇందులో ఉన్నాయి.

ప్రారంభంలోనే అంబేద్కర్ సైమన్ కమిషన్‌ను ఉద్దేశించి ఉటంకించిన వాక్యాలను గుర్తుచేసి, అంబేద్కర్ వ్యక్తిత్వానికి మెరుపులు కూర్చాడు కవి.

"ఏ దేశమూ - ఏ దేశాన్ని
పాలించేటంతటి గొప్పదికాదు
ఏ జాతీ మరో జాతిపై పెత్తనం
చెలాయించే అధికారం లేదు" అంటూ సర్వమానవ సమానత్వాన్ని, సర్వజన స్వేచ్ఛను ఆకాంక్షిస్తూ చెప్పిన వాక్యాలు మానవ సమాజ నిర్మాణ చరిత్రలో శాసనాలుగా నిలవడానికి అర్హమైనవి.

## అంబేడ్కర్ జననం : విద్యాభ్యాసం :

అంబేద్కర్ మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా 'అంబవదేకర్' గ్రామంలో జన్మించాడు. రాంజీసక్‌పాల్, భీమాబాయి తల్లిదండ్రులు. మహర్ కులానికి చెందిన ఆదర్శ దంపతులకు కడగొట్టు బిడ్డడుగా 1891 సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన అంబేద్కర్ జన్మించాడు. అంబేద్కర్ అసలు పేరు భీమారావ్, ఇంటిపేరు 'అంబావదేకర్'. స్కూలు రికార్డులు రాసిన ఒక ఉపాధ్యాయుడు అంబావదేకర్‌కు బదులుగా 'అంబేద్కర్' అని రాయడం వల్ల అదే పేరు స్థిరమై నిలిచింది.

అంబేద్కర్ బాల్యం కష్టాల సుడిగుండాల్ని చవి చూసింది. పాఠశాలలో చిరిగిన గోనెగుడ్డను అడ్డంగా పరచుకొని కూర్చునేవాడు. ఎవరినీ చూడకూడదు, దేన్నీ తాకకూడదు. 'మహర్' బాలుడు మాట్లాడితే మైలపడతామని భావించే ఉపాధ్యాయులు, ఆ బాల అంబేద్కర్ రాసిన ప్రశ్న - జవాబులను సరిదిద్దేవారు కాదు. దాహం వేస్తే సైగ చేయాలి, ఎవరో వచ్చి నీళ్లు పైకెత్తి పోస్తే దోసిలి పట్టుకొని తాగాలి. 'బాల్యం నుండే అనుభవించిన అస్పృశ్యత, అంటరానితనం, అసమానతలు, అవహేళనలు అంబేద్కర్‌ను పోరాట యోధుడిగా మార్చాయి. ప్రజ్ఞా పాటవాలను ఆయుధంగా మార్చుకొని తన జాతి జీవనగతిలో మెలుగురేఖలు పూరించే 'అహస్కరుడు' అవుతాడని ఆనాడు ఎవరూ ఊహించి ఉండరు' అంటాడు కవి.

## వైవాహిక జీవితం :

17 ఏళ్ల వయసులో 9 స॥రాల 'రమాబాయి'ని వివాహం చేసుకున్నాడు అంబేద్కర్. బొంబయిలోని 'బైకుల్లా' బజారులో నిరాడంబరంగా పెళ్లి జరిగింది.

అంబేద్కర్‌కు తగిన సతిగా, అభిమానవతిగా రమాబాయి నిలిచిందని చెప్తూ..

'సాత్వికురాలు సమభావదర్శకురాలు
సతతం సహనం - సంస్కారం
మూటగట్టుకని జీవించిన ఇల్లాలు
పీడిత జాతి నేత
నవభారత నిర్మాత అంబేద్కర్
వెనుకనిలిచిన -వెలుగునిచ్చిన
మణి ఖని - శిరోమణి'' అంటాడు కవి రాజగోపాల్.

రమాబాయి వ్యక్తిత్వాన్ని ఆదర్శవంత ప్రయాణాన్ని నాలుగు మాటల్లో చిత్రించాడు కవి. అంబేద్కర్- రమా బాయిలకు నలుగురు సంతానం పుట్టగా అందులో రమేష్, రాజరత్న గంగాధర్‌లు గతించారు. యత్వంత్ ఒక్కడే మిలిగిన కుమారుడు. ప్రియ పుత్రులను కోల్పోయి 'నీరవ నిశ్శబ్ద దుఃఖితుడుగా' నిర్వేద భావనా భరితుడుగా' అంబేద్కర్ మిగిలాడని కవి వాపోతాడు.

**కళాశాల చదువు :**

1907 సం॥లో అంబేద్కర్ మెట్రిక్ పాసయ్యాడు. 'శ్రీ బోలే' కృష్ణాజీ అర్జున్ కేలూస్కర్' అంబేద్కర్‌పై అభి నందనలూ, ఆశీస్సులు కురిపించాడు. హైస్కూల్ నుండి కళాశాల స్థాయికి ఎదిగిన అంబేద్కర్ ఆ తరవాత ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలో చేరి అత్యంత శ్రద్ధగా చదువు కుంటున్న ఆయన్ను ఆర్థిక బాధలు చుట్టుముట్టాయి. తండ్రి రాంజీ సాయంతో, వీధి దీపాల వెలుగులో పరిశ్రమిస్తున్న అంబేద్కర్‌కు కేలూస్కర్ బరోడా మహారాజు శాయాజీ గౌక్వాడ్‌ను మెప్పించి ఉపకారవేతనం ఇప్పించి మహోపకారం చేశాడు. అంబేద్కర్ చదువుతున్న ఆ కళాశాల ప్రొఫెసర్ ముల్లర్‌కు ప్రియమైన విద్యార్థిగా మారి, ముల్లర్‌ను జీవితాంతం గుర్తుపెట్టుకున్నాడు అంబేద్కర్. కళాశాల క్యాంటీన్‌లో మంచినీళ్లు కూడా తాగనివ్వని అస్పృశ్యతా జాడ్యం అంబేద్కర్‌ను దహించింది. 'తియ్య తియ్యటి జ్ఞాపకాల కన్నా సుమధుర స్మృతుల కన్నా అవమానాలు - తిరస్కారాలు అంబేద్కర్ జీవితంలో కోకొల్లలు - లేవు దానికి ఎల్లలు' అంటూ వాపోతాడు కవి. అన్నింటినీ అధిగమించి బి.ఎ. పట్టా సాధించాడు అంబేద్కర్.

**రాంజీ మరణం :**

తండ్రి రాంజీ మాలోజీ సక్పాల్. ఈయన మిలట్రీలో చిరుద్యోగి. ఈయనకు అధిక సంతానం. జన్మించిన సంతా నంలో ఐదుమంది బ్రతికారు. వారు బలరాం, ఆనంద రావు, తులసి, మంజుల, భీమారావు. ఆ భీమారావే అంబేద్కర్.

సత్యశోధక్ సమాజ స్థాపకుడు మహాత్మ జ్యోతిరావ్ పూలే శిష్యుడుగా, సన్నిహితుడుగా రాంజీ ఉండేవాడు. 1892 సం॥కాలంలో మహర్‌లను సైన్యంలో చేరకుండా నిషేధిస్తే, 'రెనడే'తో కలసి బ్రిటీష్‌వారికి లేఖరాసి సమస్య పరిష్కారానికి కృషి చేశాడు రాంజీ. బొంబాయి గవర్నర్‌ను కలసి అంటరానివారి స్థితిగతులు మెరుగుపరచాలని కోరాడు

''సత్యమనే కవచాన్ని కప్పుకొని / అంబేద్కర్‌ను మణి పూసలా తీర్చిదిద్దాడు'', 1913 ఫిబ్రవరి 2న ఆయన తనువు చాలించాడు. ''సముద్రమంత దుఃఖాన్ని, అంబరమంత కటిక దారిద్ర్యాన్ని వీడి కనరాని మరొకలోకానికి గమిం చాడు'' అంటాడు కవి. ''ఓహో / రాంజీ సక్పాలా / విరామమెరుగక విశ్రమించక/ చీకటిపై - ఆకటిపై / అస్పృశ్యత - అంటరానితనంపై / బహు బాధల తత్వంపై / పోరాటం సలిపిన ఘన గంభీరా../ నీకు నీవేసాటి / నీకు నీవే మేటి '' అనండంలో రాంజీ చైతన్యం అర్థమవు తుంది.

**అమెరికాలో అంబేద్కర్ ఉన్నత విద్య :**

బరోడా మహారాజు పేద విద్యార్థులకు ఇచ్చే ఉప కారవేతనంపై అంబేద్కర్ అమెరికాలోని కొలంబియా విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించాడు. అర్జున్ కేలూ స్కర్ పండితుని సాయంతో ఈ సహాయం లభించింది. అమెరికా జీవితం అంబేద్కర్ ప్రస్తానంలో ఒక మైలురాయి. కులం కారణంగా స్వదేశంలో తిరస్కరణకు గురయిన ఆయన ''అమెరికాలో అందరితోపాటు తినడం, తిరగడం, మసలు కోవడం, మనడం, మాట్లాడుకోవడం, అది ఒక

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


అద్భుతమైన అనుభవంగా" నిలవడాన్ని రచయిత కళ్లకు కట్టిస్తాడు.

అక్కడ ఆర్థిక, సామాజిక, వాణిజ్య, రాజకీయ శాస్త్రాలలో నైపుణ్యం గడించి ఏన్షియంట్ ఇండియన్ కామర్స్ 'భారతదేశంలో కులాలు' - వాటి వ్యవస్థ - పుట్టు పూర్వోత్తరాలు' గ్రంథాలు రాసి తన శక్తిని ప్రపంచానికి చాటాడు. 'నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా - ఎ హిస్టారికల్ అండ్ అనలిటికల్ స్టడీ' అనే పరిశోధనా గ్రంథానికి కొలంబియా విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇచ్చింది.

నీగ్రోలకు, నీలి వర్ణీయులకు స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రసాదించిన సంస్కర్త 'బూకర్ టి. వాషింగ్టన్' చరిత్ర అంబేద్కర్‌ను కదిలించింది. అమెరికాలో ఉండగానే అంబేద్కర్‌కు ఇంగ్లాండులోని 'లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్ - పాలిటిక్స్'లో చదువుకునే అవకాశం వచ్చింది. అందులో చదవాలనే కోరిక అంబేద్కర్‌లో బలంగా ఉండేది. అయితే, ఉపకారవేతనం గడువు ముగియడం వల్ల తిరిగి స్వదేశానికి రాక తప్పలేదు. వీలును బట్టి చదువుకు పూర్తిచేసుకొనే అవకాశాన్ని ఆ సంస్థ కల్పించింది.

అంబేద్కర్ భారతదేశానికి సముద్ర మార్గంలో వస్తున్న సమయంలో ప్రపంచ యుద్ధం ముమ్మరంగా సాగుతోంది. కుక్ కంపెనీ స్టీమరును మెడిటేరియన్ సముద్రంలో ముంచేశారు. అందులో అంబేద్కర్ సేకరించిన పుస్తక భాండగారం ఉంది. అంబేద్కర్ మరొక ఓడలో స్వదేశానికి చేరుకున్నాడు. ఒడంబడిక ప్రకారం అంబేద్కర్ బరోడా సంస్థానంలో ఉద్యోగిగా చేరాడు. చిల్లిగవ్వ కూడా చేతిలో లేని సమయంలో కుక్ కంపెనీ వారు పంపిన నష్టపరిహారం అందింది. ఆనందపడ్డాడు. ఈ సందర్భంగా వేదాంతాన్ని జోడిస్తూ కవిచెప్పిన మాటలు మనసును ఆకట్టుకుంటాయి.

"మానవ జీవితం చిత్రాలతో నిండిన బుట్ట
మహనీయుల జీవితం అనేక చిత్రాల గుట్ట
బతికి బయటపడిన వాడే కడదాక కడతాడు బట్ట
ఈ జీవితం చిత్ర విచిత్రాల పుట్ట" అంటూ చమత్కరిస్తాడు రాజగోపాల్.

## బరోడా సంస్థానంలో :

సెప్టెంబరు, 1915 బరోడా సంస్థానంలో 'రక్షణ శాఖ కార్యదర్శిగా చేరాడు. ఈ క్రమంలో అంబేద్కర్‌కు స్వాగతం ఏర్పాటు చేయమని రాజు ఆజ్ఞాపించినా 'ఒక్క మహార్‌కు స్వాగతమా, సత్కారమా' అంటూ దివాను చీత్కరించుకున్నాడు. రైలు దిగిన అంబేద్కర్‌కు ఏ ఒక్క హోటల్ వారు ఆశ్రయం ఇవ్వలేదు. వెతికి వెతికి చిన్న పార్శీ సత్రంలో తలదాచుకున్నాడు. రక్షణశాఖ కార్యదర్శి హోదాలో ఉద్యోగానికి వస్తే ఆయనను పట్టించుకొనేవారే లేరు. అడుగడుగునా అవమానాలు, చీత్కారాలు అంబేద్కర్‌ను ఆలోచనలో, ఆవేదనలో పడేశాయి.

కొన్ని రోజులకు పార్శీ సత్రంవాళ్లు కూడా అంబేద్కర్‌ను వెళ్లగొట్టారు. విషయం తెలుసుకున్న రాజు, అంబేద్కర్‌కు చోటు చూపించమని 'దివాను'ను స్వయంగా ఆజ్ఞాపించాడు. ఈ విషయంలో తానేమి చేయలేనని చేతులెత్తేవాడు దివాను. అంబేద్కర్ బరోడా నుండి బొంబాయికి వచ్చేశాడు. అంబేద్కర్‌ను మిలటరీ కార్యదర్శి పదవి నుంచి తొలగించారు. అంతటితో ఆగక తాను పొందిన ఉపకారవేతనాన్ని తిరిగి కట్టమన్నారు. రాజు జోక్యంతో ఆగొడవ సద్దుమణిగింది.

సంఘసేవకుడు ' కృష్ణాజీ అర్జున్ కేలుస్కర్' అంబేద్కర్‌కు ఒక ప్రొఫెసర్ ఇంట్లో వసతి కల్పించడానికి ఏర్పాట్లు చేశాడు. తీరా అక్కడికి వెళ్లిన తరవాత, భార్య ఒత్తిడితో ఆ ప్రొఫెసర్ అంబేద్కర్‌ను ఇంటిలోకి రానీయక, వెనక్కి పంపేస్తాడు. అంబేద్కర్ తిరిగి బొంబాయికి చేరుకుంటాడు. బతుకు తెరువు బరువౌతుంది.

'స్టాక్స్ - షేర్స్' పేరుతో డీలర్‌లకు సలహా ఇచ్చే సంస్థను ఏర్పాటు చేసుకుంటాడు - 'దళితుడు, అస్పృశ్యుడు ఇచ్చే సలహాలు సహస్రమైనా, వినరావని - కనరావని, మార్కొనరానివి సుమా..!' అనుకుంటూ ఆయన దగ్గరికి ఎవరూ రారు. అన్ని కష్టాలు ఉన్నా లెక్కచేయకుండా 'భారతదేశంలో కులాలు' పేరుతో గ్రంథాన్ని రాశాడు.

అది అచ్చయ్యింది. విదేశీయులు అంబేద్కర్ మేధస్సును, ప్రతిభా పాండిత్యాలను కొనియాడుతుంటే, స్వదేశీయులు కుళ్లుకున్నారు. అంబేద్కర్ ప్రతిభ జనంలో నానుతుంటే ‘ సిడెన్‌హోమ్ కళాశాల ’’ ఆయనను గుర్తించి ‘పొలికల్ ఎకానమీ ప్రొఫెసర్‌గా ఉద్యోగం ఇచ్చారు. అగ్రవర్ణ హిందూ అధ్యాపకులు అవమానపరిచినా, తన ప్రతిభా పాటవాలతో అందరి మన్ననలు పొంది, దళితుల విమోచనకు నాందిపలికాడని కవి వివరిస్తాడు.

## సైమన్ కమిషన్ అంబేద్కర్ :

1927 నవంబరులో భారత స్వాతంత్ర్య పోరు మిన్నంటుతున్న వేళ, ఆ వేడిని చల్లార్చడానికి రాజ్యాంగ పరమైన సంస్కరణలు తేవడానికి సైమన్ కమిషన్ వేశారు. ఆ కమిషన్‌లో భారతీయులు లేరు. అంతా ఆంగ్లేయులే. దీన్ని భారతీయులు వ్యతిరేకించారు. కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు సైమన్ కమిషన్‌ను తిరస్కరించారు ప్రజలు. ‘సైమన్ గో బ్యాక్’ (1928 ఫిబ్రవరి) నినాదం ఉద్యమంగా మారింది. అయినా కమిషన్ తీరు రూపురేఖలు మారలేదు.

అంబేద్కర్ సైమన్ కమిషన్‌ను కలిసి ‘నిమ్నులకు, నిరాశావాదులకు, తాడితులకు, పీడితులకూ న్యాయమైన హక్కులు కల్పించాలని కోరాడు. కాంగ్రెస్ అంటరానివారిని గుర్తించలేదని, గౌరవించలేదని అంబేద్కర్ బాధపడ్డాడు. క్రైస్తవ, సిక్కు, మహ్మదీయ, ద్రవిడ, ఆంగ్లో ఇండియన్ ప్రతినిధులతో కూడా సంప్రదించిన మోతీలాల్ కమిటీ అస్పృశ్యులను అంటరానివారిగానే చూసింది. వారి మనోభావాలను తెలుసుకొలేదు. ఈ వికృత ధోరణిని ఎండగడుతూ ఆయా వర్గాల ప్రతినిధులు సైమన్ కమిషన్ కలిశారు.

‘దేశ జనాభాలో ఐదవ వంతున్న దళితులకు పాలనా యంత్రాంగంలో, పరిపాలనా తంత్రాంగంలో సముచిత స్థానం కల్పించాలని ‘బహిష్కృత హితకారిణీ’ సభ తరపున విజ్ఞాపన పత్రాన్ని అందజేశాడు అంబేద్కర్. అల్ప సంఖ్యాక ప్రజలకు ప్రత్యేక నియోజకవర్గాలు మొదలుకొని కేంద్రం, రాష్ట్రాలు, న్యాయస్థానాలు, మంత్రుల వరకు వాటి విధి విధానాలు ఎలా ఉండాలో చెప్పి కుల, మత ప్రాతిపదికపై విభజన జరగకూడని అంశాలతో సహా నివేదించాడు అంబేద్కర్. ఇన్ని చేసినా, భారతీయుల్లో ఏకాభిప్రాయం లేదని చెప్పడమే గాక, నెహ్రూ, అంబేద్కర్ నివేదికల ప్రస్తావన లేకుండానే ‘కేంద్ర లెజిస్లేచర్’లో నూటికి అరవై సీట్లు ఇచ్చేటట్టు, దళితులకు అందులోనే కొన్ని ప్రత్యేక స్థానాలు ఉంటాయని, దళిత అభ్యర్థిని గవర్నర్ సిఫారసు చేయాలని ముడిపెట్టారు. ఆ నివేదిక ఎవ్వరికీ నచ్చలేదు.

## మహద్ సంగ్రామం :

మహారాష్ట్రలో ‘మహద్’ పేరుతో వాసికెక్కిన మంచినీళ్ల చెరువు అస్పృశ్యులను నిరాకరిస్తూ, అస్మదీయులను అలరించింది. కాలక్రమంలో హక్కుల సాధనకు ‘నాంది’ వాచకం పలికింది. 1927 మార్చి నెలలో అక్కడ దళితుల మహాసభ జరిగింది. విశేష జనవాహినిని ఉద్దేశించి ఉద్వేగభరితంగా ప్రసంగించాడు అంబేద్కర్. ‘మనం పోరాడితే తప్ప ఏదీ లభించదు... ఏదీ తలవంచదు. భయపడేవాళ్ళను భయపెడుతుంది తిరగబడే వాళ్లుంటే భయపడుతుంది లోకం’ అంటూ మహద్ చెరువులోకి దిగి నీళ్లు తాగి, దానిపై అందరికీ హక్కుందని చాటి చెప్పాడు ఆయన.

‘‘ఇదే... ఇదే మహద్ గ్రామ సంగ్రామం ఇదే... ఇదే భరతఖండాన / స్పృశ్యులకు-అస్పృశ్యులకూ నీటి కోసం జరిగిన సంగ్రామం... మత మౌఢ్యంపై అంబేద్కర్ జరిపిన సంగ్రామం... ఇది చరిత్రను మలిచిన ఘన పోరాటం’’గా కవి అభివర్ణిస్తాడు.

## మనస్మృతి దహనం :

మహద్ చెరువు నీరును అందరిలాగే యథేచ్ఛగా, స్వేచ్ఛగా వాడుకునేందుకు, సవర్ణుల పెత్తనాన్ని నిలువరించేందుకు ‘సత్యాగ్రహం కోసం అంబేద్కర్ పిలుపునిచ్చాడు. ఆ సభ నిర్వహించుకోవడానికి హిందూ పెద్దలు, వ్యాపారులు సహాయ నిరాకరణ చేశారు. ముస్లిం సోదరుల సహకారంతో జరిగిన సభలో అంబేద్కర్ ఫ్రాన్స్‌లో జరిగిన మానవ హక్కుల పోరాటాన్ని ఉదహరిస్తూ చేసిన ప్రసంగం

ప్రజలను ప్రభుత్వాన్ని ఆలోచింప చేసింది. ఆ సభలో అంబేద్కర్ నాలుగు తీర్మానాలు ప్రవేశపెట్టాడు.

1. అందరికీ సమానహక్కులూ అవకాశాలు
2. మనస్మృతిని తిరస్కరించడరా గ్రంథాన్ని దహనం చేయడం
3. కులాలను రద్దు చేయడం
4 అందరికీ దేవాలయ ప్రవేశం అనే నినాదాలతో జరిగిన సభలో మనుస్మృతిని దహనం చేశారు. ఈ సందర్భంగా రాజగోపాల్ "అంబేద్కరా - దళిత జన ప్రవీణా.. నీవు మనస్మృతి గ్రంథ ప్రతిని తగుల బెట్టావు కానీ, కుళ్లు, కుతంత్రంలో కంపుకొట్టే హిందూ సంస్కృతిని తగలబెట్టి ఉంటే సమాజంలో భావ సంచలనమే కాదు, భావ దాస్యము పోయి - బాగుపడి ఉండేది. భారత భూమి బంగారు భూమిగా మారేది" అని ఆశాభావం వ్యక్తం చేస్తాడు.

## దేవాలయ ప్రవేశోద్యమం :

గుడికట్టినవాళ్లూ, గుడిలో ప్రతిమలను అమర్చిన వాళ్లూ అయిన శ్రామికులను, కార్మికులను అస్పృశ్యత పేరుతో దేవాలయాలకి రానివ్వకపోవడం, మైలపడుతుందని చెప్పి మనషులను దూరం పెట్టడాన్ని అంబేద్కర్ జీర్ణించు కోలేక పోయాడు. అంటరానివారి వెన్నుతట్టి దేవాలయ ప్రవేశోద్యమం లేవనెత్తాడు.

బొంబాయిలోని 'ఠాకూర్ ద్వార్' ఆలయంలోకి అన్ని కులాల వారికి ప్రవేశముందని దేవాలయ ధర్మకర్తలు ప్రకటించారు. దీన్ని ప్రజలు నిజమనుకున్నారు. ఆనంద పడిన అంబేద్కర్, ఆలయంలోకి వెళ్లే ప్రయత్నం చేస్తే పూజారులే అడ్డగించారు. అవాక్కైన అంబేద్కర్‌ను, ఆలయం చుట్టూ చేరిన సవర్ణులు ఆలయ ప్రాకారంలోనికి కూడా వెళ్లనివ్వలేదు. అస్పృశ్యులు గుడి ప్రాంగణంలోకి వచ్చారని పాలాభిషేకం చేసి శుద్ధి చేశారు.

అంబేద్కర్ అంతటితో ఆగలేదు. ఊరూరా తిరిగి ఉద్యమాన్ని బలోపేతం చేశాడు. పూనాలోని పార్వతీదేవి ఆలయంలోకి వెళ్లాలని ప్రయత్నించి విఫలమయ్యాడు. ఆలయ ప్రవేశోద్యమం ఉధృతమతున్న కొద్దీ, వారిని ప్రతిఘటించడాలు కూడా పెరిగాయి. రత్నగిరి, కార్వార్, అమ్రౌతి, మున్సీగంజ్, బెంగాల్, ఖుల్నా మొదలైన ప్రదేశాల్లో ఆలయ ప్రవేశ సత్యాగ్రహాలు ఊపందు కున్నాయి.

నాసిక్‌లో జరిగిన 'దళితులు - దేవాలయ ప్రవేశ సభ'లో అంబేద్కర్ ప్రసంగించాడు. ఉద్యమానికి క్రమ శిక్షణ అవసరమని, శాంతియుతంగా సమస్య పరిష్కారం కావాలని, సర్వమానవ సహజీవనమే తన లక్ష్యం అని పేర్కొన్నాడు. "దేవుడు దర్శనం ఇవ్వకపోయినా పూజా రులు - పురోహితుల ప్రాపుకోసం దళితులను ఎదురు చూడవద్దన్నాడు." కాలం సమస్యను పరిష్కరిస్తుందని అంబేద్కర్ అన్నాడు.

## నాసిక్ ఉద్యమం :

ఇది కూడా ఆలయ ప్రవేశ ఉద్యమమే. అగ్రవర్ణాలకు తప్ప అస్పృశ్యులకు ప్రవేశంలేని నాసిక్‌లోని 'కాలారం దేవాలయం. అంటరానివారు పరిసర ప్రాంతాల్లో కూడా కనపడకూడదని, గుడిని, గుడిలోని విగ్రహాన్ని కన్నెత్తైనా చూడకూడదని అక్కడి అగ్రవర్ణాల వారి నిర్ణయం. 1930 మార్చిలో దేవాలయ ప్రవేశానికి అంబేద్కర్ పిలుపు నిచ్చాడు. వేలల్లో దళితులు అక్కడికి చేరుకున్నారు. మహోద్యమానికి ఊపిరిపోశారు. ఎవరెంత చెప్పినా పూజారులు, సవర్ణపెద్దలు అంటరానివారిని గుడిలోకి అనుమతించలేదు. గుడిని నెలరోజులు మూసేశారు. ఏప్రెల్ 9న రథోత్సం నిర్వహించక తప్పలేదు. దేవుడి రథాన్ని దళితులు అగ్రవర్ణాలు అందరూ కలసి లాగే ఒప్పందంతో ఉత్సవాల్ని ప్రారంభించారు. ఇంతలో పూజా రులు అగ్రవర్ణాలవారు కలిసి దేవుడి రథాన్ని మరో ఇరుకు మార్గం గుండా బయటకు లాక్కెళ్లారు. కుతంత్రంతో దళితులను మోసగించారు. రథం చుట్టూ అగ్రకుల హిందువులతో పాటు సాయుధ పోలీసులు పహార కాశారు. కాంద్రేకర్ అనే భండారీయువకుడు పోలీసుల వలయం దాటి రథాన్ని ముట్టుకున్నాడు. దాన్ని గమ నించిన దళితులకు ధైర్యమొచ్చింది. అందరూ చట్టూ ముట్టి పట్టుపట్టారు. రథ చోదకులు హతాశులయ్యారు.

అగ్రవర్ణాల వాళ్లు రాళ్ల వర్షం కురిపించారు. 'కాంద్రేకర్ ప్రాణాలు కోల్పోయాడు. నాసిక్ నగరం రక్తసిక్తం అయ్యింది. అంబేద్కర్‌కు రాళ్లు తగిలాయి. 'తలచిట్టింది - బొట్టు బొట్లుగా రక్తంకారింది. దళితులు రుధిరాన్ని గ్రోలి చరిత్రకెక్కాడు కాలరాం దేవుడు. దళితులు చిందించిన రక్తాన్ని సేవించి దేశమంతా చల్లబడింది. చక్కబడింది. కాలారాం దేవాలయ ప్రవేశోద్యమం అప్పటికీ ఇప్పటికీ నిమ్నుల ముందు సాక్షాత్కరిస్తూనే ఉంది. దళితుల సంఘటిత శక్తిని ఆవిష్కరిస్తూనే ఉంది అంటాడు కవి.

రాజ్యాంగ నిర్మాతగా, ప్రథమ న్యాయశాఖ మంత్రిగా అంబేద్కర్ సేవలు మార్గదర్శకంగా నిలుస్తాయి. స్త్రీల హక్కుల బిల్లుగా ప్రస్తావించే 'హిందూకోడ్ బిల్లు' ఆయనే ప్రతిపాదించగా, అది ఇప్పటికీ బిల్లుగానే మిగిలి పోయింది. ఆర్థిక, రాజకీయ, సామాజి, మత విషయాలపై అసంఖ్యాక రచనలు అంబేద్కర్ కలం నుంచి జాలువారాయి.

స్ఫూర్తిప్రదాత అంబేద్కర్ పేరుతో రాసిన దీర్ఘకవిత పూర్తిగా దళిత దృక్కోణంలో నడిచింది. దీర్ఘకవితలో శిల్ప నిర్వహణ కష్టతరంగా ఉంటుంది. విషయ ప్రాధాన్యంలో పడి కొట్టుకు పోతున్నపుడు శిల్పం గురించి పట్టించుకోవడం కష్టం. ఇందులోనూ అదే జరిగింది. అక్కడక్కడ సాధారణ వాక్యాలు విషయ ప్రకటన కోసం ఉద్దేశించినవిగా కనిపిస్తాయి. కష్టాలను, కన్నీళ్లు చిత్రించేటప్పుడు ఆర్ద్రతలో ముంచేసే కవి, తిరగబడాల్సిన చోట సింహంలా ఉరుకుతాడు. సమసమాజ నిర్మాణం కోసం, అట్టడుగు వర్గాల అభ్యున్నతి కోసం పాటుపడిన అంబేద్కర్ చరిత్రను, అసంపూర్ణంగానైనా కవిత్వరూపంలో చెప్పి ధన్యుడయ్యాడు కవి జల్లి రాజగోపాల్.

జల్లి రాజగోపాలరావు తూర్పు గోదావరి జిల్లా అల్లవరం మండలం తాడికోనలో 1945 జూన్ 20వ తేదీన జన్మించాడు. వృత్తిరీత్యా స్టాటిస్టికల్ అసిస్టెంటు. భారత ప్రభుత్వ జనాభా గణన కార్యాలయం హైదరాబాద్‌లో పనిచేశారు. వివిధ వార, పక్ష పత్రికల్లో జై.ఆర్.గోరా కలం పేరుతో రాసిన కవితలు, సమీక్షలు అచ్చయ్యాయి. ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం నుంచి కవిత్వంతోపాటు సాంఘిక నాటికలు ప్రసారం అయ్యాయి. 'ఆకలికేక' (వచన కవిత్వం), దేవుడులాంటి మనిషి, మనసులోని మనసు (సాంఘిక నాటికలు) వంటి రచనలు చేశాడు. ఈయన 1999 నవంబరు 8న ఆకస్మికంగా కన్నుమూశారు.

**ఆధార గ్రంథాలు :**


1. రాజగోపాలరావు, జల్లి : స్ఫూర్తి ప్రదాత అంబేద్కర్ (దీర్ఘకావ్యం) జల్లి రాజగోపాలరావు రచనలు (2005) జనపద విజ్ఞాన కేంద్రం, ప్లాట్ నెం.1, బాల్‌రెడ్డి నగర్, టోలిచౌకి, హైదరాబాద్-8
2. విజయభారతి.బి.: బాబాసాహెబ్ అంబేద్కర్ (జీవిత చరిత్ర) జనపద విజ్ఞాన కేంద్రం, ప్లాట్ నెం.1, బాల్‌రెడ్డి నగర్, టోలిచౌకి, హైదరాబాద్‌8
3. ధనుంజయకీర్ : మహాత్మా జ్యోతిరావ్‌పూలే అనువాదం బి.విజయభారతి జనపద విజ్ఞాన కేంద్రం, ప్లాట్ నెం.1, బాల్‌రెడ్డి నగర్, టోలిచౌకి, హైదరాబాద్.
4. రామారావు. ఎస్వీ : తెలుగులో సాహిత్య విమర్శా అవతరణ వికాసములు (2007), పసిడి ప్రచురణలు, హైదరాబాద్
5. నారాయణరావు, వేర్చేరు : తెలుగులో కవితా విప్లవాల స్వరూపం (1987), హైదరాబాద్ బుక్‌ట్రస్ట్, హైదరాబాద్.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# మోదుగుల రవికృష్ణ సంపాదకత్వంలో వెలువడిన చారిత్రకగ్రంథాలు - పరిశీలన

- కె. జనార్దన్, పరిశోధక విద్యార్థి, తెలుగు & అనువాద అధ్యయనశాఖ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం.

తెలుగు పరిశోధనారంగంలో నేడు ప్రముఖంగా వినిపిస్తున్న సంపాదకులలో, గ్రంథపరిష్కర్తలలో ప్రముఖులు 'మోదుగుల రవికృష్ణ'. నిరంతర పరిశోధకుడిగా ఈయన జీవనసాహితీయాత్రలో సాహిత్యమే దారిదీపంగా చేసుకొని ముందుకు సాగుతున్న అరుదైన సాహితీవేత్త, సుస్థిరపరిశోధకుడు మోదుగుల రవికృష్ణ. నిజానికి ఒక వ్యవస్థ చేయవలసిన పనిని వ్యక్తిగా చేసి నిరూపించారు. బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్, అన్నమయ్య గ్రంథాలయం, సంస్కృతి (గుంటూరు)ల తరపున వీరు ఎన్నో గ్రంథాలను వెలికి తెచ్చి నగషీలు చెక్కి పాఠకలోకానికి అందించారు. వీరు పరిష్కరించిన చారిత్రకగ్రంథాలు జనాదరణ పొందడంలో ఎలా కృతకృత్యులయ్యారో తెలియజేయడం ఈ వ్యాసం ప్రధానోద్దేశం.

మోదుగుల రవికృష్ణ పరిష్కరించి సంపాదకత్వం వహించిన చారిత్రకగ్రంథాలు నాలుగు. అవి. 1. వనమాల, 2. చారిత్రక వ్యాసమంజరి, 3. బౌద్ధయుగం, 4. చరిత్ర ఆనవాళ్ళు - పురావస్తు ప్రదర్శనశాలలు.

## 1. వనమాల :

సాహితీ సమరాంగణ సార్వభౌమ శ్రీకృష్ణదేవరాయలపై విశేషమైన అభిమానం కలిగినవారిలో రవికృష్ణగారు ఒకరు. 2010 ఆగస్ట్ నెలలో ఆంధ్రప్రదేశ్ అంతటా రాయల పట్టాభిషేకం జరిగి 500 సంవత్సరాలు గడిచిన కారణంగా కోలాహలంగా ఉత్సవాలు జరిగాయి. ఆ సందర్భంగా రాయలపట్ల జాగృతి దేశమంతటా కలిగింది. ఆ సందర్భంలో వచ్చినదే 'వనమాల' వ్యాససంచిక.

'మల్లాది రామకృష్ణ' గారు 'వనమాల' పేరుతో ఒక చిన్నకథ, ఒక పెద్దకథ - మొత్తం రెండు రాశారు. ఈ రెండుకథలను మకుటంగా పెట్టుకొని సంపాదకుడు వెలువరించిన సంచిక 'వనమాల'. ఈ గ్రంథంతో ఎన్నో కొత్తవిషయాలు సాహిత్యలోకంలోకి వచ్చాయి. ఈ గ్రంథంలోని కొన్ని వ్యాసాలు మాత్రం భారతి, ఆంధ్రపత్రిక (ఉగాది ప్రత్యేకసంచిక)ల నుండి సేకరించినవి. ముఖ్యంగా హంపీ ప్రాచీనతనుండి, కృష్ణరాయల చరమ దశ వరకు క్రమోన్మీలనంగా 39 వ్యాసాలతో అమర్చిన గ్రంథమిది. కృష్ణరాయల తత్వాన్ని సమగ్రంగా ఈ గ్రంథం ఆవిష్కరించింది.

ఈ గ్రంథ ముఖచిత్ర చిత్రీకరణలో సంపాదకుని చతురత కనిపిస్తుంది. ఈ గ్రంథ ముఖచిత్రం విశేషఖ్యాతిని పొందినది. అంత:పురంలో ఆముక్తమాల్యద రచనాలోచన నిమగ్నుడైన రాయలు ఈ గ్రంథానికి ముఖచిత్రంగా ఉన్నాడు. ఈ చిత్రాన్ని చూసినవారు "ఇది రాయలచిత్రం వలె లేదే" అని పెదవి విరిచారని సంపాదకుడు గ్రంథ పీఠికలో చెప్పుకున్నాడు. పోర్చుగీసు వర్తకుల, యాత్రికుల వర్ణన ప్రకారం ఇప్పుడు చూస్తున్న రాయల చిత్రాలలో ఒక్కటీ లేదు. నిజానికి చాలామంది కలికితురాయితో ఉండే తలపాగా ఆధారంగానే రాయలను గుర్తుపడుతున్నారు.

చిదంబరంలోని, తిరుమలలోని రాయల శిలా, లోహ విగ్రహాలు తెలిపేదేమంటే రాయలకిరీటం టోపీవంటిది. పైన రెండు నిలువుపట్టీలుంటాయి. తాడిపత్రి, లేపాక్షి, తిరువళ్ళిక్కేణి పార్థసారథి కోవెల, అహోబిలం ఇలాంటి ప్రాంతాలలో విజయనగరరాజుల శిలావిగ్రహాలున్నాయి. వర్ణచిత్రాలు ఉన్నాయి. వీటిలో పొడుగాటి టోపీల వంటి కిరీటాలు వారివారి హోదాల ప్రకారం తరతమ భేదాలతో ఉన్నాయే తప్ప అన్యం లేదు. రవికృష్ణగారు ఇవికాకుండా కొత్త చిత్రాన్ని వేయించారు.

ఆముక్తమాల్యదను తాను స్వయంగా రాస్తూనో, చెప్పి రాయించేటప్పుడో రాయలు హాయిగా ప్రశాంత వస్త్ర ధారణతో ఉండక భూరిమయాంగద తారహారములతో, కిరీటకేయూరాది విభూషితుడై ఉంటాడా? అనే భావనతో రవికృష్ణగారు వనమాల గ్రంథముఖచిత్రాన్ని వేయించారు. రాయవాచకంలో రాయల యాత్రాచరిత్ర గురించి చెబుతూ "శ్రీవిల్లిపుత్తూరికి వచ్చి చూడుకుడుత్తనాచ్చ్యారు సమ్మేతముగా సంపెంగ్గి మన్నారుస్వామిని సేవించి..." అన్నాడు స్థానాపతి. అందుకనే ముఖచిత్రంలో సంపెంగ మన్నారుతో కలసి గోదాదేవి దర్శనమిస్తున్నది.

చిలుకూరి వీరభద్రరావు, వేటూరి ప్రభాకరశాస్త్రి, నేల టూరి వెంకటరమణయ్య, దివాకర్ల వేంకటావధాని, రాళ్ళ పల్లి అనంతకృష్ణశర్మ, తిరుమల రామచంద్ర, గుడివాడ ప్రభావతి, జయప్రదాదేవి మొదలైన సాహితీవేత్తలు వ్యాసా లతో అమితజనాదరణ పొందిన సంచిక వనమాలని చెప్ప కోవచ్చు. రాయలకాలంనాటి ఒరియా, తమిళ, కన్నడ, మలయాళ, సంస్కృత వాఙ్మయాలను విశదంగా పరి శోధించేవారికి అద్భుతంగా ఉపకరించే గొప్పగ్రంథం వనమాల.

## 2. చారిత్రక వ్యాసమంజరి :

ఈ గ్రంథం రవికృష్ణగారి సంపాదకత్వంలో 2011 సంవత్సరంలో వెలువడింది. మల్లంపల్లి సోమశేఖర శర్మగారు ఎప్పుడెప్పుడు ఏయే అంశాలపై వ్యాసాలు రాశారో తెలియడంకోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంవారు Journal of the Andhra historical research society y ] Volume - XXXV " Sri Mallampalli Soma sekhara Sarma commemoration volume గా ప్రచురించారు. దీనిలో శర్మగారి వ్యాసాలశీర్షికలు, అవి ఏ పత్రికలో ఎప్పుడు ప్రచురించిందీ పట్టిక ఇచ్చియున్నారు. commemoration volumవ తెలిపిన ప్రకారం తెలుగులో శర్మగారు చరిత్ర, సంస్కృతి, శాసనాలు మొదలైన అంశా లపై వ్యాసాలు రాసి ఉన్నారని తెలుస్తుంది.

వీటిలో చరిత్రకు సంబంధించిన 19 వ్యాసాలను ఎంపిక చేసి రవికృష్ణగారు వెలువరించిన వ్యాససంకలనమే చారిత్రక వ్యాసమంజరి. చరిత్రకు సంబంధించిన పెక్కు వ్యాసాలలో 1924 నుండి 1950 వరకు శర్మగారు రాసిన వ్యాసాలలో పందొమ్మిదింటిని పత్రికా వైవిధ్యంతో రవికృష్ణ ఎంచుకొన్నారు. వీటిని కాలక్రమంలో అమర్చడంద్వారా శర్మగారి భాషలో, శైలిలో ఎలాంటి మార్పులు వచ్చాయో పాఠకులు గమనించే వీలు కలిగించారు రవికృష్ణగారు. సంకలనం పేరు చారిత్రక వ్యాసమంజరే అయినా రెండు వ్యాసాలు సంస్కృతికి సంబంధించినవి చేర్చారు.

చరిత్రను అర్థం చేసుకోవడానికి ఉపబలకంగా ఉం టుందని 'చరిత్ర అంటే', 'మన చరిత్ర సామగ్రి - చరి త్రాను' అనే రెండు వ్యాసాలను మాత్రం కాల క్రమంలో కాకుండా మొదటి వ్యాసాలుగా ఉంచడంలోనే రవికృష్ణ గారి సంపాదకత్వంలోని నిపుణత కనిపిస్తుంది.

రచనకు బొమ్మలు ఎంత నిండుదనాన్నిస్తాయో పఠితలకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. కొన్ని మినహా చాలావరకు ఛాయాచిత్రాలను సొంతంగా సేకరించి సందర్భశుద్ధి ఉన్నచోటల్లా చేర్చి సంపాదకుడు గ్రంథానికి వన్నె తెచ్చారు.

ఈ గ్రంథంలోని మరో విశేషం పాదసూచికలు. 'ఈ వాక్యం చేర్చడంద్వారా మరింత అర్థవంతమైన వివరణ ఇచ్చినట్లు ఉంటుది' అని భావించినచోట సంపాదకుడు పాదసూచికలు ఉంచాడు. 1,2,3,... వంటి అంకెల గుర్తుతో ఉన్నవి సంపాదకుడు ఇచ్చిన పాదసూచికలు. అంకెలు కాకుండా వేరే గుర్తులు ఉన్నవి శర్మగారు ఇచ్చిన పాదసూచికలు.

## 3. బౌద్ధయుగం :

మల్లంపల్లి సోమశేఖరశర్మ అప్పుడప్పుడూ పత్రికలలో రాసిన బౌద్ధసంబంధ వ్యాసాల సంకలనమే ఈ బౌద్ధ యుగం. రవికృష్ణగారి సంపాదకత్వంలో వచ్చిన అపురూప గ్రంథాలలో ఇదొకటి. బౌద్ధమతం హృదయ మతం. అనవసర డాంబికాలకు తావివ్వకుండా మనిషిని ఋజు మార్గంలో నడిపి, సచ్ఛీలతను పొందేటట్లు చేయడానికి బౌద్ధమతం ప్రయత్నించింది.

బౌద్ధమతానికి, బౌద్ధ శిల్పకళలకు సంబంధించి మల్లంపల్లి సోమశేఖరశర్మ రాసిన వ్యాసాలు మొత్తం 14 అని సంపాదకుడు ఈ గ్రంథంలో నిగ్గుతేల్చాడు. సంపాదకుడు ఈ గ్రంథంలో శర్మగారి వ్యాసాలలోని అరసున్న(c)ని తొలగించడం, "బహుజనసుఖాయ" కోసం తెలుగు అంకెలను మామూలు అంకెలుగా మార్చడం, అక్కడక్కడా విసంధిచేయడం తప్ప మార్పులేమీ చోటు చేసుకోలేదు. పత్రికలలో ప్రచురితమైన ఛాయాచిత్రాలు ఇక్కడా ఇవ్వటానికి సంపాదకుడు ప్రయత్నం చేశాడు. ఈ వ్యాసాలు ప్రచురించడంవల్ల బౌద్ధధర్మం మీద కొత్త వెలుగులు ప్రసరించాయనే చెప్పుకోవాలి. బౌద్ధశిల్పాలు గురించి శర్మగారు విపులంగా రాసిన వ్యాసాలు ఔత్సాహికు లను, చరిత్ర అభిమానులను ఆకర్షించాయి. కేవలం చరిత్ర, మన పురాసంపద మీద ఎంతో మక్కువతో శర్మగారు రాసిన వ్యాసాలను మరలా ముద్రించి, సందర్భో చితంగా ఛాయాచిత్రాలను ఉంచడం సంపాదకుని నేర్పరితనాన్ని తెలియజేసే విషయాలు. ఈ గ్రంథ ప్రచురణ ద్వారా శర్మగారిని ఆంధ్రపాఠకలోకం ఇంకా మరువలేదని, వారి యశశ్చంద్రికలు వికసిస్తూనే ఉన్నా యని తెలుస్తున్నది.

### 4. చరిత్ర ఆనవాళ్ళు-పురావస్తు ప్రదర్శన శాలలు:

గతాన్ని అవగతం చేసుకోవడానికి మ్యూజియం మంచి సాధనం. చిత్రవస్తు ప్రదర్శనశాల, వస్తు ప్రదర్శన శాల, పురవాస్తు ప్రదర్శనశాల అనేవి మ్యూజియం అనే ఇంగ్లీషు పదానికి తెలుగు సమానార్థకపదాలు. వస్తు ప్రదర్శన శాలలు వైవిధ్యవిలసితమైన విశ్వస్వరూప స్వభావాన్ని, మానవనాగరికతాభివృద్ధిని మనముందు ప్రతిఫలింప జేసే దివ్యదర్పణాలు. పుస్తక పరిజ్ఞానంకంటే ప్రత్యక్ష గోచర మయ్యే వస్తువుల ద్వారా మ్యూజియం నుండి మనం నేర్చుకొనే జ్ఞానం ఎక్కువ. మ్యూజియాన్ని అర్థం చేసు కోవడం, విద్యార్థులకు తెలియజెప్పడం పెద్దతరపు బాధ్యత. ఈ బాధ్యతను గుర్తుచేసే ప్రయత్నంలో మోదు గుల రవికృష్ణ 2012 సం॥లో వెలువరించిన గ్రంథమిది.

ఈ గ్రంథంలో కొన్ని ప్రసిద్ధ మ్యూజియాల గూర్చి, అందులో చూడదగిన విశేషాల గూర్చి నిపుణులు శ్రద్ధతో రాసిన వ్యాసాలు అనేకం చోటుచేసుకున్నాయి. 'యం.యల్.నిగమ్'గారు 'మ్యూజియములు' (సంగ్రహా లయాలు) అన్న వ్యాసంలో మ్యూజియం అనేమాట 'మ్యూజె' అనే గ్రీకు పదంనుంచి వచ్చింది. మ్యూజె అంటే సర్వకళలకూ, విజ్ఞానానికి అధిష్ఠాన దేవతలు. ఈజిప్టుకు చెందిన టాలమీ చక్రవర్తులకాలంలో అలెగ్జాండ్రియాలో ఒక అద్భుతమైన వస్తుసంచయనం జరిగింది దానికే మ్యూజియం అనే పేరు తొలుతగా వాడబడినదని మ్యూజియం చారిత్రక ప్రగతిని గూర్చి వివరించారు.

యం.యల్.నిగమ్ మాటల్లో మ్యూజియం అంటే ఒక ప్రదేశానికిగాని, ఒక జాతికిగాని సంబంధించిన కళలనూ, సంస్కృతినీ ప్రతిబింబించే వస్తు సముదాయాన్ని సేక రించిన ప్రదర్శనావేదిక లేక సంగ్రహాలయము. అంతే కాదు; మానవుని సృజనాత్మకశక్తిని, ప్రకృతిపై అతని ఆధి పత్యాన్ని ధ్రువపరచి సమాజపు సాంస్కృతిక జీవితాన్ని ఉత్తేజపరచగల మౌలిక సాక్ష్యాధారాలను పొందుపరచిన మందిరం మ్యూజియం అని పేర్కొన్నారు. ఈ వ్యాసం పాఠకలోకాన్ని ఆకట్టుకొంటుంది. మ్యూజియాల చారిత్రక ప్రగతిని పాఠకలోకం కళ్ళ ముందుంచుతుంది.

'తిరుమల రామచంద్ర'గారు ''కళాబోధనలో మ్యూజియంల పాత్ర" అన్న వ్యాసంలో నన్నయ - 'నుత జల పూరితంబులగు నూతులు నూఱిటికంటె నొక దిగుడుబావి మేలని, అలాంటి దిగుడుబావులు నూరిటి కంటే ఒక్క క్రతువు గొప్పదని, అలాంటి క్రతువులు నూరిటికంటే ఒక సుతుడు మేలని, అలాంటి నూరుమంది సుతులకంటే ఒక సూనృత వాక్యముమేలు' అని అన్నాడు. అలాగే నూరు మాటలకన్నా ఒక ప్రేక్షణకం గొప్పది. ప్రేక్షణకమంటే చూడదగినది - నాటకమైనా, నృత్యమైనా, శిల్పమైనా, చిత్రమైనా చూచిన ఒక వస్తువు నూరుమాటలు చెప్పలేని దానిని చక్కగా చెబుతుంది. మ్యూజియం కూడా ప్రేక్షణకం వంటిదే. సామాన్య ప్రేక్షణకం కాదు, మహా ప్రేక్షణకం" అని మ్యూజియాలపట్ల తనకున్న గౌరవాన్ని

పేర్కొన్నాడు. 'నండూరి పార్థసారథి'గారు 'మ్యూజియం అద్దంలో మనం' అన్న వ్యాసంలో "జాతి నాగరికతా చరిత్రకు అద్దం పట్టడమే జాతీయ వస్తుప్రదర్శనశాల పని" అని పేర్కొన్నారు. ఈ గ్రంథంలో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి రాసిన 'వస్తు ప్రదర్శనశాలలు' అన్న వ్యాసం మ్యూజియాలకు సంబంధించిన ఎంతో ప్రాథమిక సమాచారాన్ని అంద జేస్తున్నది. ఈ గ్రంథం పాఠకులలో వస్తు ప్రదర్శనశాలల పట్ల గౌరవాన్ని పెంపొందిస్తుంది. వాటిని పరిరక్షించు కొనే బాధ్యత అందరూ తీసుకోవాలని తెలిపేవిధంగా ఈ గ్రంథముంది. ప్రస్తుతం ప్రచారంలోలేని మంచి గ్రంథములను మరలా ప్రచురించి, అందులో తెలియని మాటలకు చక్కటి అర్థములను వ్రాసి, యువపాఠకులకు అర్థమగు రీతిలో సంఘటనలను వివరించి అనేక పుస్తకాలను మోదుగుల రవికృష్ణ వెలువరించారు. 'సముద్రాన్ని చెంచాతో తోడ శక్యమా?' అని మహాకవి శ్రీశ్రీ అన్నట్లు మోదుగుల రవికృష్ణగారు తమ సంపాదకత్వంలో వెలువ రించిన గ్రంథాలగూర్చి ఎంతైనా చెప్పుకోవచ్చు.

**ఉపయుక్తగ్రంథాలు :**

1. వనమాల - మోదుగుల రవికృష్ణ. స్వధర్మసేవాసంస్థ, గుంటూరు.
2. చారిత్రక వ్యాసమంజరి - మోదుగుల రవికృష్ణ. మిత్రమండలి,గుంటూరు
3. బౌద్ధయుగం - మోదుగుల రవికృష్ణ. ప్రచురణ : మిత్రమండలి,గుంటూరు
4. చరిత్ర ఆనవాళ్ళు - పురావస్తు ప్రదర్శనశాలలు - మోదుగుల రవికృష్ణ. రాయపాటి వెంకటరంగారావు విద్యాకళాశాల, గుంటూరు.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జాషువా - 'శిల్పి'

- డాక్టర్ ఎం.మునిరత్నం, తెలుగు శాఖాధ్యక్షులు, సర్ త్యాగరాయ కళాశాల, చెన్నై, తమిళనాడు.

శిల్పి రాతిని శిల్పంగా మార్చడంలో పడే శ్రమను, శిలకు, శిల్పానికి ఉండే భేదాన్ని, కవికి, చిత్రకారుడుకి ఉండే పోలికని, నల్లని రాళ్లకు శిల్పి మీద ఉండే కృతజ్ఞతను, శిల్పి రాళ్లలో చూసిన వివిధ రూప మహిమలను, చూసే వాళ్లకు శిల్పాలు మహారాజుల కథలు చెప్పగలవని, శిల్పి నిశ్చయంగా చిరంజీవని, శిల్పి దారిద్ర్యాన్ని చూసి తెలుగుతల్లి కంటతడి పెట్టిందని, శిల్పి చేయి చాలా సున్నితమైనదని, బండరాళ్లు పసుపుకుంకాలతో పూజలు పొందడానికి కారణం శిల్పిచేతిలో ఉలి మహిమను గురించి, రాళ్లలో నిద్రించు ప్రతిమల మేలుకొలిపే శిల్పే నని, నిశ్చయంగా చెప్పారు జాషువ. మనలను కదల కుండా అనేక భావాలను మనసుకు అందించే శిల్పకల గురించి ఎంతో అందంగా కళ్లకు చూపించారు జాషువా. ఇందులో శిల్పి ఆత్మకథ గురించి తెలుసుకోవచ్చు. శిల్ప కళ ఎన్నటికీ ఆరిపోయేదికాదని, శిల్పి కీర్తి పది కాలాల పాటు నిలిచి ఉంటుందనే భావాన్ని చెప్పి శిల్పిది రాతి గుండె కాదని నిగ్గుతేల్చడం కవి గంభీరతను, శిల్పకళా ప్రత్యేకతను తెలుసుకోవచ్చు. జాషువా రచించిన 'శిల్పి' ఖండకావ్యాలు నాల్గవ సంపుటం, మొదటి భాగంలో 19, 20వ పుటలలో ఎనిమిది పద్యాలతో నిండుకొని ఉంది. ఇందులో ఉన్న ప్రతి పద్యం మనలను ఏదో ఒక స్వాప్నిక జగత్తుకు తీసుకొని వెళుతుంది. ఈ శిల్ప సౌందర్యంలోని ప్రతి పద్యం మన సంస్కృతికి అద్దం పడుతుంది. అమరావతీ, అజంతా, హంపీ, లేపాక్షి, ఏకశిలారథము, మహాబలిపురంలోని శిల్పాలు ఆనాటి ఆంధ్రుల శిల్పకళను చాటి చెప్పే కళా ఖండాలు. శిల, లోహము, మృత్తిక మొదలైన పదార్థాలతో మూర్తులను మందిరాలను నిర్మించే విద్య శిల్పకళ. దేవాలయాలు, దేవతామూర్తులు, రథములు, రాజ ప్రసాదముల నిర్మాణాల్లో భారతదేశంలో శిల్పకళ రీతి ప్రాచీన కాలం నుండి కనిపిస్తూనే ఉంది. 'శిల్పి'ని జాషువా 1930వ సంవత్సరంలో ఈ ఖండికను రచించారు. ఇందులో ఉన్న ప్రతి పద్యాన్ని విశ్లేషణాత్మకంగా వివరించుకోవడంతో పాటు నాటి శిల్పకళ సౌందర్యాన్ని పరిశోధనాత్మకంగా వెలికి తీయడం ఈ వ్యాస ముఖ్య ఉద్దేశం.

చేత మిగురొత్త నొక నల్లజాతియందు
మలచినాడవు, భయద సింహముల తలలు
వసుధ గన్పట్టు సర్వ పర్వతములందు
జిత్రముల నెన్నిగతల జూచెదవో నీవు!

(1వ పద్యం పుట:19)

శిల్పి నల్లరాతిపై సింహముల తలలు చెక్కడం, సింహముల తలలు భయం కలిగించు రీతిగా చెక్కడం, నిజమైన సింహాన్ని చూసినప్పుడు ఎంతో భయం కలుగుతుందో! అంతే భయం సింహం యొక్క శిల్పాన్ని చూసినప్పుడు అదే భయం కలుగుతుందంటారు జాషువా. ఇక్కడ జాషువా శిల్పిని గురించి ఎంత వర్ణించిన అది చెప్పలేనిదే. ఎందుకంటే కవి ప్రత్యక్షంగా చూసి తన్మయత్వం పొందాడు. అందువలన ఆ అనుభూతిని ఇంత అని చెప్పలేక చెబుతున్నాడు. నిజమైన సింహం అనే భ్రమను కలిగించు విధంగా సింహాన్ని శిల్పి చెక్కాడని కవి భావించాడు. ఇక్కడ అమర శిల్పి జక్కనలాంటి ప్రతి సృష్టి చేసిన మహనీయులు ఎందరినో మనం జ్ఞాప్తికి తెచ్చుకోవచ్చు. శిల్పి చాకచక్యాన్ని గురించి శిల్పి హస్తాలని గురించి జాషువా ఏమంటారో మరో పద్యంలో చూద్దాం.

సున్నితంబైన నీ చేతి సుత్తెనుండి
బయలువడె నెన్ని దేవస్థలములు
సార్థకము గాని యెన్ని పాషాణములకు
గగె నీనాడు పసుపుగుంకాలపూజ!

(2వ పద్యం పుట: 20)

శిల్పి చేయి చాలా సున్నితమైనది. ఆ చేతిలో సుత్తి ఉన్నది. ఆ సుత్తి నుండి దేవాలయాల్లోని ఎన్నో శిల్పాలు

రూపుదిద్దుకున్నాయి. అలా దేవతా మూర్తులు ఏర్పడ డానికి ఉపయోగపడిన కఠినమైన బండరాళ్ళు పసుపు కుంకాలతో పూజలు పొందుతున్నాయి. ప్రతి దేవా లయంలో విగ్రహాలు ఉంటాయి. ఆ విగ్రహాలు బండ రాళ్ళను చెక్కగా శిల్పాలగా తయారైనవే. బండరాళ్ళుగా అవి ఎవరికి ఉపయోగంలేనివి. కాని శిల్పి తన నైపుణ్యంతో బండరాళ్ళను దేవతా విగ్రహాలుగా చెక్కుట వలన పూజకు యోగ్యమయ్యాయి. ఆ శక్తి శిల్పిదేనంటారు జాషువా. మరల శిల్పి ఉలి ఎలాంటిదో దానికి ఉన్న మహిమ ఎలాంటిదో కింది పద్యంలో చూడవచ్చు.

కవికలంబున గల యలంకార రచన
కలదు కలదోయి శిల్పి! నీ యులిముఖమున
గాకపోయినబెనుజాతికంబులకు
గుసుమవల్లరు లేరీతి గ్రుచ్చినావు?

(3వ పద్యం పుట: 20)

కవి కలానికి వర్ణించే శక్తి ఉన్నట్లే శిల్పికి కూడా అటు వంటి కల్పనా శక్తి ఉంది అంటారు జాషువా. ఆ శక్తి ఉండబట్టే శిల్పి పెద్ద రాతిబండలపై పూల గుత్తులు చెక్కగలడంటారు కవి. శిల్పి తమ నేర్పుతో చేతి రాళ్ళను అనేక రూపాలుగా అందంగా మలుస్తారంటారు జాషువా. ఇంతటితో ఆగలేదు. అది ఎంతటి చరిత్రను చూపించ గలదో కవి మాటల్లోనే చూద్దాం.

ప్రతిమలు రచించి యొక మహారాజు చరిత
వల్లె వేయింప గలవు చూపరుల చేత;
గవనమున జిత్రములు గూర్చి కవివి నీకు
దారతమ్యంబు లే దబద్ధంబు గాదు

(4వ పద్యం పుట: 20)

కవికి వర్ణనా నైపుణ్య శక్తి ఉంటుంది. ఆ నైపుణ్యం చేత ఒక మహారాజు జీవిత చరిత్రను చక్కని కావ్యంగా తీర్చిదిద్దగలడు. అట్లే శిల్పి కూడా శిల్పం చెక్కే నేర్పరితనం ఉంటుంది. ఆ నేర్పరి తనంతో శిల్పాలలో ఒక మహారాజు చరిత్రను చెక్కుతాడు. చూపరుల చేత మెప్పు పొందు తాడు. కాబట్టి కవికి, శిల్పికి ఏ విధమైన తేడా లేదంటారు కవి కోకిల జాషువా. సమాజంలో కవికి ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఆ విధంగానే శిల్పికి కూడా ప్రత్యేక స్థానం కలదని జాషువా గ్రహింపచేశాడు. సృష్టికి ప్రతిసృష్టి చేయగల శక్తి కవికి, శిల్పికి మాత్రమే ఉందనే సత్యాన్ని నవయుగ కవి చక్రవర్తి జాషువా తెలియజేశారు. ప్రతి తల్లి తమ బిడ్డలపై ప్రేమను అమితంగా చూపిస్తుంది. ఇది ప్రాణం ఉన్న వాటిలో చూస్తాం. ప్రాణంలేని శిల్పంలో ఈ ప్రేమ వ్యక్తమై నట్లు శిల్పి తన నైపుణ్యంతో చూపాడని చెప్పడం మనో నేత్రంతో శిల్పి గొప్పతనాన్ని చూడడమే. జాషువా హంపీ లోని శిల్పసంపదను చూసి ఇలా అనుభూతి పొందాడని అర్థం చేసుకోవచ్చు. శిలలో ఉండే శిల్పాలను శిల్పి ఏ విధంగా నిద్ర లేపుతాడో మన కవికోకిల వారి మాటల్లోనే మేల్కొల్పుదాం.

జాల నిద్రించు ప్రతిమల మేలుకొలిపి
యులిని సోకించి బయటికి బలిచినావు
వెలికిరానేర్చి, నీపేరు నిలుపకున్నె
శాశ్వతుడవోయి నీవు నిశ్చయముగాను

(5వ పద్యం పుట: 20)

శిల్పాలు రాళ్ళలో నిద్రిస్తున్నాయని శిల్పి ఆ రాళ్ళకు ఉలిని తాకించి ఆ శిల్పాలను నిద్రలేపాడు. అలా అంద మైన విగ్రహాలుగా శిల్పాలు భయటకు వచ్చాయి. శిల్పి పేరు నిలబడింది. నిజంగా శిల్పికి ఈ సమాజంలో శాశ్వత స్థానం ఉన్నదని కవి తన పద్యపాదాల్లో పొందుపరిచాడు. ఇలాంటి శిల్ప సౌందర్యాన్ని కవి తన మాటల్లో ఎలా చెబుతున్నాడో చూద్దాం.

తలయెత్తైన్ గద, నీదు చాతురి యజంతాగహ్వర శ్రేణి గే
వల పాషాణములందు; జీవకళ నిల్పంజాలు నీసుత్తెలో
మొలుచు న్మానవ విగ్రహంబులు; మహాపుణ్యుండ వయ్యా! హరి
త్తులు, నీ బొమ్మలచెంత ముగ్ధగతి నందున్; శిల్పి కంఠీరవా!

(6వ పద్యం పుట:20)

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



ఓ శిల్పి శ్రేష్ఠుడా అజంతాగుహల సముదాయంలో చాల అందమైన మీ నైపుణ్యం భయటపడిందని, గుహలు శిలలతో కూడినవని, ఆ గుహలలో సజీవకళ పడుతుంది. నీ చేతిలో గల ఉలితో మానవ విగ్రహాలు మొలచాయి. నీవు మహాపుణ్యమూర్తివి. సమస్థ లోకాలన్నీ నీ శిల్పాలు చూసి ముగ్దులౌవుతారు. ఇక్కడ శిల్పికి 'అమరత్వం' ఉందనే యథార్థాన్ని కవి చాటిచెప్పాడు. జీవకళ ప్రసాదించిన శిల్పి మహాపుణ్యమూర్తని చెప్పడంతో కవి హృదయం ఎంత సాత్వికమయ్యిందో అర్థం చేసుకోవచ్చు. అలాంటి శిల్పిని గురించి తన భావ సంపదను ఎలా పొందుపరుస్తున్నాడో కింది పద్యంలో విశ్లేషించుకుందాం.

నునుపుల్ దీర్చి మదంబు చిందిపడ నేన్గున్ గున్నలన్ జెక్కివై
చిన చాతుర్యము నీ శిరోగ్రమున నిల్చె న్సత్కి రీటాకృతిన్;
తెనుగుందేశము నిన్ను వంటిపనివానిం జూచి, యుప్పొంగుచుం
డును; నీలేమిదలచి కంట దడిబెట్టున్; శిల్ప విద్యానిధీ!

(7వ పద్యం పుట:20)

శిల్పాన్ని చెక్కు విద్యకు సముద్రవంటివాడు. ఎత్తు పల్లాలు లేకుండా నున్నగా తయారుచేసి ప్రేమను ఉట్టి పడేటట్లు తల్లి ఏనుగును, పిల్ల ఏనుగును, శిల్పాన్ని చెక్కిన నైపుణ్యం శ్రేష్టమైన, మంచి కిరీటం రూపంలో నీ యొక్క తల అగ్రభాగంలో నిలిచిపోయినది. నీ వంటి నైపుణ్యం గల పని వానిని చూచి తెలుగు భాష మాట్లాడే ప్రజల గల భూభాగం సంతోషంతో ఉప్పొంగిపోయి తెలుగు జాతి గర్వపడుతుంది. అదే సమయంలో నిజ జీవితంలో శిల్పి పేదరికాన్ని చూచి కంటతడి పెట్టుకున్నదనే భావసౌందర్యాన్ని గ్రహించిన జాషువా శిల్పికి ఎంత నైపుణ్యం ఉన్నా నిజజీవితంలో కడు పేదవాడని వాపోతున్నాడు. ఇక్కడ జాషువా కథనాన్ని పాటించాడు. ఆ విషయం తాను గ్రహించింది కాదు. ఆ శిల్పరూపంలో ఉన్న ఏనుగు కన్నీరు కార్చడం చూసి కవి కన్నీరు మున్నీరు అయ్యారు.

కవి ఎంత గొప్పవాడో! కవి ఎంత వెర్రివాడో! కవి ఎంత తన్మయుడో! కవి ఎంత సజీవుడో! కవి మేధస్సు ఎలాంటిదో! ఇక్కడ కవి అంటే శిల్పకవి, శిల్పి అని అర్థం చేసుకోవచ్చు. ఆ శిల్పకవిని మన కవి కోకిల ఎలా మెచ్చుకున్నాడో తన భావసౌందర్యాన్ని ఎలా వివరించాడో ఈ కింది పద్యమే సాక్ష్యం.

తెలిఱాతన్ జెలువార నచ్చరపడంతిం దిద్ది యా సోగక
న్నులపజ్జన్ నిను నీవు దిద్దుకొని, సంతోషించు చున్నాడవా!
భళిరే! శిల్పి జగంబులోన జిరజీవత్వంబు సృష్టించుకో
గల నీ కెవ్వడు సాటి వచ్చును? నమస్కారంబు నీ ప్రజ్ఞకున్

(8వ పద్యం పుట: 20)

శిల్పి చంద్రకాంత శిలపై అందంగా అప్సరస స్త్రీని చెక్కి, ఆ స్త్రీ అందమైన సోగకన్నుల, వాలుచూపుల అందానికి తనను తానే మరచిపోయాడు. ఆ శిల్పం సమీపంలో తనను తాను పదిలపరుచుకొని ఆనందంతో సంతోషిస్తున్నాడు. ఈ లోకంలో ఇటువంటి శాశ్వత సజీవ కళను సమకూర్చుకుని సృష్టించుకోగల శిల్పికి మరెవ్వరూ సాటి రారు. అటువంటి గొప్ప శిల్పి మేధస్సుకు నమస్కారాలు చేయడం కవి కోకిల కీర్తి సాధానికి నిదర్శనం. తాను చెప్పిన భావసౌందర్యం భవితకు మార్గదర్శకంగా ఉండి నేటి శిల్పకళా సౌందర్యాన్ని తెలుసుకోవాలని తపన యువ తరానికి ఎంతో జిజ్ఞాసను కలిగిస్తుందని చెప్పడంలో అతిశయోక్తి లేదు.

## ముగింపు :

జాషువా ఎంతో లోతైన విషయాలను తన ఖండకావ్య 'శిల్పి' ఖండికలో పొందుపరిచారు. ఎవరూ చూడని చూపు చూస్తారు. ఎవరూ దర్శించని ప్రదేశాలను దర్శిస్తాడు. ఊహించని వస్తువులను కవితా వస్తువులుగా స్వీకరిస్తారు. పాత సీసాల్లో టానిక్‌ను తాపించడంలో జాషువా అందె వేసిన చేయి. తాను ఎంచుకున్న రీతి ఆశ్చర్యం కలిగిస్తుంది. సాలీడు కావచ్చు, గిజుగాడు కావచ్చు, గబ్బిలం

కావచ్చు, శిశువు కావచ్చు, అయోమయం కావచ్చు ఏదైనా ప్రజలకు ఉత్సాహాన్ని కలిగించేదిగా ఉంటుంది. కవితా వస్తువుకు కొదువ లేదనిపిస్తుంది. తన ప్రతి రచనలో సామాన్యుల కష్టాలు పేదల కన్నీళ్లు వారి కడుపు మంటలు, కులమతాల నిరసన, ఉద్యమ స్ఫూర్తి, లక్ష్యాలు ఎన్నో తెలుసుకోవాలనే తపస కలుగుతుంది. అలాంటి జాషువా కవితలను నేటి సమాజానికి అందజేయ వలసిన అవసరం యువతరానికి ఉంది. జాషువా గారి శిల్పిఖండికను గురించి తెలియజేయటానికి ప్రధాన కారణం మన సంస్కృతిలో భాగమైన శిల్పకళా సౌందర్య సంపదను ప్రపంచీకరణ ప్రభావంతో యంత్రాలకు ముగ్ధులై టెక్నాలజీ ప్రభావంతో మనిషికి విలువ లేకుండా చేతిపనులకు శిల్ప సౌందర్యానికి గండిపడుతుందనే విషయం యువతరం గ్రహించాలి. ఎంత టెక్నాలజీ అభివృద్ధి చెందిన అమర శిల్పి జక్కన్నకు, బాపూజీ బొమ్మలకు యంత్రాలతో తయారుచేసే పరికరాలు పెరిగిపోయినా చేతి పని చేతిపనే. అలాంటి కుంచేయి నశించకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. మనకు ఎంతో పేరెన్నికగన్న శిల్ప సౌందర్యం ఉంది. అలాంటి శిల్ప సౌందర్యాన్ని కాపాడుకోవాలనే తపనతోనే ముందుకు సాగిపోయి శిల్పకళా సౌందర్యాన్ని కాపాడు కుందాం.

**ఆధార గ్రంథాలు :**

1. జాషువా రచనలు ఖండకావ్యాలు నాల్గవ సంపుటం- విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, 4-1-435, అబిడ్స్, హైదరాబాదు - 500 001. సెప్టెంబరు 2008.
2. జాషువా సాహిత్య తత్వ వివేచన వ్యాస సంకలనం - జాషువా పరిశోదన కేంద్రం, తెలుగు అకాడమి హైదరాబాదు 2012.
3. జాషువా అనర్ఘరత్నాలు - సంకలనం తాళ్లూరి లాబన్‌బాబు, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, విజ్ఞాన భవన్, 4-1-435, బ్యాంక్ స్ట్రీట్, హైదరాబాదు - 500 001. సెప్టెంబరు 2011.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# 'భావన' - వస్తు విశ్లేషణ

- నూకల విజయలక్ష్మి, పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాజధాని కళాశాల, చెన్నై, తమిళనాడు.

ప్రాచీన కవులయిన నన్నయ, నన్నెచోడుడు కంటే ముందు కాలం నుంచి తెలుగు వారితోపాటు, ఇతరులకు సంస్కృత, ప్రాకృత భాషలను నేర్పి, ఆ భాషల్లో కావ్యాలను అధ్యయనం చేయ్యమనేవారు. అంటే ఆ కాలం నుంచే తమ మాతృభాషతో పాటు ఇతర భాషలు నేర్చుకొని కావ్యాలు అధ్యయనం చేయడం మొదలైంది. అలా ఎందరో కవులు, పండితులు అనేక భాషలు నేర్చుకొని ఆ భాషలోని సాహిత్యాన్ని మనకి పరిచయం చేశారు. అలాంటి వారిలో నేటి కాలంలో తనకంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకున్న వ్యక్తి 'నవీన పాల్కురికి' బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఆర్వీయస్ సుందరం.

సారవంతములైన భాషలు తెలుగు, కన్నడ, తమిళం మరియు సంస్కృతం, హిందీ, ఆంగ్లేయుల రాకతో మనకి పరిచయమైన ఆంగ్లం ఈ ఆరు భాషలు అభ్యసించి, ఆ భాషల్లో రచనలు చేసిన 'శతాధిక గ్రంథకర్త' బహుముఖ ప్రజ్ఞాశాలి ఆచార్య ఆర్వీయస్ సుందరం గారు. బహుభాషా పాండిత్యం, బహుభాషాకోవిదత్వం, సృజనశీలత అన్ని కలబోసిన వారు ఆచార్య సుందరం. తెలుగు, కన్నడ, సంస్కృత భాషలలో పండితుడు. 'శివకవిత్రయం'లోని ఒకరైన పాల్కురికిలా 'నవీన పాల్కురికి' అయిన సుందరం కూడా అభ్యుదయవాది. మనిషి ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత భాషా సంస్కారం, భావ సంస్కారం అలవడుతుంది. అటువంటి గొప్ప సంస్కారవాది వీరు. పలుభాషలు నేర్చుకున్న వారికి, పలు సంస్కృతులతో పరిచయం ఉన్నవారికి, పరాయి సంస్కృతిని పరిశీలనగా పరికించినవారికి, విశాల భావాలు కలిగి భాష మీద పట్టుతోటి అయా భావాలు పలికించడం తేలిక అవుతుంది. ఎందుకంటే వాటి ప్రయోజనాలు గుర్తించి ఇతర భాషలలోకి అనువాదం చేయడం ద్వారా మూల భాషలో బందీగా ఉన్న సాహిత్యాన్ని విడుదల చేసి తన భాషలోకి ఆవిష్కరించడం ద్వారా ఇతర భాషల వారికి అందించడం జరుగుతుంది. దీనివలన అనేక మంది ఆయా రచనలను చదవ గల్గుతారు. దేశంలో కవులు, పండితులు, విమర్శకులు ఎందరో ఉండగా అన్నిటిలోను ప్రవేశం కలిగి తనకుంటూ ఒక ప్రత్యేకతను నిలుపుకున్న వ్యక్తి ఆచార్య సుందరం. వీరు చేసిన విశేషమై సాహిత్య కృషి నేటి కాలంలో చాల తక్కువ మంది చేసి ఉంటారు.

"ఎంతమాత్రమున ఎవ్వరు తలచిన అంత మాత్రమే నీవు" అని అన్నమయ్య తలచినట్లుగా ఆర్వీయస్ సుందరాన్ని జానపద శాస్త్రవేత్తలు - జానపద విజ్ఞాని అని, కవులు ఆధునిక కవి అని, అంతేకాక నవలాకారుడిగా, అభ్యుదయవాదిగా, ఆచార్యునిగా ఇలా విభిన్నమైన కోణాలలో, విశిష్టమైన రచనలు చేసి తన సాహిత్య సృజనను అక్షర రూపంలో మనముందుంచారు.

పాల్కురికి ఆనాడు ద్విపదను, జాను తెలుగును ఆశ్రయించి దేశికవిత్వంలో ప్రజల భాషకు దగ్గరయ్యారు. వీరి మార్గంలోనే నవీన పాల్కురికైన ఆర్వీయస్ 1968 - 69వ సంవత్సరంలో ఎందరో మేరు శిఖరములైన మహమహులతో పోటి పడగా వారి "తెలుగు సాహిత్యంలో దేశికవితకు" మొదటి బహుమతిని అందుకున్నారు. అంత చిన్నవయస్సులో అంత పెద్ద బహుమతిని అందుకున్న యువకుడు రాబోయే కాలంలో ఇంకా ఎన్ని సంచలనాలకును తన రచనల ద్వారా దారి తీస్తాడో మనం ఊహించవచ్చును. అలా తన తెలుగు సాహిత్యంలో దేశకవిత తరువాత అంతగొప్ప సంచలన గ్రంథం "ఆంధ్రుల జానపద విజ్ఞానం" ఈ గ్రంథం 1987వ సంవత్సరంలో వీరికి డి.లిట్.పట్టాను తెచ్చి పెట్టింది. ఈ గ్రంథం చూసిన అలెన్ డండస్ అనే జానపద శాస్త్రవేత్త "ఒక జాతి జానపద విజ్ఞానాన్ని గురించి ఇంత విపులంగా, శాస్త్రీయంగా రచియించిన గ్రంథాలు ప్రపంచంలోనే చాల అరుదు" అని ఆచార్య సుందరాన్ని ప్రశంసించారు. అలాంటి ఆర్వీయస్ గురించి పరిచయం చేయడం అంటే ఒక పెద్ద

గ్రంథమే రాయాలి. ఆర్వీయస్ గారు 1982వ సంవత్స రాలలో అమెరికాలోని విస్కాన్సిన్‌లో జరిగిన ప్రపంచ జానపద కావ్య సదస్సువారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని అమెరికాకు వెళ్ళడం జరిగింది. తిరిగి 1983లో రెండవ సారి అమెరికా వెళ్ళి వాషింగ్టన్‌లో జరిగిన తెలుగు మహాసభలలో పాల్గొనడం జరిగింది. ఈ రెండు సార్లు వెళ్ళిన పర్యటన అనుభవాలతో 1983లో 'టూరిస్ట్ నవల' భావనగా రూపుదిద్దుకుంది. అక్కడ ముప్పై రాష్ట్రాలలోని వారు దర్శించిన యాత్ర స్థలాలకు కళ్ళకు కట్టినట్లుగా మనకు చూపించడానికి భావనను నవలగా మలచారు.

**భావన - వస్తువు :**

ఈ నవలలోని కథానాయకుడు ప్రశాంత్. వృత్తిరీత్యా ఆచార్య పదవిలో ఉంటారు. అమెరికాలోని ఒక సెమినార్ ఆహ్వానం మేరకు అక్కడకి వెళ్ళడం జరుగుతుంది. అది ముగిసిన తరువాత అక్కడ ప్రసిద్ధమైన ప్రాంతాలను చూసిరావడానికి బయలుదేరుతాడు. మొదట ఆర్లాండ్ బస్ స్టేషన్‌కి వెళతాడు. అంత రాత్రి చలిలో భావన అనే తెలుగు అమ్మాయి ప్రశాంత్‌కి కనిపిస్తుంది. విదేశాలలో మనకి స్వదేశీయులు కనిపిస్తే ఎంతో ఉత్సాహం, కుతూ హలం కలుగుతుంది. ఆమె ఏ ప్రాంతం నుంచి వచ్చిందో తెలుసుకోవడానికి ఆమెతో మాట్లాడదామని ప్రయత్ని స్తాడు. కాని విచారవదనంతో దిగులుగా ఉన్న భావన మొదట అంత ఆసక్తి చూపించదు. ధైర్యం చేసి తాను రాజమండ్రి నుంచి ఇక్కడ జరిగే సెమినార్‌కి వచ్చానని చెప్పి పరిచయం చేసేకుంటాడు. తాను వీలయితే తగిన సహాయం చేస్తానని ఆమె గురించి చెప్పమని అడుగు తాడు.

భావన తనది విజయవాడ అని తనకి తల్లిలేదు. తండ్రి స్కూలు టీచర్. ఇటివలే మేఘనాథ్ అనే వ్యక్తితో తనకు వివాహం జరిగిందని, తన తండ్రి డాక్టర్ సంబంధం అందులోను అమెరికా సంబంధం రావడంతో ఎంతో సంతోషంగా పెళ్ళి చేసి పంపించాడు. ఇక్కడకి వచ్చాక కానీ తాను మోసపోయినట్లు తెలుసుకోలేకపోయానని మేఘనాథ్‌కి ఇదివరకే ఒక పెళ్ళి జరిగిందని, ఆమె కూడ డాక్టర్ అని, డబ్బు కోసం తనని పెళ్ళాడాడని తెలుసు కుంటుంది. మేఘనాథ్ లేని సమయంలో ఇంట్లో నుంచి వచ్చేసి ఇండియాకి వెళ్ళిపోవాలని ప్రయత్నిస్తున్నాను. కానీ తన దగ్గర ఇండియాకు వెళ్ళేంత డబ్బు లేదని చెబు తుంది. ప్రశాంత్ భావనకు ధైర్యం చెప్పి ఇండియాకు వెళ్ళటానికి తను సహాయం చేస్తానని, మిమ్మల్ని మీ తండ్రి దగ్గర దింపుతానని ధైర్యం చెబుతాడు. కాని అమెరికాలోని ముఖ్య ప్రదేశాలను చూసి వెళ్ళదామని ఆమెను కూడ తనతో తీసుకొని వెళతాడు.

అలా బయలు దేరిన ప్రశాంత్ భావనలు వాల్ట్‌డిస్ని ఆర్లండ్, మాంటగోయరి, ఉల్వాసి, షికాగో, న్యూయార్క్, కాలిఫోర్నియా, ఫ్రాంక్ ఫర్ట్ ప్రాంతాలకు వెళతారు. మధ్య మధ్యలో తెలుగు వాళ్ళను కలవడంతో కొన్ని సమస్యల్లో పడతారు. అలా కలిసిన వాళ్ళలో మేఘనాథ్ కూడా ఒకడు. వీరి ఇద్దరిని చూసిన మేఘనాథ్ భావన ప్రశాంత్‌లకు అక్రమ సంబంధం అంటగడతాడు. తీవ్రమైన మాటలతో ఆమె మనస్సుని గాయపరుస్తాడు. దానితో తన మంగళ సూత్రాన్ని మేఘనాథ్‌పై విసిరికొట్టి తన బంధాన్ని శాశ్వతంగా తెగతెంపులు చేసుకుంటుంది. భావనకు ధైర్యం చెప్పి ప్రశాంత్ ఆమెను అమెరికా నుండి ఇండియాకు తీసుకువస్తాడు. విజయవాడలోని ఆమె ఇంటికి వెళ్ళే సరికి తండ్రి మరణిస్తాడు. ఏ దిక్కులేని భావనతో నీకు అభ్యం తరం లేకపోతే తాను తోడుగా ఉంటానని చెప్పి ప్రశాంత్ ఆశాభావంతో వెళ్ళడంతో ఈ నవల ముగుస్తుంది.

**భావన - పాత్రచిత్రణ :**

**ప్రశాంత్ :**

ప్రశాంత్ పేరుకు తగ్గట్టుగానే సౌమ్యుడు. విద్యాధి కుడు. ఉన్నతమైన భావాలు కలిగిన వ్యక్తి. ఒక మెజీ సియన్‌గా, సంగీత, సాహిత్య అభిమానిగా విభిన్నమైన కోణాలలో మనకు కనిపిస్తాడు. ముఖ్యంగా నేటియువతకు స్ఫూర్తిదాతగా రచయిత ఈ పాత్రను మలచారు.

**భావన :**

మధ్యతరగతి నేపథ్యంలో పెరిగిన ఆడపిల్లలు, తల్లిదండ్రులు చాటు పిల్లలు ఎంత అమాయకంగా,

స్వేచ్ఛంగా ఉంటారో భావన పాత్ర ద్వారా మొదట చిత్రించి, ఆ తరువాత ఆడపిల్ల అబల కాదు సబల అని చెప్పి అవసరమైనప్పుడు, తెగింపు అనేది ఎంతో అవసర మని భావన పాత్ర ద్వారా చెప్పారు. నేటి సమాజంలో జరిగే అన్యాయాలను, అక్రమాలను సహించక ఎదిరించి పోరాడవచ్చు అని ఈ పాత్ర ద్వారా చెప్పడం హర్షించదగ్గ విషయం.

**మేఘనాథ్ :**

1980వ సంవత్సరంలోనే జరిగే మోసాలను, వివాహ నంతరం అమెరికాకు వెళ్ళి అక్కడ పడే ఇబ్బందులు, సమస్యలు భారతీయ మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు ఇవన్నీ కలిపి మేఘనాథ్ పాత్రలో మలచారు. అంటే సుమారు 38 సంవత్సరాల కాలానికి ముందే ఉన్న ఇబ్బందులు రచయిత ఊహించి రాశారు. మేఘనాథ్ లాంటి ఉన్నత చదువులు చదివినవారు కూడ వారి అవసరాలకు మేకవన్నె పులులాగా ఎలా మరుతారో ఈ పాత్ర ద్వారా మనకి తెలియజేశారు. నాటికి నేటికి కూడా ఇలాంటివారు ఎందరినో మనం చూస్తూనే ఉన్నాం. వీరి మోసాలను ధైర్యంగా బట్టబయలు చేసి ఇలాంటి వారిని శిక్షిస్తే కొంతలో కొంత యువతలో మార్పు వస్తుంది. అక్కడ పెళ్ళి చేసుకొని సంసారం పెట్టే ధైర్యం ఉన్న మగవాళ్ళకి తమ తల్లిదండ్రులకు ఎందుకు చెప్పలేరు. ఇక్కడికి వచ్చి ఇంకో పెళ్ళి చేసుకునే ఆమె జీవితం నాశనం చేయడం ఎంత వరకు సబబు.

**ముగింపు :**

మొదట విదేశీ సంబంధాలొస్తే వెంటనే ఆడపిల్లల తల్లిదండ్రులు ఎగిరి గంతేయ్యకుండా వీలయినంత ఎంక్వయిరీ చెయ్యాలి. మొదట అక్కడ తెలుసుకున్న ఫ్యామీలి ఉండాలి. అమెరికా లాంటి దేశాలలో వారి ఆఫీసులలో నేషనల్ రెవెల్‌లోనూ అన్ని వివరాలు ఓపెన్ గానే ఉంటుంది. వీలైతే వాటిని పరిశీలించవచ్చును. అక్కడి వారి బంధువులు, పూర్వీకుల వివరాలను సేకరించ వచ్చు. పదిరోజుల్లో పెళ్ళి చేసుకుని అమ్మాయిలని తీసుకెళ్ళాం అంటే ఎట్టి పరిస్థితులల్లో అంగీకరించకూడదు. ఎందుకంటే తక్కువ వ్యవధిలో పెళ్ళి అంటే వివరాలను మనం తెలుసుకోలేం. ప్రభుత్వం ఎన్నారై వివాహాలు చట్టాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా వెబ్‌పోర్టల్ అందుబాటులోనికి తీసుకురాబోతోంది. దానిలో మహిళా, శిశుసంక్షేమ శాఖ, విదేశి వ్యవహారాల మంత్రిశాఖ సంయుక్తంగా ఈ పోర్టలను రూపొందిస్తున్నాయి. ఎన్నారై అళ్ళుళ్ళ కేసుల్లో, విదేశాలకు వెళ్ళి తిరిగి రాకుండా అక్కడ ఉంటున్న వారికి పోలీసు 'లుక్అవుట్' నోటీసులు జారిచేసి నాన్ బెయిలబుల్ వారంట్లు జారీచేస్తున్నారు. ఈ సమాచారం విదేశాలకు పంపిస్తే వారి పాస్‌పోర్టులు రద్దయ్యేట్లు చేస్తారు.ఇటీవల రాజ్యసభలో ప్రవేశపెట్టిన ఎన్నారై వివాహ రిజిస్ట్రేషన్ బిల్లు 2019 చట్టమైతే అది ఎన్నారై అళ్ళుళ్ళ పాలిట బ్రహ్మాస్త్రంగా మారనున్నది. దీనివలన పెళ్ళిని 30 రోజుల్లో రిజిస్టర్ చేయకపోతే వారి పాస్‌పోర్టు జప్తు అయ్యేలా కొత్త చట్టంలో పొందుపరుస్తున్నారు. ఇలా అన్ని రకాలుగా ప్రభుత్వం, మనం కలిసిచర్యలు తీసుకుంటే మేఘనాథ్ లాంటి మోసగాళ్ళకి ఇది ఒక హెచ్చరికగా ఉంటుంది. దీనితో అనేక మంది ఆడ పిల్లలకు రక్షణ కవచంగా ఉంటుంది.

**ఉపయుక్త గ్రంథాలు :**

1. సుందరం రచనలు - డాక్టర్ రాళ్ళపల్లి సుందరం, సౌశీల్య, మొదటి ముద్రణ: జనవరి 2013.
2. రాళ్ళపల్లి సుందరం రచనలు 100 వివరణాత్మక సూచి, సౌశీల్య, మొదటి ప్రచురణ: అక్టోబర్ 2016.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# మారిషస్ దేశంలో శిక్షణోపాధ్యాయుల లిఖిత దోషాలకు గల కారణాలు, నివారణోపాయాలు

- ప్రవాసీ చిన్నయ్య, మహాత్మాగాంధీ సంస్థ - మారిషస్.

తెలుగు భాషపై అధికారాన్ని సంపాదించాలంటే తెలుగు భాషను వినటం, మాట్లాడటం, చదవటాలతో పాటు రాయటం కూడా అవసరమే. మాట్లాడే భాషకు ఏకరూపత అంతగా అవసరం లేకపోయినా రాసే భాషకు ఏకరూపత తప్పనిసరి. విద్యార్థుల జ్ఞాన సామర్థ్యం లేఖన ప్రక్రియ ద్వారానే మదింపు చేయబడుతుంది. కాబట్టి ఛాత్రోపాధ్యాయుల లేఖన నైపుణ్యాన్ని అంచనా వేయటానికి ఒక పేరాకు మించకుండా వాళ్లకు అనుగుణమైన ఒక ఉక్తలేఖనాంశం ఇవ్వబడింది. ఉచ్చారణకు, శ్రవణానికి, లేఖనానికి చక్కని సమన్వయాన్ని పరిశీలించటానికి ఒక అపరిచిత గద్య భాగం ఇవ్వబడింది. తర్వాత ఏయే దోషాలున్నవో గమనించి వాటి నివారణకు తగిన సలహాలను ఇవ్వబడ్డాయి. తర్వాత ఛాత్రోపాధ్యాయుల చేత వ్యాసాలు రాయించటం జరిగింది. పదాల్ని ఉపయోగించి వ్యాకరణ సమ్మతమైన వాక్య ప్రయోగాల్ని క్లుప్తంగానూ స్పష్టంగానూ చేయగలరో, లేరో పరిశీలించేందుకు వ్యాస రచన మార్గం ఎన్నుకోబడింది.

## పరిశీలన :

చురుకైన ఛాత్రోపాధ్యాయులు ఇచ్చిన శీర్షికలకు చెందిన వివరాలు, విశేషాలు, అభిప్రాయాలు క్రమంగా సేకరించి వ్యాసాన్ని రాశారు. వివరాలను ఒక సమగ్ర వ్యాస రూపంలో అంటే ఆది, మధ్య, తుదులను క్రమబద్ధం చేసి రాశారు. వ్యాస రచనల్లో ఛాత్రోపాద్యాయులు తగిన పద, వాక్య రూపాల్ని ఉపయోగించగలిగారు. విషయానికి తగిన శైలిని కూడా ప్రయోగించగలిగారు. కానీ అసలెవరూ దోషాలు లేకుండా రాయలేదు. అక్షర, పద, వాక్య, వ్యాకరణ, విరామ చిహ్నాల, భావ వ్యక్తీకరణలో దోషాలు చేశారు. శిక్షణోపాధ్యాయులు మామూలుగా వాక్కులో చేసే ఉచ్చారణ దోషాలే క్రమంగా అవన్నీ లేఖనానికి కూడా వర్తించాయని గమనించబడింది. ఛాత్రోపాధ్యాయులు భాషణంలోగానీ, లేఖనంలోగానీ దోషాలను నిర్లక్ష్యం చేస్తే అవే శిశువులో రేపు లిఖిత దోషాలుగా స్థిరపడతాయి. ఈ విషయంలో ఋుజఋస (2005, జూ. 110) చెప్పిన మాటలు స్మరించదగినవి.

‘Written language will be sparse if the oral language is neglected, but as the written language expands, the oral language will, in turn, be enriched. The speaking and writing arts are mutually enhanced by this intertwining”

శిక్షణోపాధ్యాయుల వ్యాసరచనలను, పరీక్ష పత్రాలను దిద్దేటప్పుడు, ఉక్తపదలేఖనాన్ని సవరించేటప్పుడు ఎన్నెన్నో దోషాలను గుర్తించబడ్డాయి. వాళ్లు చేసిన దోషాలను వాటి సవరణలను విద్యార్థులతో చర్చించడమైనది. అంతేకాక ఉక్తపదలేఖనం చేసేటప్పుడు, వ్యాసాలు రాసేటప్పుడు వాళ్లు చేసే దోషాలు ఏయే సందర్భాలలో చేస్తున్నారో గమనించబడింది. దోషాల మూలంగా భాష రూపంలో జరిగే మార్పులను వివరించబడింది. దోషాలు ఎందుకు ఏర్పడుతున్నాయి, ఎలాంటి దోషాలు జరుగుతున్నాయి, వాటిని ఏ విధంగా సరిదిద్దాలో అన్నీ దృష్టియందుంచుకోబడ్డాయి. ఇలా ఛాత్రోపాధ్యాయులు రాతలో చేసే వివిధ దోషాలు ఐదు విధాలుగా విభజించబడ్డాయి. అక్షర, వర్ణ సంబంధి, పద, వ్యాకరణ, విరామ చిహ్నాల దోషాలు.

## అక్షర దోషాలు :

అక్షర స్వరూపాన్ని సరిగ్గా గ్రహించనందువల్ల ఛాత్రోపాధ్యాయులు రాయడంలో కొన్ని అక్షరాలను తప్పుగా రాశారు. ఆంగ్ల, ఫ్రెంచి, క్రీయోల్ భాషలతో పోలిస్తే తెలుగు భాష వర్ణాల ఉచ్చారణలోను, అర్థంలోను భేదాలు

ఉన్నాయి. ఆంగ్ల భాష వలె పదాలలోని కొన్ని అక్షరాలు మౌనం వహించవు. ఆంగ్లంలో రాతలోను ఉచ్చారణ లోను భేదం ఉంటుంది. తెలుగు భాషను ఏ విధంగా ఉచ్చరిస్తామో ఆ విధంగానే రాయటం అవుతుంది. కాబట్టి ధ్వనిని ఉచ్చరించేటప్పుడు స్పష్టంగా నాలుక స్థితిని గూర్చి, పెదవుల నిలుపుదలను గూర్చి ఛాత్రోపాధ్యాయులకు స్పష్టంగా తెలియజేయబడింది. ఛాత్రోపాధ్యాయుల లిపి దోషాలను పరిశీలిస్తే ఇవి సామర్థ్యానికి సంబంధించిన దోషాలని చెప్పవచ్చు. వీటిని నాలుగు విధాలుగా వర్గీకరించవచ్చు.

**రూపసామ్యం వలన దోషాలు :**

తెలుగు లిపి సంకేతాలలో కొన్నింటికి రూపసామ్యం ఉండటంవల్ల కొన్ని దోషాలు జరిగాయి. మ-య, శ-ళ, ప-ఫ-వ, స-న, ఒ-బ, బ-జ, ఇ-ఐ మొదలైన అక్షర రూపాల మధ్యగల భేదాన్ని దృష్టిలో ఉంచుకోకపోవటం ద్వారా ఒక సంకేతానికి మరొకటి రాశారు. అక్షరాలు పొరపాటుగా రాస్తే భావం, అర్థం కూడా చెడిపోతుంది. అంటే మ అనే అక్షరానికి య అనే అక్షరానికి, అలాగే న అక్షరానికి స అనే అక్షరానికి తేడాను ఛాత్రోపాధ్యాయులకు స్పష్టంగా తెలియపరచబడింది. వీళ్లు చేసే కొన్ని దోషాలు ఈ విధంగా ఉన్నాయి :

శ్రమయే సంపద - శ్రయంవేం నంవద/ శ్రయయే సంపడ
పనస - పసన

**లిపి సంకేతం సరియైన విధంగా రాయటం తెలియకపోవటం వల్ల చేస్తున్న దోషాలు :**

ఉ, ఊ అనే అక్షరాలలోని గీతలు వంపులు సరిగ్గా గుర్తించకపోవటం వల్ల ఈ దోషాలు ఏర్పడ్డాయని చెప్పవచ్చు.

ఊరేగింపు - ఉరేగింపు
ఉపాధ్యాయుడు - ఊపాధ్యాయుడు

ఉ, ఊల మధ్య తేడా గుర్తించలేకపోవటంవల్ల ఉ వంటి రూపం రెండింటికీ రాయబడింది.

**తలకట్టు ఇవ్వటంలోని దోషాలు :**

తెలుగు లిపిలో ముఖ్య సంకేతాలు వంటి తలకట్టును కలిగి ఉంటాయి. ఏ లిపి సంకేతానికి ఏ తలకట్టు ఉపయోగించాలో తెలియక ఎక్కువగా కనిపించే "tick" ఈ గుర్తును కొన్నింటికి పెట్టారు. అవసరం లేని వాటికి తలకట్టు పెట్టారు.

శంఖం - శంఖం (ఖ మీద తలకట్టు)
భయం - బయం (తల కట్టు ఇవ్వవలసిన వాటికి ఇవ్వకపోవటం)

ఈ పై లిఖిత దోషాలకి కారణం పరిశ్రమ లోపంగా కూడా భావించవచ్చు.

**గౌణసంకేతాలతో దోషాలు :**

గౌణసంకేతాల పరిజ్ఞాన లోపంవల్ల కూడా కొంత మంది ఛాత్రోపాధ్యాయులు దోషాలు చేస్తున్నారు. వటుసుడి ఉచ్చారణలో ఉండే సందిగ్ధత వలన "కృ, క్రు, వృ" వంటి దోషాలు వస్తున్నాయి. ఈ సంకేతంలో ఉన్న రూపసామ్యత వలన :

కృష్ణుడు - క్రుష్ణుడు
నృత్యం - న్రుత్యం వంటి దోషాలు జరుగుతున్నాయి

"ఋ", "ౠ"లు తెలుగు మాటల్లో ఉండవు. వీటి ఉచ్చారణ "రి, రీ, రు, రూ" లతో సమానంగా ఉంటుంది. అందువల్ల సంస్కృత పదాలను ఉచ్చరించేటప్పుడు ఈ రెండు రకాల ఉచ్చారణా కనిపిస్తుంది. ఉచ్చారణలో భేదం లేకపోవటంవల్ల రాతలో ఇటువంటి పొరపాట్లు దొర్లుతున్నాయి. ఈ మాదిరిగానే తవ్వి - తప్పి - గౌణ సంకేతాల పరిజ్ఞాన లోపం వలన, కొన్ని రూపాల సామ్యత వలన కొన్ని దోషాలు జరుగుతున్నాయి.

**మాతృ భాష - ద్వితీయ భాష అంతర్లక్షణాల వల్ల దోషాలు:**

ఫ్రెంచి భాషలో లింగం పదగతం. కాని మారిషస్ క్రీయోల్ భాష, ఇంగ్లీషు భాషలలో లింగం పదార్థగతం. తెలుగు భాషలో కూడా లింగం పదార్థగతం. ఫ్రెంచి, క్రీయోల్, ఇంగ్లీషు భాషల్లోను మూర్ధన్య, దంత్యాల ధ్వని

భేదాలు లేవు. హ్రస్వ దీర్ఘాలు లేవు. కాని తెలుగు భాషలో అవన్నీ ఉన్నాయి. ఇటువంటి అంతర్ భాషా లక్షణాల ప్రభావం వల్ల విద్యార్థులు వ్యక్తీకరణ సంబంధి దోషాలు చేయటానికి అవకాశాలు ఎక్కువ.

**ఉదా :**

| | |
|---|---|
| కోటి (ధన్యవాదాలు) | - కోతి (ధన్యవాదాలు) |
| మెడ | - మేద |
| కల | - కళ |

## వర్ణ సంబంధి దోషాలు :

లిపిలో భాగమైన వర్ణక్రమానికీ, ఉచ్చారణకీ ప్రత్యక్షంగా సంబంధం లేకపోయినా పరోక్షంగా వీటి ప్రభావం ఒక దాని మీద ఒకటి ఉంటుంది. అందుచేత అస్పష్టోచ్చారణ వర్ణక్రమాన్ని దోషం చేస్తుంది (బుద్ధిరాజు జ్యోతిర్మయి, 1994, పు. 150). ధ్వనులు ఉచ్చారణల ప్రభావం ద్వితీయ భాషాభ్యసనం పై కనిపిస్తుంది. ద్వితీయ భాషలోని ధ్వనులు వర్ణాలుగా రాసేటప్పుడు ఆ భాషా సంప్రదాయం అవగాహన లోపం ఏర్పడితే కూడా దోషాలు ఏర్పడతాయి (వై. రెడ్డి శ్యామల, 1992, పు. 85). క్రీయోల్ భాషలోగానీ, ఫ్రెంచి భాషలోగానీ, ఆంగ్లభాషలోగానీ "ఏ", "ఐ" అనే లిపి సంకేతాలు మాత్రమే ఉండగా తెలుగులో ఎ, ఏ, ఐ మూడు లిపి సంకేతాలు ఉండటంచేత వీటి మధ్యభేదాన్ని కొంత మంది శిక్షణోపాధ్యాయులు గుర్తించలేక కింది వివరించ బడిన దోషాలు జరుగుతున్నాయి. అలాగే "ఓ", "ఔ" లిపులకు సమానంగా తెలుగులో "ఒ, ఓ, ఔ" లు ఉం డటం వల్ల తెలుగులోని ఒ, ఓ, ఔల మధ్య భేదాన్ని గుర్తించటంలో లోపం ఏర్పడుతున్నది. దీని వలన ఒ, ఓ, ఔ లను రాయడంలో దోషాలు ఏర్పడుతున్నాయి.

**1) హ్రస్వానికి దీర్ఘం దీర్ఘానికి హ్రస్వం రాయటం :**

a) "ఇ" "ఈ" గా రాయటంబీ ఉదా: ఇసక ఈసక, కాబట్టి కాబట్టీ మొదలైనవి.
b) "ఈ" "ఇ" గా రాయటంబీ ఉదా: ఈయన- ఇయన, స్త్రీ స్త్రి, మొదలైనవి.
c) "ఉ" "ఊ" గా రాయటంబీ ఉదా : ఉమ ఊమ, ఉద్యోగం ఊద్యోగం మొదలైనవి
d) "ఊ" "ఉ" గా రాయటంబీ ఉదా : ఊయల ఉయల, దూడ దుడ మొదలైనవి
e) "ఎ"- "ఏ" గా రాయటంబీ ఉదా : పందెం- పందేం, ఎవరు- ఏవరు మొదలైనవి.
f) "ఏ"- "ఎ" గా రాయటంబీ ఉదా : కష్టే ఫలి కష్టె ఫలి, మేం- మెం మొదలైనవి
g) "ఐ" ని "ఏ" గా రాయటంబీ ఉదా : ఐదుగురు- ఏదుగురు, మొదలైనవి
h) "ఒ"- "ఓ" గా రాయటంబీ ఉదా : పొలం- పోలం, కొండ- కోండ మొదలైనవి
i) "ఓ"- "ఒ" గా రాయటంబీ ఉదా : రోగం- రొగం, నోటిలో- నొటిలో మొదలైనవి

**2) అచ్చులకు బదులు హల్లులు రాయటం :**

ఎక్కడ- యెక్కడ, ఎవరు- యెవరు మొదలైనవి. మన భాష అజంత భాష. అంటే పదాలన్నీ అజంతంగా ఉంటాయని అర్థం. పదం చివర అచ్చు ఉంటుంది, హల్లు ఉండదు.

**3) దీర్ఘానికి బదులు హ్రస్వం, హ్రస్వానికి బదులు దీర్ఘం రాయగా వర్తిల్లిన దోషాలు :**

చెప్పాడు- చేప్పాడు, గుర్తురావటంలేదు- గూర్తూరావటంలేదు మొదలైనవి

**4) సున్న తర్వాతి అక్షరం పలికేటప్పుడు ఊనిక ఉందనే భ్రమ చేత ద్విత్వాక్షరాన్ని రాయటం:**

ఉదా : కొన్నాళ్లకు- కొంన్నాలకు, అంతట- అంత్తట మొదలైనవి. తెలుగు మాటల్లో బిందువు పరుష సరళాలకు ముందే వస్తుంది. బిందువు తర్వాత ఇతర హల్లులలో ఏది ఉన్నా ఆ మాట తెలుగు మాట కాదని ఛాత్రోపాధ్యాయులకు చెప్పబడింది.

**5) అల్పప్రాణాన్ని మహాప్రాణంగా రాయటం :**

ఉదా : విద్య- విధ్య, పద్యం- పధ్యం, బాధ- భాద, మొదలైనవి. మనం ఈ నాడు రాస్తున్న భాషలో ఇటువంటి

పదాలెన్నోఉన్నాయి. కాని శబ్ద స్వరూపం తెలియకపోతే వర్ణక్రమం విషయంలో అనుమానాలు వస్తూనే ఉంటాయి.

**6) మహాప్రాణాన్ని అల్పప్రాణంగా రాయటం :**

ఉదా : భాష- బాష, బోధన- భోదన, ఘోర- గోర, శ్రేష్ఠమైన- శ్రేష్టమైన, పాఠం- పాటం, మొదలైనవి. ఒక సంస్కృత పదంలో ఏ వర్ణం మహాప్రాణమో సందేహం కలగడంవల్ల ఒకదానికి బదులు మరోదానికి ఒత్తు ఇవ్వటం జరుగుతుంది.

**7) అక్షరాలలోని ఒత్తులను తారుమారు చేసి రాయటం:**

ఉదా : భేదం- బేధం, కాబట్టి- కాబ్బటి, మధ్యాహ్నం- మధ్యన్హం మొదలైనవి. సంస్కృతం నుండి మనం అరువు తెచ్చుకున్న మాటల్లో థ, ధలతో ఉండే మాటలెన్నో ఉన్నాయి. అయితే ఈ రెండింటి మధ్యా భేదాన్ని పాటించడంలో పొరపాట్లు దొర్లుతున్నాయని గమనించబడింది. ఒకదాని బదులు ఒకటి రాయడమో, లేకపోతే అన్ని చోట్లా ఒకటే రాయడమో కూడా పరిపాటి.

**8) అక్షరాలను మార్చి రాయటం :**

ఉదా : కొన్నాళ్లకు - కొన్నాలకు, నాయనలారా- నాయనలాగా, ఆసక్తి- ఆసత్తి మొదలైనవి.

**9) శ, ష, స ల మధ్య భేదం గుర్తించకపోవటం :**

ఉదా : స్మశానం- స్మషానం, శివ- షివ, ఆకాశం- ఆకాషం, భాష- భాశ, మనుష్యులు-మనుశ్యులు, అంశాలు- అంషాలు, శోభ- షోభ మొదలైనవి.

**10) ద్విత్వాన్ని దీర్ఘంగానూ దీర్ఘాన్ని ద్విత్వంగానూ రాయటం :**

ఉదా : చోటని- చోట్టని, గేయాన్ని- గెయ్యాన్ని మొదలైనవి. ద్విత్వం చేయటం అనేది భాషలో వర్ణాలకు సంబంధించి ఒక ప్రత్యేకమైన అంశం.

**11) అనునాసికం వెనక ఉన్న వర్ణాలను ద్విత్వంగా రాయటం :**

ఉదా : గంట - గంట్ట, చేయించింది- చేయిచ్చింది మొదలైనవి

**12) వర్గానునాసికం - "0" మధ్య గుర్తింపు లేకపోవటం:**

తెలుగులో పదమధ్యంలో వచ్చే అచ్చులేని వర్గానునాసికాన్ని "0" తో గుర్తించటం ఉంది. అయితే అచ్చుతో ఉన్న అనునాసికానికి అచ్చులేని అనునాసికానికి మధ్య తేడాను గుర్తించినప్పుడు ఇటువంటి దోషాలు లిపిలో చోటు చేసుకుంటున్నాయి. ఉదా : పాల్గొనటానికి - పాల్గొంనటానికి

**పద దోషాలు :**

ఛాత్రోపాధ్యాయులు ఒక పదానికి బదులుగా మరొక్క పదాన్ని రాస్తున్నారని గమనించబడింది. ఇలా పదాలలోని అక్షరాలు తప్పుగా రాయటం వల్ల భిన్నార్థం స్ఫురిస్తున్నది. పదం అర్థ రహితంగా మారింది. ఉచ్చారణ సౌలభ్యాన్ని కొల్పోయింది. వాటిని పదాంష దోషాలుగా వివరించటం జరిగింది. ఇది కూడా వర్ణక్రమ దోషమే.

**1) రూపసామ్యత వల్ల కలిగే దోషాలు :**

తెలుగులోని పదాలలోగల పరస్పర రూప సామ్యత వల్ల విద్యార్థులు ఒక దానిని మరొకటిగా అర్థం చేసుకొని రాస్తున్నారు. ఉదా :

| | |
|---|---|
| ఆసక్తి | - ఆశక్తి (శ- సల భేదాన్ని గుర్తింపక) |
| మనం | - యంనం (మ- యల గుర్తింపక) |

శ్రవణ, పఠన అవధానతా లోపాలతోపాటు రాసే విషయం మీద దృష్టి కూడా లేకపోవటం వల్ల ఈ దోషాలు చేయటానికి కారణం కావచ్చు.

**2) పదాల రూపాలను ఎన్నుకోవాడంలో దోషాలు :**

ఉదా : i) మేం తెలుగు వాళ్లం - (మనం).
ii) నా అమ్మ- (మా అమ్మ).

**3) సంఖ్యా వాచకాలు మానవ మానవేతర భేదం గుర్తించటం :**

మానవేతర పదాలకు సంఖ్యావాచకాన్ని తెలిపేటప్పుడు అంకెలు అలాగే ఉపయోగిస్తాం. ఉదా : పది కలాలు. కానీ మానవ సంబంధంగా అంకెలు

ఉపయోగించేటప్పుడు బిరు, బిగురు, బిమంది ప్రత్య యాలు కలిపి వాడుతాం. ఉదా: ఒకరు, ఇద్దరు, ఐదు గురు, ఆరుగురు

**4) అన్య భాషా పదాలు ప్రయోగం :**

ఆంగ్ల పదాలను, హింది పదాల, మాండలిక పద ప్రయోగాలవల్ల కూడా పదదోషాలను గమనించబడ్డాయి.

a) మాండలికం ప్రయోగం.
   i) ఎలాగా సమాచారం? బాగే.- (ఎలా ఉన్నారు? బాగున్నాను)

b) ఇంగ్లీషు ప్రయోగం.
   i) First తరగతి నించి sixth తరగతి వరకు చాలామంది students ఉన్నారు.

c) హిందీ ప్రయోగం.
   i) వాళ్లు ఉగాది పండగ మనిస్తారు. - manaate hein (జరుపుకొంటారు)
   ii) నాన్నగారు ఆరామం చేస్తున్నారు. - (విశ్రాంతి తీసుకొంటున్నారు)

ప్రస్తుతం మారిషస్ దేశంలో రెండు భాషలు మాట్లాడ గలిగిన లేదా కనీసం అర్థం చేసుకోగలిగిన వ్యక్తుల సంఖ్య చాలా ఎక్కువ. విద్యార్థులు ముఖ్యంగా ప్రభుత్వపు పాఠ శాల్లో అనుసరిస్తున్న విద్యావిధానం వల్ల మూడు భాషలు నేర్చుకొంటున్నారు. హింది, భోజ్పురి భాషలు తెలుసుకొన్న వాళ్లు కూడా తెలుగు భాషను నేర్చుకొంటారు. అందువల్ల తెలుగు భాషలో బహుభాషల పదజాలం వచ్చి చేరటానికి అవకాశం ఉంది. పూర్వం ఏ కొత్త మాట కల్పించుకోవా లన్నా మనం సంస్కృతం లేక హింది మీదే ఆధారపడే వాళ్లం. ఇప్పుడు ఇంగ్లీషు అంతే అనివార్యమైపోయింది. భోజ్పురి మాండలిక ప్రభావంవల్ల ఇద్దరు అరవై ఏళ్లగల తెలుగు ఉపాధ్యాయులు కలుసుకుంటే "నమస్కారం" తప్ప భోజ్పురిలో మాట్లాడుకుంటారని హాస్యోక్తి. ఇద్దరు తెలుగు ఉపాధ్యాయులు భోజ్పురిలోగానీ క్రీయోల్ లోగాని మాట్లాడుకోవటం, ఆ భాషల్లోనే తిట్టుకోవటం వింత విషయమేమీ కాదు.

**వ్యాకరణ దోషాలు :**

ఛాత్రోపాధ్యాయులు తమ రచనల్లో లింగ, కాల, వచన, విభక్తి, క్రియా మొదలైన వ్యాకరణాంశాలను తప్పుగా రాస్తున్నారని గమనించబడింది. వ్యాకరణ దోషాలు సమీక్షించటానికి గ్రహించిన సామగ్రిలో దాదాపు ప్రతి వాక్యం ఏదో ఒక స్థాయికి చెందిన దోషం కలిగి ఉంది.

**వాఖ్య నిర్మాణం :**

కర్త, కర్మ, క్రియ వరుసలలో రాస్తూ వాక్య నిర్మాణం చేయటం తెలుగు భాషా సంప్రదాయం. ఈ సంప్ర దాయం ఒక్కొక్క సారి ఇతర భాషల ప్రభావం చేత కొంత మారుతుంది. అన్య భాష పద ప్రయోగం మిశ్రమ భాషకి దారితీస్తుంది. ఇతర భాషా పదాలు తెలుగు భాషలో చోటు చేసుకున్నా తమకు తోచినట్లు పదాల్ని వాడడం దోషంగా పరిగణింపబడుతుంది. సామాన్య వాక్య నిర్మాణంలో విద్యార్థుల దోషాలు చాలా తక్కువగా ఉం టున్నాయి. సంయుక్త వాక్యాల నిర్మాణంలో విద్యార్థుల దోషాలు ఎక్కువగా కనిపిస్తుంది.

**1) క్రియా పరిజ్ఞాన లోపం వల్ల కలిగే దోషాలు :**

కొంతమంది శిక్షణోపాధ్యాయులు ఏకవచన బహు వచన క్రియలు కర్తను అనుసరించి ప్రయోగించలేదు. కర్మను అనుసరించటంచేత క్రియా దోషాలు సంభ విస్తున్నాయి.

**ఉదా :**

✡ మా అన్న తన మిత్రులతో ఆటలు <u>ఆడుతున్నారు</u> - (ఆడుతున్నాడు). ఇక్కడ "అన్న" మాత్రమే కర్త. అందుకే ఏకవచన క్రియను ఉపయోగించాలి. కాని పిల్లలందరూ ఆటలు ఆడుతున్నారు. కనుక కొంత మంది శిక్షణోపాధ్యాయులు బహువచన క్రియను ఉపయోగించారు).

**2) కాల పరిజ్ఞాన లోపం వల్ల కలిగే దోషాలు :**

కాల సంబంధి క్రియా రూపాలని గురించి సరైన అవగాహన లేకపోవటంవల్ల కొందరు ఛాత్రోపాధ్యాయులు

కాలానుగుణమైన క్రియలని ఉపయోగించటంలేదు. ఏ కాలానికి ఎటువంటి క్రియని ఉపయోగించాలో వాళ్లకు తెలియలేదు. తద్వార దోషాలు సంభవించాయి.

ఉదా :

- ✡ అది ఒక శనివారం నాడు. సూర్యుడు ఆకాశంలో బంతి లాగా ప్రకాశించాడు. - (ప్రకాశిస్తున్నాడు). ఇక్కడ వర్తమాన కాలిక క్రియకు బదులు భూత కాలిక క్రియ ఉపయోగించబడింది.
- ✡ తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తే చాలా లాభాలు దొరికాయి (దొరుకుతాయి) ఏ కాలానికి ఎటువంటి క్రియని ఉపయోగించాలో తెలియక పోవటం కారణం. ఇక్కడ తద్ధర్మకాలిక క్రియకు బదులు భూతకాలిక క్రియ ఉపయోగించబడింది.

**3) పురుష సంబంధి క్రియా పరిజ్ఞాన లోపం వల్ల కలిగే దోషాలు :**

తెలుగు భాషలో ప్రథమ, మధ్యమ, ఉత్తమ పురుష లలో క్రియ వాడబడుతుంది. కొందరు ఛాత్రోపాధ్యా యులు అది కూడా గుర్తించకపోవటం వల్ల దోషాలు చేస్తున్నారు. వాటిని గురించి తెలుసుకోవాలనే ఆసక్తి, జిజ్ఞాస లోపించటంవల్ల కూడా దోషాలు చేస్తున్నారు.

ఉదా :

- ✡ మీరు ఎలా ఉన్నావా? నన్ను గుర్తించావా?

పురుషుల సంబంధిత క్రియా పరిజ్ఞాన లోపంవల్ల ఇటువంటి దోషాలు ఛాత్రోపాధ్యాయులు చేస్తున్నారు. గౌరవవాచకాల ప్రయోగం తెలియకపోవటం కూడా ఇక్కడ కనిపిస్తుంది.

**4) లింగం - క్రియ అన్వయ లోపం వల్ల చేసే దోషాలు:**

క్రియకి సమీపంగా ఉన్న వాచకాన్ని బట్టి క్రియని ప్రయోగించాలి. ఈ విషయ అవగాహన లేకపోవటంవల్ల కొంతమంది ఛాత్రోపాధ్యాయులు ఈ దోషాలు చేస్తున్నారు.

ఉదా :

- ✡ మా చెల్లెలు మా తమ్ముడి సహాయంతో ద్వారాలకు తోరణాలు కట్టారు - (కట్టింది).
- ✡ మంచి ఉద్యోగం కూడా దొరుకుతున్నారు.

మహత్, మహతీ, తిర్యక్ జడవాచకాల క్రియా రూపాలని గుర్తించకపోవటం వల్ల ఛాత్రోపాధ్యాయులు దోషాలు చేశారు.

**5) వచనం - క్రియల అన్వయ లోపం వల్ల చేసే దోషాలు:**

ఉదా :

- ✡ భాషణం నైపుణ్యం శ్రవణం నైపుణ్యం పై ఆధార పడుతాయి - (పడుతుంది).

**6) క్రియా రూపంలోని దోషాలు :**

- ✡ మంచి ఉద్యోగం కూడా దొరుకుతున్నారు (చద వటం వల్ల/ తెస్తాయి/ దొరుకుతుంది). చేదర్థకం రాయవలసిన చోట శత్రర్థకం రాయడమైంది.
- ✡ అలా చేసి మన తెలుగు భాష మరణించదు (అలా చేస్తే...... సజీవంగా ఉంటుంది). ఆలోచనలోని సంక్లిష్టతను వ్యక్తీకరించే భాషా జ్ఞానం లోపించటం వలన ఈ వాక్యాలు ఏర్పడుతున్నాయి.

**7) ప్రత్యక్ష పరోక్ష వాక్యాల అవగాహన లోపంవల్ల చేసే దోషాలు :**

విరామ చిహ్నాలని, పరోక్ష వాక్యాల నించి ప్రత్యక్ష వాక్యాలని గుర్తు పట్టడానికి అనువుగా "కొటేషనమార్కు" ఉంచాలని తెలియకపోవటం వల్ల కొందరు శిక్షణోపాధ్యా యులు దోషాలు చేస్తున్నారు. అశ్రద్ధవల్ల ఈ దోషాలు సంభవిస్తున్నాయని గమనించబడింది. ఉదా: ఆచార్య గారు "మీరందరూ బయటికి వెళ్లండి" అని చెప్పారు. ఆచార్యగారు మమ్మల్నందరిని బయటికి వళ్లమని చెప్పారు.

**8) పదాల ఎంపికలో దోషాలు :**

పైన పేర్కొనబడిన దోషాలే కాక కొన్ని క్రియా రూపాలు, కొన్ని ప్రయోగాలు భావ దోషాన్ని కలిగించటం జరిగింది. కొన్ని వింత రూపాలని సంతరించుకోవటం కూడా జరిగింది. వాటిలో కొన్ని ఇక్కడ ఉదాహరించటం జరిగింది.

- ✡ శ్రీ వెంకటేశ్వర దేవుల గౌరవంలో నేను ఒక కీతనం

కూడా పాడాను (in honour of Lord Venkateshwara - మక్కికి మక్కి అనువదించ బడింది)

## వ్యాకరణ సంబంధి దోషాలు- వర్గీకరణ :

**1) నామవాచకాల, సర్వనామాల దోషాలు**

- ✡ తెలుగు భాష బాగా చేస్తే భారత దేశానికి వెళ్లటానికి ఒక స్కోలార్షిప్ దొరికింది. (నామవాచక లోపం).
- ✡ సలవులో పంతులమ్మ ఇంటికి తిరిగి వచ్చినప్పుడు ఈవిడ తోడికోడలు కూడా వచ్చింది. ఆవిడకు ఒక చిన్న బాబు ఉన్నాడు. ఇతను తెలుగు భాష మాట్లాడుతాడు.

తెలుగు భాషలో ఉన్న అతను- ఇతను, వాడు- వీడు, ఆయన- ఈయన, ఆమె- ఈమె, ఆవిడ- ఈవిడ అనే మాటలను ఎప్పుడు, ఎలా, ఏ సందర్భంలో ఉపయోగించాలో సందేహంగా ఉంటుంది. ఈ మాటలను సమానార్థకంగా ఇంగ్లీషులో చెప్పాలంటే ఒక్క "he, she" అనే మాటలతోనే చెప్పుకోవాలి. ఒక భాషలో ఉన్న పదాలను, వాటి అర్థభేదాలను మరో భాషలోకి యథాతథంగా తీసుకురావటం అసాధ్యం. ఈ భేదం తెచ్చి ఇంగ్లీషులో పెడదామని కృతకంగా మాటలు సృష్టిస్తే విడ్డూరంగా ఉండటమే కాక, అవి వ్యవహారంలో ఇమడవు కూడా.

**2) వచనంలో దోషాలు :**

- ✡ చాలా తక్కువ మంది విద్యార్థి.
- ✡ బియ్యాలు. (బియ్యం - నిత్యైకవాచనం అని తెలియకపోవటంవల్ల బహువచనంగా రాయ బడింది)

**3) మానవ – మానవేతర భేదం :**

కొని విద్యార్థులు కేవలం తెలుగు భాషను చదువుతున్నారు.

**4) Countable vs uncountable :**

ఎన్నో సహాయం కలుగుతుంది.

**5) విభక్తి ప్రయోగంలో దోషాలు :**

ఒక్కొక్క పర్యాయం విభక్తి దోషంవల్ల అర్థ భేదం సంభవిస్తున్నది. వీటికి పఠన అవధానతా లోపాలు ముఖ్య కారనం.

ఉదా :

- ✡ మన పిల్లలకు పోత్సహించాలి. (ని, ను ప్రయోగాలలో దోషాలు)
- ✡ పిల్లలను బోధించాలి. (కి, కు ప్రయోగాలలో దోషాలు)

**6) ఔపవిభక్తికాలలో దోషాలు :**

- ✡ ఈ కేవలం విద్యార్థుల సమస్య కాదు. దేశ సమస్య. (ఇది)
- ✡ ఇప్పుడు నేను ఇల్లుకు వెళ్తున్నాను. (ఇంటికి)

ఇవి శ్రవణ, పఠన, అవధాన లోపాల వల్ల విశేష్య, విశేషణ, విభక్తి, క్రియా రూపాల సాధారణ స్వరూప స్వభావాలని గ్రహించక ఛాత్రోపాధ్యాయులు చేసిన దోషాలు.

## విరామ చిహ్నాల దోషాలు :

ఛాత్రోపాధ్యాయులు తమ రచనలలో విరామ చిహ్నాలను సరిగా పాటింపకపోవటంవల్ల విరామ చిహ్నాల దోషాలు సంభవించాయి. ఆంగ్లేయుల కారణంగా విరామ చిహ్నాలు తెలుగు భాషలో ప్రవేశించినా, భావవ్యక్తీకరణకు అవి చాలా ముఖ్యం. భాషణలో మనం ఇచ్చే విరామం, వ్యక్తీకరించే ధ్వని భావాన్ని స్ఫురింప చేస్తుంది. రాతలో ఆ ప్రభావాన్ని విరామ చిహ్నాల ద్వారా తీసుకురావచ్చు. అవసరమైన చోట గుర్తించినా భావ దోషాలు కలుగుతాయి. ఛాత్రోపాధ్యాయుల్లో కొందరు ఉక్తపదలేఖనంలో రాసిన కొన్ని వాక్యాలు దిగువన ప్రదర్శింపబడ్డాయి.

- ✡ నేనెలా పని చేస్తానో మీకు తెలుసా - నేనెలా పని చేస్తానో మీకు తెలుసా? (ప్రశ్నార్థకం) - ఏదైనా విషయాన్ని గూర్చి ఎదుటి వారిని అడిగేటప్పుడు ఆ వాక్యం చివర "?" అనే ప్రశ్న గుర్తును ఉపయోగిస్తామనే విషయం గమనించక ఛాత్రోపాధ్యాయులు విరామ చిహ్నాల దోషాలు చేస్తున్నారు.

✡ అంతే క్షణాలలో మీకు నేను దృశ్యాన్ని చూపెడ తాను - అంతే! క్షణాలలో మీకు నేను దృశ్యాన్ని చూపెడతాను (ఆశ్చర్యార్థకం). - ఆశ్చర్యాన్ని, ఆనం దాన్ని, భయాన్ని, వింతను, మెచ్చుకోలును తెలిపే పదాల చివర ఈ గుర్తు "!" ఉపయోగిస్తామని తెలి యక దోషాలు చేస్తున్నారు.

ఈ విధంగా పాధ్యాయులు విషయ, భాషాగతమైన అనేక దోషాలు చేస్తున్నారు. ఇవి శ్రద్ధ, శ్రవణ, పఠన అవగాహన లోపాల వల్ల జరిగేవి. పఠన శక్తిని బాగా పెంపొందించుకొంటే భాషణ శక్తి కూడా మరింత అభివృద్ధి అవుతుంది. ఈ రెండు బాగున్నపుడు లేఖనం చక్క బడుతుంది.

## లేఖన దోషాల నివారణ :

భాషా దోషాలు, భావ దోషాలు, వ్యాకరణ దోషాలు, విరామ చిహ్నాలను ఉపయోగించటంలో దోషాలను సులభంగా నివారించవచ్చు. వాటిని సరియైన రూపాలను ఛాత్రోపాధ్యాయులకు తెలుపటం ద్వారా వీటిని తొలగించవచ్చు. ఛాత్రోపాధ్యాయులు చేసే దోషాలను వ్యక్తిగతంగా సవరించి చూపబడింది. లేఖన దోషాలు ఛాత్రోపాధ్యాయులకు తెలియజేసి లేఖన అభ్యాసాలు ఇవ్వబడ్డాయి. తర్వాత వాళ్లు వాటిని పాటిస్తున్నారో లేదో గమనించబడింది. సాధారణంగా అందరూ చేసే లేఖన దోషాలను క్రోడీకరించి విశ్లేషణ చేసి వివరించబడింది. ఛాత్రోపాధ్యాయులకు చూచి రాత వంటి పనులను ప్రతి రోజు అవసరమైనంతగా ఇవ్వబడింది. కుశాగ్ర బుద్ధులను, సామాన్యులను, మందబుద్ధులను దృష్టిలో ఉంచుకొని వేరు వేరు నియోజనాలను తయారు చేసుకొని వాటి ద్వారా కృషి జరిపించి అభివృద్ధిని సాధించబడింది. ఇంటి పని కూడా ప్రతి రోజు ఇవ్వబడింది. సక్రమమైన వ్యాకరణ జ్ఞానం కల్గించబడింది. దృష్ట లేఖనం, ఉక్తపదలేఖనం, లిఖిత చర్య అనే లేఖనాభ్యాసాల ద్వారా ఛాత్రోపాధ్యాయుల్లో లేఖనా నైపుణ్యాన్ని పెంపొందించటానికి ప్రయత్నం చేయబడింది.

## ఉపయుక్త గ్రంథాలు :

✡ David, A. (2005), Teaching English as a Second Language: New Delhi, India, For Commonwealth Publishers.

✡ బుద్ధిరాజు జ్యోతిర్మయి. (1994), తెలుగు బోధన పద్ధతులు- సర్వేక్షణ, రాజభూషణ ప్రచురణ, హైదరాబాద్.

✡ రెడ్డిశ్యామల, వై. (1992) హిందీ మాతృభాషగా గల విద్యార్థులకు ద్వితీయ భాషగా తెలుగు బోధన- సమస్యల విశ్లేషణ, రజతోత్సవ ప్రచురణ, యువ భారతి, హైదరాబాదు.

❀ ❀ ❀

# డా॥ టి.జి.ఆర్. ప్రసాద్ గారి కథలు - మానవీయ విలువలు

- యస్. రాధిక
పరిశోధక విద్యార్థి, తెలుగు శాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.

- డా. పి. శ్రీనివాసులు
అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు శాఖ, రాయలసీమ విశ్వవిద్యాలయం, కర్నూలు.

డా॥ టి.జి.ఆర్. ప్రసాద్‌గారు సుమారుగా 300 కథలు బాలల కోసం సృష్టించిన బాల కథా రచయిత. వీరు సిల్వర్ జూబిలీ కళాశాల, కర్నూలు నందు ఆచార్యులుగా పనిచేసి పదవీ విరమణ పొందారు. విద్యా రంగంలో సుమారుగా మూడు దశాబ్దాలుగా వివిధ స్థాయిలలో సేవలందించిన సాహితీ కృషీవలుడు. వీరి రచనలలో సమాజంలో ప్రత్యేకించి భవిష్యత్ తరంలో మానవీయ విలువలు నింపాలనే తృష్ణ వారిని బాలకథా రచయితగా నిలబెట్టడానికి ప్రేరణగా నిలిచి వుంటుంది. డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు తరచు "దేశము యొక్క అభివృద్ధి పాఠశాల తరగతి గదుల్లో నిర్మాణమవుతుందని చెబుతూ ఉండేవారు. అవును. నేటి బాలలే రేపటి పౌరులు. నేటి బాలల్లో యువతలో సామానిక మానవీయ విలువలు నింపగలిగితే భవిష్యత్ భారతం ఉత్తమ విలువలతో సంస్కార వంతమవుతుమది.

శ్రీ టి.జి.ఆర్ ప్రసాద్ గారు ప్రతి కథలో భేతాళుడు విక్రమార్కుడికి ఒక కథ చెప్పటం, ఆ ప్రశ్నించటం, విక్రమార్కుడు సమాధానం చెప్పటం అనే విక్రమార్క కథలుగా చిత్రీకరించారు. ప్రతి కథలో తప్పక ఏదో ఒక విలువ గురించి ప్రస్తావించడం ఆలోచింప చేయటం, చివరకు తర్కబద్ధంగా విక్రమార్కుడిద్వారా విశ్లేషించడం జరిగింది. ఈ కథలు పిల్లలకోసం అని చెప్పబడినప్పటికీ, నేటి సమాజంలో వివిధ సమస్యలకు, పరిష్కారం చూపించే విధంగా చిత్రీకరించారు. అటువంటి వాటిలో కొన్నింటిని స్థాలీపులీక న్యాయంగా ఈ వ్యాసంలో చర్చించడం జరిగింది.

'అంచనా' అనే కథలో గోవిందుడనే ఆచార్యులు శ్రీపతి అనే శిష్యుడు ఉండేవారు. ఆచార్యులవారు గొప్ప పండితులు. తరచు తాను గొప్ప కావ్యం రాయగలనని చెబుతూ వుండేవారు. శ్రీపతి చిన్న చిన్న కవితలు వ్రాసి చిన్న సంకలనం చేసి రాజుగారికి పంపితే, రాజుగారు శ్రీపతిని మెచ్చుకొని గోవిందాచార్యుల అధ్యక్షతన జరిగిన సభలో ఘనంగా సన్మానించాడు. ఈ కథలో రచయిత రాజు గురువును కాదని, శిష్యుడిని ఎందుకు సన్మానించాడన్న దానికి విక్రమార్కుడి ద్వారా సమాధానం చెప్పిస్తూ, "మనం మన గురించి అంచనా వేసుకునేటప్పుడు మనం ఏమి చేయగలం అన్న దాన్ని బట్టి అంచనా వేసుకుంటాం. కాని ఎదుటి వాళ్లు మనం ఏమి చేశాం అన్న దానిని అంచనా వేస్తారు". - 1. ఆచార్యుల వారు నేను గొప్ప కావ్యం రాయగలను, రాయగలను అని అనుకుంటూ వుండేవాడు గాని రాయలేక పోయాడు. కాని శిష్యుడు శ్రీపతి రాసి చూపించాడు. సన్మానం అందుకో గలిగాడు. కావున కేవలం మాటల వల్ల గౌరవం రాదు, ఆచరణలోకి వచ్చినపుడే గుర్తింపు, గౌరవం వస్తుందని చక్కని సందేశం అందించాడు.

'గొప్పతనం' అనే కథలో రచయిత ఏది నిజమైన గొప్ప తనం అనే విషయాన్ని చక్కగా వివరిస్తూ, ఈ కథలో రెండు పాత్రలను బింబ, ప్రతిబింబ భావనతో సృష్టించి కథ నడిపాడు. ఒక రాజ్యంలోని విద్యాధికారి పదవికి సమీరుడు, సాగరుడు అనే యువకులు రాజుగారిని అభ్యర్థించారు. అందుకు రాజుగారు చెరొక వెయ్యి వరహాలు ఇచ్చి, ఒక మాసంలో మీరు ఎలా విద్యాభివృద్ధి చేస్తారో ప్రయత్నించమంటే, సమీరుడు ఒక పెద్ద పండిత పరిషత్తు ఘనంగా ఏర్పాటు చేసి జ్ఞాన సప్తాహం ఏర్పాటు చేసి ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు.

సాగరుడు ఒక గ్రామం ఎన్నుకొని ఆ గ్రామంలో కొంతమంది చదువుకున్న యువకులను సమీకరించి

వారిద్వారా ఆ గ్రామంలోనూ, చుట్టుప్రక్కల గ్రామాల లోనూ వివిధ ప్రదర్శనలు, పాదయాత్రలు, సమావేశాలు నిర్వహించి ప్రజల్లో విద్య ఆవశ్యకత తెలియజేశాడు. తద్వారా నిరక్షరాస్యుల్లో చైతన్యం వచ్చి ఆ గ్రామంలోని అందరిని అక్షరాస్యులుగా చేయగలిగాడు. రాజు ఇద్దరి పనిని చూసి సాగరుణ్ని విద్యాధికారిగా నియమించాడు.

రచయిత విక్రమార్కుడి ద్వారా ఈ ఇద్దరిలో ఎవరు గొప్పవారో, ఎందుకు గొప్పవారో వివరింపజేస్తూ "మనిషి గొప్పతనం పెద్ద కార్యాల్ని ఆర్భాటంగా చేయడంలో లేదు. చిన్న చిన్న పనుల్ని గొప్ప మనస్సుతో చేయడంలో వుంది. తన తోటి సాదా సీదా మనిషికి కనీసం జ్ఞానం కలిగించాలనే ఆర్తి ఈ లోకంలో చాలా తక్కువ మందికి వుంటుంది. అలా కోరుకోవడం, అందుకోసం ప్రతి పని చేయడం, ప్రతి పౌరుడియొక్క బాధ్యత. తద్వారా సమాజంలో సమస్యలు సులువుగాపరస్పర సహకారంతో పరిష్కరించ బడతాయని"-2 సూచించారు.

'కార్య దక్షత' అనే ఈ కథలో రచయిత ఒక పనిని సాధించాలనేవాడు ఎలా వుండాలి? ఎలా ఆలోచించాలనే విషయాలను చక్కగా రెండు పాత్రల ద్వారా వివరించారు.

కార్యాన్ని సాధించాలంటే కేవలం శౌర్య పరాక్రమాలు కండబలం కలిగి వుండడమే కాదు, సమయానికి, పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడం తెలిసి వుండాలి. ప్రతికూల పరిస్థితుల్లో ఎలా వ్యవహరించాలనే జ్ఞానం వుండాలి. అప్పుడు లక్ష్యము సాధించబడి కార్యము నెరవేరుతుంది.

ఈ కథలో రెండు పాత్రలు రచయిత సృష్టించాడు. ఒకటి కేశవుడు - సేనాధిపతి, రెండవ వాడు కృతవర్మ. ఇద్దరూ శౌర్య పరాక్రమాలు కలవారే. కాంభోజ రాకుమార్తె మదాలసను ధూమకేతువు నుండి రక్షించడానికి బాధ్యత అప్పగించబడ్డారు ఇద్దరూ. మొదట కేశవుడు వెళ్లి, ధూమకేతువు అధీనంలోని మదాలస అడవిలో ఉందని తెలుసుకొని ఆమెను విడిపించే ప్రయత్నంలో గాయపడి, ఆ బాధలో కోపంతో అడవిని తగులబెట్టించాడు. అదృష్టం కొద్దీ రాకుమారి 'మదాలస' ప్రమాదం నుండి బయట పడింది. లేకుంటే కేశవుడి అనాలోచిత నిర్ణయం వల్ల 'మదాలస' అగ్నికి ఆహుతయ్యేది. కేశవుడు సాహస వీరుడు, ధైర్య సాహసాలు కలిగినావాడే కాని, సంయమనం, సమయస్ఫూర్తి లేకపోవడం వల్ల ఆవేశంలో సంయమనం కోల్పోయి ప్రవర్తించడం వల్ల రాజకుమారి 'మదాలస' ప్రమాదంలో చిక్కుకోవలసి వచ్చింది.

కృతవర్మ ధైర్యవంతుడు, మదాలస జాడ తెలిసికొని, ఆమె గట్టి బందోబస్తు మధ్య వుందని, తానొక్కడే ప్రవేశిస్తే తాను పట్టుబడడమే కాకుండా, రాకుమారికి కూడా ప్రమాదమని గ్రహించి, తెలివిగా ఆలోచించి, వెనక్కు వచ్చాడు. వెనక్కి వచ్చిన అతణ్ని అందరూ ఎగతాళి చేసినా భరించాడు. ఆ తర్వాత పెద్ద సైన్యంతో వెళ్లి, ధూమకేతువును సంహరించి, రాకుమారి 'మదాలస'ను విడిపించి కేశవుని స్థానంలో సేనాధిపతి అయ్యాడు.

"కార్యసాధకుడు ఎప్పుడూ ఆవేశంతో ముందుకు పోవాలనుకోడు. పనిని సానుకూలం చేయటానికి అవసరం కొద్దీ వెనక్కు మళ్లుతాడు. తాళం చెవిని వెనక్కి త్రిప్పితేనే కదా, తాళం తెరుచుకునేది! వివేకి గత అనుభవాలను దృష్టిలో పెట్టుకొని, అదును-పదును చూసి అడు గేస్తాడు". - 3. కృతవర్మ పాత్ర ద్వారా రచయిత కార్యసాధకుడికి తొందరపాటు, ఆవేశం, అనాలోచిత నిర్ణయాలు తగవని చక్కగా వివరించాడు.

'కృతజ్ఞత' అనే ఈ కథలో రచయిత ప్రసాద్ గారు కృతజ్ఞత అనే సామాజిక విలువను చక్కగా ప్రతిపాదించారు. ఇతరులకు మేలు చేసినప్పుడు వారినుండి ప్రతిఫలం ఆశించరాదని, ఈ కథలో మునికన్య అనే పాత్ర ద్వారా తెలిపారు.

'మునికన్య' బావిలో పడ్డ రాజును చూచి చలించి అయ్యో పాపమని దర్భలతో తాడు పేని బావిలో వదలి, రాజును రక్షించింది. రాజు బావి నుండి బయటపడిన తర్వాత తనత్రోవన తాను వెళ్లిపోవడానికి ప్రయత్నించాడు. అప్పుడు మునికన్య రాజుతో నీవేమి మని మనిషివి? కనీసం కృతజ్ఞత కూడా చెప్పకుండా వెళ్తున్నావు అంది.

ఇంతలో మునికన్య తండ్రి వచ్చి, రాజుకు 'కృతజ్ఞత కలిగి వుండాలని హితబోధ చేసి, కూతురుకు కూడా హితబోధ చేశాడు. ఆ హితబోధ కూతురుకే కాదు, సమస్త ప్రజలకు.

నేడు సమాజం,లో అనేక సేవా సంస్థలు వెలుస్తున్నాయి. అనేకమంది వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. కాని, చాలా సేవా కార్యక్రమాల వెనుక కీర్తి కాంక్ష వుంటున్నది. సేవ చేయాలనే ఆకాంక్ష కంటె, చేస్తున్నామని చెప్పుకోవాలనే ఆరాటం అధికంగా కనిపిస్తోంది. ఇంకా కొన్ని సందర్భాలలో చేసే సేవ కంటె అధికమైన ప్రచారం కనిపిస్తోంది. "ఇతరులకు సహాయం చేసేటప్పుడు ఇతరులనుండి ఏమీ ఆశించకుండా చేసేది నిజమైన సహాయం. సహాయం పొందిన వ్యక్తి కృతజ్ఞతలు చెప్పాలని అనుకోవడం, ఆ వ్యక్తి కృతజ్ఞతగా వుండాలి అనుకోవడం, ఆవలి వ్యక్తి తిరిగి సహాయపడాలని అనుకోవడం తగదు. కృతజ్ఞత చూపడం అనేది ఆవలి వ్యక్తి (సహాయం పొందిన వ్యక్తి) నైతిక బాధ్యత. సహాయం చేసిన వారికి మాత్రం కృతజ్ఞతను ఆశించే అధికారం, ప్రతిఫలం పొందాలనే ఆలోచన తగదు."- 4. రచయిత చాల చక్కగా ప్రతిఫల రహితమైన సహాయం నిజమైన సహాయం అని చక్కగా తెలియజేశాడు.

'గుప్తదానం' అనే కథ ద్వారా రచయిత ప్రసాద్ గారు గుప్తదానం యొక్క లక్ష్యము, చేసిన దానము గుప్తంగా ఉండాలనే విషయాన్ని చక్కగా వివరించారు. దానము చేసే విధానాన్ని బట్టి సాత్త్వికము, రాజసికము, తామసికము అని - గుప్తదానం సాత్త్వికమనీ, కీర్తికాంక్షతో చేసే దానం రాజసికమనీ, ప్రతిఫలాన్ని ఆశించి చేసేది తామసికమనీ - ఈ మూడింటిలో ప్రతిఫలారహితమయిన స్వచ్ఛమైన మనస్సుతో చేసే దానం సాత్త్వికదానమని రచయిత తెలియజేశారు.

ఈ కథలో మనోజవుని పాత్రద్వారా రచయిత సంపాదన ఎలా వుండాలి, శ్రేష్ఠమయిన దానం ఎలా వుండాలో నేటి సమాజానికి చక్కగా వివరించారు. నేటి సమాజం ధనసంపాదనకు ఎన్ని రకాలయిన చెయ్యకూడని పనులు చేస్తున్నారో, చెయ్యడానికి సిద్ధపడుతున్నారో ఈ కథలో తెలియజేశారు. జీవించడానికి అవసరమైన ఉద్యోగం వున్నా, వ్యాపారం, జీవనోపాధి వున్నా వాటితో తృప్తి పడడం లేదు. న్యాయమైన రీతిలో ధర్మబద్ధ సంపాదన అనేది ఆలోచించడానికే వీలుకాని పరిస్థితి వుంది.

చేసే వ్యాపారాలలో ఎన్నో అక్రమాలు, కల్తీలు. తమకు లాభం రావడం కోసం ప్రజలకు ఎంత నష్టం చెయ్యడానికైనా సిద్ధపడే స్థితి. నేడు వివిధ వార్తలలో ఇవన్నీ చూస్తున్నాము, వింటున్నాము.

అలా సంపాదించిన ధనంతో పేరు ప్రఖ్యాతులకోసం దానం చేస్తూ, విస్తృత ప్రచారం కల్పించుకోవాలనే తపన కూడా పెరుగుతోంది. చేసిన దానంకంటె ఎన్నో రెట్లు ప్రచారం కావాలనే ఆలోచన నేడు దానం చేసే వారిలో కనిపిస్తోంది. ఈ తరహా వ్యాపారస్థులకు బృహధృతుడు పాత్రను ప్రతీకగా చిత్రీకరించాడు రచయిత.

"విలువలతో కూడిన సంపాద, ధర్మబద్ధమైన జీవనం, దానం చేస్తున్నప్పుడు ఇతరులకు సహాయం చేయాలనే లక్ష్యంతో చెయ్యాలి తప్ప, ఇతరులకు నేనే చేస్తున్నాననే భావంతో ప్రచారం కోసం దానం ఉత్తమమైనది కాదు"- 5. భారతీయ ధర్మం గుప్తదానం శ్రేష్టమని చెబుతోంది. కుడిచేత్తో దానం చేస్తే, ఎడమ చేతికి తెలియరాదని పెద్దలు చెబుతారు. అంటే అంత గుప్తంగా చెయ్యాలని భావం. తద్వారా దానం చేసే వ్యక్తిలో అహంకారం పుట్టదు, సమసమాజ నిర్మాణం సాధ్యమవుతుంది అంటూ మనోజవుని పాత్రను ధర్మబద్ధ సంపాదన, గుప్త దానములకు ప్రతీకగా చిత్రించి గొప్ప సందేశాన్ని, విలువలను అందించారు రచయిత ఈ కథలో.

ఈ విధంగా టి.జి.ఆర్. ప్రసాద్ తన కథల్లో ఎన్నో సామాజిక అంశాలని స్పృశించి నేటి యువతీ యువకులకు భావిభారత పౌరులకు మానవీయ విలువలను వివరించే ప్రయత్నం చేశారు. కథలు పిల్లలకోసం రాసినట్లనిపించినా సమాజంలోని అన్ని వర్గాల ప్రజలను ఆలోచింపజేసేవిగా వున్నాయి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# అభ్యుదయ కవి - దాశరథి

- గుర్జకుంట స్వరాజ్, నిజాం కళాశాల (ఓ.యు), హైదరాబాద్, తెలంగాణ.

తెలంగాణలో జన్మించిన సుప్రసిద్ధ కవులలో దాశరథి కృష్ణమాచార్యులు ఒకరు. దాశరథి వంటి కవులు అరుదుగా వుంటారు. తెలంగాణ రైతాంగ పోరాట కాలంలో సామాన్య ప్రజానీకాన్ని చైతన్యపరచిన కవి దాశరథి. ఈయన తెలుగులో అగ్నిధారలు కురిపించి రుద్రవీణను పలికించారు. నిజాం నవాబు పరిపాలన కాలంలో తెలంగాణ గ్రామ సీమలు భయంకరమైన అస్థిరత్వంలో కొనసాగాయి. గ్రామాలలో ప్రజలంతా అక్కడి పెత్తందారులకు బానిసలుగా బ్రతికేవారు. దుర్భరమైన వెట్టిచాకిరి, దారుణమైన రజాకార్ల ఆకృత్యాలు, నిజం నిరంకుశ పాలనను దిక్కరించిన ఉద్యమ కవి దాశరథి.

## దాశరథి జన్మ వృత్తాంతం :

భారతదేశంలో అతి పెద్ద సంస్థానం హైదరాబాద్. ఆ సంస్థానంలోని జనారణ్యంలో ఒక చిన్న పల్లెటూరులో దాశరథి జన్మించాడు. ఈయన మహబూబాబాద్ జిల్లా చిన్న గూడూరు మండలంలో 1925 జులై 22న జన్మించారు. ఈయన తర్వాత మలిసంతానం ఒక కొడుకు ముగ్గురు ఆడపిల్లలు. వీరి తమ్ముడు దాశరథి రంగాచార్యులు. వీరి తల్లిదండ్రులు దాశరథి వెంకటాచార్యుల, వెంకటమ్మ వీరిది గొప్ప పండిత కుటుంబము. వీరి తాతలు తండ్రుల వద్ద వేల కుటుంబాలు విద్యను నేర్చుకున్నారు. తండ్రి గొప్పవ విద్వాన్ మరియు తల్లి పంచకావ్యాలు చదివిన విదూషీమణి. వీరి తండ్రి గారు ఇంట్లో భార్య పిల్లలతో గొడవ పడి పిల్లలను వదిలి మరో పెళ్ళి చేసుకున్నారు. ఆస్తిలో చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదు. అటు తర్వాత వీరి కుటుంబం ఖమ్మం దగ్గరున్న గార్ల గ్రామానికి మారవలసి వచ్చింది. వీరిది పూరి గెడిసె. ఈ గుడిసెకు గోడలు కూడా ఉండేవి కావు. అంతా అడవి కాబట్టి చీకటి పడితే క్రూరమృగాల భయం. తమ్ముడు చెల్లెలు చిన్న వాళ్ళు. కుటుంబ భారమంతా పెద్ద కొడుక క్రిష్ణమాచార్యుల మీద పడింది. ఈ సమయంలో హైదరాబాద్ సంస్థానంను 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పరిపాలన సాగిస్తున్నాడు.

## దాశరథి బాల్యం :

దాశరథి గారి బాల్యం నేటి ఖమ్మం జిల్లాలో గల మధిర మరియు గార్లలో జరిగింది. తెలుగు పండితుల ఇంట పుట్టిన దాశరథి తెలుగు భాష బోధించు పాఠశాలలు లేక ఓనమాలు తన తండ్రి వద్దనే నేర్చుకొని పెద్దబాల శిక్షను ఇంటి వద్దనే పూర్తి చేసి, మిగిలిన ప్రాథమిక విద్య, మాధ్యమిక విద్యను మధిరలో పూర్తి చేసి నేటి ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బి.ఎ. తెలుగు మాధ్యమంలో పట్టభద్రులయ్యారు.

## నిజాం సంస్థానంలో తెలుగు భాషా స్థానం :

హైద్రాబాద్ సంస్థానంలో తెలుగు ప్రజలు ఎక్కువగా ఉన్నా అధికార భాష ఉర్దూ ఉండేది. ప్రాథమిక పాఠశాలలో తప్ప మిగతా ఉన్నత స్థాయి విద్యాలయాల్లో ఉర్దూ మాధ్యమంగా చదువు చెప్పేవారు. తెలుగు బోధనా భాషగా వున్నా ఒకే ఒక పాఠశాల ఉస్మానియా విశ్వవిద్యాలయం. ఈ విద్యాలయం నిరాకరిస్తే పూనాలోని కార్వే యూనివర్సిటీకి వెళ్లి విద్యార్థులు పరీక్షలు రాయాల్సి వచ్చేది. తెలుగు భాషను తక్కువ చేసి చూడటం తెలుగు భాషను తెలంగీ, బెడంగీ (ముక్కు మొహం లేని విక్రుత భాష అని అర్థం). అవహేళన చేసేవారు.

## దాశరథి రచనలు :

దాశరథి కృష్ణమాచార్యులు అగ్నిధార, రుద్రవీణ, మహాంద్రోదయం, పునర్నవం, కవితా పుష్పం, అమృతాభిషేకం, తిమిరంతో సమరం, ఆలోచనాలోచనలు, నవ మంజరి, మహాబోధి అనే కవితా సంపుటాలను రచించాలి. నవమి నాటిక, గాలిబ్ గీతాలు (అనువాదం), యాత్రా స్మృతి (స్వీయ చరిత్ర) లను రచించారు. 1967లో

దాశరథి గారి కవితా పుష్పకం రచనకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు లభించింది. 1974లో తిమిరంతో సమరం రచనకు కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది. అలాగే గాలీబ్ గీతాల అనువాద రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తమ అనువాద బహుమతి లభించింది. 1977 నుండి ఆంధ్రప్రదేశ్ ఆస్థాన (తెలంగాణ మొట్టమొదటి) కవిగా వున్నారు.

### దాశరథి కవిత్వం :

దాశరథి కృష్ణమాచార్యుల కవిత్వం తెలంగాణ ప్రజల జీవనవిధానం ఉట్టిపడేలా ఉంటుంది. దాశరథి రచనలపై నాటి నిజాం నిరంకుశ విధానాలను ప్రశ్నించేలా ఉంటాయి. వీరు రచనా వ్యాసంగం మొదలు పెట్టిన రోజుల్లో తెలంగాణ పల్లెల్లో నాటి నిజాంకు వ్యతిరేకంగా అనేక ఉద్యమాలు ఊపందుకున్నాయి. దాశరథి నాడు తెలంగాణ ఉద్యమ సారధ్యానికి కవితా శక్తి, తెలంగాణ విమోచనోద్యమ సాహిత్య రథసారధి ప్రజా ఉద్యమ వారధిగా ఆయన కలం ఒక నిప్పుకణం ప్రతి అక్షరం ఒక వజ్రాయుధం, దిక్కారమే నినాదంగా ఉద్యమమే ప్రాణంగా ఒక చేతితో కలం మరో చేతితో ఉద్యమాన్ని నడిపించిన అభ్యుదయ కవి దాశరథి

దాశరథి నిజాం నిరంకుశ పాలనను తెలుగు ప్రజల కష్టాలను చూసి కన్నీరు కార్చారు. తన కలాన్ని ఖడ్గంగా మార్చి నిజాం పాలనను తన కవితలతో ఊచకోత కోసాడు. దాశరథి గారు భూస్వాముల ఇండ్లలోను పటేల్ పట్వారీ అధికారుల వద్ద ప్రజల చేసే వెట్టిచారికి తన గేయాలలో తెలియపరచి నిరసించాడు.

వెట్టిచాకిరి విధానమో రైతన్న
ఎంత చెప్పినా తీరదో కూలన్నా...

నిజాం నిరంకుశ పాలనను నిలదీస్తూ, సూటిగా గర్జిస్తూ నిజం ప్రభుత్వంపై నిప్పులు చెరిగాడు.

ఓ నిజాం పిశాచమా...!
కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని...
తీగలను తెంపి అగ్నిలో దింపినావు
నా తెలంగాణ కోటి రతనాల వీణ..
అని నిజాంను సూటిగా ప్రశ్నిస్తూ
ఇదే మాట ఇదే మాట పదే పదే అనేస్తాను.
కదం తొక్కి పదం పాడి ఇదే మాట అనేస్తాను
దగాకోరు బడా చోరు రజాకారు పోషకుడవు
ఊళ్ళకూళ్ళు అగ్గిపెట్టి ఇళ్ళన్నీ కొల్లగొట్టి
ఇలా ప్రజలలో చైతన్యం తీసుకురావడానికి
ఉద్యమ ఆహ్వానాన్ని పలికాడు.
రానున్నది ఏది నిజం?
అది ఒక్కటి సోషలిజం
కలంపడోయ్ భుజం భుజం

కదలండోయ్ గజం గజం ...... అంటూ ప్రజలను చైతన్యపరిచాడు.

### దాశరథి గారి జైలు జీవితం :

ఖమ్మం జైలు జీవిత కాలంలో దాశరథి ప్రేమాభిమానాలు పొందిన మహా రచయిత "వట్టికోట ఆళ్వారు స్వామి" జైలు గోడల మీద దాశరథి బొగ్గుతో రాసే పద్యాలను ఆళ్వారుస్వామి కంఠస్థం చేసి పదే పదే చదువుతూ పది మందికి వినిపించేవాడు. జైలు అధికార్లు ఆ పద్యాలను గోడల మీద చెరిపినప్పుడల్లా అవి మరో గోడ మీద ప్రత్యక్షం అయ్యేవి. వాటిని దాశరథి రాస్తున్నాడని అనుమానం నిజానికి రాస్తున్నది ఆళ్వారుస్వామి అని అధికారులు కనిపెట్టి దాని ఫలితంగా ఆళ్వారు స్వామిని గుల్బార్గా జైలుకు, దాశరథిని హైద్రాబాద్ చంచల్‌గూడ జైలుకు మార్చారు. నిజామాబాద్ కేంద్రకారాగారంలో దాశరథి ఉన్నప్పుడు ఆ జైలు ప్రాచీనతను ప్రాశస్త్యాన్ని వర్ణిస్తూ చక్కని కథ రాశాడు.

ఇది చారిత్రాత్మకంబైన
ఏ మహితాలయమో...! ఇదే మహా కనకదుర్గమో...!
కట్టిన దుర్గమో

అంటూ మొగలు రాజులను ఎదిరించిన మరాఠ వీరులు కట్టిన కోట ప్రశస్తిని దాశరథి గారు వర్ణించారు.

### దాశరథి స్మృతి కవిత :

1948 జనవరి 30 వ తేదిన సాధురాం గాడ్సే

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

తుపాకీతో కాల్చి మహాత్మగాంధీని చంపాడు. ఆయన మరణ వార్తను నిజామాబాద్ జైలులో ఉన్న దాశరథి విన్నాడు. ఆ వార్తను విని చలించిపోయి "క్షమమూర్తి" అనే శీర్షికతో స్మృతి కవితలు రాశాడు.

## దాశరథి శ్రామిక జన చైతన్యం :

భూస్వామ్య పెట్టుబడిదారి సమాజంలోని దోపిడికి అణచివేతకు గురయ్యే శ్రామిక జన చైతన్యానికి స్వాగతం పలికాడు.

బలిపశువై తలవాల్చిన - దీన పరాధీన జాతి శ్రామిక జాతి...

దెబ్బతిన్న బొబ్బిలివలె మేల్కొన్నది.. మేల్కొన్నది...

ధనవంతుడికి పేదవాడికి మధ్య వున్న వర్గ స్పృహను ప్రకటించి ఈ అనంత సంగ్రామానికి గల కారణాలను తెలిపాడు.

అనాదిగా సాగుతుంది ... అనంత సంగ్రామం
అనాధుడికి ఆగర్భ శ్రీమంతుడికి మధ్య...

## దాశరథి వచన కవిత :

పద్యం, గేయం, గీతం, రుబాయిలు, గజల్స్, మొదలైన కవితా రూపాలతో పాటు వచన కవితా రూపాన్ని కూడా తన రచనలలో సుసంపన్నం చేశాడు. బాల్యం, మస్తిష్కంలో లేబొరేటరీ అన్న వచన కవితలు దాశరథి కవితకు ప్రతిభకు అద్దం పడతాయి.

## సినీ రచయితగా దాశరథి :

తెలుగు సినిమా సాహిత్యంలో దాశరథి విశిష్ట స్థానం సంపాదించుకున్నాడు. మొట్టమొదట 1961లో ఇద్దరు మిత్రులు సినిమాలో పాటలు రాశాడు.

## ఆ చల్లని సముద్ర గర్భం :

ఆ చల్లని సముద్రగర్భం దాచిన బడబానలమెంతో
ఆ నల్లని ఆకాశంలో కానరాని భాస్కరులెందరో
॥ ఆ చల్లని ॥

భూగోళం పుట్టుక కోసం రాలిన సురగోళాలెన్నో
ఈ మానవ రూపం కోసం జరిగిన పరిణామాలెన్నో
ఒక రాజుని గెలిపించుటలో ఒరిగిన నర కంఠములెన్నో
కులమతాల సుడిగుండాలకు బలియైన పవిత్రులెందరో ॥ ఆ చల్లని ॥

అన్నార్తులు అనాధలుండని ఆ నవయుగమదెంత దూరం
కరువంటూ కాటకమంటూ కనిపించని కాలాలెపుడో
పసిపాపల నిదురకనులలో ముసిరిన భవితవ్యం ఎంతో
గాయపడిన కవిగుండెలలో రాయబడిన కావ్యాలెన్నో
॥ ఆ చల్లని ॥

## దాశరథి సమసమాజ నిర్మాణ ఆకాంక్ష :

భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించగానే దేశ పరిస్థితులన్నీ మారిపోతాయనీ దాశరథి భ్రమపడలేదు. నిజాం నవాబు లొంగి పోగానే హైద్రాబాద్ సంస్థానం విముక్తియై ఇండియన్ యూనియన్‌లో విలీనం కాగానే పరిస్థితులు మార్పు చెందుతాయని భావింపలేదు. ఒక మనిషిని వేరొక మనిషి, ఒక జాతిని ఇంకొక జాతి పీడించడానికి అవకాశం లేని ఉద్దాతమైన సమాజం ఆవిర్భవిస్తుందని ఆశించాడు. ఉదయించనున్న సుందరమైన లోకాన్ని కలగన్నాడు.

## ముగింపు :

గతాన్ని కాదనలేను
వర్తమానం వద్దనబోను
భవిష్యత్తు వదులుకోను
కాలం నాకంఠమాల
నా పేరు ప్రజా కోటి
నీ ఊరు ప్రజావాటిగా

ప్రకటించుకొన్న కవి ప్రజాకవి దాశరథి. ఈయన ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి ఒక చేతిలో కలం మరో చేతిలో ఉద్యమాన్ని నడిపించి నిజాం దురాగతాలను ఎండగడుతూ నిజాం రాజు కొరకరానికొయ్యలా తయారయ్యాడు. హైద్రాబాద్ ఆస్థానకవిగా పనిచేశాడు. తెలంగాణ ప్రజల చైతన్యానికి పాటుపడిన గొప్ప వ్యక్తి దాశరథి. ఇటీవల తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాశరథి గారి జయంతి, వర్ధంతిలను అధికారికంగా జరుపుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

భావవీణ
UGC Approved Journal No. 42500

# అవమానాలను ఎదిరించి నిలిచిన సత్యవాడ సోదరీమణుల 'అమ్మమ్మ ఆశయం'

**- యద్దనపూడి దీప్తి ,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం.

'అమ్మమ్మ ఆశయం' కథ రాసిన వారు సత్యవాడ సోదరీమణులు. విశాఖపట్టణం వాస్తవ్యులైన శ్రీ సత్యవాడ శివరామదాసు, నారాయణమ్మలకు ఏడుగురు సంతానం. ముగ్గురు కుమారులు, నలుగురు కుమార్తెలు. వీరిలో రఘునాథమ్మ, సూర్యకుమారి మరియు వేణుగోపాల్ పుట్టుకతోనే అంధులు. శ్రీ శివరామదాసుగారు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా పనిచేసేవారు. వీరికి తరచుగా బదిలీలు అవుతూ ఉండేవి. అందువలన వీరి విద్యాభ్యాసం, సంగీతం ఒకే చోట సాగలేదు.

చదువుకోవాలనే ఆసక్తి ఉన్నా కుటుంబ సభ్యుల ప్రోత్సాహం లేకపోవడం వల్ల బ్రెయిలీ అందుబాటులో ఉన్నా వారి విద్యాభ్యాసం కొనసాగలేదు. సత్యవాడ సోదరీ మణులకు రేడియో వినడం వల్ల కథలు రాయాలనే ప్రేరణ కలిగింది. వారు రచనలు చేసి విలువైన సాహిత్యాన్ని ఆర్జించుకొని గొప్ప ప్రగతిని సాధించారు అంటే దానికి కారణం రేడియో వినడం. వీటితో పాటు వీరికి కథలు రాయమని ప్రేరణ కలిగించిన వ్యక్తి ఒక సాధారణ వ్యక్తి. అతని పేరు రమణ. వారి నాన్న గారి దగ్గర ప్యూన్. సోదరీమణులు వారి మిత్రులకు రమణ చేత ఉత్తరాలు రాయించుకుంటూ ఉండేవారు. అప్పుడు వారి భాషని గమనించిన రమణ కథలు రాయమని ప్రోత్సహించారు. ఇలా లభించిన ప్రోత్సాహంతో సోదరీమణులు రచనలు చేశారు.

మొదటి కథ 'ఆదర్శం కోసం' ఈ కథను రమణ చేతనే రాయించారు. ఇది 1976 జులై 16 వ తేదీన ఆకాశవాణి విశాఖపట్టణం కేంద్రం నుండి ప్రసారం అయ్యింది. ఆ తరువాత వీరికి తండ్రి నుంచి కూడా మంచి ప్రోత్సాహం లభించింది. ఇక్కడి నుంచి సోదరీ మణులు చెబుతుంటే తండ్రి రాసేవారు. చివరకు 'చుక్క కోసం' కథవరకు రచనా వ్యాసంగం అంతా వాళ్ళ నాన్న గారి చేతులమీదుగానే సాగింది. ఆకాశవాణి ద్వారా ఇంచుమించు 200లకు పైగా వీరి కార్యక్రమాలు ప్రసారమైనవి.

రఘునాథమ్మకు 1996లో భారత రాష్ట్రపతి పురస్కారం మరియు సూర్యకుమారికి 2003లో భారత రాష్ట్రపతి పురస్కారం. అంతేకాకుండా 1995లో అమెరికాలో జరిగిన తానా సభల్లో పాల్గొన్నారు.

సత్యవాడ సోదరీమణులు 'సరస్వతీ నమస్తుభ్యం', 'బదిలీ', 'అపరంజి', 'సుమిత్ర' అనే కథలలో వికలాంగుల యొక్క జీవన విధానం వారి ప్రగతి వారి పట్ల సమాజం వ్యవహరించే తీరును గురించి వివరించారు. ఇవన్నీ వారు స్వయంగా తమ జీవితంలో అనుభవించిన వాస్తవాన్ని కథల రూపంలో సమాజం ముందుంచారు.

వికలాంగుల జీవన వ్యవస్థపై స్పందిస్తూ 'సమాజంలో వికలాంగులు ఎందరో ఉన్నారు. ప్రతి వ్యక్తికీ ఏదో ఒకనైపుణ్యం ఉంటుంది. ఆ నైపుణ్యాన్ని వెలికితీసి సమాజానికి ఉపయోగపడే విధంగా మనం చేయగలిగినంత సహాయం చేయాలి కానీ వారి అవిటితనాన్ని వేలెత్తి చూపి వారి మానసిక వ్యధకు కారణం కాకూడదు. వికలాంగులు సమాజంలో రకరకాల సమస్యలను ఎదుర్కొంటున్నారు. శారీరక లోపం ఉన్న వారు నిరంతరం సమాజంలో దూషణలు ఎదుర్కొనవలసిందేనా, ఇలాంటి సమాజ వైఖరి మారాలని అవయవం లేనివాడు అవిటివాడు కాడు ఆత్మస్థైర్యం లేనివాడే నిజమైన అవిటివాడు అంటారు ఈ సత్యవాడ సోదరీమణులు.

## కథ సారాంశం :

'అమ్మమ్మ ఆశయం' అంధుడైన మనవడి కోసం ఒక అమ్మమ్మ పడిన తపన ఈ కథ. ఈ కథలో ప్రధాన పాత్రలు 'చంద్రం', 'సరోజిని'. చంద్రం అమ్మమ్మ సరోజిని. చంద్రం తల్లిదండ్రులు దేవి, గోవిందరాజు. చంద్రం పుట్టుకతోనే అంధుడు. పెళ్ళైన ఏడాదికే చంద్రం పుట్టాడు. కానీ పుట్టుకతోనే అంధుడిగా పుట్టాడు. దేవి ఎక్కువ సమయం చంద్రంతో గడిపేది. గోవిందరాజుకు అది నచ్చేది కాదు. ఈ విషయమై ఎక్కువగా భార్యాభర్తల మధ్య వాదోపవాదాలు, గొడవలు జరుగుతూ ఉండేవి. అవి చిలికి చిలికి గాలివానగా మారి నీ గ్రుడ్డి కొడుకే నీకు లోకమయ్యాడు. మొగుడ్ని పట్టించుకునే తీరిక నీకు లేదు. ఇలా అయితే మనం కలిసి ఉండటం కష్టం. నీకు నీ గ్రుడ్డి కొడుకు కావాలో నేను కావాలో తెలుసుకో వీడిని ఏదైనా అనాథ శరణాలయంలో వదిలేయ్. లేదంటే నన్ను వదిలేయ్ అని గోవిందరాజు సీరియస్ గానే చెప్పాడు. చేసేది ఏమీలేక దేవి తల్లి సరోజిని కూతురు కాపురం బాగుండటం కోసం చంద్రాన్ని తనతో తీసుకెళ్లి పెంచింది. తల్లీతండ్రీ లోటు తెలియకుండా...!

చంద్రాన్ని బాగానే చదివించింది. ఏదైనా ఉద్యోగం సంపాదించుకొని తన కాళ్ళ మీద తాను నిలబడాలని చంద్రానికి బలమైన కోరిక. అందుకోసం ఎన్నో ఆఫీసుల చుట్టూ కాళ్ళు అరిగేలా తిరిగినా ఫలితం శూన్యం. కారణం చంద్రానికి అర్హతలు లేకనో, ప్రతిభలేకనో కాదు చంద్రం అంధుడు. ఆ కారణం వల్ల ఎక్కడికి వెళ్ళినా అవమానాలు, ఛీత్కారాలు తప్ప ప్రోత్సాహాలు ఎదురయ్యేవి కావు. వెనుక నుంచి హేళన చేసే వాళ్ళు కొందరైతే ఎదురుగా ఉండి హేళన చేసే వాళ్ళు కొందరు. అందులో ప్రధాన మైన వ్యక్తి సుందరమూర్తి. చంద్రం తిరిగి తిరిగి అలసి పోయాడు. ఇక తిరగలేడు, తిరిగే ఓపిక లేదు. తిరిగినా ఫలితం శూన్యం. అందుకే చంద్రం పరిస్థితిని అర్ధం చేసు కున్న అమ్మమ్మ సరోజిని ఉన్న పొలాన్ని అమ్మేసి అనాథ శరణాలయం కట్టించి నిర్వాహకురాలిగా మారింది. అందులో మాష్టర్ గా చంద్రం మారాడు. చంద్రం వేణు నాదం బాగా వాయిస్తాడు. అనాథ శరణాలయం ఏర్పాటు చేసి 5సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఏర్పాటు చేయబోయే ఫంక్షన్ లో వేణునాదం వాయించాలని అమ్మమ్మ మాట తీసుకుంది. ఇంటర్వ్యూ కోసం ఎక్కడెక్కడికి వెళ్ళి అవమానాలు పడ్డాడో, ఎవరెవరి చేత అవమానాలు పడ్డాడో ఆరా తీసి వాళ్లందరినీ అనాథ శరణాలయ ఫంక్షన్ కి ముఖ్య అతిధులుగా పిలుస్తుంది. ఫంక్షన్ కి హాజరైన తరువాత వాళ్ళకు అసలు విషయం అర్థమవుతుంది. ముఖ్య ప్రసంగం సరోజిని ఇస్తుంది. ఆ ప్రసంగంలో దివ్యాంగులను గుర్తించమని, వాళ్ళకు కూడా అవకాశాలు ఇవ్వమని అర్థిస్తుంది. వారు కూడా సమా జంలో భాగమని ఎవరూ కావాలని అవిటివాళ్లుగా పుట్టరని చదువు, సంస్కారం ఉన్న వాళ్ళుగా మనం వాళ్ళను అర్ధం చేసుకొని వాళ్ళకు ప్రతిభకు తగినట్లుగా అవకాశాలు కల్పిస్తే వాళ్ళు కూడా అత్యున్నత స్థాయికి ఎదుగుతారని.. సందేశాన్ని ఇచ్చి చంద్రం చేత వారికి సన్మానం చేయి స్తుంది.

నీతిగా, నిజాయితీగా చంద్రాన్ని అవమానించిన ఒక స్కూల్ ప్రిన్సిపాల్ సుందరమూర్తి ముందుకు వచ్చి తను చంద్రానికి చేసిన అవమానానికి సిగ్గుపడి చేసిన తప్పుని సరిదిద్దుకోవడం కోసం అనాథ శరణాలయానికి పాతికవేల రూపాయలు విరాళంగా ఇస్తాడు. ఇకపై వికలాంగులకి నా అండ ఉంటుందని హామీ ఇస్తాడు. అనాథ శరణా లయానికి ఎప్పుడు ఏ అవసరం వచ్చినా తాను ముందు ఉండి నడిపిస్తానని ప్రకటించడంతో కథ ముగుస్తుంది.

"నీ గుడ్డి కొడుకే నీకు లోకమయ్యాడు. మొగుడన్న వాడున్నాడన్న ధ్యాసే లేదు. ఇలా అయితే కుదరదు. నేను కావాలనుకుంటే, వీన్ని ఏ అనాథాశ్రమానికో ఇచ్చేయి. మనకేం వయసు మీరిపోలేదు. పుట్టేవాళ్లు వీడిలా అవుతారని ఎక్కడుంది." అని పుట్టు గుడ్డి అయిన చంద్రం గురించి వాళ్ళ నాన్న అమ్మతో మాట్లాడిన మాటలు ఇవి. "తల్లికి విషయమంతా చెప్పి నా జీవితం ఏమవుతుందో అంటూ కన్నీరు మున్నీరైంది. కూతురి కాపురాన్ని చక్కదిద్దాలి అనుకున్న సరోజిని కూతురి

చేతుల్లో మనవడిని అందుకుని తన గుండెల్లో దాచుకుంది.''

ఎదిగిన చంద్రం తన కాళ్ళ మీద తాను నిలబడాలని తన చదువుకు తగిన ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేయడం మొదలు పెట్టాడు. వెళ్ళిన ప్రతి చోట అవ మానాలే కానీ ఆదరించిన వారు, అర్థం చేసుకునేవాళ్ళు చంద్రానికి కనిపించలేదు.

మొదటిసారి ఇంటర్వ్యూకి వెళ్ళిన చంద్రం తిరిగొచ్చి అమ్మమ్మను చుట్టేసి కన్నీరై కరిగిపోయాడు. ''మేము ఎందుకూ పనికిరామట, మాబోటి వాళ్ళను చూస్తేనే ఎవరికైనా పక్కకి తప్పుకోవాలనిపిస్తుందట. మీరు ఎన్ని చదువులు చదివినా, ఏం సాధించినా చేయగలిగేది ఏముంది? అంటూ ఆక్షిపించారు.'' అని చాలా ఆవేదన చెందాడు. ఇంటర్వ్యూ అధికారులు వెకిలి నవ్వులతో, బాకుల్లాంటి మాటలతో చంద్రాన్ని చాలా అవమానిం చారు. బాధపెట్టారు. ''నేను గదిలోకి వెళ్ళగానే ఒకాయన తగుదునమ్మా అంటూ ఇలాంటి వాళ్ళు ఎందుకు ఉద్యోగాలకు ఎగబడతారో, అనగానే మన బుర్రలు తినడానికి చటుక్కున మరొకరన్నారు. వచ్చాడుగా ఇంటర్వ్యూ చేయక తప్పదు వాళ్ళల్లో వాళ్ళు మాట్లాడు కుంటూ మొదలు పెట్టారు.'' మరొకాయన ''ఏం నాయనా! అన్నీ తెలిసే అప్లికేషన్ పెట్టావా! స్టడీస్ కి సంబంధించిన క్వాలిఫికేషన్ ఒక్కటే సరిపోతుందని ఎలా అనుకున్నావు? ఒక్క పాఠాలు చెప్పడమే కాదు, ఏ గుమస్తానో సెలవు పెట్టాడనుకో అత్యవసర పరిస్థితులలో ఆ బాధ్యత కూడా నిర్వర్తించాలి. అదీ వదిలేద్దాం ఈ స్కూల్ ఆవరణ ఎంతో తెలిసే అడుగు పెట్టాడా? ఆ కర్రకొట్టుకుంటూ ఎంతని తిరుగుతాడు. ఇతగాడికి ఈ జాబు ఏ మాత్రం సరికాదు. ఆ విషయం ముందే వాళ్ళు తెలుసుకోవాలి. అయ్యో! అలా తెలుసుకుంటే వాళ్ళ గొప్పతనమేముంది. గోల్డ్ మెడల్స్ సాధించినా, ఒకరి మీద ఆధారపడవలసిన బతుకులే'' ఇన్నిన్ని మాటలు తట్టుకోలేకపోయాడు చంద్రం. తిరిగి ప్రశ్నించాడు. మాకూ రిజర్వేషన్లు ఉన్నా యని వాళ్ళకు గుర్తుచేశాడు. వాళ్ళు కూడా చంద్రంతో ఏకీభవించారు. ''ఏ పదిశాతమో లోపమున్న వాళ్ళని ఎన్ కరేజ్ చేస్తాం కానీ, నీలా వందశాతం గుడ్డివాడికి, రెండు కాళ్ళూ లేనివాడికి, చేతులు పనిచేయని వాడికి, పదవులు కట్టబెట్టలేము.'' అని తేల్చి చెప్పేశారని అమ్మమ్మ దగ్గర తన గోడు వెళ్ళబుచ్చుకున్నాడు చంద్రం.

ఇంటర్వ్యూ హాల్‌లో ''డిజేబుల్డ్ వాళ్ళని ఇప్పటికీ ముగ్గుర్ని వెనక్కి పంపేసరికి నా తల ప్రాణం తోక్కొచ్చింది. ఇక నీసంగతి ... వాళ్ళు పిల్లలు వాళ్ళు అల్లరి చేయటం, పరుగులు పెట్టడం, వాళ్ళ జన్మ హక్కు. వాళ్ళను కళ్ళతోనే కదా దారిలో పెట్టవలసింది. మాష్టారుని చూస్తే భయ పడాలి కానీ నవ్వుకోకూడదు....'' ఇలా చాలానే మాట్లా డారు.

తాను పాఠాలు చెప్పగలనని, పిల్లల్ని కంట్రోల్ చేయ గలనని చెప్తూ ... మీరేలా ఇవన్నీ నాకు సాధ్యం కావని అంటారు. అని ఎదురు ప్రశ్న వేసేయసరికి ప్రిన్సిపాల్‌కి విపరీతమైన కోపం వచ్చి.. లేవయ్యా లే ''మీరు చేయగలి గిన దానికంటే, చేతకానిదే ఎక్కువ. బోర్డు మీద రాయ గలవా? రాసింది చదవగలవా? ప్రిన్సిపాల్ సుందరమూర్తి తనతో వాదులాడుతున్నాడో, ఇంటర్వ్యూ చేస్తున్నాడో చంద్రానికి అర్థం కాలేదు. తన లోపాన్ని ఎత్తుచూపుతున్న'' ఆ ఇంటర్వ్యూ హాల్‌లో ఉండలేక వెళ్లిపోయాడు చంద్రం.

చంద్రం తపనని, ఆవేదనని, ఆశయాన్ని అర్థం చేసు కున్న అమ్మమ్మ అనాథ శరణాలయం స్థాపించి మనవడికి అప్పగించింది. అనాథశరణాలయం పూర్తి బాధ్యతలు మనవడి చేతిలో పెట్టింది. చూస్తుండగానే ఐదు ఏళ్ళు గడిచిపోయాయి. ఐదవ వార్షికోత్సవం సందర్భంగా శరణా లయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. చాలా గ్రాండ్ గా సెలబ్రేట్ చేస్తున్నారు. మనవడు ఇంటర్వ్యూకి వెళ్లినప్పుడు అవమానించిన వారందరి గురించి ఆరా తీసి వాళ్లందరిని ముఖ్య అతిథులుగా ఆహ్వానించింది. ''ఈ శరణాలయం స్థాపించడం వెనుక నా అంతర్మథనం ఎంతో ఉంది. వీళ్ళ తాతగారు పదిమందికి అన్నంపెట్టు అని చేతిలో చేయి వేయించుకొని ఇచ్చిన పొలాన్ని అమ్మి ఆయనకిచ్చిన మాట తప్పి ఈ శరణాలయం స్థాపించాను.''

"నా మనవడు బతుకు తెరువు కోసం ఎన్నో పాట్లు పడ్డాడు. ఆవిషయం అందరికి తెలుసు." ఇలా అనేకమైన విషయాలతో ముఖ్య సందేశం అందించింది సరోజిని.

"సుందరమూర్తి కన్నీటి పర్యంతమైనాడు. సరోజిని మాటలు అక్షరసత్యాలు అనిపించి, చంద్రాన్ని ప్రత్యేకంగా అభినందించారు." అవమానించిన వాళ్ళే శరణాలయానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో తనని ఇంటర్వ్యూ చేసిన ప్రిన్సిపాల్ మూర్తి పాతికవేలు విరాళం ప్రకటించాడు. నా అభ్యర్థన ఒక్కటే మూర్తిగారు "మా వికలాంగుల పట్ల గౌరవాభిమానాలు చూపిస్తే చాలు" అన్న చంద్రం మాటలకు "ఇకనుంచి వికలాంగులెవరికైనా నా అండదండలు తప్పక ఉంటాయి" అని సుందరమూర్తి అనడంతో కథ ముగుస్తుంది.

పుట్టుకతోనే గుడ్డివాడిగా పుట్టిన చంద్రం అంటే తండ్రికి ఇష్టం లేకపోవడం, భర్తకు అనుగుణంగా ఇష్టం ఉన్నా లేకున్నా తల్లి ప్రవర్తించడం, కూతురు జీవితం ఎక్కడనాశనం అవుతుందో అని అమ్మమ్మ చంద్రాన్ని పెంచడం. ఇంట్లో వాళ్లనుంచే చంద్రం వివక్షకు గురి కావడం మనం గమనించవచ్చు. ఇలాంటి వాళ్ళు మనకు సమాజంలో చాలా మంది కనిపిస్తారు. చంద్రానికి అమ్మమ్మ ఉంది. చంద్రాన్ని చదివించింది. పెంచి పెద్ద వడిని చేసింది. చంద్రం అవమానాలు పడటం, బాధ పడటం ఆచూడలేక పొలాన్ని అమ్మి శరణాలయాన్ని స్థాపించి చంద్రం ఆశయాన్ని తన ఆశయంగా మార్చుకొని ముదుకు నడిపించింది. చంద్రం అమ్మమ్మలా బయట దివ్యాంగుల ఆలోచనలను, ఆశయాలను ఎంతమంది అర్థం చేసుకోగలుగుతున్నారు.

చదువున్నా ఉద్యోగాలు కరువు, రోడ్డుపై పాటలు పాడడమే జీవనోపాధి, దుర్భర జీవితం గడుపుతున్న గ్రుడ్డి వాళ్లు. పుట్టుకతో అంధులైన వారు కొందరైతే అనా రోగ్యాలు, ప్రమాదాల వల్ల పూర్తిగా చూపును కోల్పో యిన వారు మరికొందరు. బతకడానికి దారి లేక కుటుం బాన్ని పోషించుకోవడానికి నానా తంటాలు పడుతున్న అంధుల ధీనగాథ చెప్పడం కష్టమే. ప్రభుత్వాలు ఎన్ని మారినా అభాగ్యులకు, నిరాశ్రయులకు ఆసరా ఇచ్చి అక్కున చేర్చుకుని ఆదుకున్న దాఖలాలు లేవు. విధి వంచించిన వీరిని ఎవ్వరూ ఆదుకోకపోవడంతో నిలువ నీడలేక, పనిచేసుకునే వీలులేక దుర్భర జీవితం అనుభవిస్తున్నారు. ఇలాంటి ఘటనలు చంద్రం జీవితంలో పూర్తి స్థాయిలో లేకున్నా, కష్టపడి చదువుకున్న చదువుకు తగిన ఉద్యోగం దొరక్క శరణాలయాన్ని స్థాపించి అమ్మమ్మ తన కాళ్ళ మీద తాను నిలబడే మార్గాన్ని చూపింది. అంటే ఎంత ఉన్నత చదువులు చదువుకున్నా చంద్రానికి కూడా ఎదురుదెబ్బలు తప్పలేదు. ఇలా పుట్టాలని ఎవరూ ఎవరూ మూడే నిర్ణయించుకోరు. భగవంతుడి నిర్ణయం అంటారో, జీన్స్ ప్రభావం అంటారో, రోగాల పరిణామం అనుకుంటారో ప్రపంచంలో అంధులుగా ఉన్న వారి పరిస్తితి దారుణం. వాళ్ళని ఆదరించి అవకాశాలు కల్పిస్తే ఉన్నత శిఖరాలను తప్పకుండా అధిరోహిస్తారు. వాళ్ళ కంటూ ఆశలు, ఆశయాలు, గొప్ప ఆలోచనలు ఉం టాయి. వాటిని గుర్తించిన నాడు వాళ్ళు కూడా గుర్తించ బడతారు. కాసేపు చీకట్లో ఉండటానికి, నడవటానికి, పనిచేయడానికి నరక యాతన అనుభవిస్తాం. అలాంటిది అమ్మను చూడకుండా, ఈ అందమైన ప్రపంచాన్ని చూడ కుండా చివరి శ్వాస ఆగేవరకూ అంధులుగా బతకద మంటే....

చంద్రం... ఎక్కడా రాజీ పడలేదు. కింద పడ్డా కానీ పైకి లేచాడు. "జీవితం ఒక యుద్ధ రంగం లాంటిది. నిరంతరం ఏదో ఒక పోరాటం జరుగుతూనే ఉంటుంది." అలా ప్రతి పోరాటాన్ని ఎదుర్కొన్న చంద్రం అవమానం జరిగిన ప్రతిచోటా ఎదుర్కొన్నాడు, ఎదిరించి ప్రశ్నించాడు, ప్రతిఘటించాడు. "జీవితం అనేది ఎన్నో భావాల, అనుభ వాల ప్రభోదాత్మక పుస్తకం లాంటిది. ప్రతి పుట కూడా మనకు కొంత విలువైనది బోధిస్తుంది... అయితే అది మనం చదివే విధానాన్ని బట్టి వుంటుంది...పుట లోని పాఠాన్ని మనసు పెట్టి చదివి, అర్థం చేసుకున్నామా, లేక ఎవరి బలవంతం మీదో చదివినట్టు నటించి పేజీ తిరగేశామా..."

అనే దాన్ని బట్టి మనం చేరుకునే లక్ష్యం ఉంటుంది. చంద్రం జీవితపు పేజీల్ని పైపైన తిరగేయలేదు. అక్షరం అంతరాంతరాళాల్లోకి వెళ్ళి మరీ పరిశీలించాడు.

"నిష్కల్మష హృదయం వున్నవారు నిరాడంబరంగా జీవిస్తూ , తమ చుట్టూ ఉన్న ప్రపంచాన్ని అర్థవంతంగా నిర్మించుకుంటారు. సమస్యలకు వెరవక, వేదనలకు కలతచెందక ఎదురయ్యే పరిణామాలను నవ్వుతూ ఆహ్వా నిస్తారు. నలుగురిలో తమను ప్రత్యేకంగా నిలబెట్టు కుంటారు. ఆటుపోట్లను ధైర్యంగా ఎదుర్కొని ఆదర్శ వంతంగా జీవనయానం సాగిస్తారు. వారిలో కొండంత ఆత్మవిశ్వాసం ఉంటుంది. పెదాలపై చెక్కుచెదరని చిరు నవ్వు ఉంటుంది. అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ, స్వచ్ఛమైన మల్లెపువ్వులా పరిమళిస్తుంటారు. అలాంటి వారికి సమాజం ఎంతో విలువనిస్తుంది." అందుకే నిష్క ల్మష హృదయం కలిగిన చంద్రాన్ని మొదట సమాజం అవమానించినా, గుర్తించక పోయినా చివరకు ఆయన ఆశయం ముందు తలవంచక తప్పలేదు.

"జీవితం ఒక ఆట లాంటిది. ఒకసారి గెలుపు, మరో సారి ఓటమి తప్పదు. అవతలి పోటీదారుణ్ణి తక్కువగా అంచనా వేయలేం. అలాగని విధినీ ఎదిరించి నిలవలేం. విజయం సాధించిన వాడు ఆనందంతో ఎగిరి గంతేస్తాడు. పరాజయం పొందినవాడు తీవ్రవేదనకు గురై కన్నీళ్ల పర్యంత మవుతాడు. కానీ ఈ రెండు శాశ్వతం కాదని తెలిసినవాడు నిత్యం సుఖసంతోషాలతో, స్థిత ప్రజ్ఞతతో జీవించగలుగుతాడు." అని "రహదారిలో ఎత్తు పల్లాలు... సముద్రంలో ఆటు పోట్లు ఎంత సహజమో .... మన జీవితంలో కష్ట సుఖాలు అంతే.... కొన్ని చెప్పి, మరి కొన్ని చెప్పా పెట్టకుండా వస్తుంటాయి. కానీ చెప్పేది స్పష్టంగా చెప్పి మరీ వెళ్తుంటాయి. సుఖాలు వచ్చినప్పుడు ఆనందంతో ఎగిరి గంతేసి, కష్టాలు వచ్చినప్పుడు నిలు వెల్లా కుంగిపోకూడదు. కష్టాలే లేకుంటే సుఖానికి విలువే ముంటుంది.?" అని సాహిత్య ప్రకాష్ కలం ఒలికించిన అక్షరాలు చంద్రానికి నూటికి నూరు పాళ్ళు సరిపోతాయి.

కిందపడ్డా లేచిన చంద్రంనుంచి, అవమానాలనే ఆభరణాలుగా మలచుకున్న చంద్రాన్ని చూసి, సందేహా లనే సందేశాలుగా మార్చుకున్న చంద్రాన్ని చూసి దివ్యాం గులు, దివ్యాంగేతరులు నేర్చుకోవలసింది చాలానే ఉంది. ఈ వ్యాసంలో చాలా చోట్ల నేను వికలాంగులు అనే పదాన్ని ఎక్కువగా వాడటం జరిగింది. కథ మూలంలో వికాలంగులు అనే పదాన్ని ప్రయోగించడం వల్ల నేను అదే పదాన్ని వ్యాసంలో కూడా వాడటం జరిగిందనే విషయాన్ని పాఠకులు గమనించగలరని మనవి.

**ఆధార గ్రంథాలు :**

1. మేము సైతం - డా.నాగరాజు అసిలేటి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, జనవరి 2015.
2. జీవన పరిమళాలు కవితాసంపుటి, సాహిత్య ప్రకాష్.
3. వైకల్యాన్ని జయించిన మనిషి కథలు : గిన్నారపు ఆదినారాయణ May 5, 2014.
4. అవిటికథలు, వేములయల్లయ్య, సంపంగి శంకర్, 1-1-2013.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# కాకతీయుల కాలపు ఆర్థిక వ్యవస్థ

- డా॥ గంగు కిషన్ ప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్, తెలంగాణ.

రాజ్యాభివృద్ధికి ముఖ్యమైంది అర్థిక వ్యవస్థ. కాకతీయుల కాలం నాటి ఆర్థిక వ్యవస్థకు సంకేతాలు నాణాలు. పన్నులు - వాణిజ్యం.

వస్తు మార్పిడి పద్ధతిలో నాణాలు ప్రముఖ పాత్ర వహిస్తాయి. వస్తుమారకంగా నాణాలను ఉపయోగిస్తారు. నాణాలతో ఏ వస్తువుకైనా విలువ కట్టవచ్చు. ప్రభుత్వం నాణాలను టంకశాలల్లో ముద్రిస్తుంది. అదే ప్రభుత్వం పన్నులను కూడా నిర్ణయిస్తుంది. రాజ్యం యొక్క ఆదాయం ఈ పన్నుల పైననే ఆధారపడి వుంటుంది.

వాణిజ్యమంటే వస్తు వినిమయాన్ని పెంచడం, సంపదలు ఎక్కువైనపుడు, ఉత్పత్తులు స్థానిక అవసరాల కంటే ఎక్కువగా ఉన్నపుడు వ్యాపారం జరుగుతుంది. కాకతీయులు తమ ఉనికిని నిలబెట్టుకోవటానికి ఆర్థిక వ్యవస్థ పటిష్టపరచుకోటానికి ఈ అంశాలకు ఇచ్చిన ప్రాముఖ్యత ఎలాంటిదో విశ్లేషించటం, చర్చింటం ఈ వ్యాస ఉద్ధేశ్యం.

**నాణాలు :**

కాకతీయుల కాలపు శాసనాలలోను, నాటి సాహిత్యం లోనూ ఆ కాలమున ఉపయోగించిన నాణాలను గూర్చి తెలుస్తున్నది.

కాకతీయుల నాణాల మొదటి ప్రశంస 1814-47 సవంత్సరంలో కనబడుతుంది. ఆ కాలపు బొంబాయి రాయల్ ఏషియాటిక్ సొసైటీ వారి పత్రిక దక్షిణ కొంకణ దేశంలో హుల్ అనే గ్రామంలో దొరికిన 10 (పది) నాణాల గూర్చి ఒక వ్యాసం ప్రచురించింది.

తరువాత సర్‌వాల్టర్ ఎలియట్ అనే పండితుడు, 1886లో వెలువరించిన దక్షిణ హిందూదేశం గ్రంథంలో కాకతీయుల నాణాల ప్రశంస చేశాడు. అందులో ఒక రాగి నాణెం గూర్చి వర్ణించాడు. డా॥. హరిశివకుమార్ కూడా రాగి నాణాలున్నట్లు పేర్కొన్నాడు. కాని ఎక్కువగా బంగారు నాణాల, వెండి నాణాల ప్రస్తావనే శాసనాలలో కనబడుతుంది.

శాసనాధారాలను బట్టి కాకతీయు నాణాలకు అనేక పేర్లు కనిపిస్తాయి. వీరి నాణాలలో కేసరి అనే మాట వుంది. కేసరి అంటే సింహం ఇది బిరుదు నామంగా కన బడుతుంది. రాజులకిచ్చిన బిరుదుల్లో “కేసరి” పదాన్ని విశేషంగా ఉపయోగించారు. కేసరి తరువాత వచ్చే పదం నాణెం విలువ తెలుపుతుంది.

కేసరి గద్యానం, కేసరిమాడ, పహిండిగ, సంస్కృతంలో నిష్కం అనేవి పర్యాయ పదాలు. గద్యలు అంటే బంగారు నాణాలు గద్యకు గుర్తు ఒక నిలువు గీత. వీరి కాలంలో అర్ధమాడ, పావుమాడ, పరకమాడ అనే చిల్లర నాణాలు వాడుకలో వున్నట్లు తెలుస్తుంది. క్రీ॥.శ. 1137 నాటి కొల్లూరు శాసనాలు సంస్కతంలో 5 నిష్కాలని, తెలుగులో 5 గద్యలని పేర్కొన్నాయి.

గద్య తరువాత చిన్న నాణెం రూక పరి రూకలను ఒక గద్య లేదా మాడ అంటారని నల్లగొండ జిల్లా బొల్లె పల్లి శాసనం తెలుపుతుంది. టంక, రూక వంటి వెండి నాణాలు విస్తృత ప్రచారంలో వున్నట్లుగా తెలుస్తుంది.

కాకతీయ రూకలను కేసరి రూకలనేవారు. 1258నాటి నాదెండ్ల శాసనంలో కేసరడ్డుగ అనే మాటను అర్ధరూకగా భావించారు. మరెన్నో శాసనాల్లో కేసరి వీసం కనిపిస్తుంది.

ఒక వీసం అనగా 1/16 (భాగం) రూక, కేసరి చిన్నం అనే దానికి కొన్ని శాసనాలు 1/14 (భాగం) మాడ అని, 21 సన చిన్నాలు (కేసరి చిన్నాలు) రెండు గద్యల ఒక చిన్నమని పేర్కొన్నాయి. ఈ ఆధారాల వల్ల కేసరి చిన్నానికి ఖచ్చితమైన విలువ తెలియలేదు.

ఆ కాలంలో ఫనం, పగోడా, వరాహాలు, కాసు అనే నాణాలున్నట్లు కనిపిస్తాయి. అన్నింటి కంటె చిన్న నాణెం తార అని పేర్కొనబడింది. తార అంటే నాలుగు కాసుల నాణెం అని శాసన శబ్దకోశం చెప్పున్నది.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

మనమిప్పుడు వ్యవహారంలో పైస అంటే రూపాయిలో వందో భాగమని పైస అంటే డబ్బు అనే పదాన్ని ఉపయోగిస్తున్నాం. నాటి శాసనాలు కూడా ఈ నాణాలను కేవలం డబ్బు అన్న అర్థంలో వాడినట్లున్నాయి.

కాకతీయుల నాటి నాణాల పేర్లను ఒక పద్ధతి లేకుండా వాడటం వలన వాటి విలువలను నిర్ధారించటంలో సమస్యలు తలెత్తుతాయి.

వీటన్నింటిని బట్టి ఆ కాలంలో బంగారు, వెండి, రాగి నాణాలు చెలామణిలో వున్నట్లు విశదమగుతున్నది.

## పన్నులు :

రాజులు తమ రాజ్యంలోని ప్రజలకు తగిన రక్షణ కల్పించటానికి ప్రజలకు కావలసిన సౌకర్యాలను సమకూర్చటానికి, వివిధ రకాల పన్నులు, వసూలు చేసే వారు. అలా వసూలు చేసే పన్నులు, కొన్ని కాకతీయుల శాసనాలలో కూడా కనిపిస్తాయి.

ప్రకాశం జిల్లా గిద్దలూరు తాలూకా సలకలవీడు గ్రామంలో లభించిన శాసనం కాకతీయ కాలానికి సంబంధించిన పన్నుల బాహుళ్యాన్ని తెలుసుకోవటంలో తోడ్పడుతుంది. కాకతీయ రాజులు, ప్రజల నుండి వసూలు చేసిన పన్ను, అయిదు (5) రకాలని తెలుస్తుంది.

1. భూమి పన్నులు
2. పారిశ్రామిక -ఆస్తి పన్నులు
3. వృత్తి పన్నులు
4. వాణిజ్య పన్నులు (వ్యాపార పన్నులు)
5. ఇతర పన్నులు

## భూమి పన్నులు :

సామంతులకిచ్చిన భూములు, ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన భూములు, బ్రాహ్మణులకు ఇచ్చిన భూములన్నీ కూడా, తప్పని సరిగా పన్ను చెల్లించాలి. భూమి తరహాను బట్టి వనరులను బట్టి కొత్తగా సేద్యం చేయుటకు ప్రోత్సహిస్తూ ఆ ప్రాంతపు రాజులు కాని, సామంతులు కాని, కొంత కాలం పాటు పన్ను నుండి రాయితీలు కల్పించేవారు. ఇలాంటి భూమిని అచ్చుకట్టు లేక ఆయకట్టు భూమి అనేవారు.

పన్నులు ధన రూపంలో గాని, వస్తురూపంలో గాని వసూలు చేసేవారు.

భూమి పన్నుకు సంబంధించి శాసనాలలో ఐదు రకాల పరిభాష కనిపిస్తుంది.

1. **పన్ను** : వ్యవసాయంతో సంబంధం లేకుండా భూమి మీద వసూలు చేసే పన్ను ఒక రకం.
2. **పంగము లేదా పంగ** : మరొక రకం పంటలో రాజు భాగాన్ని కేటాయించడం దీనిని పంగము లేదా పంగ అనేవారు. సందార్భాన్ని బట్టి, రాజులు పంటలో సగభాగం, మూడవ వంతు లేదా నాలుగవ వంతు వసూలు చేసేవారు.
3. **కానిక** : ఇంకోరకం రైతులు రాజుకు గాని, రాజ ప్రతినిధికి గాని తమ విధేయతను, తెలుపడానికి చెల్లించే పన్ను కానిక.
4. **దరిశనము** : రైతు రాజును గాని, సామంత రాజును గాని దర్శించటానికి పోయేటప్పుడు, కట్టే పన్నును దరిశనపు పన్ను అన్నారు.
5. **భూమి మీద అదనపు పన్నులు** : ప్రభుత్వ వనరుల నుండి తాము పొందే ప్రయోజనాల కోసం, రైతులు, అదనపు పన్నును చెల్లించేవారు. అందులో నీరువడి, యన్నుపన్ను లేదా వెన్నుపన్ను బంటెల ఆయం, అర్ధాయం పుల్లరి అని పన్నులు వసూలు చేసేవారు.

## నీరువిడి :

వ్యవసాయం కొరకు కాలువల నుండి చెరువులు, బావులు, నదుల నుండి నీరు తీసుకున్నందుకు చెల్లించే పన్ను ఈ బావులు చెరువులు రాజుకు చెందినవైతే, రాజుకు ప్రైవేటు వ్యక్తికి చెందినవైతే, ఆ వ్యక్తికి పన్ను చెల్లించాలి. ప్రైవేటు వ్యక్తులు వీటిని కలిగి వున్నందుకు వీరు కూడా రాజుకు పన్ను చెల్లించాలి.

## యన్ను పన్ను లేదా ఎన్ను పన్ను :

పంట కోతకు వచ్చే సమయంలో వేసే పన్నును ఎన్నుపన్ను అంటారు. మంచి పంట పండితే రైతులు సాధారణంగా చెల్లించే పన్నుకు, అదనంగా చెల్లించేదే యన్ను పన్ను.

## బంటెల ఆయం :

కాకతీయులు ప్రభుత్వ ఉద్యోగులకు సామంతులకు జీతాల క్రింద, పన్ను వసూలు అధికారాన్ని కల్పిస్తూ వారికి, భూములను కేటాయించారు వీరిని నాయంకరులు అనే వారికిచ్చిన భూములను నాయంకరమని అనేవారు. యుద్ధ సమయాల్లో నాయంకరులు రాజులకు, సైన్య సహాయంచేయటానికి తమ ఆధీనంలో నిర్ణీత సంఖ్యలో, సైన్యాన్ని పోషించేవారు. వీరి పోషణ కొరకు, తమ ఆధీనంలోని భూమి, సాగు చేసే రైతుల నుండి పన్ను వసూలు చేసేవారు. దీనినే బంటెల ఆయం అనెడివారు.

## అర్థాయం :

పంటలో సగం రాజుకు చెల్లించే షరతు మీద ప్రభుత్వ భూముల్ని రైతుకు కౌలుకు ఇచ్చేవారు. ఈ పద్ధతి వల్ల రాజు కోశాగారానికి, పెద్దమొత్తంలో ఆదాయం లభించేది.

## పుల్లరి :

పుల్లు అంటే గడ్డి. అరి అంటే పన్ను, రాజుకు చెందిన అడవిలోను, పచ్చిక బయళ్ళలోను, పెంపుడు జంతువులను మేపుకున్నందుకు చెల్లించే పన్ను, పుల్లరి.

సలకలవీడు దుర్గి మరియు ఇతర శాసనాలు ఈ విధమైన భూమి పన్నులను పేర్కొన్నాయి.

కాకతీయుల కాలంలో నీటి కోసం పంట కోత కోసం పశువులను మేపటం కోసం ప్రభుత్వ ఉద్యోగులకు సామంతులకు, జీతాల క్రింద పన్ను వసూలు చేసుకోవటం పంటలో రాజుకు సగం ఇవ్వడం లాంటి పన్నులన్నీ భూమి మీద ఉన్నాయంటే భూమే ప్రధానమైన ఆర్థిక వనరు. కాబట్టి రాజుకు సంపద రైతుకు భారం అవుతుంది. ఇది సామంత భూస్వామ్య వ్యవస్థ ఆర్థిక దోపిడీ విధానాన్ని సూచిస్తుంది.

## పారిశ్రామిక పన్నులు-ఆస్తి పన్నులు :

కాకతీయుల కాలంలో తైల పరిశ్రమ నేత పరిశ్రమ ప్రధానమైనవి. తెలికవారు, నేతగాళ్ళు పరిశ్రమలు స్థాపించడానికి నడపడానికి అంగట్లో సరకు అమ్ముకోడానికి స్థానిక దేవరకు తమ సంఘాలకు పన్ను చెల్లించాలి.

ఉప్పుచేలు, రాట్నాలు, కల్లుగీత, కుమ్మరం మొదలైన కుటీర పరిశ్రమల మీద కూడా పన్నులుండేవి.

కాకతీయుల కాలంలో గొఱ్ఱెలు, మేకలు, వివిధ పశువులు పెంపుడు జంతువులే ప్రజల ఆస్తి. పాలకులు వీటి మీద కూడా పన్ను వసూలు చేసేవారు.

ఇంటి పన్నును శాసనాలలో ఇల్లరి, ఇల్లడి, ఇలుటు దెర అని పేర్కొన్నారు.ఏ ప్రమాణంలో ఇంటి పన్నును నిర్ధారించేవారో తెలుసుకోడానికి ఆధారాలు లేవు. ఇంటి యజమాని ఆర్థిక హెూదా మీద ఆధారపడి కూడా పన్ను నిర్ధారించే సందర్భాలు కనిపిస్తున్నాయి.

## వృత్తి పన్నులు :

కాకతీయుల కాలంలో వివిధ వృత్తుల మీద పన్నులు విధించినట్లు ఆధారాలున్నాయి. ఇక్కడ వృత్తి అంటే కుల పరమైన జీవనోపాధి మాత్రమే గాక, కొన్ని చిన్న పరిశ్రమలకు కూడా వర్తిస్తాయి. వృత్తి మీద పన్ను విధించే పద్ధతి వుందని చెప్పగలిగినప్పటికి అది ఎంత అన్నది చెప్పడానికి తగినంత ఆధారం లేదు. వేతనం మీద పని చేసేవారు కూడా వృత్తి పన్ను చెల్లించాలి.

క్రీ.శ.1111 నాటి పరాంతకుని ద్రాక్షారామశాసనం గ్రామంలోని వృత్తికారుల మీద పన్నులను పేర్కొంది. కుమ్మరి చక్రానికి, వడ్డరి, కమ్మరి, కంసాలి, కమ్మఛారి, వడ్రంగి, చాకలి, మంగళి తలకు ఇన్ని చిన్నాలని తల పన్నును పేర్కొంది.

## వాణిజ్య పన్నులు (వ్యాపార పన్నులు) :

కాకతీయులు అన్ని రకాల వాణిజ్య వస్తువుల మీద పన్ను వసూలు చేసేవారు. అంగడి లేదా మజలీని అడ్డ అనేవారు. ఈ అడ్డలో వసూలు చేసే సుంకాన్ని అడ్డు పట్టు సుంకం అనేవారు. సరకు అమ్ముడుగాక అనేక అంగట్లకు తిరగవలసి వస్తే ప్రతి అంగట్లోను కొంత పన్ను చెల్లించాల్సి వుండేది.

ఉప్పు, వడ్లు, పసుపు, పత్తి బెల్లం మొదలైనవాటి మీద నగదు రూపంలో తక్కిన అన్ని వస్తువుల మీద నగదు రూపంలో గాని వస్తు రూపంలో గాని సుంకం వసూలు చేసేవారు.

**ఇతర పన్నులు :**

ఏ ప్రభుత్వానికైనా పన్నుల రూపంలోనే ఆదాయం లభిస్తుంది. వంశ పారంపర్యపు గ్రామ సేవకులకు ఉద్యోగులకు జీతాలు ఇవ్వటానికి ప్రజల నుంచి వేరు వేరు పన్నులు వసూలు చేయబడేవి. గ్రామ కావలి దారుకు తలారి పన్ను చెల్లించాలి. ప్రమాద పరిస్థితులలో గ్రామస్తుల్ని హెచ్చరించటానికి ఎత్తయిన ప్రదేశంలో నిల్చొని బాకా పట్టేవాని జీతం కోసం సింగినాదం పన్ను వసూలు చేయబడేది. విదేశ వ్యవహారాల మంత్రి జీతం కోసం సంధివిగ్రహిపన్ను యువరాజు పోషణకు దొగరాచ పన్ను వసూలు చేయబడేది. దేవ కార్యాల కోసం భూమి యజమానుల నుండి వర్తకుల నుండి మగము అనే పేరిట పన్నులు వసూలు చేశారు. దేవాలయాలకు వివిధ వృత్తుల వాళ్ళు పన్ను చెల్లించాల్సి వచ్చేది. పుట్టిన బిడ్డకు నామ కరణం మీద పన్ను వసూలు చేసేవారు. దీనిని పుట్టు పేరు సుంకం అన్నారు. పెండ్లి సమయంలో పెండ్లి కొడుకు తరపున పెండ్లి పన్ను వసూలు చేసేవారని గణపతి దేవుని కాలం నాటి వేల్పూరి, రొంపిచెర్ల గుడివాడ శాస నాలు తెలుపుతున్నాయి. నది దాటించుటకు పడవలకు అనుమతిస్తే రేవు సుంకం వసూలు చేసేవారు. పోక తోటల మీద అంతరాయం అనే పన్ను వసూలు చేసేవారు.

ఉమ్మడిగా గ్రామస్తుల మీద అత్యవసర సమయాల్లో ప్రత్యేక పన్ను వసూలు చేసేవారు. దీన్ని మధ్యకం అనేవారు.

ఈ రకంగా ఆనాటి శాసనాలలో వివిధ రకాల పన్నులు కనిపిస్తాయి.

**వాణిజ్యం :**

వ్యవసాయం లాగే వస్తువు ఉత్పత్తి జరిగిన చోటు నుండి వినియోగదారుని వద్దకు చేరవేయటానికి వాణిజ్యం ఉపయోగపడుతుంది.

కాకతీయుల కాలంలో వాణిజ్యం పటిష్టమైన వర్తక శ్రేణుల ద్వారా జరిగేదని శాసనాలు చెపుతున్నాయి. వ్యాపారాన్ని వ్యవహారమని వర్తకుని బేహారి అని పిలిచే వాళ్ళు. వ్యవహారం నుండే బేహారి అనే మాట ఏర్పడింది.

వ్యాపారం స్వదేశీ, పరదేశి అని రెండు రకాలుగా జరిగేది. స్వదేశి వ్యాపారులను నకరము అని పరదేశి వ్యాపారులను నానాదేశి పెక్కంర్డు లేక ఉభయ నానాదేశి పెక్కంర్డు అని పిలిచేవాళ్ళు. నానాదేశి పెక్కుంర్డు అని పేర్కొన్నప్పటకి వీరు తెలుగు దేశములోని గ్రామాలకు చెందిన వారే. వీరు పెద్ద ఎత్తున వివిధ ప్రాంతాలలో వివిధ వస్తువుల వ్యాపారాన్ని సాగించేవారు.

వ్యాపారులు తాము వర్తకం చేసే ప్రాంతాలకు వస్తువు లకు సంబంధించి వర్తక సమయాలు ద్వారా ప్రభుత్వం నుండి అనుమతి పొందేవారు.

సాంప్రదాయక వైశ్యులు లేదా కోమట్లే కాక రెడ్లు, నాయుళ్ళు, బోయలు దాసర్లు కూడా వాణిజ్యం నిర్వ హించేవారు.

కోమట్లను సెట్లు (శ్రేష్టులు) చెట్టులని అనేడివారు. నీతిశాస్త్రముక్తావళి, సుమతీ శతకాలు రచించిన బద్దెన మాటలను బట్టి నాటి సామాజిక ఆర్థిక జీవనంలో కోమట్ల ప్రాధాన్యం వ్యక్తమవుతుంది.

దేశం నలుమూలల, వీళ్ళ ద్వారానే ఆర్థిక వ్యవస్థ విస్తరించేది, వ్యవసాయ ఉత్పత్తులు ఉండే ప్రతిచోట ప్రతీ పట్టణంలో వీరి కార్యకలాపాలుండేవి.

తెలికలు, పద్మశాలీలు వ్యవసాయదారుల వంటి ఉత్పత్తిదారుల పాత్ర వాణిజ్యంలో కోమట్ల తరువాతే. నాటి రాజులు సామంతులు అనేక శాసనాలలో రాజ్య సెట్లను కూడా పేర్కొన్నారు. వస్త్ర వ్యాపారులు, పోకల వ్యాపారులు, నువ్వుల వర్తకులు, స్వదేశీ పరదేశీ అనుమతులను కలిగివున్నారు. నువ్వుల వర్తకులే గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు మొదలగు ధాన్యాలు ఉప్పు నూనె, నెయ్యి మిరియాలు, ఆవాలు, తేనె, తుత్తు నాగం (జింకు) తగరం, రాగి వంటి లోహాలు కర్పూరం, కస్తూరి పట్టు రత్నాలు ముత్యాలు పూసలు, పసుపు ఉల్లిగడ్డలు అల్లం దుంపలు మొదలైన వాటి వ్యాపారం చేసేవారు.

క్రీ.శ.1228 నాటి గణపతి దేవుని వరంగల్లు కోట శాసనం అంగడి స్వరూపాన్ని అంగడిలో జరిగే వ్యాపార

కార్యకలాపాల్ని సమయాల (శ్రేణులు) పేర్లే కాకలు అవి చేసే వ్యాపారాలను కూడా వివరంగా తెలుపుతుంది.

రాజ్యంలోని అన్ని సమయాల (శ్రేణులు) వ్యాపారులు తమ వాణిజ్య ప్రాంతాలతో పాటు, పట్టణ వ్యాపారుల తోను, నిరంతర సబంధాలు కలిగి ఉండేవారు. వివిధ వృత్తికారులు, ఉత్తత్తిదారులు, స్వంత సమయాలను (శ్రేణులను) ఏర్పరచుకొని వస్తువులను ఉత్పత్తి చేయుటవే గాక తమ గ్రామాలకు సమీపంలోని సంతలలో అమ్మేవారు.

నేతపనివారు నూనె గానుగుల వారు కుమ్మరుల కంసాలులు మేదరులు మొదలైనవారు ఈ వర్గంలోకి వస్తారు. వీరు తమ వృత్తి సమయాలను (సంఘాలను) ఏర్పరచుకొని తమ కుల కార్యాలనే కాక తమ పరిశ్రమ వ్యాపాలను నిర్వహించుకొనేవారు సుంకం చెల్లించి అడ్డలలో తమ వస్తువులను అమ్ముకునేవారు. వాణిజ్య పరంగా ఈ సమయాలన్నీ స్వదేశీ బేహారులలో చేరు తాయి. వాస్తవానికి వీరు అనేక రకాల వస్తువులను అమ్మే వృత్తి పరమైన వ్యాపారులు కారు, అయినా వీరికి అడ్డలో చోటు వుండేది.

గుత్త వ్యాపారం కాని, చిల్లర వ్యాపారం కాని పెంట, అడ్డ, సంతలలో జరిగేది. చాలామంది చ్లిలర వ్యాపారులు నెత్తిమీద గంపలతోను, సంచులతోను, కావళ్ళతోను, సరకులను ఇంటింటికి తిరిగి అమ్ముకునే వాళ్ళు పన్నులు విధించడానికి అనుకూలంగా ఎంపిక చేసిన స్థలాలలో వ్యాపారం జరిగేది. అమ్మేవాడికి కొనేవాడికి ఇది అను కూలంగా వుండేది.

పెంటలలో వర్తకులు తమ సరుకులను పెట్టుకోవ టానికి, పాకలను ఏర్పరచేవారు ఈ పాకకు వారానికి ఒక గద్యానం అద్దెగా వుండేది. సరకులు పాకనుండి బయటకు తీసి అమ్మకానికి పెట్టేటపుడు మరో గధ్యానం చెల్లించాలి. అంగడిలో అమ్మకానికి సరకులను నమోదు చేసుకునే సందర్భంలో ముద్ర సుంకం చెల్లించవలసి వుండేది. ఇది చాలా స్వల్పంగా వుండేది.

పెంట లేదా అడ్డల నిర్వహణ ప్రభుత్వమే చేసేదని 1310 నాటి కాకతీయ సేనాని దేవరినాయకుని కోచ్చెర్ల కోటిశాసనం తెలుపుతుంది. చిల్లర వ్యాపారులకు పెంట వ్యాపారులు చెల్లించే సుంకాల కంటే తక్కువ సుంకాలు వుండేవి.

ఆహారం వస్త్రాలకు సంబంధించినంత వరకు నాటి గ్రామాలు స్వయం సమృద్ధమై వుండేవి. ఉప్పు ఖనిజాలు అటవీ ఉత్పత్తులు ప్రతీ గ్రామానికి అవసరం.

సుగంధ ద్రవ్యాల్లో మిరియాలు అల్లం, లవంగాలు బయటి నుండి దిగుమతి చేసుకునేవారు. జంతువుల్లో గుఱ్ఱాలు ఒంటెలు, ఆవులు, ఎద్దులు గేదెల వ్యాపారం సర్వసాధారణమైనవి. పశువుల కోసం ప్రత్యేకంగా పెంటలు వుండేవి.

ప్రసిద్ధమైన అయ్యావళి సమయం (శ్రేణి) వారు తమ సరకులను గాడిదలు, గుఱ్ఱాలు, ఎద్దులు, బండ్ల మీద అంతర్ రాజ్యమార్గాల ద్వారా రవాణా చేసేవారు.

బళ్ళారి - నెల్లూరు, బళ్ళారి - చిత్తూరు, రాయచూర్ - కొలన్‌పాక - బీదర్ - కొలన్‌పాక, కళ్యాణి - కొలన్‌పాక - అనుమకొండ నాటి అంతర్ రాష్ట్ర వాణిజ్య మార్గాలలో ముఖ్యమైనవి.

గణపతిదేవుని కొణిదెన శాసనం పేర్కొన్న రేవు సుంకం నదుల ద్వారా మనుషుల్ని దాటించడానికే కాక, వస్తువుల రవాణా కూడా చేసేవారని నిరూపిస్తుంది.

సరుకులను పడవ ఎక్కించినపుడు, దింపినపుడు కూడా పన్ను చెల్లించవలసి వుండేది వాణిజ్య సరకుల రవాణా అద్దె సాధనాల మీద ఆధారపడి వుండేది అన్ని అంగడి స్థలాలలోను, బండ్లు ఎడ్లు గుఱ్ఱాలు, గాడిదలను అద్దెకిచ్చేవారు వుండేవారు.

### ముఖ్యమైన వాణిజ్య కేంద్రాలు :

రాజధాని పట్టణమైన ఓరుగల్లు ఆనాటి ముఖ్య వ్యాపార కేంద్రం. నల్లగొండ సమీపంలోని పానగల్లు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చెర్ల తుంగభద్రాదీరంలో అలంపురం, కరీంనగర్ జిల్లాలో మంథెన ప్రకాశం జిల్లా లోని త్రిపురాంతకం కొచ్చెర్లకోట, పెదగంజాము పశ్చిమ

గోదావరి జిల్లాలోని పెనుగొండ, నెల్లూరు, కృష్ణా జిల్లాలోని ఘంటశాల మరియు గుడివాడ, గుంటూరు జిల్లాలోని వేల్పూరు దుర్గీ మాచర్ల, తంగెడ, కొప్పరం, ఎనమదల, కడప జిల్లాలోని లేబాక, నందలూరు, ఉప్పరపల్లె కర్నూలు జిల్లాలోని దోర్నాల ముఖ్యమైన వాణిజ్య కేంద్రాలు.

**వాణిజ్య విషయంలో - రాజు తీసుకోవలసిన జాగ్రత్తలు :**

కాకతీ ప్రతాపరుద్రుడు రచించిన నీతిసారమనే రాజనీతి శాస్త్ర గ్రంథం రాజ్యంలో సక్రమంగా వాణిజ్యం జరగడానికి రాజు చేపట్టవలసిన బాధ్యతలను తెలుపు తుంది. వాణిజ్య సరకులను రాజు స్వంతానికి వాడుకున్నా సుంకం పెంచినా వ్యాపారం చేసుకోడానికి పరదేశీ వ్యాపారులకు అనుమతి ఇవ్వకపోయినా, వ్యాపారులు తమ ఇష్టం వచ్చినట్లు కొలతల్లో మోసాలు జరిపినా ప్రజలకు వినాశమేనని ఈ గ్రంథం చెబుతుంది.

క్రీ.శ. 1244లో దేశుయక్కొండ పట్టణమనబడే మోటు పల్లిలో గణపతి దేవుడు శాసనం వేయించాడు. కళి యుగంలో ప్రబలుతున్న అధర్మాన్ని అణచి ధర్మ ప్రతిస్థాపన చేస్తూ సముద్ర వర్తకులకు కొన్ని రాయితీలను ఇస్తున్నట్లు ఈ శాసనం చెబుతుంది.

వివిధ ఖండాల నుంచి ద్వీపాల నుండి, దేశాల నుండి సముద్రం మీదుగా వచ్చే వర్తకుల భద్రతకు గాను ఈ శాసనం వేయబడింది.

వ్యాపారం నిరంతరం జరగడానికి రాజు దోహద పడాలి. వ్యాపారం దెబ్బతింటే ఆర్థిక వ్యవస్థ దెబ్బ తింటుంది

తమకు పూర్వం వున్న చాళుక్య చోళరాజుల నిర్లక్ష్యం వల్ల దెబ్బతిన్న సముద్ర వ్యాపారాన్ని కాకతీయ చక్రవర్తి గణపతిదేవుడు పునరుద్ధరించాడు. విదేశీ వ్యాపారం కొరకు అనేక రేవు పట్టణాలు అభివృద్ధి చెందాయి. ఆనాడు ఆంధ్రదేశం ఏఏ దేశాలతో వాణిజ్య సంబంధాలను ఏర్ప రచుకున్నదో ఎక్కడి నుండి వస్తువులను దిగుమతి చేసు కున్నదో 15వ శతాబ్ది ప్రథమార్థానికి చెందిన శ్రీనాథుని హరవిలాసం వర్ణిస్తుంది.

మొత్తం మీద భూమి, నాణాలు, వాణిజ్య, రాజ్యానికి ప్రధాన అదాయ వనరులుగా వుండడం కాకతీయ ప్రాభవానికి వైభవానికి అవే ప్రధాన దోహదకారులు కావటం గమనించవచ్చు. ఈ ఆదాయపు మిగులే సాహిత్యం-సాంస్కృతి కళాభివృద్ధికి దోహదం చేశాయి.

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# పాలేరు నాటకం - సామాజిక చైతన్యం

- డా॥. లంకిపల్లె జ్యోతీశ్వర నాయుడు, ఆంధ్రోపన్యాసకులు, వి.ఆర్.యస్. & వై.ఆర్.ఎన్. కాలేజి, చీరాల, ప్రకాశం జిల్లా.

## నాటకం - విశిష్టత :

కావేషు నాటకం రమ్యం అన్నారు. "నాటకాంతం సాహిత్యం" అన్నారు. కవిత్వం ఏ ప్రక్రియంలో చెప్పబడినా అది ఆలోచనలకు అందేది మాత్రమే. నాటకం అలాకాదు. అదితక్కిన అన్ని కళలనుసాధనాలుగా ఉపయోగించుకొని జీవిత క్రమ వికాసాన్ని, క్రమోన్నతిని రమణీయంగా సర్వేంద్రియాలకు తృప్తినిచ్చే విధంగా ప్రదర్శించి చూపు తుంది. ప్రతి మనిషి తానున్న స్థానమునుంచి ముందుకు పోవాలనుకుంటాడు. అటువంటి ప్రస్థానాన్ని ప్రత్యక్షంగా చూపించేది నాటకం. ఇతి వృత్తంగా ఏవ్యక్తి జీవితాన్నైనా తీసుకోవచ్చు. ఆ జీవితం సుఖదు:ఖాల వెలుగు చీకట్ల గుండా ప్రయాణిస్తూ ఎలా క్రమ వికాసం చెందిందో సహృదయుల మనస్సులకు హత్తుకునేలా చూపగలిగేదే నాటకం. అట్టి జీవితం లక్ష్యం అందరూ సాధించ గలిగినట్టిదిగా ఉండాలి. అదే నాటకంలోని విశిష్టత. నాటకం ద్వారా సమాజాన్ని చైతన్య పరచడం రచయిత యొక్క ముఖ్యోద్దేశం అయివుండాలి.

## పాలేరు నాటకం - దాని లక్ష్యం :

సత్యహరిచ్చంద్ర నాటకం చూసి ఎందరు సత్య వ్రతులైయ్యారో తెలియదు కానీ, పాలేరు నాటకం చూసి వేలమంది పాలేర్లు తమ తమ పాలేరు తనాలు వదిలేసి పాఠశాలల్లో చేరడం మాత్రం వాస్తవంగా జరిగింది.

## నాటక రచయిత పరిచయం :

పాలేరు నాటక రచయిత డా॥బోయి భీమన్న. పేరు కెక్కిన కోనసీమ వైనతేయ నదీతీరంలో రాజోలు తాలూకా లోని మామిడికుదురు గ్రామంలో క్రీ.శ.1911 సెప్టెంబరు 19వ తేదీన జన్మించారు. భీమన్మ గారి తల్లి నాగమ్మ, తండ్రి పల్లయ్య. భీమన్నగారు అనేక సన్మానాలు అందు కున్నారు. కవి రచయితగా వారి ప్రతిభను గుర్తించి ఆంధ్ర విశ్వవిద్యాలయం కళా ప్రపూర్ణ బిరుదమునిచ్చి గౌర వించింది. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ, పద్మభూషణ్ బిరుదములనిచ్చి గౌరవించింది. వారణాసి కాశీ విద్యాపీఠ్ డిలిట్ గౌరవ డాక్టరేట్‌ను ఇచ్చింది. భీమన్న గారు తన 12వ ఏటనే కలము చేత బట్టి వివిధ సాహిత్య ప్రక్రియ లలో రచనలు సాగించారు. వీరు మధుబాల, మధుగీత, దీపసభ అనే కావ్యములతో పాటు పాలేరు, కూలిరాజు, అసూయ, ప్రగతి, పడిపోతున్న గోడలు అను కొన్ని సాంఘిక నాటకాలు కూడా వ్రాశారు. మరి కొన్ని వచన కవితలు కూడా వ్రాశారు. "గుడిసెలు కాలిపోతున్నాయి" అనే వీరి కవితకు కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. వీరి రచనలన్నింటిలో "పాలేరు" నాటకం భీమన్నగారి కీర్తి కిరీటానికి మేలుతురాయి వంటిది.

## ఇది వృత్తం :

పాలేరు నాటకంలోని కథచాలా చిన్నది. గోదావరి నదీ తీరంలో కాకినాడ బస్సురూటులో రైతువాడ ఒక గ్రామం. ఆ గ్రామంలో కుబేరయ్య అగ్రకుల భూస్వామి. పాలేరుల సహాయంతో సొంతంగా వ్యవసాయం చేసుకుంటాడు. అతని పాలేరులలో దళితుడైన పుల్లయ్య ముఖ్యుడు. అతని కొడుకు వెంకన్న వీరేశు మరొక పాలేరు. ఈ ముగ్గురూ దళితులే. వెంకన్నను కూడా పాలేరు తనంలో పెడతాడు పుల్లయ్య. కానీ వెంకన్నకు చదువుకోవాలని వుంది. ఆ వూరి బడిలోని ఉపాధ్యాయుని పేరు ఉపకారి. అతడు, వనబాల అనే విద్యార్థిని ఇద్దరు వెంకన్నను ప్రోత్సహిస్తారు. కామందు కుబేరయ్య, తండ్రి పుల్లయ్య వ్యతిరేకిస్తారు. ఈ ఇద్దరు వెంకన్నను చాలా బాధలు పెడతారు.

రైతువాడ గ్రామం చుట్టూ విశాలమైన పంట పొలాలు. పొలాల మధ్యలో అక్కడక్కడ చెట్లు, తోటలు వున్నాయి. అలాంటి ఒక తోటలో వుంది పాఠశాల. అంటే గ్రామానికి మధ్య పొలాలు వున్నాయన్న మాట. ఆ పొలంలోని పచ్చిక

బయళ్లలోనే వెంకన్న కుబేరయ్య గారి పశువుల్ని మేపేది. ఆ పొలాలలోని చెట్ల క్రిందనే ఉపకారి మాష్టారిని, విద్యార్థిని వనబాలను వెంకన్న తరచు కలుస్తూ వుంటాడు. అతడు కామందు చేత దెబ్బలు తినేది కూడా ఆ పొలాల లోనే.

అవర్ణులైన వ్యవసాయ కూలీల, పాలేర్ల పేటలు ఆ పొలాలకు ఆనుకునే వుంటాయి. అవన్నీ కామందుల భూములే. కూలీలకు సొంత ఇళ్లు లేవు. అప్పటికి ఇంకా దేశానికి స్వాతంత్రం రాలేదు. రైతువాడ గ్రామంలో కుబేరయ్య గారి లోగిలికి దగ్గరలోనే మరొక సంపన్న కుటుంబం వుంది. వాళ్లూ సవర్ణులే అయినా కుబేరయ్య వలె సంకుచిత మూర్ఖకులతత్వ వాదులుకారు. ఆ సంపన్న కుటుంబానికి చెందినదే వనబాల. ఆమె అన్న గారు సుందరం. కాకినాడ కాలేజీలో చదువుచున్నాడు. అక్కడి అనాధశరణాలయం సూపర్నెంటుగారి అబ్బాయి రామం, సుందరం మిత్రడు. కామందు కుభేరయ్య తన తండ్రి పుల్లయ్య పెట్టే హింసలకు భరించలేక కాకినాడకు పారిపోయిన వెంకన్న అనాధ శరణాలయంలో చేరి వెంకటేశ్వర రావై ప్రవేటుగా పరీక్షలు పాసై ప్రభుత్వాధికారి డిప్యూటి కలెక్టరు అవుతాడు.

ఈ లోగా సీత-వీరేశు, దొంగ రామన్న-రౌడి రండు, కుభేరయ్య-పుల్లయ్య, సుందరం-రామంల సంఘటనలు కొన్ని జరుగుతాయి. బాలను రామనికిచ్చి వివాహం చేయడానికి సుందరం ప్రయత్నించడం, బాల దు:ఖం, వెంటేశ్వరరావు నిర్వేదం, తుదకు కష్టాలన్ని తొలగి అందరూ కలుసుకోవడం, కుబేర్రావుకు వెంకటేశ్వర రావు మేలు చేయడం జరిగి బాల-వెంకటేశ్వర్రావుల వివాహంతో కథ సుఖాంతమవుతుంది.

కవి ఉద్దేశ్యము :

పాలేరు నాటక కర్త భీమన్నగారు షెడ్యూల్డ్ కులంలో పుట్టి తన షెడ్యూల్డ్ జాతి యువకులు పాలేరు తనంతో బానిసత్వపు సంకెళ్లలో చిక్కుకొని పతనమవుతున్న విష యాన్ని గ్రహించి చదువువల్లనే సంఘంలో మార్పు వస్తుం దనే సత్యాన్ని విశ్వసించారు. వూరికి దూరంగా నివసిస్తూ తరతరాలుగా సంపన్నుల ఇండ్లలో పాలేరు తనం చేస్తూ వున్న మాల, మాదిగల కష్టాలను నివారించడానికి, పాలేరు తనాన్ని పూర్తిగా నిర్మూలించాలనే సంకల్పంతో ఈ నాటకాన్ని రచించి గొప్ప సాంఘిక విప్లవాన్ని సాధిం చారు.

## నాటక నామౌచిత్యము :

పాలేరు అంటే ఎవరు ? యజమానికి క్రింద బానిసలా పనిచేసే ప్రతి అస్వతంత్రుడు బానిసే. అట్టి ప్రతివాడు తన బానిసతనాన్ని తొలిగించుకోవడానికి నిరంతరం కృషి చేయవలసి వుంటుంది. ఇది ఒక ఎడతెగని సమస్య. దీనికి ముగింపు లేదు. అయినా పోరాటం కొనసాగక తప్పదు అనెడి ఈ భావమును తెలియజేయచు నాటక ప్రారంభములోనే కవి భీమన్న నాటకానికి కథా నాయకుడైన వెంకన్నచేత ఒక గేయం పాడిస్తాడు.

బానిసతనమును - బాపుమురా
భారతభూమికి - భాగ్యముతేరా!
సకల దేశముల - సర్వమానవుల
సామ్యము - సాధింపుమురా!

దీనివలన సమాజములో బానిసతనమును రూపు మాపవలెననెడి సామాజిక స్పృహను కలిగించి యువకు లలో సాంఘిక విప్లవమునకు అంకురార్పణ చేయగలను అనేది కవి విశ్వాసము.

## కథాసారాంశము :

ఈ నాటకములోని ఆరవ రంగంలో సమయం ఉదయం వెంకన్న పొలంలో పశువుల్ని మేపుతున్నాడు, కాలికి కట్టు, తలకు తుండుగుడ్డ పాగా, అందులో నుంచి ఒక చిన్న నలిగిపోయిన పుస్తకమును చూచి చదువు కుంటూ, పాడుకుంటూ పశువుల్ని అదలిస్తు పరిసరాల్ని పరికిస్తూ వున్నాడు. మధ్య మధ్య కాలి దెబ్బకు బాధపడు తున్నాడు. వూళ్లో కామందు చేత దెబ్బలు, ఇంటికాడ తండ్రి చేత తన్నులు, ఓ పాలేరా! నీ జీవితం ఎంత దు:ఖకరం! అయ్యో! నా పసితనానికి చీడతనం పట్టిందే! ఇక నాకు ఎదుగు బొదుగులు లేవా? ఆశల్ని చంపి

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

చిన్నప్పటి నుంచే పసిబిడ్డను ఒక పశువులాగా తయారు చేసే పాలేరు తనం నాకు దాపురించిందే! అయ్యో! పాలేరుకు చదువు పనికిరాదా? చదువు స్వతంత్ర భావాలను కలిగిస్తుందనా? చదువుకున్నా బానిసలై బ్రతుకుతున్న వాళ్ళు ఎంతమంది లేరు? ఇక నాకు దిక్కేది? ఈ నరకం నుంచి బయటపడే దారేది? చదువు సంధ్యల్లేక, ప్రపంచమంటే ఏమిటో తెలియక, నూతిలో కప్పలాగా, పగ్గంపోసి కట్టిన పశువులాగా ఏదో ఇంత గడ్డితింటూ బ్రతకనా? అదిగో! ఆ బడికి పోతున్న పిల్లలు ఆహా! ఎంత కులాసాగా పోతున్నారు బడికి! వాళ్ల ఈడువాణ్ణి కానా నేను! వాళ్లు పొందే ఆనందానికి అభివృద్ధికి నోచుకోలేదా నేను? అయ్యో! తండ్రీ! ఈ రొంపిలో నన్ను తొక్కేసావే! ఈ ఊబిలో నన్ను కూరేశావే! పాలేరు తనమే పరమావధి చేశావే! ఓరి బాబు! నీవు రాక్షసుడివా? అని తనను తాను నిందించుకుంటూ వెంకన్న ఇక నాకు మరణమే శరణ్యము. పాలేరుగా బ్రతకలేను. విద్యావంతునిగా బ్రతకలేను. ఈ పరనూతిలో పడి ఈ దారిద్ర్య దాస్య జీవితాన్ని ముగించేస్తాను. అంటరాని, అసహ్యకరమైన, ఈ నా నికృష్ఠ జీవితం స్వతంత్ర నాగరిక జాతికి ఒక మచ్చ. ఇది నేను భరించలేను. (నూతి దగ్గరిచేరి చేతులు మోడ్చి) ఓ పరమేశ్వరా! మా బావిలో దూకి ప్రాణత్యాగం చేస్తున్నాను. ఇక నీలో కలిపేసుకో.

"దీనుల గావించి-పాలేరుగా జేసి
కామందు కాలికి గట్టినావు
అంటరాదని చెప్పి పెంటల పాల్జేసి
నీచుల మనుపేర నిల్పినావు
చదువు సంధ్యలు లేక జంతువులను బోలె
ఊరి వెల్పల చావ నుంచినావు,
అజ్ఞాన తిమిరాల యడగుసి బడద్రోసి
బరగీసి యెదనొక్కి పట్టినావు
వెలుగు జూపవు, నేర్పవు మెలగుసరళి,
దాస్యముం బాపు కోనీవు ధైర్యమూని
మనిషిగా నన్ను మననీవు, మహినికేల?
చంపు కొని పొమ్ము, చాలింతు జన్మమింక"!

అని ఈ పాటను వినిపిస్తూ పాలేరు వెంకన్న నూతిలోకి దూకబోతూవుండగా తెరలో పాట వినిపిస్తుంది ఆగి వింటాడు.

దీని ద్వారా కవి భీమన్న పాలేరు తనములోని కష్టాన్ని, బాధను వెంకన్న ద్వారా తెలియచెప్పారు.

రంగం 22లో కాంపు సీను. బైట ఆవరణలో వెంకటేశ్వరరావు, ఉపకారి, వీరేశు, సీతమ్మ మాట్లాడుకొంటు వుంటారు. వెంకటేశ్వరరావు ఆఫీసరు దుస్తులలో వుంటాడు. తక్కిన వారి దుస్తులు పూర్వం లాంటివే, కొంచెం మంచివి.

వెం : ఇక మా తండ్రి గారిని వెతికించాలిగా!

ఉప : అన్వేషణ సాగుతూనే వుంది. నలువైపులకూ కుర్రాళ్ళని పంపించాం.

వీరె : ఎందుకు? నేను వెళ్ళి వెతుక్కువస్తాను. (వెళతాడు)

వెం : ఇక లేద్దాం. కుబేరయ్య గారింటికి వెళ్లిరావాలి

వీరె : (నడిచి) అదే కుబేర్రావు గారి ఇల్లు. ఇంట్లో వున్నారేమో చూడు

బం : చిత్తం చిత్తం (వెళ్ళొచ్చి) వున్నాడు సార్ వస్తున్నాడు

కుబే : (ప్రవేశిస్తాడు, వంగి నమస్కరిస్తూ)

వెం : నమస్కారమండీ కామందు గారు ! నేను వెంకణ్ణి

కుబే : ఎంతమాట! ఎంతమాట! (చెంపలు వేసుకొని) మహా ప్రభో! నన్ను క్షమించండి. అపరాధిని (మోకరించబోతాడు)

వెం : (ఆపి) పొరపాటు, నేను అనేక కారణాల వల్ల మీకు కృతజ్ఞుణ్ణి పొరపాట్లు లేనివారు ప్రపంచంలో లేరు. మీరు పెద్దలు. నన్ను మన్నించి ఆశీర్వదించండి.

కుబే : (మళ్లీ చెంపలు వాయించుకుంటూ) ఎంత మాట! ఎంతమాట నేను ఎంత మూర్ఖుణ్ణి! తమకు సప్లయిలన్నీ నేను పంపించాను. నా కమతంలో తమ చేతికడ్డులేదు!

అని ఈ విధంగా దళితుడైన ఒకప్పటి పాలేరైన వెంకన్న పట్టణం చేరి విద్యాధికుడై వెంకటేశ్వరరావుగా మారి డిప్యూటి కలెక్టరై క్యాంపు కొరకు రైతువాడ గ్రామం వచ్చి కుబేరయ్య కుట్రలు కుతంత్రాలు తెలుసుకొని అతడు పెట్టిన కేసులు విచారించి తనకు ఉపకారం చేసిన ఉపకారి మాష్టారిని బయటకు రప్పించి తన తండ్రిని కూడా వెతికించి అగ్రకులస్తురాలైన వనబాల హృదయం దోచుకొని ఆమెను వివాహమాడి పూర్వం చిన్నతనంలో ఏ కామందు కుబేరయ్య చేతిలో చావుదెబ్బలు తిన్నవాడైన వెంకటేశ్వరరావు (వెంకన్న) ఆ కుబేర్రావు చేతనే వంగి వంగి నమస్కారములు చేయించుకున్నాడు. కుబేర్రావుచే తన తప్పులు తానే ఒప్పుకునేటట్లు చేస్తాడు. అంత విద్యాధికుడైన వెంకటేశ్వరరావు కూడా కుచ్చితుడు, కుతంత్రుడు, స్త్రీవ్యామోహి, దళితద్వేషి అయిన కుబేరయ్యను "నమస్కారమండి కామందుగారు నేను వెంకణ్ణి" అని చెప్పుకొన్నాడు. దీని వలన అతడి వినయ విధేయతలు తెలుస్తున్నాయి. ఉపకారి మేష్టారి వలన తాను అంతటి వాణ్ని అయినానని అతనికి కృతజ్ఞతలు చెప్పుకున్నాడు.

## విప్లవ భావాలు :

సనాతన వ్యవస్థపై తిరుగుబాటును చేయటం విప్లవం అంటారు. పాలేరైన వెంకన్నకు చదువుపై ఆసక్తి కలగడం, పాలేరు తనంపై అసహ్యత వుండడం విప్లవ భావమే. సంపన్నురాలైన వనబాల బీదహరిజన వ్యక్తిని ప్రేమించడం విప్లవ భావమే. అతనిని చదువుకోమని ప్రోత్సహించడం, వర్ణాంతర వివాహం చేసుకోవడం అన్నది నిజమైన విప్లవ భావాలు. ఉపకారి మాష్టారు దళితవాడలో విద్యా బోధన చేయడం విప్లవ భావమే. వెంకన్న చదువు కోసం ప్రోత్సహం కలిగించడం విప్లవ భావమే. ధనికులైన రామం, సుందరములు వెంకన్న యొక్క అభివృద్ధిని కోరి అతని ఉన్నత చదుకై ధనము వెచ్చించి ప్రోత్సహించడం, అతనిని ఆఫీసరును చేయడంకూడా గొప్ప విప్లవ భావాలే.

## ముగింపు :

ఈ విధంగా కవి, రచయిత డా॥ బోయి భీమన్న గారు పాలేరు నాటకం ద్వారా యువకులైన వారు పాలేరు తనంలో కట్టుబానిసలై కామందుల ఉక్కుపాదములు క్రింద నలిగి పోకుండా ఉండేందుకు యువకులలో సామాజిక స్పృహను కలిగించి యువకులందరిలో సామాజిక చైతన్యం కలగాలనే వుద్ధేశంతో ఈ పాలేరు నాటకం ద్వారా సమాజానికి ఒక మంచి సందేశాన్ని ఇచ్చారు.

## ఆధార గ్రంథాలు :

పాలేరు నాటకం - డా॥ బోయి భీమన్న

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


# తెలంగాణా కథ - వలస కుటుంబ కష్టాలు

**- జి. అశోక్,** పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్, తెలంగాణ.

ఉత్తర తెలంగాణాలో గల్ఫ్ ప్రాంతాలకు వలస బోవడం సర్వసాధారణం. ఇక్కడి ప్రతి గ్రామం నుండి గల్ఫ్ లోని ప్రతిదేశానికీ వలసలున్నాయి. వలస బతుకుల్లో సుఖదుఃఖాలు రెండూ మిళితమై ఉన్నాయి. కుటుంబ ఆర్థిక పరిస్థితి మెరుగు పర్చుకునేందుకు వలసలు పోయినా వలస వెళ్ళినవారు, ఇంట్లో మిగిలిన వారు వలసకు ఎన్నిటినో పణంగా పెట్టవలసి వస్తుంది. ప్రాయం, ఆరోగ్యం, ఏకాగ్రత, భౌతికవాంఛలు, నిందలు, అప్పులు, అసూయలు, కష్టకాలాలు, కర్తవ్యాలు, పేగు బంధాలు మొదలైనవి ఎన్నో వలస చుట్టు పరిభ్రమిస్తుంటాయి. ఉన్న ఊర్లో గౌరవంగా బ్రతికినవారు పొట్టతిప్పల కొరకు తనవాళ్ళందరినీ విడిచి దేశంగాని దేశంలో చెప్పుకోలేని పనులు చెయ్యవలసి వస్తుంది. ఇక్కడ ఆడవాళ్ళు మగదిక్కులేని సంసారాన్ని, వ్యక్తిత్వాన్ని కాపాడుకునేందుకు అనేక ఇబ్బందులు పడవలసి వస్తుంది.

పూటకు లేకున్నా కడుపునిండా తిన్నా అన్నీమందికే అవసరం. నల్లగుంటే దూరం దూరం బోవటం, తెల్లగ బ్రతికితే బట్టగాల్చి మీదెయ్యటం మనుషుల సహజనైజం. భర్తలు బైటి దేశాలకు వలసలుబోయిన తర్వాత మెరుగుపడిన ఆర్థికపరిస్థితిలో కోరికల్ని ఆపుకోలేక నలుగురి నోట్లే నానే స్త్రీలు అక్కడక్కడా కన్పిస్తుంటారు. వారిని ఆధారం చేసుకుని ఇమానంగా బ్రతికేవారినికూడా రంపాన బెట్టడం, బ్లాక్‌మెయిల్ చెయ్యటం, అవసరానికి వాడుకోజూడటం, పన్నాగాలు పారకపోతే రంకుకెత్తుకోవటం గ్రామాల్లో కన్పిస్తుంటాయి. అత్తింటివాళ్ళు, ఆడబిడ్డలు, దాయాదులే శత్రువులుగా చూసినప్పుడు పరాయివాళ్ళకు మరింత లోకువ. ఆడదానికి ఆడదే శత్రువైనప్పుడు మగవాడికి మరింత వెసులుబాటు. ఈ విపరీతపు పరిస్థితుల్ని తట్టుకోలేకనే చాలామంది స్త్రీలు భర్త విదేశాలకు పోగానే పుట్టింటికివెళ్ళి తల్లిదండ్రులతో బ్రతుకుతుంటారు.

వలస బతుకుల్లో చేజేతులా చేసుకున్న తప్పిదాలవల్ల కొన్ని కుటుంబాలు చెదిరిపోతుంటే చెప్పుడుమాటలకు మరికొన్ని కుటుంబాలు బలైపోతున్నాయి. వలస బతుకులు నిలబడాలంటే అక్కడాయిక్కడా ప్రతికూల పరిస్థితుల నెదుర్కొనే కఠినమైన సహనాన్ని అలవర్చుకుని గొంతులో విషాన్ని నిలుపుకోవాల్సిందేననే కఠోరసత్యాన్ని ఆవిష్కరిస్తూ, వలసలు తెచ్చే అవస్థలను స్త్రీ పార్శ్వంలో చిత్రించిన కథ 'ఘర్షణ'. భర్త వలస పోయాక భార్య వ్యక్తిత్వ, ఆర్థిక, సామాజిక స్థితికి రక్షణలేని యదార్థాన్ని ఈ కథ బలంగా, నిజంగా చెప్పగలిగింది. ఈ కథలో సుజాత భర్త మస్కట్‌కు పోయాడు. వేరుపడ్డ సంసారం గనుక, తన ఐదేండ్ల కొడుకుతో ఆమె విడిగానే ఉంటోంది. భర్త మస్కట్ కుపోకముందు సుజాతతో అందరూ బాగానే మాట్లాడేవారు. ఓపికవంతురాలని మెచ్చుకునేవారు. ఇప్పుడు సుజాత ఆర్థికంగా ఎదిగిపోతున్నదనే బాధ వారిని కలుషితం చేసింది. ఆమె భర్త మస్కట్‌లో డ్రైవర్ పని చేస్తున్నాడని నెలకు పదివేల జీతమని తెలిసి ఈర్ష్యగా చూడటం మొదలుపెట్టారు. ఏదో రకంగా ఆమెను హింసించి సంతోషపడటంతో తృప్తిపడుతున్నారు. బంధువులకే ఆమె పట్ల కసి పెరిగింది. అత్తమామలు, ఆడబిడ్డలు, యారండ్లు పుల్లిరుపు మాటలతో వేధించేవారు. ఇక మస్కట్ నుండి చెక్కులు రావటం మొదలయ్యాక మాట్లాడటమే మానేశారు. రెండేండ్లు గడిచేసరికి వీసా కొరకు చేసిన అప్పులు తీరాయి. సుజాత ముఖంలో తృప్తి, ఆర్థికపరిస్థితిలో మిగులూ కన్పించాయి. తద్వారా ఆమె కట్టుబొట్టులో కొంచం మార్పువచ్చింది. అది చుట్టుపక్కల వారికి భరింపరాని విషమైంది. సాంఘికంగా వేధింపులు మొదలయ్యాయి.

తినిపోవటం, తిట్టిపోవటం సుజాతపట్ల అందరికీ హక్కుగా మారింది. చక్కెర, చాయ్‌పత్తా బదులడగటం ఇవ్వకుంటే బదునాంచేయడం, ఇస్తే తీర్చకపోవటం

మామూలైంది. పెండ్లికని, జాతరకని చీరలు, జాకెట్లు బదులడిగేవారు. భయపడి యిస్తే పాడుజేసి యిచ్చేవారు. ఇవ్వకపోతే గల్ల పెద్దగ కత్తిరించుకుంటదని, బ్రాలు కన్పించేజాకెట్లేస్తదని, మొగోళ్ళందరూ సుజాతనే చూస్తరని బహిరంగంగానే ముచ్చట్లు పెట్టేవారు. అదంతా సుజాతకు మనశ్శాంతి లేకుండా చేసేది. మొగవాళ్ళు చూపులతో, మాటలతో వేధించేవారు. ముసలివాళ్ళు సైతం అయిందానికీ, కానిదానికీ సుజాతను కాల్చుక తినేవాళ్ళు.

మస్కట్ నుండి వచ్చేవాళ్ళతో సామాన్లు, బట్టలు పంపిస్తుంటారు. సుజాతకు కూడా భర్త, నాలుగూర్ల అవతలి వ్యక్తితో కొన్ని సామాన్లు పంపించాడు. అతడు రెండుమూడు సార్లు వచ్చిపోవటం, భర్త ఫోన్ చేస్తాడని ఒకసారి వచ్చి తీసుకపోవడం జరిగింది. పోతే మంది ఏమనుకుంటారో, పోకపోతే భర్త ఏమనుకుంటాడోనని భయపడుతూనే అతని స్కూటర్‌మీద కూర్చుండి పోయింది. ఫోను రావటం లేటుకావడంతో ఆ రాత్రి వాళ్ళింట్లోనే ఉండవలసి వచ్చింది. అతడు మస్కట్ పోయేముందు భర్తకు పలహారాలు చేసి పంపింది. ఇదంతా ఊర్లోవాళ్ళకు, బంధువులకు భరింపరానిదయింది. ఎవరి నోటికీ తాళంవేసే శక్తిలేక సుజాత అన్నిటినీ భరించింది. సుజాతను వేధించడం కోసం ఆమె భర్తకు అనేక తప్పుడు విషయాలను ఉత్తరాల ద్వారా చేరవేసేవారు. ఈ కథలో సుజాత పాత్ర వలసబోయిన యువకుల భార్యలు దుర్కొంటున్న అవమానాలకు, సంఘర్షణలకు ప్రతీక. ద్వంద్వనీతి చూపించే సమాజంలో నోట్లో నాలుక లేనివాళ్ళు బ్రతకటం ఎంతకష్టమో తెలిపే అనేక సన్నివేశాలు సహజవాతావరణంలో రూపొందాయి. ఇవన్నీ కథకు చిక్కదనాన్ని పెంపొందించి, వలస జీవితాల్లోని అనేక పార్శ్వాలను వెల్లడిజేసేవే.

ఈ కథ తెలంగాణాలో వలసబాట తొక్కిన, తొక్కబోయే లక్షలాది మందికి, వేల కుటుంబాలకు నిర్మాణాత్మకమైన, సందేశాత్మకమైన, సజీవాత్మకమైన, యదార్థమైన, అవసరమైన ముగింపునిచ్చింది. గ్రామగ్రామాన చదివి విన్పించదగ్గ కథయిది. తెలంగాణా వలస బతుకుల్లోని ఆత్మభిమానపు విలువలను, మానవీయ సంబంధాలను ఆర్తితో గుండెలమీద మోసినకథ ఘర్షణ. తెలంగాణాలో వలసలు ఉన్నంతకాలం అందరూ గుర్తుంచుకోదగిన సామాజిక ప్రయోజనమున్న కథ యిది. ఇలా వలస జీవితాల్ని, వలసజీవుల కుటుంబసభ్యుల జీవిత వ్యథల్ని వర్ణించిన కథలు తెలంగాణా కథా సాహిత్యంలో అనేక కనిపిస్తాయి. అన్నిటి లక్ష్యం ఈ వలస జీవుల వెతల్ని వినిపించడమే.

BHAVAVEENA
VOL. 16, ISSUE. 11(1), NOVEMBER - 2019.
ISSN NO. : 2456-4702 - RNI NO. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# బసవేశ్వరుని వచనాలు - సామాజిక చైతన్యం

**డాక్టర్ మఠపతి మాంతయ్య,** అసిస్టెంట్ ప్రొఫెసర్ (తెలుగు)
డాక్టర్ బి.ఆర్.ఆర్. ప్రభుత్వ కళాశాల, జడ్చర్ల.

**ఉపోద్ఘాతం :** బసవేశ్వరుడు పన్నెండవ శతాబ్దంలోనే వచన సాహిత్యాన్ని సృష్టించి, సామాజిక చైతన్యం కల్గించిన సంఘసంస్కర్త. ఆనాటి సమాజంలో మూఢాచారాలు, మానవుల మధ్య అంతరాలు, కుల, వర్గ, వర్ణవివక్ష అధికంగా ఉండేది. మాదిరాజు, మాదాంబ దంపతులకు జన్మించిన బసవేశ్వరుడు చిన్ననాడే, తన అక్క నాగాంబకు లేని యజ్ఞోపవీత సంస్కారము తనకెందుకని ప్రశ్నిస్తాడు. తండ్రి తెలిపిన సమాధానం నచ్చక, స్త్రీలకోధర్మం, పురుషులకోధర్మం కల్గిన సంస్కారాన్ని వ్యతిరేకిస్తాడు. నాటి సమాజంలో అనేక రుగ్మతలను రూపుమాపడానికి వచన సాహిత్యాన్ని ఎంచుకుంటాడు.

అనుభవ మంటపమును స్థాపించి, అందులో పురుషులకు, స్త్రీలకు సమప్రాధాన్యాన్నిచ్చాడు బసవేశ్వరుడు. "కాయకమే కైలాసమని" ప్రబోధించి జాతి, కుల, మత, వర్గ, వర్ణ, లింగ విభేదాలకతీతంగా అనుభవ మంటపంలో చర్చలలో పాల్గొనేవారు. హరళయ్య, మడివేలు మాచయ్య, దోహరకక్కయ్య, మేదార కేతయ్య, మెరమెండదేవయ్య, అయిదక్కి మారయ్య మొదలగు శ్రమ జీవులైన నిమ్న కులాలవారు. సత్తెక్క, పీరవ్వ, ముక్తాయి, గొగ్గవ్వ, అక్కమహాదేవి మొదలైన స్త్రీలు. అనుభవ మంటపంలో గోష్ఠులు జరిపి సామాజిక చైతన్యం కొరకు వచనాలు చెప్పేవారు. శ్రమ జీవన తత్వాన్ని వ్యాపింపజేసి సోమరితనాన్ని నిర్మూలించి, దోపిడి తత్వాన్ని వ్యతిరేకించే బసవేశ్వరుడు అహింసను సమర్థించాడు. జీవహింసను వ్యతిరేకించాడు. ఒక వచనంలో

ఆహా! ఎంత విచిత్రము విశ్వము
మరణోన్ముఖ జీవన వాహిని యిది!
పండుగ కొఱకై తోరణమ్ములను
బలిపశువును, నరుడొకడిలు చేర్పగ
జిహ్వాచాపల్యముతో పశువది
ప్రాణాపాయమునాలోంచింపదు
తనవధయును జరుగుననియు తెలియదు
మరణోన్ముఖ జీవన వాహినియిది
స్వామీ! కూడల సంగమదేవా॥

తోటి మానవుల పట్ల, జంతువుల పట్ల దయను కలిగి ఉండాలని, దయలేని ధర్మము, ధర్మమే కాదని ఒక వచనంలో బసవేశ్వరుడు

దయయే ధర్మము, దయయే సత్యము
దయయే జీవాధారము జగతికి
దయలేనట్టి స్వధర్మమెట్టిది?
దయహీనునిల సంగముడొల్లడు

మరొక వచనంలో

"దొంగిలింపకు, హత్యల చేయకు
కల్లలనాడకు, కోపగింపకుము
ఆత్మస్తుతి, పరనిందల విడువుము
బాహ్యాంతశ్శుద్ధుల భావమ్మిదె" అంటాడు బసవేశ్వరుడు.

బసవేశ్వరుడు అనేక వచనాలలో మూఢాచారాలను నిరసించాడు.

"ఏమీ! చిత్రంబీలోకపు కథ
సత్యేతరమగు జీవితగాములు
రాతి పాము నర్చించెడి పెద్దలు
జాతి నాగులను చంపివేసెదరు
తినెడి జంగముని "చను-చను" మనుచు
తినని లింగమును "తిను-తిను" మందురు"

కులనిర్మూలన

పుట్టుకతో అందరూ సమానమనీ, వారు ఎంచుకునే వృత్తులననుసరించి ఆయా కులాల పేరుతో ఒక కులం

తక్కువ మరొక కులం ఎక్కువ కాదని తెలుపుతాడు బసవేశ్వరుడు

"అగస్త్యునకు కులమేది?
అరుంధతి కులమేది?
వ్యాసుని కులమేది?
వాల్మీకి కులమేది?" అని ప్రశ్నిస్తూ
కాచిన కమ్మరి, ఉతికిన చాకలి
నేయ సాలె, కర్మచేతనే కుల భేదములు" అని అధిక కులం, తక్కువ కులం అంటూ ఏవీలేవనీ, మానవత్వమే అందరి కులమనీ ప్రబోధిస్తాడు.

"ఇతడెవరు?
ఇతడెవరు?
ఇతడెవరు? అని అనకుడయ్యా?
"ఇతడు నావాడు
ఇతడు నావాడు
ఇతడు నావాడు" అని పలుకుమయ్యా! అంటాడు.

ఎవరైనా నీదే గోత్రమని ప్రశ్నిస్తే
"నాది మేదర చెన్నయ్య గోత్రము
నాది కుమ్మరి గుండయ్య గోత్రము
నాది చెప్పులు కుట్టే హారళయ్య గోత్రము" అని పలికిన మహా మానవతావాది బసవేశ్వరుడు.

కుల వ్యవస్థను తృణీకరిస్తూ
"ఎందులకీ కుల గర్వమునీకిల?
ఏమీ! కర్ణము నుండి వచ్చితివా?
మైలలోన పిండముగా నుండి
ఆ మార్గముననే నీవు వచ్చితివి
రాగద్వేషము లకటే కాగా
చదివిన, వినినను సార్ధకమేమిటి? అని ప్రశ్నించాడు.

బసవేశ్వరుడు పరస్తుతిని తీవ్రంగా వ్యతిరేకించిన బసవేశ్వరుడు
ఒక వచనంలో.....
"కొట్టిన నా పోషకులందును
తిట్టినచో నాబంధువునందును
నిందించిన మాతాపితలందును
సేవ కోరినను జన్మ బంధునందును
కానీ ననుపొగిడినచో మాత్రము
తూలమెక్కించినట్టే తలచెద
స్వామీ కూడల సంగమదేవా"

నిరంతరం ధనార్జన చేస్తూ మానవ సంబంధాలు దూరం చేసుకునే వారికి కనువిప్పు కలిగించే విధంగా చెప్పిన వచనం
"పాము కరిచినను పలికింపనగు
భూతము సోకిన పలికింపనగు
ధన భూతము సోకినచో వారిని
తరచూ పలికించుట శ్రీ సంగమ॥ అంటాడు.

రాజ్యాధికారం గల వారికి, ధనవంతులకు సాగిలబడి మ్రొక్కుతూ, నిరుపేదలను తూలనాడే వారిని గూర్చి తెలుపుతూ
"ఈ తీరుననే ఈ లోకమ్మిక
ఎల్లకాలమును నడుచుచుండు నా?
వాహనములపై వచ్చెడి వారికి
ఛత్రపత్రులకు ధనవంతులకు సాగి మ్రొక్కెదరు
బడుగువారాగమనము చేయగ
పిడికెడు బిచ్చము పెట్టక పోగా
నడు వుండంచు గెంటింతురు వారిని
స్వామీ! కూడల సంగమదేవా!!
నీవీక్షుద్రుల నేలద్రోచి నీ
సూడెము తోడను చెక్కుము ముక్కును" అంటాడు బసవేశ్వరుడు.

'పనిచేయకుండా తినడం మహాపాపం" అన్నాడు బసవేశ్వరుడు. శ్రమించకుండా తినేవాడే "దొంగ" అని దోచుకున్నవాడు కాదు దాచుకున్నవాడు కూడా దొంగయే అని బసవేశ్వరుని సిద్ధాంతం.

అహంకారము, క్రోధము పతన హేతువులని బసవేశ్వరుని అభిప్రాయం. వాటిని వర్జించాలని తెలుపుతూ
"అహంకారమను మదగజమెక్కియు

ఆహుతిగా విధికెదురేగుదురా!
సద్గుణ ఫలబీజంబుల నాటియు
సత్యసంగమాలయమును చేరుదు"
తన కోపమ్మే తనకు శత్రువు భువి
పరుల వదిలి నీలోపల నరయుము
ఇంటినిప్పు ముందింటిని కాల్చును'' అంటూ అహంకారాన్ని, కోపాన్ని వదిలివేయాలని పలుకుతాడు.
మరొక వచనంలో
జ్ఞానముచే న జ్ఞానము చెదరును
జ్యోతిర్గమనము తమమునుచెరుచును
సత్యము చేత న సత్యమువీగును" అని నిత్య సత్యమును తెలిపాడు బసవేశ్వరుడు.
ధనవంతులు దేవాలయాలు నిర్మించారని, నిరుపేదలు బాధపడకూడదని వారి దేహమే దేవాలయమని, మనస్సే బంగారు కలశమని ఒక వచనంలో పేర్కొంటాడు బసవేశ్వరుడు.
ధనవంతులు నిర్మింతురు నీకై
ధగద్ధగోజ్జ్వల గోపురాదులను
ధనము లేని నేనెట్టుల
తమకై కట్టుదు శివాలయంబును
స్వామీ! కూడల సంగమదేవా!
చెడును స్థావర జంగమమిదిగో
పాదములివి అలయకంలంబులు
పసిడి కలశమిది నా శిరమిదుగో
నడచెడి ఈ దేవాలయమ్మలో
నివసింపుము శ్రీ సంగమేశ్వరా!
మరో వచనంలో
ఏవీ దయ్యములేవీ భూతములు
ఏవీ ప్రేతము లేడీ కాళుడు?" అని ప్రశ్నిస్తూ

దయ్యాలు, భూతాలు, అభూతకల్పనలనీ మూఢాచారాలను నిరసించిన బసవేశ్వరుని వచనాలు నాటి నుండి నేటి దాకా సామాజిక చైతన్యాన్ని కలిగిస్తున్నాయి.
చచ్చిననే స్వర్గమను మాటలు
చెరుకు తుదనుగల సారము వంటివి
స్వర్గ నరకములు చూడు మిచ్చటనే" అంటూ స్వర్గము నరకములు ఎక్కడ లేవని అవి ఇక్కడే ఉంటాయని అంటాడు బసవేశ్వరుడు.
"ఏదీ స్వర్గమ్మేదీ నరకము?
ఏదీ పాపమ్మేది పుణ్యము?
ఏదీ మార్గమ్మేది కుమార్గము?
స్వర్గము, నరకము అనేవి మానవుని ఆలోచనలననుసరించి, అవి కనబడతాయని మంచి ఆలోచనతో తాను ప్రశాంతంగా జీవిస్తూ, ఇతరులు కూడా సంతోషంగా ఉండాలనే భావన కల్గియుంటే, అదే స్వర్గమని పేర్కొంటాడు బసవేశ్వరుడు.
"పరధనాపహరణమ్మది పాపము
పరసతీ సంగమము భువి పాపము
పరహింసా పశు వర్తన పాపము" అంటూ
పరధనమును అపహరించుట, పశువులాగా ప్రవర్తించుట పాపహేతువులనీ, అదే నరకప్రాయమనీ బసవేశ్వరుడు పేర్కొంటాడు.
ముగింపు: మహా మానవతావాది, క్రాంతి పురుషుడు, సంఘ సంస్కర్త అయిన బసవేశ్వరుడు వచనాల ద్వారా నాటి సమాజాన్ని చైతన్యపరిచాడు. పాల్కురికి సోమనాథుని బసవపురాణముననుసరించి బసవేశ్వరుడు నాలుగు లక్షల అరవై నాలుగు వేల వచనాలు రచించినట్లు తెలుస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. బసవవచనామృతము – రేకళిగెమఠం వీరయ్య.
2. బసవగీత – ఆచార్య ముదిగొండ శివప్రసాద్.
3. బసవేశ్వరగీతామృతం –ఆచార్య మఠం లింగయ్య.
4. బసవేశ్వరవచనాలు – సమగ్ర సమీక్ష బాడాల రామయ్య.

★ ★ ★

''

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# Importance of Human Element in Machine Translation

- ***Dr. Bolugadde Anil Kumar***, Lecturer in Telugu, Narayana IAS Academy, Hyderabad.

**ABSTRACT :**

One of the most celebrated poets, Robert Frost once expressed, "Poetry is what gets lost in translation." This eminent American poet might not have guessed the impending growth machine translation will be witnessing at a brisk pace. Machine translation rose as a technological refinement which revolutionized the literary world. In the recent past, automated translation has been steadily upgrading conforming to human requirements. There are escalating tensions today over the path-breaking developments in Artificial Intelligence replacing the human jobs. No matter how far, the machine technology grows by leaps and bounds, the relevance of humans never declines.

**Interdiction :**

Since ages, literature has been symbolizing a civilization's mark of intellect. Literature served as an instrument for propagation of religion and political revolutions. Prose, poetry, drama, essays, fiction, literary works based on philosophy, art, history, religion, culture and science and writings of legal nature fall under the category of literature. To broaden the horizons and learn about other cultures and places, literature is one best way. Literature which is a universal human experience has been be spreading throughout the multilingual world all these centuries by the means of one action, translation.

The faith of Christianity representing one-third of the world's population in one way can be incidentally attributed to Bible being the most translated book of all time. On a microscale, the Telangana Armed Struggle could not have taken place without the accessibility of the translated Marxist literature in a vernacular language. The translation of Indian epics, Ramayana and Mahabharata into English by the English demonstrated the literary capabilities of India to the world. Literature makes the world a better place. However, not all human beings speak the same language. This essentially calls for a translation activity which is not as easy as it seems. Translation is not a mere word-to-word substitution. A literary translator must be well-versed in both the source language and the target language in the process of translation. Gone are the days when translation was solely possible with human participation making it a tediouscostly affair. The entrant of the technology changed the rules of the game.

**Machine Translation as the game-changer:**

One of the greatest technological advancements humanity has ever witnessed is Machine Translation. The traditional translation gradually evolved with the rise of technology all over the world. In simple words, Machine Translation (MT) is a sub-domain of computational linguistics that is the automated translation that investigates the use of software tools to translate text or speech from one language to another.

A work ought to be translated without losing the original document's effect of style, culture and tone of the author. This demands the creativity and quality comprehensive understanding of the translator of the source language. Foremost, an interpretative analysis of all the elements of the text and each

respective element's interconnection to the other words is mandatory to properly convey the communicative essence in the translated version.

This binds the machine too to gain proficiency in grammar, syntax, and semantics alongside the targeted readership which is impracticable considering the current availability of technology at our disposal. Nevertheless, we have been making breakthroughs in the last five decades enhancing the accuracy of translation.

The previously held low opinion towards the automated translation was of late being altered by the erstwhile and the emerging technological advances. Some of them are the Rules Based Machine Translation (RBMT), Statistical Machine Translation (SMT), Syntax Based Machine Translation (SBDT) and the Neural (NMT) and the Deep Neural Machine Translation (Deep NMT).Amongst these, the widely used types are SMT, RMBT and the Hybrid Systems which aggregate SMT and RMBT.

MT in the recent past has proved to be of great utility. The time consumed in translation of bulk volumes was drastically cut down turning the whole procedure less expensive. Furthermore, the productivity of the human translators is augmented through the antecedent, though imperfect translation can be improvised by the humans in the last phase. In unserious cases where the human translation is unwanted, content can be translated just to note the gist of the information. Softwares like Google Translate and DeepL etc., are used for such services. This saves the time of the human translator making use of his valuable finite time who can confine himself to the cases where the accuracy is of primary importance.

Before the advent of the machine translation neural networks, 'word for word' vocabulary translations bereft of contextual understanding a human brain possesses, is prevalent. Research at present is vigorouslyongoingin the context translation. The new Google's Neural Machine Translation System (GNMT) endeavours to bridge the gap between the humans and machine translation through overcoming the shortfalls of the conventional phrase-based translation systems. Skype has been working on conversation translation which enables to interact with a person who speaks a different language.Machine translators arepragmatically cost-effective where there is no requirement to wait for the professional translator and thereon, user independence is ensured.

In times of exigencies, whether an asylum seeker or the natural calamity-stricken victims who are of a different tongue, can immensely benefit from Machine Translation. A famous example quoted by one of the well-known fathers of Machine Translation, Andy Way to testify the significance of Machine Translation in crisis scenarios is the 2010 earthquake in Haiti. Despite the timely arrival of medical supplies, doctors and nurses, the language of the locals became a barrier to the medical team. It is in these sorts of situations where Machine Translation can be deployed to administer the timeous assistance to the needy.

In addition, Machine Translation by removing the language barriers empowers and educates the citizens. Vice President Venkaiah Naidu while addressing the gathering at the demonstration of the machine language translation software *'Saara'*developed by the University of Hyderabad said, "Machine Translation holds great promise for the future

and should be taken up as a National Mission."

**Value of Humans in MT :**

Although the machine translator is faster than humans, given the present inadequate technology, it cannot ever parallel the output quality a human translator produces in his work.

Every output of a machine translation engine is prone to errors. The translation received from the machine might be literally right, but the tone, wording or register can be incorrect. Therefore, involvement of human supervisors and reviewers is a necessity to rescue the translation from mistakes. There are speculations of jobless future prospects on how machine learning AI can make human translators an endangered species. A *MailOnline*story cited a survey which claimed that two thirds of the fastest declining jobs in Britain are being hit because of increased automation and advances in technology. Surprisingly, creative industries are no exception. Google is among those which designed automated software making humans increasingly redundant.

Natural languages are subjective constructs invented by human beings for the sake of communication. The apparent rules in language are not anchored in objective reality as languages constantly evolve through conventions. Computer assisted translation tools would act as a complement, not an alternative to the human output. Corporate bodies and states should come forward to invest in the Machine Translation which bears great untapped potential. This is an opportune route to the marketers and ambitious enterprises to go global leveraging the innovations of artificial intelligence. In the upcoming years, Machine Translation with minimal human intervention should be able to translate information pertinent to a specific discipline in that distinct jargon raising the bar for translation services. To conclude, machine translation in the truest sense is only an apparatus to enhance the proceedings of translation but this artificial intelligence can never be a replacement to the human intelligence. The need of the hour is integration of human touch to the technological end product.

**References :**

1) https://www.forbes.com/sites/bernardmarr/2018/08/24/will-machine learning-ai-make-human-translators-an-endangered-species/#384389913902
2) https://ai.google/research/pubs/pub45610
3) https://nlp.stanford.edu/projects/mt.shtml
4) https://scroll.in/article/876969/what-makes-a-translation-great-ten-literary-translators-from-across-the-world-weigh-in (https://scroll.in/article/876969/what-makes-a-translation-great-ten-literary-translators-from-across-the-world-weigh-in)
5) http://www.systransoft.com/systran/translation-technology/what-is-machine-translation/ (http://www.systransoft.com/systran/translation-technology/what-is-machine-translation/)
6) https://kantanmt.com/documents/Machine_Translation.pdf
7) https://en.m.wikipedia.org/wiki/Machine_translation
8) https://gengo.com/machine-translation/ (https://gengo.com/machine-translation/)
9) http://pib.nic.in/PressReleaseIframePage.aspx?PRID=1560375

BHAVAVEENA
Vol. 16, Issue. 11(1), November - 2019
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253
భావవీణ
UGC Approved Journal No. 42500

# జన రంజక కవి ప్రతిభా పురస్కారాలు 2019

స్పష్టంగా, సూటిగా, నిరాడంబరంగా, భావయుక్తంగా, శక్తివంతంగా ఉండే జన సంక్షేమ కవిత్వం రాసే కవులు "జన రంజక కవి ప్రతిభా పురస్కారాల కోసం" కవితల సంపుటాలు పంపించవలసినదిగా కోరుతున్నాం. వచన కవితలు / పద్యాలు / గేయాలు / లఘు కవితలు / బాల గేయాల సంపుటాలు ఏవైనా ఒక పుస్తకం పంపితే చాలు. 2015 నుండి 2019 వరకు ప్రచురించిన పుస్తకాలు పంపవచ్చు. ఎంపికైన పుస్తకాల కవులకు ఒక్కొక్కరికి రూ. 2000 నగదు, శాలువా, జ్ఞాపికతో "రావి రంగారావు సాహిత్య పీఠం" పక్షాన గుంటూరులో బృందావన్ గార్డెన్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అన్నమయ్య కళా వేదిక మీద ఫిబ్రవరి 10 సాయంత్రం 6 గంటలకు జరిగే సభలో ప్రముఖుల సమక్షంలో సత్కరించటం జరుగుతుంది.

2019 డిసెంబర్ 31 లోగా పుస్తకాలు పంపించవలసిన చిరునామా :

**నర్రా ప్రభావతి**

కన్వీనర్, రావి రంగారావు సాహిత్య పీఠం (రి.నం. 6/2016), గుంటూరు.

## రావి రంగారావు సాహిత్య పీఠం

**(రిజిస్టర్డ్ నం. 6/2016)**

101, శంఖచక్ర నివాస్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్ తూర్పు, గోరంట్ల, గుంటూరు - 522034.

సెల్ : 92475 81825. వాట్సప్ నెం : 9493686165 మెయిల్ : raavirangarao@gmai.com

భావవీణ

# BHAVA VEENA

ISSN No. : 2456-4702
RNI No. APTEL/2003/12253

## Journal of Telugu Literary, Culture & Language Study

తెలుగు సాహిత్య సాంస్కృతిక భాషాధ్యయన పత్రిక

**November(1) 2019**























































































Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 94 94 660 509.